# సృజనాత్మక రచన - బి.ఎ జనరల్ తెలుగు

## 2వ సంవత్సరం - సెమిస్టర్ - III

### పాఠ్య రచయితలు


డా॥ ఇరపని మాధవి
ఎం.ఎ.,ఎంఫిల్., పిహెచ్.డి
అసోసియేట్ ప్రొఫెసర్
తెలుగు & ప్రాచ్యభాషావిభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
నాగార్జున నగర్, గుంటూరు.

డా॥ దొప్పలపూడి సుజాత
ఎం.ఎ.,టి.పి.టి., ఎంఫిల్., పిహెచ్.డి
తెలుగు అధ్యాపకులు
ప్రభుత్వ మోడల్‌డిగ్రీ కళాశాల
యర్రగొండపాలెం
ప్రకాశం జిల్లా.

డా॥ టి. ఓగేశ్వరరావు
ఎం.ఏ.., బి.యిడి. పిహెచ్.డి.
తెలుగు అధ్యాపకులు
వి.వి.గి.రి. ప్రభుత్వడిగ్రీ కళాశాల
దుంపలగూడెం, ప.గో.జిల్లా

షేక్ జరీనాబేగం
ఎం.ఏ..,
తెలుగు అధ్యాపకులు
ప్రభుత్వడిగ్రీ కళాశాల
రాజమండ్రి, ప.గో.జిల్లా

పి.రామచంద్రుడు
ఎం.ఏ..,
తెలుగు అధ్యాపకులు
డి.ఆర్.జి. ప్రభుత్వడిగ్రీ కళాశాల
తాడేపల్లిగూడెం, ప.గో.జిల్లా


*సంపాదకులు*


డా॥ ఇరపని మాధవి
ఎం.ఎ.,ఎంఫిల్., పిహెచ్.డి
అసోసియేట్ ప్రొఫెసర్
తెలుగు & ప్రాచ్యభాషావిభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం


*సమన్వయకర్త*


డా॥ ఇరపని మాధవి
ఎం.ఎ.,ఎంఫిల్., పిహెచ్.డి
అసోసియేట్ ప్రొఫెసర్
తెలుగు & ప్రాచ్యభాషావిభాగం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం


*డైరెక్టర్*


డా. నాగరాజు బట్టు
ఎంబిఎ, యంహెచ్ఆర్ఎమ్, ఎల్ఎల్ఎమ్, ఎం.ఎ. (సై), ఎం.ఎ. (సో), ఎం.ఇడి., ఎం.ఫిల్., పిహెచ్.డి.
దూరవిద్యా కేంద్రం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510.
ఫోన్ నెం.: 0863-2346208, 0863-2346222,
0863-2346259 (స్టడీ మెటీరియల్)
వెబ్‌సైట్ : www.anucde.info,
ఇమెయిల్ : anucdedirector@gmail.com

# BA GENERAL TELUGU – SRUJANATMAKA RACHANA

**2nd Year - 3rd Semester**

First Edition :

No. of Copies :

© Acharya Nagarjuna University

This book is exclusively prepared for the use of students of **BA GENERAL TELUGU – SRUJANATMAKA RACHANA,** 2st Year - 3 Semester Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is mean for limited circulation only

Published by :

**Dr.Nagaraju Battu**

Director

Centre for Distance Education

Acharya Nagarjuna University

Nagarjuna Nagar-522510

Printed at :

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే గ్రేడ్ 'A'ను సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, ప్రకాశం జిల్లాలోని 447 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిప్లమో, డిగ్రీ, పీజి స్థాయి విద్యాబోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికీ అందించాలన్న లక్ష్యంతో 2003–04లో దూరవిద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తిస్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్యనభ్యసించలేని వారికి, వ్యయభరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరిక ఉన్న గృహిణులకు ఈ దూర విద్యాకేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బి.కాం., బి.ఎస్‌సి., పీజీ స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్‌సి., ఎం.సి.ఏ., ఎల్.ఎల్.ఎం., ఎం.బి.ఏ., కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం గత సంవత్సరం కొత్తగా జీవన నైపుణ్యాలు అనే సర్టిఫికేట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు సులభంగాను, సరళంగాను విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకునేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి రచనా వ్యాసంగంలో అనుభవం గల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు నిష్ణాతులైనవారు ఇచ్చే సలహాలు, సూచనలు, సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలు గ్రహించి ముమ్ముందు మరింత నిర్దిష్టంగా అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, అభివృద్ధి కోసం సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయడం జరిగింది.

దూరవిద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమే కాక చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వార దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూరవిద్యాకేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని అకాంక్షిస్తున్నాను. ఈ ఆశయ సాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూర విద్యాకేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, అకడమిక్ కోఆర్డినేటర్లకు, అకడమిక్ కౌన్సిలర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

ప్రొఫెసర్. పి.రాజశేఖర్
ఉపకులపతి
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

# Degree - **II** Year - **III** Semester

## బి.ఏ / బి.కాం / బి.బి.ఎం రెండవ సంవత్సరం
## తెలుగు సిలబస్.
## సృజనాత్మక రచన

**యూనిట్–1: వ్యక్తీకరణ నైపుణ్యాలు**

1. భాష– ప్రాథమికాంశాలు: భాష నిర్వచనం, లక్షణాలు, ఆవశ్యకత, ప్రయోజనాలు
2. వర్ణం – పదం – వాక్యం, వాక్య లక్షణాలు, సామాన్య సంయుక్త సంక్లిష్ట వాక్యాలు
3. భాషా నిర్మాణంలో 'వర్ణం – పదం – వాక్యం' ప్రాధాన్యత.

**యూనిట్–II : సృజనాత్మక రచన**

4. కవితా రచన : ఉత్తమ కవిరా లక్షణాలు
5. కథారచన : ఉత్తమ కథా లక్షణాలు
6. వ్యాసరచన : ఉత్తమ వ్యాస లక్షణాలు,

**యూనిట్– III: అనువాద రచన**

7. అనువాదం నిర్వచనం, అనువాద పద్ధతులు.
8. అనువాద సమస్యలు – భౌగోళిక, భాషా, సాంస్కృతిక సమస్యలు, పరిష్కారాలు
9. అభ్యాసము: ఆంగ్లం నుండి తెలుగుకు, తెలుగు నుండి ఆంగ్లానికి ఒక పేరాను అనువదించటం

**యూనిట్ –IV: మాధ్యమాలకు రచన–1 (ముద్రణామాధ్యమం / ప్రింట్ మీడియా)**

10. ముద్రణా మాధ్యమం (అచ్చు మాధ్యమం)– పరిచయం, పరిధి, వికాసం.
11. వివిధ రకాల పత్రికలు – పరిశీలన, పత్రికాభాష, శైలి, వైవిధ్యం..
12. పత్రికా రచన: వార్తా రచన, సంపాదకీయాలు, సమీక్షలు అవగాహన,

**యూనిట్ V మాధ్యమాలకు రచన–2 (ప్రసార మాధ్యమం / ఎలక్ట్రానిక్ మీడియా)**

13. ప్రసార మాధ్యమాలు :నిర్వచనం, రకాలు, విస్తృతి, ప్రయోజనాలు,
14. శ్రవణ మాధ్యమాలు– రచన: రేడియో రచన, ప్రసంగాలు, నాటికలు, ప్రసార సమాచారం.
15. దృశ్య మాధ్యమాలు – రచన: వ్యాఖ్యానం (యాంకరింగ్), టెలివిజన్ రచన.

ఆధార గ్రంథాలు / వ్యాసాలు :

1. వ్యక్తీకరణ నైపుణ్యాలు :

ఎ. ఆధునిక భాషా శాస్త్ర సిద్ధాంతాలు–ఆచార్య పి ఎస్ సుబ్రహ్మణ్యం,

బి. తెలుగు భాషా చరిత్ర – సం. ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి

సి. తెలుగు వాక్యం డా. చేకూరి రామారావు..

2. ఉత్తమ కవిత – లక్షణాలు– చూ, నవ్య కవిత్వ లక్షణములు – ఆచార్య సి. నారాయణ రెడ్డి. ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయములు, ప్రయోగములు, చతుర్ధ ప్రకరణము.

3. ఉత్తమ కథ – లక్షణాలు చూ. కథా శిల్పం వల్లంపాటి వెంకట సుబ్బయ్య, పుటలు 11–17.

4. ఉత్తమ వ్యాసం – లక్షణాలు చూ. చదువు సంస్కృతి (వ్యాసం)– కొడవటిగంటి కుటుంబరావు

5. అనువాద రచన :

ఎ. అనువాద సమస్యలు– రాచమల్లు రామచంద్రారెడ్డి పుట 61–75, 85–94.

బి. అనువాదన పద్ధతులు, ఆచరణ సమస్యలు చేకూరి రామారావు.
భాషాంతరంగం, పుటలు 130–146, తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురణ

6. ముద్రణా మాధ్యమంచూ, మాధ్యమాలకు రచన, పుట 9–12, –డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం ప్రచురణ

7. పత్రికా భాష –చూ, మాధ్యమాలకు రచన, పుట 67–74, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం ప్రచురణ

8. పత్రిక రచన –చూ, తెలుగు మౌలికాంశాలు పుట 59–69, డాక్టర్ బి ఆర్ అంటేద్కర్ విశ్వవిద్యాలయం ప్రచురణ

9. ప్రసార మాధ్యమాలు చూ.మాధ్యమాలకు రచన, పుట 3–10. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంప్రచురణ

10. రేడియో రచన చూ. మాధ్యమాలకు రచన, పుట 141 148, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం

11. వ్యాఖ్యానం (యాంకరింగ్)– చూ, మాధ్యమాలకు రచన, పుట:178–181, డాక్టర్ బి ఆర్ అంటేద్కర్ విశ్వవిద్యాలయం ప్రచురణ,

12. టెలివిజన్ రచన చూ. మాధ్యమాలకు రచన, పుటలు 153–160, డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం ప్రచురణ.

13. తెలుగు జర్నలిజం – డా. బూదరాజు రాధాకృష్ణ

# విషయసూచిక


| | |
|---|---|
| 1. భాష – ప్రాథమికాంశాలు: భాష నిర్వచనం, లక్షణాలు, ఆవశ్యకత, ప్రయోజనాలు | 1.1 – 1.12 |
| 2. వర్ణం – పదం – వాక్యం, వాక్య లక్షణాలు, సామాన్య, సంయుక్త, సంక్లిష్ట వాక్యాలు | 2.1 – 2.13 |
| 3. భాషా నిర్మాణంలో వర్ణం – పదం – వాక్యం' ప్రాధాన్యత | 3.1 – 3.16 |
| 4. కవితా రచన : ఉత్తమ కవితా లక్షణాలు. | 4.1 – 4.10 |
| 5. కథారచన : ఉత్తమ కథా లక్షణాలు | 5.1 – 5.11 |
| 6. వ్యాసరచన – ఉత్తమ వ్యాస లక్షణాలు | 6.1 – 6.6 |
| 7. అనువాదం – నిర్వచనం, అనువాద పద్ధతులు | 7.1 – 7.6 |
| 8. అనువాద సమస్యలు. – పరిష్కారాలు | 8.1 – 8.3 |
| 9. అభ్యాసం – ఆంగ్లం నుండి తెలుగుకు, తెలుగు నుండి ఆంగ్లానికి ఒక పేరాను అనువదించడం | 9.1 – 9.3 |
| 10. ముద్రణా మాధ్యమం – పరిచయం, పరిధి, వికాసం | 10.1 – 10.5 |
| 11 వివిధ రకాల పత్రికలు – పరిశీలన, పత్రికాభాష, శైలి, వైవిధ్యం. | 11.1 – 11.6 |
| 12. పత్రికారచన – వార్తా రచన, సంపాదకీయాలు, సమీక్షలు | 12.1 – 12.5 |
| 13. ప్రసార మాధ్యమాలు – నిర్వచనం, రకాలు, విస్తృతి, ప్రయోజనాలు | 13.1 – 13.7 |
| 14. శ్రవణ మాధ్యమాలు – రేడియోరచన, ప్రసంగాలు, నాటికలు, ప్రసార సమాచారం | 14.1 – 14.6 |
| 15. దృశ్య మాధ్యమాలు – రచన – టెలివిజన్‌రచన, వ్యాఖ్యానం | 15.1 – 15.6 |

# Degree-II year semester 3

## బి.ఏ / బి.కాం / బి.బి.ఎం రెండవ సంవత్సరం

## తెలుగు

# సృజనాత్మక రచన

## మాదిరి ప్రశ్నాపత్రం

3 గంటలు. మార్కులు : 70

---

### అ - విభాగము

క్రింది వానిలో నాల్గింటికి సంక్షిప్త సమాధానాలు రాయండి 8వ ప్రశ్నకి తప్పనిసరిగా సమాధానం రాయాలి.

4 × 5 మా = 20 మా

1. భాష ప్రయోజనాలు 2. వాక్యం- లక్షణాలు 3. టెలివిజన్ రచన 4. రేడియో రచన 5.ఉత్తమ వ్యాసం - లక్షణాలు 6.సంక్లిష్ట వాక్యం 7.సంపాదకీయాలు 8. ఈ క్రింది అంశాన్ని తెలుగులోకి అనువదించండి.

To many, Indian thought, Indian manners, Indian customs, Indian philosophy, Indian literature are repulsive at the first sight; but let them preserve, let them read, let them become familiar with the great principles underlying these ideas, and it is ninety-nine to one that the charm will come over them, and fascination will be the result. Slow and silent, as the gentle dew that falls in the morning, unseen and unheard yet producing, a most tremendous result, has been the work of the calm, patient. All- suffering spiritual race upon the world of thought.

### ఆ విభాగము

క్రింది వానిలో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయండి 5 × 10మా = 50మా

9. భాషానిర్మాణంలో 'వర్ణం-పదం- వాక్యాల ప్రాధాన్యత వివరించండి.

(లేదా)

భాషను నిర్వహించి లక్షణాలు రాసి, ప్రామాణిక భాషను పరిచయం చేయండి.

10. ఉత్తమ కవితా లక్షణాలను విశ్లేషించండి.

(లేదా)

ఉత్తమ కథా లక్షణాలను వివరించండి.

11. అనువాద సమస్యలను, వాటి పరిష్కారాల గురించి రాయండి.

(లేదా)

అనువాద లక్షణాలను వివరిస్తూ, అనువాద పద్ధతుల గురించి రాయండి.

12. ముద్రణా మాధ్యమాన్ని పరిచయం చేస్తూ, దాని పరిధి, వికాసాలను వివరించండి.

(లేదా)

పత్రిక రచనను గురించి విశ్లేషణాత్మక వ్యాసం రాయండి.

13. ప్రసార మాధ్యమాల విస్తృతి, ప్రయోజనాలను సమీక్షించండి.

(లేదా)

యాంకరింగ్ నిర్వహణ, తీరుతెన్నులను వివరించండి.

# పాఠం - 1

# వ్యక్తీకరణ నైపుణ్యాలు

1. భాష - ప్రాథమికాంశాలు:

భాష - నిర్వచనం, లక్షణాలు, ఆవశ్యకత, ప్రయోజనాలు.

పాఠ్యాంశ విషయక్రమం :

1.0 పరిచయం

1.1 భాష - ప్రాథమిక అంశాలు

1.2 భాష - నిర్వచనాలు

1.3 భాష - లక్షణాలు

1.4. భాష - ఆవశ్యకత

1.5 భాష ప్రయోజనాలు

## 1.0 పరిచయం

ఈ సృష్టిలోని జీవరాసులన్నిటిలో మానవుడు మాత్రమే తన భావాలను మాటల రూపంలో తెలయపరచుగలడు. తన మనసులోని అభిప్రాయాలను బహిర్గతం చేసేందుకు ముఖ అవయవాలతో చేసే అర్థవంతమైన ధ్వనుల సముదాయమే భాష. ఆది మానవుడు తన మనసులోని భావాన్ని ఎదుటివారికి వ్యక్తం చేయడానికి సైగలు చేసేవాడు. భాష పుట్టిన తరువాత మనిషి తన ఆలోచనలను, భావాలను స్పష్టంగా వ్యక్తపరచగలుగుతున్నాడు. భాష లేనప్పుడు ఆదిమ సమాజంలో భాషా ప్రయోజనాలు పరిమితంగా ఉండేవి. మనిషి తన జీవన అవసరాలు తీర్చుకోవడం కోసం చాలా పరిమితంగా మాట్లాడేవాడు. తనకు సంతోషం వేసినప్పుడు పాటలు, పదాలు పాడుకునే వారు. భాష పుట్టిన తరువాతే మానవ అభివృద్ధి జరిగింది. నాగరికత ఏర్పడింది.

## 1.1 భాష - ప్రాథమికత అంశాలు :

భాష ప్రాదన ఆశయం భావ వ్యవక్తీకరణే. నాగరికతా వికాసంలో క్రమంగా సామాజిక అవసరాలు పెరగడం వల్ల భాషకు లిపి ఏర్పడింది. భాషాభి వృద్ధితోనే సమాజ అభివృద్ధి జరిగిందనేది చారిత్రక సత్యం. లిపి ఏర్పడిన తరువాత మానవుడు ఒక తరంలో నేర్చుకున్న విజ్ఞానాన్ని మరొక తరానికి అందించడానికి వీలు కలిగింది. మానవ వికాసానికి, సాంస్కృతిక అభివృద్ధికి మూలం భాష. మన భావాన్ని ఇతరులతో పంచుకోడానికి, ఇతరుల భావాన్ని మనం గ్రహించడానికి ప్రధాన సాధనం భాష. ఈ సృష్టిలోని జీవరాలసులన్నిటిలో మాట్లాడగల శక్తి మనావునికి మాత్రమే ఉంది. జీవరాశుల్లో నుండి మానవుణ్ణి వేరుపరచేది కూడా భాషే. భాష మానవుని

ఆలోచనా పరిధిని పెంచుతుంది. మేధస్సును వికసింప చేస్తుంది.

## 1.2 భాష – నిర్వచనాలు :

భాష స్వరూప స్వభావాలను ప్రపంచ వ్యాప్తంగ అనేకమంది భాషా పండితులు, భాషావేత్తలు పలువిధాలుగా నిర్వచించారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలిద్దాం. "భాష్యతే ఇతి భాష" అని మన ప్రాచీన లాక్షణికులు సంస్కృతంలో "భాష" అనే పదానికి అర్థం చెప్పారు. అంటే భాషింప బడేది లేదా పలుకబడేది భాష అని అర్థం హాకెట్ అనే ప్రసిద్ధ భాషావేత్త " పలు భాషల అలాట్లతో కూడిన సంక్లిష్ట వ్యవస్థే భాష" అని అర్థం చెప్పారు. "స్టూర్టమెంట్" అనే ప్రముఖ భాషావేత్త "ఒక సమాజంలోని సభ్యులు వ్యవహరించడానికి ఉపయోగించే స్వచ్ఛంద వాచిక సంకేతాల వ్యవస్థయే భాష" అని చెప్పారు. "మాంటి అనే భాషావేత్త " చిత్తస్థితిని వ్యక్తం చేసేందుకు చేసిన ఉద్దేశ్యపూర్వక ధ్వనుల ఉచ్చారణే భాష" అని చెప్పారు. బ్లూక్ & ట్రేగర్ (Bloock and Trager) అనే భాషావేత్త " ఒక సాంఘిక సముదాయం సహకరించుకోడానికి సాధనమైన స్వచ్ఛంద వాచిక సంకేతాల వ్యవస్థయే భాష " అని పేర్కొన్నారు. "ఇజ్లర్" అనే భాషావేత్త "బుద్ధిజీవుల అనుభవాల అభివ్యక్తే భాష" అని అన్నారు. "సఫేర్" అనే భాషా శాస్త్రజ్ఞుడు "అలవోకగా ఉత్పన్నమయ్యే కంఠధ్వనుల సాధనాలతో మానవతా సంబంధమైన సహజేతర పద్ధతి ద్వారా మానవోద్రేకాలను ఆలోచనలను వాంఛలను తెలియజేసేదే భాష" అని వివరించారు.

'సైమన్ పాటర్' అనే భాషా శాస్త్రజ్ఞుడు "మౌఖిక ధ్వనుల లేదా కంఠధ్వనుల స్వతంత్ర వ్యవస్థే భాష" అని చెప్పారు. రామచంద్రయ్య అనే భాషావేత్త "మనసులోని భావ పరంపరను ఏ వాక్యాలు, ఏ పదాలు ఎదుటి వారికి అందిస్తాయో ఆ వాక్యాలు, ఆ పదాలే భాష" అని పేర్కొన్నారు.

ఎందరో భాషావేత్తలు భాషను నిర్వచించారు. పైన చెప్పిన నిర్వచనాలలో స్టూర్టమెంట్, బ్లూక్ అండ్ ట్రేగర్, సఫేర్ వంటివారి నిర్వచనాలు కొంత సమంజసంగా ఉన్నాయి. వ్యాకరణ పండితులు " ప్రకృతి, ప్రత్యయ పద నిరూపణే భాష" అని పేర్కొన్నారు. భాషా వ్యవస్థను భాషావేత్తలు ఐదు ఉప వ్యవస్థలుగా వర్గీకరించారు. అవి:

1. వ్యాకరణ వ్యవస్థ : పదాంశాల సముదాయం, వాటి వరుస క్రమం
2. ధ్వన్యాత్మక వ్యవస్థ : వర్ణాల సముదాయం, వాటి వరుస క్రమం.
3. సంధి వ్యవస్థ : వాక్యంలో రెండు పదాలు లేదా పదాంశాలు సంహితలో ఉన్నప్పుడు ధ్వనుల్లో జరిగే మార్పు లేదా మార్పులు.
4. అర్థ సంబంధ వ్యవస్థ : పదాంశాలకు ఉన్న అర్థాన్ని వివరించే పద్ధతి.
5. ధ్వని వ్యవస్థ : ఒక ధ్వని లేదా వర్ణం వ్యక్తి భేదాన్ని బట్టి ఉచ్చారణలో కలిగే భేదం.

వీటిలో వ్యాకరణ, ధ్వన్యాత్మక, సంధి వ్యవస్థలను మాత్రమే భాషావేత్తలు "భాష" గా చెప్పారు. అర్థ, ధ్వని వ్యవస్థలు భాషా సంబంధాలు కావని కొందరు భాషా పండితుల అభిప్రాయం. అట్టివారి అభిప్రాయం చర్చించదగినది.

భారతీయులలో ప్రముఖ కవి కాళిదాసు భాషకు శబ్దార్థాలు రెండు ముఖ్యమైనవే అన్న

"వాగర్థావివ సంపృక్తౌ వాగర్థప్రతిపత్తయే
జగత:పితరౌ వన్దే పార్వతీ పరమేశ్వరౌ " అని

కాళిదాసు రఘువంశలో భాషకి శబ్దం, అర్థం ఈ రెండూ పార్వతీ పరమేశ్వరుల వంటివని వాటి ప్రాధాన్యతను

వివరించారు.

(DUALITY IN CONSTRUCTION)

## 1.3 భాష - లక్షణాలు :

మానవునికి అన్నపానాదులు ఎంత ముఖ్యమో సంభాషణ కూడా (భాష) అంతే ముఖ్యమైనది. భాష దాదాపుగా 25వేల సంవత్సరాల క్రితం పుట్టి ఉంటుందని భాషాశాస్త్రవేత్తల అభిప్రాయం. కోతిజాతినుండి పుట్టిన మానవుని మెదడు పరిణామం చెందినదని, ఒక తరం నుండి మరొక తరానికి సంస్కృతి, భాష ప్రసరించి ఉంటాయనేది స్పష్టంగా తెలుస్తుంది. మానవ జీవనంలో సంభాషణ ప్రధానమైంది. ఆ సంభాణలకు ముఖ్యమైనది భాషే. భాషకి ప్రధానంగా ఏడు లక్షణాలు ఉంటాయని భాషా శాస్త్రజ్ఞులు పేర్కొన్నారు. వాటిని పరిశీలనగా చూద్దాం.

### 1. నిర్మాణ ద్వైవిధ్యం (DUALITY IN CONSTRUCTION) :

మానవ భాషలో రెండు నిర్మాణ క్రమ పద్ధతులు ఉన్నాయి. ఒకటి కొన్ని రకాల ధ్వనులు కలసి ఒక పదంగా ఏర్పడడం. రెండవది కొన్న పదాలు కలసి ఒక వాక్యంగా ఏర్పడడం. ఈ రెండు పద్ధతులు ప్రపంచలో ఎన్ని భాషలున్నాయో వాటన్నిటిలో ఉన్నాయి. ప్రతి భాషలోనూ పదాలు క్రమపద్ధతిలో కలిసి వాక్య నిర్మాణం జరుగుతంది. ఒకటి వర్ణనాత్మక వ్యవస్థ, రెండు వ్యాకరణ వ్యవస్థ వీటినే ద్వైవిధ్య నిర్మాణం అంటారు. సాధారణంగా ప్రపంచంలో ఏ భాషలోనైనా 60 వర్ణాలకు మించకుండా, 15 వర్ణాలకు (అక్షరాలకు) తక్కువ కాకుండ ఉంటాయి. భాషకి వ్యాకరణం ఉండటం వల్ల సంపూర్ణ సందేశం మనకి అందుతుంది. విషయాన్ని అర్థం చేసుకొని, అవగాహన కలిగి ఉండడానికి వ్యాకరణ వ్యవస్థ తోడ్పడుతుంది. మానవేతర జీవుల్లో ఈ ద్వైవిధ్య నిర్మాణం లేదు. తేనెటీగల వార్తాప్రసారంలో కొంతవకు ద్వైవిధ్య నిర్మాణం ఉందని భాషాశాస్త్రవేత్తల అభిప్రాయం.

### 2. ఉత్పాదక శక్తి :

మానవుడు వర్ణాల కలయిక ద్వారా పదాలు నిర్మిస్తాడు. పదాల కలయికతో వాక్యం నిర్మిస్తాడు. ఈ వాక్యాల నిర్మాణం కొన్నిసార్లు తెలిసి, కొన్నిసార్లు అప్రయత్నంగా చేస్తాడు. ఉదా॥కి చిన్నపిల్లలు వారికి తెలియకుండానే అప్రయత్నంగా మాట్లాడతారు. చిన్నపిల్లలు భాష నేర్చుకోవడం ఉత్పాదక శక్తివల్లే సాధ్యపడుతుందని భాషాశాస్త్రజ్ఞుల అభిప్రాయం. భాష నేర్చుకున్న తరువాత కొన్ని వాక్యాలను కూడా వారికి తెలియకుండానే నిర్మిస్తారు. వినేవారు ఆ వాక్యాలను అర్థం చేసుకోగలరు. ఈక్రొత్త వాక్యాల నిర్మాణానికి కారణం సారూప్యత (amalogy) ఉత్పాదకత పాత, కొత్త వాక్యాల నిర్మాణానికి సంబందించింది. తేనెటీగల్లో తప్ప మిగిలిన జీవరాసుల్లో ఈ శక్తి లేదని భాషజ్ఞుల అభిప్రాయం.

### 3. శబ్దార్థ సంబంధ శక్తి :

పదానికి అర్థం అనేది సంకేతంగా (గుర్తు) చెప్పవచ్చు ప్రతిభాషలోనూ పదాలకు అర్థాలు ఉంటాయి. మానవుడు చేసే భాషాధ్వనుల కలయికకు (అమాహారానికి) అర్థానికి సంబంధం ఉంది. ఇది శబ్దార్థ సంబంధ శక్తితో కూడినది. ఉదా॥కి "నోరు ఉంటే" కన్ను" అనో, లేదా కాలు, ముక్కు అని వేరే అర్థాలు ఎందుకు రాలేదు? అనే ప్రశ్న లేవనెత్తితే సమాధానం ఒక్కటే అది శబ్దార్థ సంకేతం కేవలం స్వచ్ఛందతతో కూడింది. అని చెప్పడమే . వైయాకరుణులు (వ్యాకరణ గ్రంథాలు రాసినవారు) "శక్తం పదమ్" అన్నారు. అంటే శక్తి కలదానిని పదం

అంటారు అని అర్ధం ఈ పదంనుండి ఈ అర్థం పుట్టింది. అని చెప్పడానికి భగవంతుని సంబంధమైన శక్తే (ఈశ్వర సంకేతమైన కారణమని కొందరు భాషాశాస్త్రజ్ఞుల అభిప్రాయం. ఆధునిక భాషా వేత్తలు కూడా పదానికి అర్థానికి మానవ సంకేత శబ్దశక్తే కారణమని అంటారు.

### 4. వక్త శ్రోత విపరిణామం :

మానవునికి రెండు శక్తులున్నాయి. ఒకటి మాట్లాడే శక్తి. రెండవది ఇతరుల మాటలను అర్థం చేసుకోగల శక్తి. వీటివల్లే మన సంభాషణ సాగుతుంది. కోతుల అరుపులు, తేనెటీగల నాట్యఝీంకారంలోనూ ఈ లక్షణం ఉంది. అవి మాటల ద్వారా కాక ధ్వనుల ద్వారా భావాన్ని తెలుపుతాయి. ఈ శక్తి ఇతర మానవేతర జీవుల్లో లేదు.

### 5. ప్రత్యేకత :

వార్తా ప్రసారంలో ప్రేరణ, ప్రతిక్రియ రెండూ ఉంటాయి. ఈ రెంటికీ దగ్గర సంబంధం వుంది. ఉదా॥ పదార్థాలు వడ్డించే సమయంలో వంటగదిలోకి వెళ్ళి కూర్చుంటాం. కారణం ఈ రెండు పనులకు దగ్గర సంబంధం ఉంది. కాబట్టి వార్తాప్రసారంలో ప్రత్యేకత లేదు. కానీ వడ్డిస్తున్నాను అని గృహిణి చేసే ధ్వనులకు మనం వంటగదిలోకి వెళ్ళి కూర్చోవడం అనే ప్రతిక్రియ జరుగుతుంది. ఇది సహజ సిద్ధంగా జరిగిందికాదు. వీటి మధ్య కృత్రిమమైన శబ్దార్థ శక్తి ఉండటంవల్ల అలా జరిగింది. ఆమె పలికిన మాటలు విన్నప్పటికి దానికి అర్థం తెలియని వారు ఉంటే ప్రతిక్రియ జరగదు.

### 6. ప్రేరణ దూరత :

మానవుడు, తన ఆలోచనలను, భావాలను వ్యక్తం చేయడానికి మాట్లాడతాడు. కేవలం ప్రస్తుతం జరుగుతున్న సంఘటనలనే కాక, జరిగిపోయిన (భూత) జరగబోతున్న (భవిషత్) విషయాలను కూడా వెల్లడించగలడు. పశు పక్షాదులలో మనోవికారం కలిగినప్పుడు మాత్రమే ధ్వనులు వ్యక్తమౌతాయి. మానవునికి, జంతువులకి ఉండే భేదం కూడా ఇదే.

### 7, సాంస్కృతిక ప్రసరణ

మానవుడు సంఘజీవి. సంప్రదాయ ఆచార అలవాట్లను (వ్యవహారాలు) ఒక తరంనుండి మరొక తరానికి అనుసరించి ఆచరిస్తాడు. అదే విధంగా భాష కూడా ఒకరి నుండి మరొకరు నేర్చుకుంటారు. మనిషికి ఈ శక్తి అనుకరణ వల్లే వస్తుంది. సాధారణంగా పిల్లలు మాట్లాడే భాషలో . తప్పులుంటాయి పెద్దలు వాటిని గమనించి సరిచేస్తారు. ఈ అనుకరణ శక్తి మానవేతర జీవులకు కూడా ఉంది. కానీ వాటిలో సాంస్కృతిక ప్రసరణ లేదు. దీనిని బట్టి మనకు రెండు విషయాలు అర్థమౌతాయి. అది ఒకటి వంశపారంపర్యంగా (జీన్స్ ద్వారా) తరతరాలకి అందుతుంది. రెండవది పరిసరాల ప్రభావం వల్ల వస్తుంది. సాంస్కృతికంగానైతే అధ్యయనం ద్వారా సంక్రమిస్తుందని నిర్ధారించారు.

## 1.4. భాష – ఆవశ్యకత :

మానవ అభివృద్ధికి, సమాజ అభివృద్ధికి భాష అవసరం. సమాజ అభివృద్ధిలో భాషని కీలకపాత్ర నేటికీ బాషా ఉత్పత్తికి సంబంధించిన పరిశోధనలు విస్తృతంగా సాగుతున్నాయి. వీటిపై భిన్నమైన అభిప్రాయాలు

ఉన్నాయి. ప్రపంచంలో భాష ఎప్పుడు పుట్టింది? ఎక్కడ పుట్టింది? ఎవరు ఎవరితో మొట్ట మొదటిగా మాట్లాడారు మొదట ఏ భాష ఉంది? అనే విషయాలపై నేటికీ పరిశోధనలు సాగుతున్నాయి.

ప్రపంచం ప్రారంభంలో ఒకే భాష ఉండేదని, తరువాత క్రమేపి కొన్ని భాషలు పుట్టాయని భాషాశాస్త్రవేత్తల అభిప్రాయం. దీనినే "ఏకమూల భాషా వాదం" అంటారు. కాల క్రమంలో అనేక భాషలు పుట్టాయని భాషాశాస్త్ర వేత్తలు నిర్ధారించారు. భావ వ్యక్తీకరణకు భాష అవసరం. మానవుని దైనందిన జీవితంలో భాషా ఆవశ్యకత ఎంతో ఉంది. భాష ఏదైనా వ్యక్తపరిచే భావం ఒకటే. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా సుమారు 6 వేల భాషలున్నాయని, ఒక్క భారత దేశంలోనే 1652 భాషలున్నాయని భాషాశాస్త్రజ్ఞుల అభిప్రాయం. భాషావేత్తలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న భాషలన్నింటినీ 10 భాషా కుటుంబాలుగా వర్గీకరించారు. భారత దేశంలోని భాషలను నాలుగు కుటుంబాలుగా విభజించారు. అందులో మన మాతృభాష తెలుగును ద్రావిడ భాషా కుటుంబానికి చెందిందని నిర్ధారించారు. ద్రావిడ భాషా కుటుంబానికి చెందిన భాషలే ద్రావిడ భాషలు. సాధారణంగా దక్షిణ భారతదేశం, శ్రీలంక, పాకిస్తాన్ నేపాల్, బాంగ్లాదేశ్ తూర్పు, మధ్య భారతదేశం, ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్‌లోని కొన్ని ప్రాంతాలలో మట్లాడే భాషలు దాదాపు 26 ఉన్నాయి. అవి ఈ వర్గానికి చెందినవని ప్రముఖ తెలుగు భాషావేత్త బద్రిరాజు కృష్ణమూర్తి గారు తెలిపారు. భారత రాజ్యాంగంలో 85వ షెడ్యూల్‌లో ప్రస్తుతం ఆమోదం పొందిన 18 భాషలున్నాయి. వీటినే భారత రాజ్యాగం అధికార భాషలుగా గుర్తించింది. అవి. 1. తమిళం, 2.కన్నడం, 3. మళయాళం, 4 . తెలుగు 5, మరాఠీ, 6 పంజాబి, 7. బెంగాలి, 8. హిందీ, 9, ఒరియా, 10 కాశ్మీరి, ? గుజరాతి 12, ఉర్దూ, 13. సింధీ, 14. అస్సామీ, 18. సంస్కృతం 16 మణిపురి 17. నేపాలి, 18. కొంకణి భాషలుగా గుర్తించింది. హిందీ దేశ భాషగా గుర్తింపు పొందింది.

భాషకి ఒక ఆకృతి (ఆకారం, రూపు రేకలు ) తెచ్చేది వ్రాత మాత్రమే. ఆ వ్రాతకు దోహదం చేసేది లిపి, అభివృద్ధి చెందిన సమాజాలలో భాష లిపి రూపంలో ఉంటుంది. రాసే భాష మాట్లాడే భాషనుండే పుట్టింది. తొలిరోజుల్లో మాట్లాడే భాష, రాసే భాష, ఒకే విధంగా ఉండేది. క్రమేపి రెంటి మధ్య వ్యత్యాసం ఏర్పడింది, మాట్లాడే భాషలో కూడా భేదాలున్నాయి. మనం చిన్న పిల్లలతో మాట్లాడే భాష చిన్న చిన్న పదాలలో ముద్దు ముద్దుగా ఉంటుంది. తోటి వయస్కులతో ఒక విధంగా, ఇంటిలో ఒక విధంగ సభలో ఒక విధంగ, రాసేక్రమంలో ఒక విధంగా భాష వ్యక్తమౌతుంది. సభలలో, సమావేశాలలో మాట్లాడే భాష శైలీ సౌందర్యంతో, వినేవారిని ఆకట్టుకొంటుంది. రాయడంలో కూడా కథాకథనాలను, కవిత్వాన్ని రాసే సమయంలో, మంత్రాలను రాసే సమయంలో వేరువేరు భాషలు ఉపయోగిస్తాం. చదువుకొన్న వారి భాషకు, చదువు రాని వారి భాషకు తేడా ఉంది. ప్రాంతాన్ని బట్టి భాష మారుతూ ఉంటుంది. మాండలిక యాస భాషలకు, ప్రామాణిక భాషకు వ్యత్యాసం ఉంది. ఒకే ప్రాంతలో ఉన్న వ్యక్తుల్లో కూడా, కుల, మత, ఆచార వ్యవహారాలను బట్టి భాషా పదజాలంలో తేడా గమనించవచ్చు. ప్రస్తుత కాలంలో చాలా మంది రచయితలు వారివారి యాస భాషలతో ( మాండలిక భాష) కవిత్వాలు, కథలు, కథానికలు రాస్తున్నారు. భాషలో భేదాలెన్ని ఉన్నప్పటికి భావ వ్యక్తీకరణే దాని అంతిమ లక్ష్యం.

## 1.5 భాష ప్రయోజనాలు

మనం నిత్య వ్యవహారంలో దైనందిన జీవితంలో భాష వల్ల అనేక ప్రయోజనాలు పొందుతాము. అవి.

1, భావవ్యక్తీకరణకు, భావాన్ని గ్రహించడానికి భాష ఉపయోగపడుతుంది.

2 దైనందిన జీవితంలో ఎదుటి వారితో మనం మాట్లాడి అవసరాలు తీర్చుకోడానికి భాష అవసరం.

3, మన సంస్కృతి, సాంప్రదాయాలను, సాహిత్య సంపదను భాష రక్షిస్తుంది.

4, వ్యక్తి వికాసానికి, జాతి అభివృద్ధికి దోహదం. చేస్తుంది

5. వ్యక్తిత్వ వికాసానికి భాష, తోడ్పడుతుంది.

6. నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తుంది.

7, మనం సంస్కారవంతంగా ఎదగడానికి తోడ్పడుతుంది.

8, చెప్పడానికి, చదవడానికి తోడ్పడుతుంది.

9.విజ్ఞానాన్ని సంపాదించుకోవడానికి ఉపయోగపడుతుంది.

10, మనలో సృజనాత్మక శక్తిని పెంపొందిస్తుంది..

11. రచనా శక్తికి, విభిన్న కోణాలలో రచన చేయడానికి ఉపయోగ పడుతుంది.

12. దేశభక్తి, జాతీయతాభావాలు పెంపొందించి ప్రజల సమైక్యతకు దోహదం చేస్తుంది.

13. పాటలు, పద్యాలు, గేయాలు, కవితలు మొదలైన సాహిత్య, సంగీత కల్పనుకు తోడ్పడి మానవాళిని ఆనందింప జేస్తుంది.

12. వివిధ వృత్తులు, వాణిజ్యం, వ్యాపారం, వంటి రంగాల్లో అభివృద్ధి చెంది ఆదాయాన్ని సంపాదించుకోవడానికి తోడ్పడుతుంది.

13 సాంకేతిక విషయాలు, అనేక శాస్త్రాలు తెలుసుకోవడానికి సహకరిస్తుంది.

14. భాష ద్వారానే విద్యావంతులకు సాంకేతిక ప్రయోజనం అందుబాటులో ఉంటుంది.

15. సాహిత్యం వల్ల, ఉద్దీపనా ప్రయోజనం కలుగుతుంది. ఈ ఉద్దీపనా ప్రయోజనాలకు తోడ్పడేది భాషే.

16, అనుభూతి, సృజనాత్మకత వెల్లడించడానికి తోడ్పడుతుంది.

17. పారిభాషిక పద ప్రయోగాలు తెలుసుకోడానికి అర్థం తెలుసుకోవడానికి భాష ఉపయోగ పడుతుంది. ఇంకా భాష వల్ల కలిగే ప్రయోజనాలు అనేకమని చెప్పవచ్చు.

మగింపు :

ఒక వ్యక్తి అభివృద్ధికి, సమాజ-అభివృద్ధికి తోడ్పడే గొప్ప శక్తి భాషకు మాత్రమే ఉంది. కాబట్టి మనం భాషానైపుణ్యాలను పెంపొందించుకోవాలి. అనేక ప్రయోజనాలున్నా భాషను పరిరక్షించుకోవలసిన బాధ్యత అవసరం మనందరిపైన ఉంది. భాష మృతమైతే మానవ మనుగడ చాలావరకు వెనక్కి నెట్టివేయబడుతుంది. అది ఊహించుకోవడమే చాలా కష్టతరం కాబట్టి మనభాషని మనం కాపాడుకోవాలి. మృతభాషల కోవలోకి చేరే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి, కనుక రక్షించుకునే బాధ్యత పౌరులందరిపైన ఉంటుంది.

# ప్రశ్నలు - జవాబులు

## వ్యాసరూప ప్రశ్నలు

1. 'భాష', నిర్వచనాలను వివరించి స్వరూప, స్వభావాలను తెలుపుము?

**జవాబు :**

భాష స్వరూప స్వభావాలను ప్రపంచ వ్యాప్తంగా ఎందరో భాషావేత్తలు ఎన్నో నిర్వచనాలు చెప్పారు. మన పూర్వీకులు (ఆలంకారికులు, వైయాకరుణులు, సంస్కృతంలో " భాష్యతే ఇతి భాష" అన్నారు. అంటే భాషింపబడేది భాష అని అర్థం. భాషకి కొంతమంది భాషావేత్తలు, శాస్త్రజ్ఞులు కొన్ని నిర్వచనాలు చెప్పారు.

1.హాకెట్ : "పలు భాషల అలవాట్లతో కూడిన సంక్లిష్ట వ్యవస్థ భాష" అని నిర్వచించారు.
2.స్టూర్ట్‌వెంట్: స్టూర్ట్‌వెంట్ అనే భాషావేత్త " ఒక సమాజంలోని సభ్యులు వ్యవహరించడానికి ఉపయోగించే స్వచ్ఛంద వాచిక సంకేతాల వ్యవస్థ భాష, అని చెప్పారు.
3. బ్లాక్ & ట్రిగర్ : "ఒక సాంఘిక సముదాయం సహకరించుకోడానికి సాధనమైన స్వచ్ఛంద వాచిక సంకేతాల వ్యవస్థయే భాష" అని భాష" అని భాష గూర్చి దరిదాపుగా స్టూర్ట్‌వెంట్ అభిప్రాయాన్నే వెలిబుచ్చారు.
4. మాంటి : 'మాంటీ' అనే భాషావేత్త "చిత్తస్థితిని వ్యక్తం చేసేందుకు చేసిన- ఉద్దేశ పూర్వక ధ్వనుల ఉచ్ఛారణే భాష" అని అన్నారు.
5. ఇజ్లర్ : బుద్ధి జీవుల అనుభవాల అభివ్యక్తే భాష" అని ఇజ్లర్ తన అభిప్రాయాన్ని చెప్పారు.
6 సఫేర్: , సఫేర్ "అలవోకగా ఉత్పన్నమయ్యే కంఠధ్వనుల సాధనాలతో మానవతా సంబంధమైన సహజేతర పద్ధతి ద్వారా మానవోద్రేకాలను, ఆలోచనలను, వాంఛలను తెలియజేసేది భాషని" నిర్వచించారు.
7, సైమన్ పాటర్ : మౌఖిక ధ్వనులు లేదా కంఠధ్వనుల వ్యవస్తే భాషని సైమన్ పాటర్ అనే భాషాశాస్త్రజ్ఞుడు భాషకి నిర్వచనం చెప్పారు.
8. రామచంద్రవర్మ : " మనసులోని భావపరం పరలను ఏ వాక్యాలు, ఏ పదాలు ఎదుటి వారికి అందిస్తాయో, ఆ వాక్యాలు, పదాలే భాష" అని నిర్వచించారు.

పైభాషావేత్త లందరి నిర్వచనాలను పరిశీలిస్తే స్టూర్ట్ మెంట్, బ్లాక్ & ట్రేగర్ చెప్పిన నిర్వచనాలు సమంజసంగా ఉన్నాయి. భాషావేత్తలు భాషని 5 ఉపవ్యవస్థలుగా విభజించారు. అవి:

1, **వ్యాకరణ వ్యవస్థ** :- ఇది పదాంశాల సముదాయాన్ని, వాటి వరుస క్రమాన్ని తెలుపుతుంది..

2 **ధ్వన్యాత్మక వ్యవస్థ** :- వర్ణాల సముదాయాన్ని దాని వరుస క్రమాన్ని తెలియజేస్తుంది.

3. **సంధి వ్యవస్థ** :- వాక్యంలో రెండు పదాలు లేదా పదాంశాలు దగ్గరగా ఉన్నప్పుడు ధ్వనుల్లో కలిగే మార్పులను తెలుపుతుంది.

4, **అర్థ సంబంధ వ్యవస్థ** :- పదాంశాలకు ఉన్న అర్థాలను తెలియజేస్తుంది.

5 ధ్వని వ్యవస్థ :-

ఒక ధ్వని లేదా ఒక వర్ణం వ్యక్తి భేదాన్ని బట్టి ఉచ్చారణలో కలిగే భేదాన్ని తెలుపుతుంది. పై వ్యవస్థల్లో వ్యాకరణ, ధ్వన్యాత్మక, సంధి వ్యవస్థలనే భాషావేత్తలు భాషగా చెపుతున్నారు. అర్థసంబంధ, ధ్వని వ్యవస్థలను భాషా సంబంధాలు కాదనేది వారి అభిప్రాయం. కాళిదాస మహాకవి భాషకి శబ్దార్థాలు (శబ్ధం, అర్థం) రెండూ అర్ధనారీ శ్వరులైన పార్వతీ పరమేశ్వరులతో పోల్చి రెండూ భాషకి ముఖ్యమేనని తెలిపారు.

<u>భాష- పుట్టు పూర్వోత్తరాలు -</u> అసలు భాష లేదా భాషలు ఎప్పుడు పుట్టాయి? ఎక్కడ పుట్టాయి అనే అంశాలపై నేటికీ పరిశోధనలు సాగుతూనే ఉన్నాయి. మొదట ప్రపంచమంతా ఒకే భాష ఉండేదని, కాలక్రమంలో ఆ భాషే అనేక భాషలుగా మార్పు చెందిందని కొందరు. భాషా శాస్త్రజ్ఞుల అభిప్రాయం. దీనినే "ఏకమూల భాషావాదం' అంటారు. కాని భాష అనేక ప్రాంతాలలో అనేక రూపాల్లో పుట్టిందని, ఆ భాషలే ఎన్నో పరిణామాలకు లోనై నేటి భాషలుగా ప్రాంతీయ భాషలుగా ఏర్పడి ఉంటాయని భాషా శాస్త్రజ్ఞులు నిర్ధారించారు

భాషా శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం ప్రపంచం మొత్తం మీద 6000 భాషలున్నాయి. ఈ 6000 భాషలు, ఆ భాషల లక్షణాలను అనుసరించి భాషావేత్తలు పది భాషా కుటుంబాలుగా వర్గీకరించారు. ఒక్క భారత దేశంలోనే 1652 (పదహారు వందల ఏభై రెండు) భాషలున్నాయి.

ఆ భాషలు నాలుగు భాషా కుటుంబాలకు చెందినవని భాషా శాస్త్రవేతలు తెలిపారు . తెలుగు ద్రావిడ భాషా కుటుంబానికి చెందింది. తమిళం, కన్నడం, మళయాళం కూడా ద్రావిడ భాషా కుటుంబానికి చెందినవే.

భాషకు రాత రూపంలో ఒక ఆకారాన్ని కల్పించేది లిపి. అభివృద్ధి చెందిన భాషలకు లిపి ఉంటుంది. రాసే భాష మనం మాట్లాడే భాషనుండి పుట్టింది. ఆదిలో మాట్లాడే భాషకి, రాసే భాషకి తేడా ఏర్పడింది.

మాట్లాడే భాషలో కూడా తేడాలుంటాయి. ఒకే వ్యక్తి పిల్లలతో ఒక విధంగా, స్నేహితులతో ఒక విధంగ, సమావేశాల్లో మరోక విధంగా, మాట్లాడతాడు. చదువుకున్నవారు, పామరులు మాట్లాడే భాషలో కూడా తేడా ఉంటుంది. ప్రామాణిక భాషకి, ప్రాంతాల వారీగా మాట్లాడే మాండలిక భాషకి ఎంతో వ్యత్యాసం ఉంటుంది.

<u>ముగింపు :</u> భాషా స్వరూపంతో ఎన్నో భేదాలు ఉన్నా బాషా లక్ష్యం భావ ప్రకటన మాత్రమే. భావవ్యక్తీకరణ కోసం ఏర్పడిన భాష వల్ల మనిషికి, సమాజానికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి.

2, భాషను నిర్వచించి, ప్రయోజనాలను వివరించండి?

జవాబు:-

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భాషావేత్తలు భాషను అనేక విధాలుగా నిర్వచించారు. సంస్కృతంలో "భాష్యతే ఇతి భాష" అని నిర్వచించారు. అంటే " బాషింపబడేది భాష" అని భాషా పదానికి వ్యుత్పత్తిని చెప్పారు. ఇతర నిర్వచనాలు.

**1.స్టూర్ట్‌వెంట్:** ఒక సమాజంలోని సభ్యులు వ్యవహరించడానికి ఉపయోగించే స్వచ్ఛంద వాంచిక సంకేతాల వ్యవస్థే భాష, అన్నారు

**2. బ్లూక్ & ట్రిగర్ :** "ఒక సాంఘిక సముదాయం సహకరించుకోడానికి సాధనమైన స్వచ్ఛంద వాచిక

సంకేతాల వ్యవస్థయే భాష" అని చెప్పారు.

3. చిత్తవృత్తిని వ్యక్తం చేసేందుకు చేసిన- ఉద్దేశ పూర్వక ధ్వనుల ఉచ్ఛారణే భాష" అని నిర్వచించారు. - మాంటి.

4. **ఇజ్లర్ :-** బుద్ధిజీవుల అనుభవాల అభివ్యక్తి భాష" అన్నారు

5. **సఫేర్ :** "అలవోకగా ఉత్పన్నమయ్యే కంఠధ్వనుల సాధనాలతో మానవతా సంబంధమైన సహజేతర పద్ధతి ద్వారా మానవోద్రేకాలను, ఆలోచనలను, వాంఛలను తెలియజేసేది భాషని" నిర్వచనం చెప్పారు.

6. **సైమన్ పాటర్ :** "మౌఖిక ధ్వనుల లేదా కంఠధ్వనుల స్వతంత్ర వ్యవస్థే భాషని సైమన్ పాటర్ అనే శాస్త్రవేత్త భాషని నిర్వచించారు.

7. **రామచంద్రవర్మ:** "మనసులోని భావ పరంపరను ఏవాక్యాలు ఏ పదలు ఎదుటి వారికి అందిస్తాయో ఆ వాక్యాలు, పదాలే భాష" అని నిర్వచించిన వారు రామచంద్రవర్మ.

8. **వ్యాకరణ వేత్తలు (వైయాకరణులు :** "ప్రకృతి, ప్రత్యయాల నిరూపణే భాష" అన్నారు. వీరందరిలో, స్టూర్ట్‌మెంట్, బ్లూక్ & ట్రేగర్, సఫేర్ వంటి భాషా వేత్తలు చెప్పిన నిర్వచనాలని అనేకులు సమంజసంగా ఉన్నాయని అంగీకరించారు.

**భాషా ప్రయోజనాలు :**

మానవుడు నిత్య అవసరతల వ్యవహారంలో ఉపయోగించడం వలన ఎన్నో ప్రయోజనాలను పొందుతున్నాడు. అవి:

1. భావాన్ని వ్యక్తపరచడానికి, గ్రహించడానికి భాష అవసరం.
2. భాష లేకపోతే మనుషుల మధ్య సంభాషణ జరగదు. భావ వినిమయం ఉండదు.
3. మానవుడు తన దైనందిన జీవితంలో అవసరాలు తీర్చుకోవాలంటే తప్పని సరిగా భాష అవసరం.
4. మానవజాతి సంస్కృతిని, సాంప్రదాయాలను ఆచార వ్యవహారాలు బలపరచుకోవడానికి భాష తోడ్పడుతుంది.
5. సాహిత్యాన్ని పరిపుష్టి చేస్తుంది.
6. వ్యక్తి వికాసానికి, జాతి అభివృద్ధికి భాష పనికివస్తుంది.
7. భాషా నైపుణ్యాలు వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి.
8. వ్యక్తిత్వం వికాసం చెందడం ద్వారా మానవునిలో నాయక్తవ లక్షణాలు పెరుగుతాయి. సంస్కారాన్ని పొందవచ్చు.
9. చదవడానికి చెప్పడానికి (అభ్యాసన, భోధనలకు) భాష తోడ్పడుతుంది.
10. విజ్ఞాన సముపార్జన భాషవల్లే కలుగుతుంది.
11. భాష మనలోని సృజనాత్మకతని పెంచుతుంది. విభిన్న ప్రక్రియల్లో రచనా శక్తి పెరుగుతుంది.
12. మనకి (మానవునికి) జాతీయభావాలు కలిగిస్తుంది. దేశభక్తిని, భావ సమైక్యతను కలిగించే శక్తి భాషకుంది.
13. లలితకళల్లో బాగాలైన పాట, పద్యం మొదలైన సాహిత్య రూపాలతో శ్రోతలను సంతోషపరచడానికి భాష తోడ్పడుతుంది.
14. అనేక వృత్తులు నిర్వహించి ఆదాయం సంపాదించుకోడానికి తోడ్పడుతుంది.
15. వాణిజ్య, వ్యాపారరంగ అభివృద్ధి ద్వారా మానవుడు ఎదగడానికి సహాయపడుతుంది.
16. విజ్ఞాన శాస్త్రానికి సంబందించిన ప్రయోగ ఫలితాలను నమోదు చేసి తరువాత తరాలకు అందించడాని

ఉపయోగపడుతుంది.

17. గణిత శాస్త్రం, సాంకేతికాంశాలు, వ్యాకరణ, శాస్త్రం, వాణిజ్య శాస్త్రం వంటి అనేక శాస్త్రాలకు సంబంధించిన పారిభాషిక పదాలు నేర్చుకొని మానవుడు ఆయారంగాలలో విద్యావంతులు, విజ్ఞులు, మేధావులు కావడానికి భాష దోహదం చేస్తుంది.
18. సాహిత్యం, ఇతర కళల ద్వారా మధుర అనుభూతిని పొంది మానవుడు హృదయ వికాసాన్ని పొందడానికి భాష ఉపయోగపడుతుంది.

**ముగింపు :**

మానవ మనుగడకు, అభివృద్ధికి, బుద్ధివికాసానికి, హృదయోల్లాసానికి, విజ్ఞాన సముపార్జనకు తోడ్పడే భాషని కాపాడుకోవడం మానవునిపై ఉంది. కాబట్టి మనమంతా మనభాషను కాపాడుకుంటూ, భాషానైపుణ్యాలను పెంపొందించుకొంటూ అభివృద్ధి చెందాలి. భాష లేకపోతే మానవ మనుగడ కొంతవరకు చీకటిమయం అవుతుంది. దానిని పరిరక్షించుకోడం ప్రతి ఒక్కరి బాధ్యత.

**3. భాషా లక్షణాలను వివరించండి?**

**జవాబు :-**

మనిషికి భోజన పానాల వలె భాషకూడా అవసరం. 25వేల సంవత్సరాల క్రితం భాష పుట్టి ఉంటుందని భాషావేత్తల అభిప్రాయం. మానవ జీవితంలో, జీవనంలో సంభాషణ లేకపోతే జరగదు. ఆ సంభాషణకు భాష ఎంతో అవసరం . అట్టి ప్రాధాన్యత కలిగిన భాషకి ప్రధానంగా కొన్ని లక్షణాలు ఉన్నాయని భాషావేత్తలు తెలిపారు. అవి:-

**1. నిర్మాణ ద్వైవిధ్యం :**

ప్రతి భాషలోనూ రెండు నిర్మాణాత్మకమైన క్రమపద్ధతులు ఉంటాయి. అవి ఒకటి కొన్ని ధ్వనులు కలసి ఒక అర్థవంతమైన పదంగా ఏర్పడటం. రెండవది కొన్ని అర్థవంతమైన పదాలు క్రమ పద్ధతిలో అమర్చబడి వాక్యరూపం దాల్చడం. ప్రతి భాషలోనూ ఈ రెండు లక్షణాలు తప్పనిసరిగా ఉంటాయి. వాటినే నిర్మాణ ద్వైవిధ్యం అంటారు . వీటినే వర్ణనాత్మక వ్యవస్థ, వ్యాకరణ వ్యవస్థ అంటారు. ప్రతి భాషలోనూ 15 నుండి 60' వర్ణాలకు మధ్యలో అక్షరాలు ఉంటాయి. భాష అర్థం అవ్వాలంటే వ్యాకరణ వ్యవస్థ వల్లే భావం శ్రోతకి (వినేవారికి) అర్థమవుతుంది.

**2. ఉత్పాదక శక్తి:**

అర్థవంతమైన పదాలు క్రమ పద్ధతిలో అమర్చబడటం వల్ల వాక్యం ఏర్పడుతుంది. ఆ వాక్యాలను మనం (మానవుడు) కొన్ని సార్లు ఎటువంటి ప్రయత్నం చేయకుండానే మాట్లాడతాం. పసిపిల్లలు సొంత ప్రయత్నంతోనే అంటే తమ ఉత్పాదనా శక్తి ద్వారానే నేర్చుకుంటారు. తరువాత నూతన వాక్యాలు (కొత్తవి) సృష్టిస్తారు. ఈ ఉత్పాదక శక్తి వల్లనే చిన్న పిల్లలుగాని, పెద్దవారు గాని కొత్త వాక్యాలు నేర్చుకుంటారు. కొత్తగా సృష్టించిన ఆవాక్యాలను శ్రోతలు అర్థం చేసుకుంటారు.

### 3. శబ్దార్థ సంబంధ శక్తి :

భాషలో ఒక పదం ఒర అర్థానికి సంకేతం. ప్రతి భాషలోనూ ప్రతి పదానికీ అర్థం ఉంటుంది. శబ్దానికి అర్థంతో ఉండే సంబంధమే శబ్దార్ధ సంబంధ శక్తి. ఉదా ॥ కి "కన్ను" అనే పదానికి నోరు, కాలు అనే అర్థాలు రావు ఎందుకని? అంటే శబ్దార్థ సంకేతం కేవలం సంకేతతతో కూడి ఉండటమే. వైయాకరుణులు కూడా పదం "శక్తితో కూడి ఉంటుంది" అని చెప్పారు ఈ పదానికి ఈ అర్థమే ఎందుకు వస్తుంది అంటే అది కేవలం భగవంతుని సంకేతమైన (ఈశ్వర) శక్తి మాత్రమే అని భాషావేత్తల అభిప్రాయం. ఆధునిక భాషావేత్తలు శబ్దార్థానికి కారణం మానవ సంకేతమైన శక్తి అని చెప్పారు.

### 4. వక్త శ్రోత విపరిణామం :

ప్రతి మనిషికి భాషా సంబంధమైన రెండు శక్తులుంటాయి. అవి 1, మాట్లాడే శక్తి. 2, మాట్లాడితే అర్థం చేసుకోగల శక్తి. ఈ రెండిటి వల్లే మానవుల మధ్య సంభాషణ జరుగుతుంది. మానవేతర జీవుల్లో ధ్వనులే గాని మాటల వ్యక్తీకరణ ఉండదు.

### 5. ప్రత్యేకత :

భావాన్ని వ్యక్తపరిచే సంబంధంలో ప్రేరణ, ప్రతిక్రియ రెండూ. ఉంటాయి. ఈ రెంటికీ చాలా దగ్గర సంబంధం ఉంటుంది. ఉదా॥కి ఇంటిలో భర్త "ఏమే ఇటురా " అని పిలిస్తే వెంటనే తన భార్య వస్తుంది. ఇంటిలో ఎందరున్నా ఆమె ఒక్కటే వెళుతుంది. తననే పిలిచినట్లు అర్థం చేసుకోగలుగుతుంది. ఇది ప్రతిక్రియ. ఈ ప్రతిక్రియ శబ్దానికి, అర్థానికి ఉన్న సంబంధం వల్ల కలుగుతుంది. ఆ ధ్వనులు వేరే భాష తెలిసిన వారు ఉన్నప్పటికి అతను మాట్లాడిన భాష తెలియకపోతే స్పందించలేరు కదా. అంటే ప్రతిక్రియ జరగదు. ఇది భాషకున్న ప్రత్యేకత.

### 6. ప్రేరణదూరత :

మానవుడు తన మనసులో కలిగే భావాన్ని ఎదుటివారికి తెలియజేయడానికి మాట్లాడతాడు. కేవలం ప్రస్తుతం జరుగుతున్న విషయాలనే (వర్తమాన) కాక, జరిగిపోయిన (భూత) జరుగబోయే (భవిష్యత్) కాలాలకు సంబంధించిన విషయాలు, విశేషాలు కూడా మాట్లాడగలడు. ఈ శక్తి మానవునికి తప్ప వేరే జీవులకు (పశువులు, పక్ష్యాదులకు) తెలియదు.

### 7, సాంస్కృతిక ప్రసరణ :

మనవుడు సంఘజీవి. ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలను ముందుతరం నుండి స్వీకరించి ఆచరిస్తూ ఉంటాడు. అలాగే భాషను కూడా స్వీకరించి మాట్లాడుతూ ఉంటాడు. అనుకరణ శక్తివల్ల ఇది సాధ్య మవుతుంది. పిల్లలు మాట్లాడే భాషలో తప్పులు దొర్లితే పెద్దవారు సరిచేస్తూ ఉంటారు. పిల్లలు పెద్దలను అనుసరించి సరిచేసుకొని మాట్లాడుతూ ఉంటారు. ఈ శక్తి కొన్ని మానవేతర జీవుల్లో ఉన్నప్పటికి వాటికి సాంస్కృతిక సవరణ ఉండదు. అంటే వారు (అవి) తరువాత తరానికి అందించలేరు. ఈ సాంస్కృతిక సవరణ జీన్స్ ద్వారా, పరిసరాల ప్రభావం వల్ల జరుగుతూ ఉంటుంది.

**ముగింపు :** ఈ 7 లక్షణాలుండడంవల్ల భాష తరతరాలుగా కొనసాగుతూ, అభివృద్ధి చెందుతూ ఉపయోగపడుతుంది

## II సంక్షిప్త సమాధానాలకు రాదగిన ప్రశ్నలు.

1. బాషకు సంబంధించిన నిర్వచనాలను తెలపండి
2. భాషా లక్షణాలను వివరించండి.
3. భాషను నిర్వచించి, భాషా ప్రయోజనాలను తెలపండి.

**డా|| దొప్పలపూడి సుజాత**
తెలుగు అధ్యాపకురాలు
ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల
యర్రగొండపాలెం
ప్రకాశంజిల్లా

## పాఠం - 2

# వర్ణం - పదం - వాక్యం

**వాక్య లక్షణాలు - సామాన్య, సంయుక్త, సంశ్లిష్ట వాక్యాలు.**

**పాఠ్యాంశ విషయక్రమం :**

2.1 వర్ణం - పదం - వాక్యం

2.2. వాక్య లక్షణాలు, సామాన్య, సంయుక్త సంశ్లిష్ట వాక్యాలు

### 2.1 వర్ణం - పదం - వాక్యం :

మానవుడు మాట్లాడేటప్పుడు ఉపయోగించే భాషా శబ్దాన్ని "ధ్వని" అంటారు. ధ్వనులు కొన్ని ప్రధానమైనవి ఉంటాయి. కొన్ని అప్రధానమైనవిగా ఉంటాయి. ప్రధానమైన ధ్వనినే శబ్దాన్నే "వర్ణం" అంటాము. వర్ణాలన్నీ ధ్వనులే గాని ధ్వనులన్నిటినీ వర్ణాలు అనం. వర్ణం అంటే కొన్న ధ్వనుల సముదాయం. అర్థ భేదక శక్తి కలిగిన చాలా కనిష్ఠ (చిన్న) భాషాంశాన్ని "వర్ణం" అంటారు అని ఆచార్య బద్రిరాజు కృష్ణమూర్తిగారు పేర్కొన్నారు.

ఉదా ॥ అ - అనేది ఒక వర్ణం

ఆ - ఒక వర్ణం

క - అనేది కూడా ఒక వర్ణము

కాని "క" అనే దానిలో "క్ + అ" అనే రెండు వర్ణాలు కలిసి ఉన్నాయి. కాని "క" అని ఒక్కసరారే పలుక గలుగుతున్నాము. కావున దానిని ఒక్క వర్ణంగానే చెబుతాము గాని (క్, అ అని రెండు సార్లు పలుకము) రెండు వర్ణాలని చెప్పము. కావున అది వర్ణం. వర్ణాలు ఏ భాషలోనైనా విడివిడిగా ఉంటే వాటికి అర్థాలుండవు. విడి విడిగా ఉన్న కొన్న వర్ణాలు అర్థవంతంగా కలిస్తే దానిని పదం అంటాము. పదం అర్థవంతమైందేగాని పదాలను ఏర్పరచిన వర్ణాలకు మాత్రం అర్థంతో సంబంధం ఉండదు అంటే వర్ణం అర్థవంతంకాని తెలుస్తుంది.

**పదం:**

అర్థ భేదం ఉన్న వర్ణాల సమూహమే "పదం" అని భాషా శాస్త్రవేత్తలు నిర్వచించారు ఉదా॥ తల, వల అనే పదాలు. అర్థభేదంతొ కలిగిన వర్ణాలతో ఏర్పడ్డాయి. అర్థవంతంగా ఉన్నాయి. కాబట్టి తెలుగు భాషలో వ్యవహారంలో ఉన్నాయి.

**పదాంశం:**

"Morph" అనే గ్రీకు పదంనుండి మార్ఫ్‌మ్ అనే (Morpheme) రూపం ఏర్పడింది. "Morph" అంటే Form అని అర్థం. తెలుగులో దీనికి "రూపం" అని అర్థం చెప్పవచ్చు. పదాలు ఏర్పడే రూపానికి సంబంధించిన శాస్త్రం కాబట్టి దీనిని Morphology అంటారు. "Morpheme" అనే పదానికి శాస్త్రజ్ఞులు (భాషాశాస్త్రజ్ఞులు) "రూపం", "పదాంశం" అనే అర్థాలు చెప్పారు. పదాంశం అంటే ధ్వనిలోను, అర్థంలోను ఇతర పదాలతో పోలికలేని భాషాంశాన్నీ పదాంశం అంటారని "బ్లూమ్ ఫీల్డ్" అనే భాషాశాస్త్రవేత్త నిర్వచించారు. "అర్థ వ్యవస్థలో సరాసరి అన్వయించగల భావప్రకటన కనిష్టాంగాన్ని (చాలాచిన్న భాగాన్ని) పదాంశం, అంటారని హాకెట్ అనే భాషావేత్త

నిర్వచించారు, అంటే భాషలో అర్థవంతమైన కనిష్ఠ అంశాలను పదాంశాలు అంటామని అర్థమౌతుంది.

**పదం - పదాంశం :-**

సంస్కృత వ్యాకర్తలు అర్థవంతమైన కనిష్ఠభావాన్ని శబ్దం, ధాతువు అని అన్నారు.. అంటే అర్థవంతమైన వర్ణాల సమూహమే పదం అయితే భాషాశాస్త్రజ్ఞులు మాత్రం అర్థవంతమైన అర్థాన్ని బోధించే ప్రత్యాయాలను కూడా శబ్దాలుగానే స్వీకరించారు. కాని ప్రత్యయం స్వయంగా అర్థాన్ని బోధించలేదు. భాషాశాస్త్ర దృష్టిలో ధాతువు ప్రత్యయాలు రెండూ పదాంశాలే. ఉదా॥ పాట -బాట, తల - వల, అలక - పలక, తలపు - వలవు వంటి పదాల జంటల్లో మొదటి అక్షర భేదం వల్ల అర్థభేదం కలుగుతుంది. అవన్నీ పదాలే.

**<u>'బాటలు'</u>** అనే పదంలో 'లు' అనేది పదాంశం అది బహువచనాన్ని తెలిపే (అనేకం) పదాంశం. "పెద్ద" అనే పదాంశంతో " ప్+ఎ+ద్+ద్+అ" అనే వర్ణాలున్నాయి. వీటిలో ఏ వర్ణం లోపించినా అర్థం లోపిస్తుంది. ( అర్థం ఉండదు). కాబట్టి అర్థవంతమైనది మాత్రమే పదాంశం అవుతుంది. పదాంశాన్ని విభజించడానికి వీలులేదు. అంటే అవి అవిభాజాలుగా ఉంటాయి. ధాతువులు, ప్రత్యయాలు, ఉపసర్గలు కూడా పదాంశాలే. ఉదా॥ మేన+రికం, పేద+రికం పెద్ద, చుట్ట అనేవి పదాంశాలు "రికం" అనే పదాంశం చేరి వాటికి అర్థం ఏర్పడింది వీటికి ఇంగ్లీష్‌లో పోలికలున్నాయి. ఆంగ్లంలో King - hood, Boy - hood, అనే పదాలలో రెండూ పదాంశాలే. (అదే విధంగా Chaild-hood).

**2. 3 వాక్యం - వాక్యాలక్షణాలు**

**వాక్యం :-**

భాషాశాస్త్ర వేత్తలు "ఒక సంపూర్ణ భావాన్ని తెలుపుతూ రెండు విరామాల మధ్య ఉన్న ఉచ్చారణ వాక్యం" అని చెప్పారు. అంటే అర్థవంతమైన పదాల కూర్పువల్ల ఏర్పడేది వాక్యం, కేవలం పదాల కూర్పువల్ల భావాన్ని స్పష్టంగా చెప్పలేము. పదాల సముదాయమే వాక్యం. కాదు. ఆ పదాలు ఏక్రమంలో ఉండాలి? ఎలాఉండాలి? అనే సందేహం వస్తుంది. వాక్యంలో ఉన్న పదాలకు అర్థం ఉండాలి. ఒక క్రమంలో అమర్చబడాలి. పరిమిత ఉచ్చారణ కలిగి ఉండాలని భాషావేత్తల అభిప్రాయం.

**వాక్యం - వైయాకరణులు**

వాక్యాన్ని గూర్చి సంస్కృతవ్యాకరణ కర్తలు అంతగా శ్రద్ధ చూపించలేదు. పాణిని వంటి గొప్ప మేధావిక్కూడా వాక్యాన్ని గూర్చి తన "అష్టాధ్యాయి" లోకూడా అంతగా చర్చించలేదు. బత్రుహరి తన రచనైన "వాక్యపరదీయం" లో ఈ <u>"వాక్యకాండ"</u> అనే భాగాన్ని చేర్చి వాక్యాన్ని చర్చించాడు . తెలుగులో ప్రసిద్ధి చెందిన చిన్నయ సూరి "బాలవ్యాకరణ" గ్రంథంలో వాక్యప్రస్తావన తేలేదు. అప్పకవి కూడా "వాక్యం పై దృష్టిపెట్టలేదు. మూలఘటిక కేతనకూడా ఆ విషయ ప్రస్తావన తేలేదు. కానీ రామాచార్యులు గారు "వాక్యపరిచ్ఛేదం" లో వాక్యాన్ని నిర్మాణాన్ని కూలంకషంగా చర్చించారు.

**వాక్యం - ఆంగ్ల భాషా ప్రభావం :**

వాక్య నిర్మాణంపై ఆంగ్ల ప్రభావం ఉందని చెప్పవచ్చు. అమెరికా వాడైన "నోమ్‌ఛామ్స్కీ" 1987లో

వాక్య నిర్మాణంపై పరిశోధనలు చేసి అనేకుల ప్రశంస పొందారు ఆంగ్ల భాషలో వాక్యనిర్మాణాన్ని "Syntax" అంటారు. sya, tax..m అనే రెండు లాటిన్ భాషా పదాల వల్ల ఏర్పడింది "Syntax" అంటే " శాస్త్రీయ పద్ధతిలో వాక్య నిర్మాణం, అధ్యయనం అని అర్థం. "నోమ్‌ఛామ్స్కీ" పరివర్త వ్యాకరణంలో వాక్య నిర్మాణ పరిశోధనకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. భాషలోని రెండు రకాల వాక్యాలకు మధ్యగల పరస్పర సంబంధాన్ని తెలుసుకోడానికి ఈ పరివర్తన వ్యాకరణం ఉపయోగపడుతుంది. వ్యాకరణ సూత్రాల ద్వారా ఎటువంటి సాధు వాక్యాలనైనా సృష్టించవచ్చు. కాబట్టి దీనిని "ఉత్పాదక వ్యాకరణంగా," భాషా వేత్తలు చెప్పారు. ఆధునిక కాలంలో "ఆచార్య చేకూరి రాఆరావు" గారు తెలుగు నామ్నీకరణలపై "పరివర్తన శాస్త్ర అధ్యయనం అనే అంశంపై పరిశోధన చేశారు. "నామ్నీకరణం" అంటే వాక్యాన్ని కొన్ని మార్పులతో కర్త కర్మ పదస్థానాలను ఉపయోగించే పద్ధతి.

**వాక్య లక్షణాలు :-**

ప్రౌఢ వ్యాకర్త బహుజన పల్లి సీతారామాచార్యులు గారు వాక్య పరిచ్ఛేదంలో "యోగ్యత, ఆకాంక్ష, ఆసక్తి "అనే మూడులక్షణాలతో కూడిన సమగ్రమైన, అర్థవంతమైన పదాల సముదాయమే వాక్యం అని చెప్పారు.

**1.యోగ్యత :-**

పదాల అర్థాలకు పరస్పర సంబంధంతో ఎటువంటి వ్యతిరేకత కలుగకుండా ఉండడాన్ని యోగ్యత అంటారు. ఉదా " నిప్పుతో తడుపుతున్నాడు అనే వాక్యంలో పదాల మధ్య యోగ్యత లేదు. కారణమేమిటంటే కాలిపోతుంటే నీటితో తడపాలిగాని నిప్పు పనికిరాదు కదా "నీటితో తడుపుతున్నాడు" అంటే యోగ్యత ఉంది గాని నిప్పుతో తడుపుతున్నాడు అనడం సరికాదు . అది విరుద్ధార్థం అవుతుంది. కాబట్టి వాక్యంలోని పదాలకు యోగ్యత ఉండాలి.

**2. ఆకాంక్ష :-**

వాక్యం విన్నప్పుడు శ్రోతకు భావాన్ని గ్రహించాలనే ఉత్కంఠ కలుగుతుంది. దానినే "ఆకాంక్ష" (తెలుసుకోవాలనే కోరిక) అంటారు. ఉదా॥ సుబ్బారావు వచ్చాడు అంటే శ్రోతకి (వినేవారికి) వెంటనే అర్థం అవుతుంది.

**3, ఆసత్తి :-**

వాక్యంలోని పదాలు ఒక క్రమ పద్ధలో ఉంటే దానిని " ఆసత్తి" అంటారు . ఆసత్తి ఉంటేనె వాక్యం పూర్తి అవుతుంది. ఒక పదాన్ని ఒకప్పుడు మరో పదాన్ని మరుసటిరోజు చెప్పకూడదు. ఉదా॥ "రాముడు రావణుని సంహరించాడు" అదే వాక్యం చెప్పడానికి రాముడు అనే పదాన్ని ఈ రోజు రావణుని అనే పదాన్ని మరుసటి రోజు సంహరించాడు. అనే పదాన్ని ఆ తర్వాత రోజు చెబితే శ్రోతకి (వినేవాడికి) "ఆసత్తి" 'పోతుంది. శ్రోతకు "ఆసత్తి" అనేది ముఖ్యం, కాబట్టి పదాల ఉచ్చారణలో వ్యవధానం ఉండకూడదు.

సీతారామాచార్యులు గారు ముఖ్యంగా వాక్యంలో రెండు అంశాలు ఉంటాయన్నారు. ఒకటి ఉద్దేశ్యం (subject) రెండు (Predicate) విధేయం.

**ఉద్దేశ్యం :-**

దేనిని ఉద్దేశించి చెప్పామో అది ఉద్దేశ్యం. దీనినే నామవాచకం అంటాము. వాక్యంలో మొదటి భాగం ఉద్దేశ్యం.

**విధేయం : -**

వాక్యంతో రెండో భాగం విధేయం.ఈ విధేయంలో కర్మ, క్రియ ఉంటాయి. ఉదా॥ రామారావు ఊరికి వెళ్ళాడు" అనే వాక్యంలో రామారావు ఉద్దేశ్యం. ఊరికి వెళ్ళాడు అనేది విధేయం.

**వాక్యనిర్మాణ సంబంధాలు :-**

భాషావేత్తలువాక్యంలో పదాలకున్న పరస్పర సంబంధాన్ని 3 విధాలుగా చెప్పారు.

1. స్థాన సంబంధం
2. యోగ్యతా సంబంధం
3. ఆదేశ సంబంధం.

**స్థాన సంబంధం :-**

కొన్ని పదాలు కలిసేటప్పుడు నిర్దిష్ట క్రమంలో వాటి స్థానాలు మార్చడానికి వీలు కుదరదు. కొన్నిటిని మాత్రమే వ్యాకరణం ప్రకారం మార్చగలం దానినే స్థాన సంబంధం అంటారు. ఉదా॥ నాకొత్తకారు అనేది వ్యాకరణ సమ్మతంగా ఉంటుంది. కానీ "కొత్త నా కారు. అని చెప్పడానికి వ్యాకరణం వ్యతిరేకిస్తుంది. అదే స్థానసంబంధం.

**2, యోగ్యతా సంబంధం :-**

వాక్య నిర్మాణంలో ఒక రకమైన పదం కొన్ని రకాల పదాలతోనే కలుస్తుంది. అలా కాకుండా ఏదో ఒక పదం ఉపయోగిస్తే విపరీతార్థాలకు దారి తీస్తుంది. ఉదా॥ "పాప అన్నం తినగలదు". అంటే యోగ్యతా సంబంధం ఉంది. కానీ గోడ అన్నం తినగలదు, అంటే విరుద్ధంగా ఉంటుంది.

**3. ఆదేశ సంబంధం :-**

ఒక వాక్యంలో ఒక పదం స్థానంలో ఇంకో పదాన్ని ఉంచడానికి సాధ్యమైతే దాన్ని ఆదేశ సంబంధం అంటారు. ఉదా॥ ఆ భవనం పెద్దది అని చెప్పినప్పుడు భవనం స్థానంలో కారు, ఇల్లు, ఊరు వంటి పదాలు ఉపయోగించినా అర్థవంతమైన వాక్య నిర్మాణమే జరుగుతుంది.

**4.వాక్య భేదాలు :-**

ప్రౌఢవ్యాకర్త "బహుజన పల్లి సీతారామాచార్యులు" గారు వాక్యాన్ని ప్రధానంగా రెండు రకాలుగా వర్గీక రించారు.

**సంపూర్ణ వాక్యం :-**

సమీపక క్రియ ఉన్న వాక్యాన్ని సంపూర్ణ వాక్యం అంటాము. ఉదా॥ అన్నం తిన్నాను. ఇది సంపూర్ణ

వాక్యం కారణం తినుట అనే క్రియ పూర్తి అయ్యింది. అసంపూర్ణ వాక్యంలో ఆకాంక్ష ఉండదు. ఉదా॥ "నేను అన్నం తింటే " ఇటవంటివి అసంపూర్ణ వాక్యాలు.

**రూపాన్ని బట్టి వాక్య భేదాలు :-**

రూపాన్ని బట్టి వాక్యాన్ని 3 విధాలుగా వర్గీకరించవచ్చు.

1. సామాన్యవాక్యం :

ఒక సమాపక క్రియ ఉన్న దానిని సామాన్య వాక్యం అంటారు. ఇది రెండు రకాలు 1. క్రియా సహిత వాక్యం. క్రియాపదం ఉన్న వాక్యాన్ని క్రియాసహిత వాక్యం అంటారు. ఉదా॥ లత చదువుతుంది. 2) క్రియారహిత వాక్యం. క్రియాపదంలేని వాక్యాన్ని క్రియారహిత వాక్యం అంటారు. ఉదా॥ రాజు మంచి నాయకుడు. ఈ వాక్యంలో క్రియ లేదు. క్రియాసహిత, క్రియా రహిత వాక్యాలు రెండు రకాలుగా ఉంటాయి. అవి:-

**1) కర్త సహిత వాక్యాలు : -** ఇవి క్రియల్ని అనుసరించి 3 విధాలుగా ఉంటాయి. అవి:

**ఎ) అకర్మక వాక్యాలు :** అకర్మక వాక్యాల్లో కర్మ ఉండదు. ఉదా॥ శర్మ వచ్చాడు. కర్మ యొక్క ఆకాంక్ష లేనివి అకర్మక వాక్యాలు ప్రశ్నించడానికి వీలుపడని వాక్యాలే అకర్మక వాక్యాలు.

**బి) సకర్మక వాక్యాలు :** సకర్మక వాక్యాల్లో కర్మ ఉంటుంది. ప్రశ్నలు వేయడానికి వీలున్న వాక్యాలను సకర్మక వాక్యాలంటారు.

**ఉదా॥** "సుబ్బమ్మ అరిసెలు వండింది."

**సి) ప్రేరణార్థక వాక్యాలు : -** ఈ వాక్యాల్లో కర్త ప్రేరణ ఉంటుంది. అంటే ఒక పని చేయడానికి వేరొకరు ప్రేరేపించుట.

**ఉదా॥** అక్క తిట్టిచ్చింది

టీచర్ పరీక్ష రాయించారు.

**2. కర్త రహిత వాక్యాలు :** వీటిలో కర్త ఉండదు.

ఉదా ॥ నాకు సంతోషంగా ఉంది.

అమ్మ కోపంగా ఉంది.

**3.సంశ్లిష్ట వాక్యం : -** సమాపక, అసమీపక క్రియలు రెండూ ఉన్న వాక్యాన్ని సంశ్లిష్ట వాక్యం అంటారు.

**ఉదా ॥** రవి చూస్తూ ఉండగానే వరదవచ్చింది.

ఈ వాక్యంలో చూస్తూ ఉండగానే అనేది అసమాపక క్రియ. వచ్చింది అనేది సమాపక క్రియ సంశ్లిష్ట వాక్యంలో శత్రర్థకం, చేదర్థకం, అప్యర్థకం, క్త్వార్థం అని నాలుగు అసమాపక క్రియలు ఉంటాయి.

**శత్రర్థకం :** క్రియాపదానికి "తూ" అనే ప్రత్యయం చేరడంవల్ల ఈ రూపాలు ఏర్పడతాయి.

**ఉదా॥** వసుధ అరుస్తూ పరుగుతీస్తుంది.

**చేదర్థకం :-** ధాతువుకు (మూలరూపానికి) "ఐతే" "తే" ప్రత్యయాలు చేరి చేదర్థంగల క్రియాపదాలు ఏర్పడతాయి.

**ఉదా ॥** 1) సుబ్బలక్ష్మి అయితే బాగా పాడేది.

2) చదివి తే ఉద్యోగం వస్తుంది.

**క్త్వార్థకం : -** భూతకాలిక అసమాపక క్రియను క్త్వార్థం అంటారు. ధాతువుకి "ఇ" వర్ణం చేరితే క్త్వార్థక రూపాలు ఏర్పడతాయి.

**ఉదా ။** మాస్టర్ గారు బడికి వచ్చి పాఠం చెప్పారు.

**3. సంయుక్త వాక్యం :-** రెండుగాని అంతకంటే ఎక్కువగాని సమాన ప్రతిపత్తిగల వాక్యాలు కలిసి ఒక వాక్యంగా ఏర్పడితే దానిని సంయుక్త వాక్యం లేదా మహావాక్యం అంటారు. కాని అయితే వంటి అవ్యయపదాలు రెండు వాక్యాలను కలుపుతాయి. వీటిని 3 రకాలుగా చెప్పవచ్చు.

**సంకలన సంబంధ వాక్యాలు : -** కొన్ని సామాన్య వాక్యాలను ఒకే సమయంలో ( ఒకేసారి) ఉపయోగించేటప్పుడు వాటి మధ్య ఉంటే సంబంధాన్నే సంకలన సంబంధం అంటారు.

**ఉదా॥** సుమతి ఉపన్యాసాలిస్తుంది, కవిత్వం రాస్తుంది, వ్యాసాలు రాస్తుంది, నాటకాలు వేస్తుంది.

**2. వికల్ప సంబంధం :-** ఇందులో నామవాచకాలకు "ఓ" శబ్దం చేరుతుంది. కొన్నిసార్లు స్పష్టత లేని విషయాలు చెప్పేటప్పుడు కూడా "ఓ" శబ్దం చేరుతుంది.

**ఉదా॥** 1) రజనీకాంత్ కండక్టరో, యాక్టరో అవుతాడు.

2) కుమార్ ఏదో చేస్తున్నాడు.

**3. వైరుధ్య సంబంధం : -** రెండు వాక్యాలు చెప్పే విషయాల మధ్య వైరుధ్య సంబంధం ఉంటే "అయితే" "కానీ" వంటి అవ్యయాలు చేరుతాయి.

**ఉదా ။** 1) "ఆయన పేరుకు మాత్రం డాక్టర్ కానీ వైద్యం చేయడు"

2) పాలకులు చట్టాలు చేస్తారు. అయితే అమలు కావు.

అర్ధాన్ని బట్టి వాక్యాలు ఇంకా కొన్ని రకాలుగా విభజించబడ్డాయి. **అవి : -**

**1) నిశ్చయార్థక వాక్యాలు :-** ఒకే అభిప్రాయాన్ని లేదా ఒకే భావాన్ని స్పష్టంగా చెప్పడానికి ఉపయోగించే వాక్యాలను నిశ్చయార్థక వాక్యాలు లేదా భావార్థక వాక్యాలు అంటారు. వీటికి మరొకపేరు నిర్దేశిక వాక్యాలు.

**ఉదా ။** సుబ్బారావుకి పెళ్ళై మూడు సంవత్సరాలు అయ్యింది.

లేదా

కల్పనాకి ఉద్యోగం వచ్చింది.

**2) వ్యతిరేకార్థక వాక్యాలు :** "లేదు" అనే వ్యతిరేక క్రియ చేరుతుంది. వీటినే అభావార్థక వాక్యాలు అనికూడా అంటారు.

ఉదా॥ కుమార్ మంచివాడు కాదు

**3) ప్రశ్నార్థక వాక్యాలు : -** ఉందా, అవుతుందా, ఏమిటి, ఎక్కడ, ఎవరు, ఎందుకు, ఎప్పుడు, ఎలా, ఎవరితో, కదూ, కదా వంటి పదాలు వచ్చి ఈ వాక్యాలు ఏర్పడతాయి.

**ఉదా ။** 1) మనదేశంలో ప్రజాస్వామ్యం ఉందా ?

2) ఎవరక్కడ?

3) నీవు తినేది ఏమిటి?

4) సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి ఉపాధ్యాయ దినోత్సవం కదా?

5) మనం తప్పులు చేస్తూ ఉంటాం కదా?

**4) విధ్యర్థక వాక్యాలు :** విధిని తెలియజేసే వాక్యాలు. ఇవి వినేవారికి అదేశాన్ని ఇస్తాయి. (శ్రోతకు).

**ఉదా॥** 1) నీవు వెంటనే ఫీజు చెల్లించు

2) మీరు వెంటనే ఇల్లు ఖాళీ చేయండి.

**5) నిషేధార్థక వాక్యాలు :-** నిషేధాన్ని తెలియజేసేవి.

**ఉదా ॥** 1) మాస్క్ ధరించకుండాలోనికి రావద్దు

2) కళాశాలకు యూనిఫామ్ ధరించకుండా రావడానికి వీలులేదు.

**6) ప్రేరణార్థక వాక్యాలు :** ఒకరి వల్ల ప్రేరణ కలిగినట్లు చెప్పేవి.

**ఉదా ॥** 1) నా వల్ల అతనికి బాధ కలిగింది.

2) టీచర్ ప్రేరణవల్ల విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు.

**7) ఆశ్చర్యార్థకాలు :-** ఇవి ఆశ్చర్యం, అద్భుతం, సంతాపం, సంతోషం వంటి భావాలను తెలియజేస్తాయి.

**ఉదా॥** 1) అయ్యో ! వరద వల్ల రైతులకి నష్టం వచ్చింది.

2) ఆహా ! ఎంత మధురం

3) ఓహో ! మల్లెల పూవు ఎంత తెల్లగా ఉంది.

4) కటకటా ! ఎంత సంకటం కలిగింది.

**8) సందేహార్థక వాక్యాలు :** ఇవి సందేహాన్ని తెలియజేస్తాయి.

**ఉదా :-** (1) పంట పండుతుందో లేదో?

(2) నేను చదవగలనో లేదో?

**9) ఆశీర్వాదర్థక వాక్యాలు :-** ఆశీస్సులు తెలియజేసేవి.

**ఉదా :-** నీవు విజయం పొందుదువు.

**10) ప్రార్థనార్థక వాక్యాలు :** వాక్యాలకు ముందు దయచేసి, కాస్త వంటి ప్రార్థనార్థక పదాలు ఉంటాయి.

**ఉదా :-** (1) కాస్త ఉత్తరం చదివిపెట్టు.

(2) దయచేసి సహాయం చెయ్యండి.

**11) వికల్పార్థక వాక్యాలు :** ఒక విషయం చెప్పి అది జరగడానికి మరొక కారణం చెబితే అటువంటి వాక్యాలను వికల్పార్థక వాక్యాలు అంటారు.

**ఉదా:-** 80% హాజరు ఉంటేనే విద్యార్థికి అమ్మవడి పథకం అమలు అవుతుంది.

**12) అనుమత్యర్థక వాక్యాలు :** - అనువతిని ఇవ్వడం లేదా కోరుకోవడం. (అనుమతి తీసుకోవడం)

**ఉదా :- (1)** పిల్లని చదువుకోనివ్వు.

(2) జూన్ 10 నుండి విద్యార్థులు బడికి రావచ్చు.

ఈ విధంగా అర్థ భేదాన్ని బట్టి వాక్యాలు అనేక రకాలుగా విభజించబడ్డాయి.

ఇవేకాక క్రియా ప్రధాన్యతను బట్టి వాక్యాలను 3 విధాలుగా భాషా వేత్తలు విభజించారు. అవి:-

1) **కర్తృ ప్రధాన వ్యాక్యాలు :** ఇందులో క్రియా పదం కర్తకి ప్రాధాన్యత ఇస్తుంది.

ఉదా : రాముడు రావణుని చంపాడు

ఈ వాక్యంలో కర్తృపదమైన రామునికి చంపుట అనే క్రియాపదం వల్ల ప్రాధానయత కలిగింది.

2) **కర్మ ప్రధాన వాక్యం :** క్రియాపదం కర్మకి ప్రాధాన్యతనిస్తుంది.

**ఉదా ॥** రావణుడు రామునిచేత సంహరించబడ్డాడు. ఈ ఉదాహరణలో క్రియాపదం కర్మకి ప్రాధాన్యం ఇస్తుంది.

3) **భావ ప్రధాన వాక్యం :** భావాన్ని తెలియజేయజేసే క్రియలను ఉపయోగించి విధేయాంశాన్ని చెప్పడాన్నే భావ ప్రధాన వాక్యం అంటాము.

**ఉదా :** మంత్రివర్యా! మీ మాటలచే మమ్మల్ని అలరింపజేశారు.

**ముగింపు :** ఈ విధంగా తెలుగు భాషలో వాక్య నిర్మాణం, దాని స్వరూప స్వభావాలు స్పష్టంగా భాషావేత్తలు తెలియజేశారు. కర్త, కర్మ, క్రియ వరుస క్రమంలో అమర్చబడి సాధారణ వాక్యం ఏర్పడుతుంది. (వ్యాకరణ బద్ధంగా) ఆ వాక్యం అనేక రకాలుగా రచనలో, భావ ప్రకటనగా మార్పు చెందుతుంది.

## రాదగిన ప్రశ్నలు

### వ్యాసరూప ప్రశ్నలు

1) వాక్యాన్ని నిర్వచించి వాక్య లక్షణాలను వివరించండి?

(లేదా)

వాక్యమంటే ఏమిటో తెలిపి, దాని లక్షణాలను తెలపండి?

**జవాబు :-**

అర్థవంతమైన పదాలతో ఒక సంపూర్ణమైన భావాన్ని వ్యక్తీకరిస్తూ, రెండు విరామాల మధ్య (ఫుల్‌స్టాప్‌ల) ఉన్న ఉచ్చారణను వాక్యం అంటాము. కేవలం పదాల కూర్పుతో భావాలను వ్యక్తం చేయలేము అవి క్రమ పద్ధతిలో పరిపూర్ణమైన ఉచ్చారణ కలిగి రెండు విరామ చిహ్నాల మధ్య ఉంటే దానిని వాక్యంగా చెప్పవచ్చు అని తెలుస్తుంది.

**వాక్యం - లక్షణాలు :** మన వైయాకరుణుల్లో (భారతీయ వ్యాకరణకర్తలు) బహుజనపల్లి సీతారామాచార్యులు గారు "ప్రౌఢ వ్యాకరణం" అనే వ్యాకరణ గ్రంథంలో "వాక్యపరిచ్ఛేదం"లో వాక్యాన్ని గూర్చి క్షుణ్ణంగా వివరించారు. "యోగ్యత, ఆకాంక్ష, ఆసత్తి అనే మూడు లక్షణాలతో కూడి సమగ్రమైన అర్థవంతమైన పదాల సముదాయాన్నే వాక్యం" అంటామని చెప్పారు.

1) **యోగ్యత : -** పదాలకున్న అర్థాలను పరస్పర సంబంధంలో ఎటువంటి వ్యతిరేకత లేకపోవడాన్ని యోగ్యత అంటారు.

**ఉదా ॥** నిప్పుచేత తడుపుచున్నాడు.

ఈ వాక్యంలో పదాలకు మధ్య యోగ్యత లేదు. మంటలని ఆర్పడానికి నీరు కావాలి గాని నిప్పు పనికిరాదు. కాబట్టి "నీటిచే తడుపుచున్నాడు" అంటే వాక్యంలో పదాలకి యోగ్యత ఉంటుంది. నిప్పుతో తడుపుతున్నాడనడం విరుద్ధ ధర్మాన్ని కావ్యానికి కలిగిస్తుంది. కావున ఆ వాక్యానికి (పదాలకు) యోగ్యత లేదు. అందువల్ల అటువంటి వాటిని వాక్యాలు అనకూడదు.

2) **ఆకాంక్ష :** వాక్యాన్ని ప్రారంభించిన తరువాత శ్రోతలో కలిగే భావన లేదా ఉత్కంఠను అకాంక్ష అంటారు.

**ఉదా ॥** రాముడు వచ్చాడు. లేదా సీత వచ్చింది అనే వాక్యాలతో శ్రోతకు పూర్తిగా అర్థమయ్యే విధానం (అమరిక

లేదా కూర్పు) ఉంది. రాముడు అని చెప్పగానే వెంటనే చెప్పబోయే విషయం గూర్చి శ్రోతకి ఆసక్తి మనసులో కలుగుతుంది. వాచ్చాడు అని లేదా వచ్చింది అని చెప్పగానే ఆ ఉత్కంఠ తీరుతుంది. వాక్యం అర్థం అవుతుంది.

3) **ఆసత్తి** :వాక్యంలోని పదాలు ఒక క్రమ పద్ధతిలో ఉండడాన్ని "ఆసత్తి" అంటారు అంటే వాక్యంలోని పదాలు క్రమపద్ధతిలో ఉంటేనే వాక్యం పూర్తవుతుంది. ఒక పదాన్ని ఒకసారి చెప్పి, మరోపదాన్ని ఇంకోసారి చెబితే పదాల మధ్య సన్నిహిత సంబంధం చెడిపోతుంది. అర్థంకాదు. అదేవిధంగా వాక్యంలో ఉండవలసిన పదాల క్రమం సరిగా లేకపోతే సమన్వయం కుదరదు.

**ఉదా॥** "నేను బి.ఏ. చదువుతున్నాను" వాక్యంలో 3 పదాలున్నాయి. ఆ మూడు పదాలని మూడురోజుల్లో విడివిడిగా చెబితే శ్రోత గందరగోళానికి గురౌతాడు. పదాల మధ్య సుదీర్ఘమైన వ్యవధానం (ఎడము) ఉండడం వల్ల అర్థస్ఫూర్తి చెడుతుంది.

బహుజనపల్లి సీతారామాచార్యులు గారు వాక్యంలో ఉద్దేశ్యం, విధేయం అనే రెండు అంశాలు ఉంటాయని చెప్పారు. వాక్యంలో దేనిని గురించి చెబుతామో దానిని ఉద్దేశ్యం అంటాము. ఉద్ధేశ్యం కాక మిగిలిన వాక్యభాగాన్ని విధేయం అంటామని వివరించారు.

**ఉదా ॥** సీత బడికి వెళ్ళింది. అనే వాక్యంలో "సీత" ఉద్దేశ్యం బడికి వెళ్ళింది అనేది విధేయం (విధేయంలో కర్మ, క్రియ వంటి అంశాలు ఉంటాయి.)

**వాక్య నిర్మాణ సంబంధాలు :-** వాక్యంలోని పదాల మధ్య ఉండే పరస్పర సంబంధాన్ని భాషావేత్తలు మూడు రకాలుగా విభజించారు. అవి:-

1) స్థాన సంబంధం :- అర్థవంతమైన కొన్ని పదాలు కలిసి వాక్యంగా ఏర్పడేటప్పుడు ఆ వాక్యంలోని పదాలు నిర్ధష్టమైన స్థానంలోనే ఉండాలి. ఆ స్థానాన్ని మార్చకూడదు. కొన్ని పదాల కలయికను మాత్రమే వ్యాకరణం అంగీకరస్తుంది. కొన్నిటిని అంగీకరించదు. దానినే స్థాన సంబంధం అంటాము.

**ఉదా ॥** "నా ఇల్లు కొత్తది" ఈ వాక్యాన్ని వ్యాకరణం అంగీకరిస్తుంది. "కొత్త నా ఇల్లు" అనడానికి వీలు లేదు. కారణం పదాల మధ్య స్తానసంబంధం సరిగ్గాలేదు. ఇటుంటి వాటిని వ్యాకరణ శాస్త్రం తిరస్కరిస్తుంది.

2) ఆదేశ సంబంధం : ఒక వాక్యంలోని ఒక పదం స్థానంలో మరోపదాన్నిగాని, పదాలను గని ఉంచడానికి వీలుపడితే అటువంటి పరస్పర సంబంధాన్ని ఆదేశ సంబంధం అంటారు.

ఉదా ॥ ఆ ఇల్లు పెద్దది. ఇల్లు స్థానంలో దర్వాజా, కిటికీ వంటి పదాలను ఉంచినా అవి అర్థవంతంగానే ఉంటాయి. వ్యాకరణ శాస్త్రం సమ్మతిస్తుంది. కావున ఆ సంబంధాన్ని ఆదేశ సంబంధం అంటారు.

2) అర్థాలను అనుసరించి ఏర్పడే వాక్యాలను వివరించండి?

**జవాబు :**

భాషావేత్తలు వాక్యాలు తెలిపే అర్థాలను బట్టి క్రింది విధంగా వాటిని విభజించారు.

అర్థాన్ని బట్టి వాక్య భేదాలు :

1) నిశ్చయార్థక వాక్యాలు : ఒక భావాన్ని గాని, ఒక అభిప్రాయాన్ని గాని స్పష్టంగా చెప్పడానికి (కచ్చితంగా నిర్థారించడానికి) ఉపయోగించే వాక్యాలు నిశ్చయార్థక వాక్యాలు అంటాము. వీటినే నిర్దేశక వాక్యాలు అనికూడా

అంటారు.

**ఉదా॥** రాజుకి ఉద్యోగం వచ్చింది.

2) వ్యతిరేకార్థక వాక్యాలు : ఈ వాక్యాల్లో సాధారణంగా "లేదు" అనే వ్యతిరేక క్రియ చేరుతుంది. వీటినే అభావర్థక వాక్యాలని కూడా అంటారు.

**ఉదా॥** మధుకి పెళ్ళికాలేదు.

3) ప్రశ్నార్థక వాక్యాలు : ఇవి 3 విధాలుగా ఉంటాయి.

ఎ) **వాక్యాంత శబ్దాపేక్ష ప్రశ్నలు :-** వాక్యం చివర "ఆ" చేర్చడం వల్ల వాక్యాలు ఏర్పడతాయి. వీటిని వాక్యాంతక (చివర) శబ్దాపేక్ష ప్రశ్నలంటారు.

**ఉదా॥** దేశంలో ప్రజాస్వామ్యం ఉందా? (ఉంది +ఆ)

బి) **వాక్యేతర శబ్దాపేక్ష ప్రశ్నలు :** ఎక్కడ, ఎవరు, ఎందుకు, ఎప్పుడు, ఏమి, ఏమిటి, ఎలా వంటి పదాల వల్ల ఏర్పడే ప్రశ్నలను వాక్యేతర శబ్దాపేక్ష ప్రశ్నలంటాము.

**ఉదా :-**

1) మీరు ఏ ఊరు వెళుతున్నారు?
2) నీవు ఎక్కడుంటున్నావు?
3) ఇది ఎలా చేస్తావు?
4) నాకే ఎందుకు చెప్పారు?
5) ఎవరక్కడ?
6) ఇది ఏమిటి?
7) ఇదేమి ?

సి) **విషయ నిర్ధారక ప్రశ్నలు :** వాక్యాలకు కదూ, కదా మొదలైన పదాలు చేరడంవల్ల ఈ వాక్యాలు ఏర్పడతాయి.

**ఉదా ॥** గిడుగు రామమూర్తి గారి జయంతి వ్యావహారిక భాషా దినోత్సవం కదా?

4) **విధ్యర్థక వాక్యాలు :** విధిని తెలియజేసే వాక్యాలు. ఇవి వినేవారికి (శ్రోతకి) ఆదేశాన్నిస్తాయి.

**ఉదా॥** 1. మీరు వెంటనే ఇంటికి రండి.
2. నీవు బడికి వెళ్ళు.

5) **నిషేదార్థక వాక్యాలు :** నిషేదాన్ని తెలిపే వాక్యాలను నిషేదార్థక వాక్యాలు అంటారు.

**ఉదా॥** 1. వాహనాలు రోడ్డుకి కుడి ప్రక్కగా నడపకూడదు.
2. ప్రజాధనం వ్యక్తిగతానికి ఖర్చు చేయకూడదు.

6) **ప్రేరణార్థక వాక్యాలు :** ఒకరి వల్ల ప్రేరణ పొంది పని జరిగితే వాటిని ప్రేరణార్థక వాక్యాలు అంటారు.

**ఉదా॥** ప్రజల వల్ల పాలకుడయ్యాడు (నాయకుడు).

7) **ఆశ్చర్యార్థక వాక్యాలు :** అద్భుతం, ఆశ్చర్యం, సంతోషం, సంతాపం మొదలైన భావాలను వ్యక్తీకరించే

వాక్యాలను ఆశ్చర్యార్థక వాక్యాలంటాం.

**ఉదా॥** అయ్యో! ఎంత ఘోరం జరిగింది.

ఆహా! ఎంతో సంతోషం కలుగుతుంది.

8) **ఆశీర్వాదర్థక వాక్యాలు :** ఆశిస్సును తెలియజేసేవి.

**ఉదా॥** నీకు మేలు కలుగు గాక!

9) **సందేహార్థక వాక్యాలు :** సందేహాన్ని తెలియజేసే వాక్యాలను సందేహాత్మక వాక్యాలంటారు.

**ఉదా ॥** వాన వస్తుందో? రాదో?

10) **వికల్పార్థక వాక్యాలు :** ఒక విషయాన్ని చెప్పి అది జరగడానికి కారణమైనది చెప్పేవి.

**ఉదా ॥** వానలు కురిస్తే పంటలు పండుతాయి.

11) **ప్రార్థనార్థక వాక్యాలు :** ప్రార్థనార్థక క్రియలు, కాస్త దయచేసి నామాట వింటారా?

**ఉదా ॥** దయచేసి నా మాట వింటారా?

12) **అనుమత్యర్థక వాక్యాలు :** అనుమతిని ఇవ్వడం, లేదా కోరడం ఉండే వాక్యాలు.

**ఉదా ॥** మీరు ఇంటికి వెళ్ళవచ్చు.

**ముగింపు :** పైవిధంగా అర్థాన్ని బట్టి తెలుగులో వాక్యాలను నిర్మిస్తాము.

3) వాక్య భేదాలను సమగ్రంగా చర్చించండి?

(లేదా)

తెలుగు వాక్యాల్లోని భేదాలు తెలపండి? లేదా (వివరించండి)

**ఉపోద్ఘాతం : –** యోగ్యత, ఆకాంక్ష, ఆసత్తి అనే లక్షణాలున్న సమగ్రమైన, అర్థవంతమైన పదాల సముదాయాన్ని వాక్యం అంటారు. ఈ వాక్యాన్ని ప్రౌఢవ్యాకర్త బహుజనపల్లి సీతారామాచార్యులు గారు

1) సంపూర్ణ వాక్యం

2) అసంపూర్ణ వాక్యం

అని రెండు విధాలుగా విభజించారు. వాక్యంలో క్రియ (పని) పూర్తయినట్లు ఉంటే దానిని సంపూర్ణ వాక్యం అంటారు. క్రియా పదం పనిపూర్తికానట్లు ఉంటే దానిని అసంపూర్ణ వాక్యం అంటారని తెలిపారు.

ఆంగ్లంలోని వాక్య నిర్మాణాన్ని బట్టికూడా వాక్యాన్ని

1) సాధారణ లేదా సామాన్య వాక్యం

2) సంశ్లిష్ట వాక్యం

3) సంయుక్త వాక్యమని 3 రకాలుగా విభజించవచ్చు.

1) సామాన్య వాక్య భేదాలు : – వాక్యంలో ఒక క్రియ మాత్రమే ఉంటే దానిని సాధారణ లేదా సామన్య వాక్యం అంటారు. ఇది క్రియ ఉంటే క్రియాసహిత వాక్యం అంటారు. క్రియ లేకుంటే క్రియారహిత వాక్యం అంటారు. ఈ క్రియాసహిత వాక్యాలు క్రియలను బట్టి 3 విధాలుగా ఉంటాయి.

1) కర్మలేని వాక్యాలను అకర్మక వాక్యాలు అంటారు.

2) కర్మ ఉన్న వాక్యాలను సకర్మక వాక్యాలు అంటారు.

3) ప్రేరణ ఉన్న వాక్యాలను అంటే వేరొకరి ప్రేరణవల్ల పనిజరిగితే అటువంటి క్రియలు తెలియజేసే పదాలున్న వాక్యాన్ని ప్రేరణర్థక వాక్యాలంటారు. కర్తృరహిత వాక్యాలలో కర్తని తెలియజేసే పదాలుండవు. “ఉంది” అనే క్రియారూపం వస్తుంది.

**సంశ్లిష్ట వాక్యం :-** ఒక వాక్యంలో అసమాపక, సమాపక క్రియలు ఉంటే వాటిని సంశ్లిష్ట వాక్యాలు అంటారు. ఈ వాక్యాలలో అసమాపక క్రియలు ప్రధాన పాత్రను పోషిస్తాయి. (ప్రాధాన్యతను కలిగి ఉంటాయి) శత్రర్థకం, చేదర్థకం, అప్యర్థకం, క్త్వార్థకం అనే అసమాపక క్రియలు సంశ్లిష్ట వాక్యాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తాయి.

**సంయుక్త వాక్యం :-** రెండుగాని అంతకంటే ఎక్కువగాని సమాపక ప్రతిపత్తి కలిగిన వాక్యాలు కలిసి ఒకే వాక్యంగా ఏర్పడితే అటువంటి వాక్యాలను, సంయుక్త వాక్యాలు అంటారు. వీటినే మహావాకాలు అనికూడా అంటారు.

ఆంగ్లంలో రెండు వాక్యాల మధ్య అనుసంధానికి and, but, or, so, while వంటి పదాలు ఉపయోగిస్తారు. అదే విధంగా మన తెలుగు భాషలో కూడా కానీ, అయితే అనే అవ్యయపదాలు (లింగ, వచన, విభక్తి సూన్యమైన అంటేలేని పదాలు) అనుసంధానానికి ఉపయోగిస్తారు. ఈ సంముక్త వాక్యాలను భాషావేత్తలు 3 రకాలుగా విభజించారు. అవి:-

1. సంకలన సంబంధ వాక్యాలు
2. వికల్ప సంబంధ వాక్యాలు
3. వైరుధ్య సంబంధ వాక్యాలు

వీటన్నిటిలో (మహావాఖ్యాల్లో) సమాపక క్రియలే ఉంటాయి. వాక్యానికుండే అర్థాన్నిబట్టి వాక్యాలను సుమారు 12 రకాలుగా విభజించబడ్డాయి. అవి:-

1. నిశ్చయార్థక వాక్యాలు
2. వ్యతిరేకార్థక వాక్యాలు
3. ప్రశ్నార్థక వాక్యాలు
4. నిషేదార్థక వాక్యాలు
5. విధ్యర్థక వాక్యాలు
6. ఆశ్చర్యార్థక వాక్యాలు
7. ప్రేరణార్థక వాక్యాలు
8. ఆశీర్వాద్యర్థక వాక్యాలు
9. సందేహాత్మకార్థక వాక్యాలు
10. వికల్పార్థక వాక్యాలు
11. అనుమత్యర్థక వాక్యాలు
12. ప్రార్థనార్థక వాక్యాలు

అని భాషావేత్తలు విభజించారు. ప్రశ్నార్థక వాక్యాలను 1) వాక్యాంత శబ్దాపేక్ష ప్రశ్నలు 2) వాక్యేతర శబ్దాపేక్ష ప్రశ్నలు, విషయ నిర్ధారక ప్రశ్నలు ఉన్న వాక్యాలుగా విభజించారు.

**క్రియా ప్రాధాన్య వాక్యాలు :-** క్రియ యొక్క ప్రాధాన్యత వాక్యంలో ఉన్నదానిని బట్టి 3 విధాలుగా విభజించారు.

భాషావేత్తలు. అవి :- 1)కర్తృ ప్రధాన వాక్యాలు.

2) కర్మ ప్రధాన వాక్యాలు

3) భావ ప్రధాన వాక్యాలు

**ముగింపు :** ఈ విధంగా తెలుగు భాషలో వాక్యాలను విభజించడం జరిగింది. ఈ విభజనలో ఆంగ్ల వ్యాకరణం ప్రధానంగా విభజించినట్లు తెలుస్తుంది.

1. గమనిక

ఈ ప్రశ్నకు సమాధానం పూర్తిగా పాఠ్యాంశంలో ఉదాహరణలతో కూడా వివరించబడినది. కావున విద్యార్థులు గమనించి పరీక్షా పత్రంలో జవాబు రాసేటప్పుడు పూర్తిగా రాయాలి.

2. సంక్షిప్త ప్రశ్నలకు రాదగినవి (సంక్షిప్త సమాధాన ప్రశ్నలు)

1. "వర్ణం" ను వివరించండి?
2. "పదం - పదాంశం" స్వరూపాలను చర్చించండి?
3. సామాన్య వాక్యాలను గూర్చి రాయండి?
4. సంశ్లిష్ట వాక్యం గూర్చి విపులీకరించుము?
5. "వాక్యం" గూర్చి ప్రౌఢవ్యాకర్త అభిప్రాయం తెలుపుము?
6. వాక్య నిర్మాణ సంబంధాలను తెలుపుము?

**- డా॥ దొప్పలపూడి సుజాత**
తెలుగు అధ్యాపకురాలు,
ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల,
యర్రగొండపాలెం,
ప్రకాశం జిల్లా.

# పాఠం - 3

# భాషా నిర్మాణంలో 'వర్ణం - పదం - వాక్యం' ప్రాధాన్యత

3.0. వర్ణం

3.1. తెలుగు వర్ణమాల భిన్నాభిప్రాయాలు

3.2. భాషా నిర్మాణంలో పదం

3.3 భాషా నిర్మాణంలో వాక్యం ప్రాధాన్యత

**ఉపోద్ఘాతం : -**

ఆదిలో మానవుడు దైనందిన కార్యక్రమాలను సైగలతోనే కొనసాగించేవాడు. మానవుని మెదడు క్రమేపి వికసించింది. ప్రకృతితో కలిగే మార్పులను, పదార్థాలను అవగాహన చేసుకొంటూ ఒంటరిగా కాక సమూహంగా జీవించడం మొదలు పెట్టాడు. అదే క్రమేపి సంఘజీవనంగా మారింది. పశు పక్షాదులను మచ్చిక చేసుకోవడం నేర్చుకొని భూమి దున్ని పంటలు పండించడం, సంపద పెంచుకోడానికి అలవాటు పడ్డాడు. ఈ పరిణామ క్రమంలోనే భాషకూడా అభివృద్ధి చెందుతూ వచ్చింది. భాషించడానికి మూలస్థానం "స్వరపేటిక" ఇది ప్రకృతిలోని పశుపక్షాదులకు కూడా ఉంది. దరిదాపుగా జంతుజాలానికంతటికీ ఈ స్వరపేటిక ఉంది. ప్రతి జంతువు తన ఉనికిని తెలియజేయడానికి ఇది ఉంటుంది. దాని ద్వారా ధ్వని చేసి తన ఉనికిని చాటుతుంది. కుక్క భౌభౌమని, పిల్లి మ్యావ్ అని, కాకి కావ్ కావ్ అని సింహం ఘర్జించి, ఏనుగు ఘీంకరించి బాధ, ఆవేశం, కోపాలు వంటి మనోభావాలను అంటే వాటి ఉద్వేగాలను ఇతర జంతువులకు వ్యక్తం చేయడం మనం నిత్యం చూస్తూ గమనిస్తూ ఉంటాం. జంతువుల అరుపుల నుండి అనేక విధాలైన అపరిమితమైన ధ్వనుల చేయగల శక్తి మానవునికి వచ్చింది. మానవ స్వరపేటిక వికసించి మానవుడిని జంతుజాలం నుండి వేరుచేసింది. నాలుక పదునెక్కి నోటితో స్పష్టమైన ధ్వనులు చేయగలిగాడు. ఇదే మానవుని జంతువుల నుండి వేరుచేసింది. సృష్టిలో ఇది మానవుడు సాధించిన తొలివిజయంగా మనకి కనిపిస్తుంది. పసిబిడ్డలు క్రమేపి మాట్లాడే స్థితికి వచ్చినటులగానే మానవుడు కూడా మాటలు నేర్చుకున్నాడు. మాటల ద్వారా తన మనసులోని భావాలు, అనుభవ జ్ఞానం ఇతరులకు పంచడానికి ప్రయత్నించాడు. తన అవసరాలు తీర్చుకోడానికి ప్రయత్నించే క్రమంలోనే భాష పుట్టింది.

మొట్టమొదట మానవుడు తన మనోభావాలు, అవసరతలు ఇతరులకు తెలియజేయడానికి సంజ్ఞలు (సైగలు) చేసేవాడు. కోపం, ఆవేశం, సంతోషం, దుఃఖం వంటి విషయాలను ఎదుటి వారికి తెలపడానికి ముఖ అవయవాలు, కాళ్ళు, చేతులు ఉపయోగించేవాడు. కాబట్టి భాషకు తొలిరూపం సంజ్ఞలే.

సంజ్ఞల వ్యక్తీకరణకు కంఠధ్వని తోడయ్యింది. ఈ కంఠధ్వనులు అనేక రకాలుగా ఉంటాయి. వాక్కుకు సంబంధించిన ముక్కు, దౌడలు, పెదాలు, దంతాలు, కొననాలుక (నాలుక చివర ఉండే చిన్న నాలుక) భిన్న శబ్దాల ఉచ్చారణకు సహాయపడతాయి. వీటిలో కొన్ని కదిలేవి, కొన్ని కదలని రెండు విధాలుగా విభజిస్తారు. స్థానం అంటే కదలినివి. కరణం అంటే కదిలేవి. ఈ విధమైన అవయవాల స్పర్శవల్ల కలిగే ధ్వనులను, వాటి భేదాన్ని బట్టి భాషావేత్తలు పేర్లు పెట్టారు. ఉదా॥ పఫబభమ అనే వర్ణాలు రెండు పెదాల స్పర్శవల్ల పుట్టాయి. కాబట్టి ఓష్ఠ్యాలు అన్నారు. ఈ వర్ణాలను వేరుచేసి చూపే క్రమంలో వర్ణమాల పుట్టింది. ఇది లిపికి, భాషాభివృద్ధికి, సాహిత్య రచనకు తోడ్పడింది.

భాష తొలిదశలో వాగ్రూపంలో మౌఖిక భాష లిపి పుట్టాక వాఙ్మయంగా మార్పు సంతరించుకుంది. భాషకు చెప్పేవారు "వక్త" వినేవారు "శ్రోత" అవసరం మానవ సమాజంలో కొన్ని భాషలకి లిపిలేదు. తొలిదశలో లిపి చరిత్రరూపంలో ఉండేది.  ధ్వని సంకేతాలకు అనుగుణంగా రాళ్ళు, చెక్కలపై చెక్కేవారు. దీనిని "ఇకోనిన్ లిపి" అనేవారు. ఈ లిపికి భావంతోను, కంఠధ్వనులతోను సంబంధం ఉంటుంది.

## 3.0 వర్ణం :-

కంఠధ్వనుల వల్ల వర్ణాలు వచ్చాయి. వర్ణాల అభివృద్ధికి చాలా దీర్ఘకాలిక చరిత్ర ఉన్నట్లు తెలుస్తుంది. కంఠధ్వనుల్లో కొన్ని అప్రధానమైనవి. కొన్ని ప్రధానమైనవి. అర్థ భేదం కలిగిన ధ్వనులే ప్రధనమైనవి. కంప - గంప, గోడలు –కోడలు, కలుపు - పులుపు, తల - వల, కాలు - చేలు, తేలు వంటివి అర్థభేదంలో ఉంటాయి. ఈ చిన్న తేడావల్ల వివిధమైన వాటినిగూర్చి చెబుతున్నట్లు అర్థమవుతుంది. అర్థభేద కారకమైన ధ్వనులనే ప్రధాన ధ్వనులుగా స్వీకరించాలని భాషావేత్తల అభిప్రాయం. ఖారం - కారం, కర్మ –ఖర్మ వంటి వాటిలో అర్థ భేదంలేని ధ్వని మార్పేగాని అటువంటి వాటినే అప్రధాన ధ్వనులు అంటారు. ప్రత్యేక ధ్వనులకే లిపి గుర్తులు (చిహ్నాలు) ఉంటాయి.

వర్ణం అంటే కొన్ని ధ్వనుల సమూహం. ఉదా॥ అమ్మ అనే పదంలో అ+మ్+మ్+అ అనే 4 ధ్వనులున్నాయి. ఇవి మొత్తం కలిపి ఒక పదంగా ఏర్పడ్డాయి. భావ ప్రకటనకు సంబంధించిన కనీస శబ్ధాంశాన్ని వర్ణం అంటారు.

<u>వర్ణమాల - పరిణామం : -</u>

ఒక భాషలో వర్ణాలను క్రమంగా అమర్చడాన్ని వర్ణమాల అంటారు. భాషా నిర్మాణంలో వర్ణమాల ప్రధానమైనది. తెలుగులో వెలువడ్డ శాసనాలు, లిఖిత సాహిత్యం ఆధారంగా వర్ణమాలలో జరిగిన పరిణామ క్రమాన్ని భాషా శాస్త్రవేత్తలు పరిశోధించిన తరువాత ఏర్పాటుచేశారు. క్రీ.పూ. 200 నుండి క్రీ.శ.600 మధ్యకాలంలో (ఱ) కారం ప్రత్యేక వర్ణంగా ఉండేది. క్రీ.శ. 7 నుండి 9 శతాబ్దాల మధ్యకాలంలో "c" అర్ధానుస్వరం (అరసున్న లేదా ఖండ బిందువు) క్రొత్త వర్ణంగా అంటే ధ్వనిగా పుట్టింది. క్రీ.శ. 1100 నుంఇ 1399 మధ్య కాలంలో తెలుగులో కేవలం 10 అచ్చులే ఉండేవని అవి <u>అఆఇఈఉఊఎఏఒఓ</u> అని చెప్పారు. శాసన భాషలో <u>ఋ</u> వర్ణం <u>రి,రు</u> లుగా కనిపిస్తుంది.

క ఖ గ ఘ ఙ

చ ఛ జ ఝ ఞ

ట ఠ డ ఢ ణ

త థ ద ధ న

ప ఫ భ మ య ర ల వ శ షస హ ళ క్ష ఱ ఉండేవని తర్వాత క్రమేపి వర్ణమాల విస్తరిస్తూ వచ్చిందని తెలుస్తుంది.

### 1.3.1 తెలుగు వర్ణమాల : అనేక అభిప్రాయాలు :-

ఆంధ్రభాషకు వర్ణాలు, లేదా అక్షరాలు 56 అని అనేకుల అభిప్రాయం. (ప్రసిద్ధి చెందింది)

**అచ్చులు :-** అ ఆ ఇ ఈ ఉ ఊ ఋ ౠ ఌ ౡ ఎ ఏ ఐ ఒ ఓ ఔ అం అః అనే 18 వర్ణాలను అచ్చులు అంటారు. కాని బాలవ్యాకర్త అభిప్రాయం ప్రకారం అం, అః అనేవి అచ్చులు కాదు. ఁ,ం, ః ఈ మూడు ఉభయాక్షరాలు.

క ఖ గ ఘ ఙ

చ ఛ జ ఝ ఞ

ట ఠ డ ఢ ణ

త థ ద ధ న

ప ఫ భ మ య ర ల వ శ షస హ ళ క్ష ఱ ఈ 38 హల్లులు కలిపి 56 వర్ణాలుగా చెప్పారు. (పండితులు) హల్లులన్నీ అచ్చుల సహాయంతోనే ఉచ్చరించబడతాయి. అచ్చులలో ఋౠ అనే వాటి ఉచ్చారణ రు రూ ల వలె ఉచ్చరించబడుతుంది. ఉచ్చారణేకాదు అర్థభేదం కూడా లేదు. అలాగే ఌ ౡ లకు లు లూ లకు భేదం లేదు కావున ప్రస్తుతం తెలుగు భాషలో ఋ,ౠ ఌ ౡల ప్రయోగం తగ్గిపోయింది. ప్రస్తుతం లేదనే చెప్పవచ్చు. ఱ కూడా వాడుక నుండి దరిదపుగా తొలగిపోయింది. అయితే సంస్కృతం నుండి తెలుగులోకి వచ్చిన కొన్ని పదాలలో మాత్రం కనిపిస్తుంది. పరవస్తు చిన్నయసూరిగారు దంత్య తాలవ్యంబులైన చ జ లు చజ సవర్ణాలు అని బాలవ్యాకరణంలో చెప్పడం వల్ల చ జ లుకూడా ప్రస్తుతం తెలుగులో లేవు. ఙ,ఞ లు సంస్కృతంలో ధ్వని సంకేతాలే గాని తెలుగులో అవసరతలేదని కొందరి భాషజ్ఞుల అభిప్రాయం. చ జ లలో కేవలం"ౕ" గుర్తు మాత్రమే గుణింతాలలో ఉపయోగిస్తున్నాము.

తెలుగు భాషలోని హల్లులో ర,ఱ వర్ణాలున్నాయి. "ర" కారాన్ని సాధురేఫ అంటారు. "ఱ" కారాన్ని శకటరేఫ అంటాం. ప్రస్తు భాషలో "ఱ" కి ప్రత్యేక ప్రయోజనం లేనందువల్ల అది భాషనుండి తొలగిపోయింది. తొలగింది అనడం కంటే జారిపోయింది అనడం సమంజసం. ఎందుకంటే క్రమంగా వాడుక తగ్గింది. "క్ష" కారం ప్రత్యేక వర్ణం కాదని పండితుల అభిప్రాయం కావున ఋ,ౠ, ఌ ౡ చ జ ఙఞ, ఱ వర్ణాలను తొలగిస్తే ప్రస్తుతం తెలుగు వర్ణమాలలో 46 వర్ణాలు ఉన్నాయి.

చిన్మయసూరిగారు బాలవ్యకరణంలో తెలుగునకు వర్ణాలు 36 అని 14 అచ్చులు చెప్పారు. 22 హల్లులు చెప్పారు. మహాప్రాణులు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదనేది వారి అభిప్రాయం అవి సంస్కృతం నుండి పుట్టిన పదాలలో ఉండడంవల్ల వాటిని స్వీకరించి ఉండకపోవచ్చు. శ వర్ణంకూడా అంతే 'క్ష' సంయుక్తాక్షరం కావున స్వీకరించలేదు. "ఱ" ప్రయోగం తెలుగు భాషలో వాడుక తక్కువగా ఉండడంవల్ల దానిని వర్ణంగా సూరి గుర్తించలేదు. తాలవ్య చ,జ లతో పాటు దంత్య చ ఝు తెలుగులో వర్ణమాలలో చేర్చాడు. కాని రెండూ సవర్ణాలేగాని వేరుగా చెప్పనవసరంలేదు కావున చ జ ప్రస్తుతం భాషలో వాడుకలో లేవు.

వర్ణమాల సంఖ్య ఎంతైనా భాషా వ్యవహారంలో అవి పరిమిత సాధనాలేనని మనం తెలుసుకోవాలి. పరిమితమైన వర్ణాల కలయికతోనే భాష ఏర్పడుతుందని మనం గమనించాలి. సంగీతమంతా 'స,రి,గ,మ,ప,ద,ని,స" అనే సప్త వర్ణాలపై ఆధారపడినట్లు ఏ భాషైనా పరిమిత అక్షరాలతోనే అనంత అభివృద్ధి జరుగుతుంది. వర్ణం ధ్వని సంకేతమేగాని అర్ధంకాదు. వర్ణాల కలయికతో ఏర్పడిన పదాలకు అర్ధాన్ని తెలిపే శక్తి ఉంటుంది. అర్ధం రెండు రకాలు. 1) వాచ్యార్ధం, 2) ప్రతీయమానార్ధం. నిత్యం మన వ్యవహారంలో ఉన్నది వాచ్చార్ధం. సాహిత్యంలో ఉండేది ప్రతీయమానార్ధం.

### 1.3.2 - పదం - భాషా నిర్మాణం :

కొన్ని వర్ణాలు కలిసి అర్ధవంతంగా ఏర్పడితే దానిని పదం అంటాము. దీనిని శబ్దం, మాట అనికూడా అంటాం. వర్ణం మార్చినప్పుడు క్రొత్త అర్ధం వస్తే వాటిని అక్షరాలుగా గుర్తిస్తాం. ఆ అక్షరాల సముదాయాన్నే "పదం' అంటాము. ఉదా॥ మాట అనే పదంలో మా స్ధానంలో వర్ణాలు మార్చి కోట, పేట, తోట, పాట, బాట, చేట అంటే ఆ మార్పు నూతన అర్ధాన్ని పుట్టిస్తుంది. కావున అందలో ఉన్న వర్ణాలకు అక్షర శక్తి ఉందని తెలుస్తుంది. అటువంటి అక్షర సముదాయాన్నే పదం అంటాము "రాము" అనే పదానికి (సంస్కృత ప్రాతిపదికకు...ఉత్వ, డుజ్ ప్రత్యాయాలు చేరి రాముడు అనే తత్సమ పదం ఏర్పడింది. తెలుగులో నామవాచక, క్రియా ప్రాతిపదికలు (మూలరూపాలు) విభక్తి ప్రత్యయాలు చేరి "పదాలు" ఏర్పడతాయి. అవి అర్ధాన్ని బోధిస్తాయి. కాబట్టి అవికూడా పదాలే.

### పదనిర్మాణ పద్ధతి - కలిగే మార్పులు :

పదాల రూపాలకు మార్పులు, చేర్పులు చేసి ఎన్నో కొత్త పదాలు రూపొందించవచ్చు. ప్రాతిపదిక చివర చేరితే ప్రత్యాయమంటాం. "డు, వు, రు ను, ము అనేవి తెలుగు ప్రత్యయలని చిన్నయసూరి తత్సమ పరిచ్ఛేదంలో వివరించారు. వచనంతో, పురుషతో, లింగభేదంతో కొత్తపదాలు సృజిస్తాము. కాలాన్ని బట్టికూడా పదనిర్మాణం ఉంటుంది. క్రియా రూపాన్ని బట్టి పదం ఏర్పడుతుంది.

### భాష - వ్యాకరణం :

మనం భాష పూర్తిగా స్పష్టంగా నేర్చుకోవాలంటే తప్పనిసరిగా వ్యాకరణం కావాలి. వ్యాకరణ శాస్త్రాన్ని శబ్దశాస్త్రం అంటాం. భాషలో వర్ణం, పదం, వాక్యం నిర్మాణక్రమం తెలియాలంటే వ్యాకరణం కావలసిందే. ఈ శాస్త్రం నియమాలని తెలుపుతుంది. పదాల మూలాలు, పదాల రకాలు తెలుస్తాయి. ప్రాచీన వైయాకరుణులు తెలుగుకు సంస్కృతం మూలమని చెప్పారు. శ్రీనాధమహాకవి "క్రీడాభిరామం" అనే తన గ్రంథంలో "జనని సంస్కృతంబు సకల భాషలకు అని చెప్పాడు. తెలుగు పండితులు, వ్యాకరణవేత్తలు, ఈ అభిప్రాయంతోనే ఏకీభవించారు. అందువల్లే తెలుగు వ్యాకరణంపై సంస్కృత వ్యాకరణ ప్రభావం అధికంగా కనిపిస్తుంది.

మొట్టమొదట నన్నయ "ఆంధ్రశబ్ద చింతామణి" అనే మొదటి తెలుగు వ్యాకరణ గ్రంథాన్ని సంస్కృతంలో రాశారని ప్రతీతి. తత్సమ, తత్భవ, దేశ్య, అన్యదేశ్య, గ్రామ్యపదాలుగా భాషాపదాలు వర్ణించారు. మూలఘటిక కేతన తన "ఆంధ్రభాషాభూషణం" అనే వ్యాకరణ గ్రంథంలో పదాలను 1) తత్సమాలు 2) తత్భవాలు 3) అచ్చతెనుగు పదాలు 4) దేశ్యాలు 5) గ్రామాలని చెప్పాడు. "కావ్యాలంకారచూడామణి" లో విన్నకోట పెద్దన 1)

తత్సమ 2)తత్భవ 3) సహజాంధ్రదేశభావాలు 4) దేశ్యోద్భవాలు 5) గ్రామ్యాలుగా పదాలను చెప్పాడు. కాకుల అప్పకవి "అప్పకవీయంలో" తత్సమ తత్భవ, ఆంధ్రదేశ్య విభాగం, గ్రామ్యం అని 4 రకాల తెలుగు పదాలు చెప్పారు. పరవస్తు చిన్నయసూరి గారు "బాలవ్యాకరణంలో" ఆంధ్ర శబ్ద చింతామణిని అనుసరించి తెలుగు పదాలని 1) తత్సమ, 2) తత్భవ, 3)దేశ్య, 4) గ్రామ్యం అని విభజించాడు. పదాల వ్యుత్పత్యార్థాన్ని బట్టి ఈ విభజన చేశారు.

**1) తత్సమాలు :**

చిన్నయసూరిగారు బాలవ్యాకరణంలో సంజ్ఞాపరిచ్ఛేదంలో "సంస్కృత ప్రాకృత తుల్యంబగు భాష తత్సమం" అని సూత్రీకరించారు.

**ఉదా :**

| సంస్కృతం | తత్సమం (సంస్కృతసమం) |
|---|---|
| హరి ః | హరి |
| పితా | పిత |
| గోః | గోవు |
| భూః | భువి |
| విద్యా | విద్య |

| సంస్కృతం | ప్రాకృతం | సంస్కృతసమం |
|---|---|---|
| అగిః | అగ్గి | అగ్గి |
| రాజ్ఞీ | రాణీ | రాణి |
| శ్రీః | సిరి | సిరి |

వీటిని తత్సమ పదాలు అంటాం.

**2. తత్భవాలు :**

బాలవ్యాకరణకర్త "సంస్కృత ప్రాకృత భవంబగు భాష తత్భవం" అనే సూత్రం ద్వారా చెప్పారు. అంటే సంస్కృత, ప్రకృత భాషాపదాల నుండి పుట్టిన తెలుగు పదాలను తత్భవాలు అంటారు. వీటిని మనం ప్రకృతి వికృతులుగా చెప్పుకుంటాం. సంస్కృత ప్రాకృత భాషాపదాలు అనేక మార్పులు, చేర్పులకు గురై తత్భవ పదాలు ఏర్పడ్డాయని తెలుస్తుంది. వాటిని భాషావేత్తలు 5 విధాలుగా విభజించారు.

అవి:

**అ) వర్ణాగమాలు :** అదనంగా వచ్చి చేరే వాటిని ఆగమం అంటారు. ఉదా॥కి "ద్వారం" తత్సమం "దువారం" తత్భవం ఇక్కడ ఉ అదనంగా చేరింది. ఆకాశం సంస్కృతం ఆకసం (తెలుగు) క స వర్ణాలు వచ్చి చేరాయి.

**ఆ) వర్ణాదేశం :** ఒక వర్ణానికి బదులు ఇంకొకటి రావడం.

**ఉదా॥** సంధ్య - సంస్కృతం

సంజ - తత్భవం

ఇక్కడ 'ధ్య' స్థానంలో 'జ' వర్ణం వచ్చింది.

**ఇ) వర్ణవ్యాత్యయం :** సంస్కృతం - తత్భవం

శుచి - చిచ్చు

**ఈ) వర్ణలోపం :** ఒక వర్ణం లోపించడం వల్ల తత్సమ పదాలు తత్భవాలుగా మారతాయి.

ఉదా ॥ తామరసమ్ తామర

సంస్కృతం (తత్భవం)

ఇక్కడ "సమ్" వర్ణాలు లోపించి తత్భవ రూపం ఏర్పడింది.

**ఎ) వర్ణ సమీకరణం :** తత్భవాలలో సంయుక్తాక్షరం ద్విత్వాక్షరంగా మారుతుంది.

**ఉదా ॥** తత్సమం తత్భవం

శ్రేష్ఠ సెట్టి

**3) దేశ్యాలు :**

బాలవ్యాకరణంలో సూరి "త్రిలింగ దేశవ్యవహార సిద్ధంబగు భాషదేశ్యంబు" అని చెప్పారు. త్రిలింగ దేశం అంటే తెలుగు వ్యవహారంలో ఉన్న ప్రాంతం. త్రిలింగ అనే పదంనుండి తెలుగు (తత్భవం) ఉద్భవించింది. తెలుగు దేశంలో వాడుకలో ఉన్న పదాలు దేశ్యాలు, తత్సమ, తత్భవ పదాలుకానివి దేశ్యాలు

**ఉదా॥** ఇల్లు, ముల్లు, కోట, పేట, మేడ, దూడ, ఊరు, పేరు, తావి, మోవి, లేత, కోత వంటివి దేశ్యాలు. ఇవి తత్సమ, తత్భవాలు కాదు. మనది ద్రవిడ భాషా కుటుంబానికి చెందిన భాష అవ్వడం వల్ల మనకి అంటే తెలుగు పదాలకి, తమిళ, కన్నడ, మళయాళం వంటి ద్రవిడ భాషా పదాలతో కొన్నిటకి సారూప్యం ఉంది.

| తెలుగు | తమిళం | కన్నడం | మళయాళం |
|---|---|---|---|
| అక్క | అక్కా | అక్క | అక్క |
| తల | తలై | తలె | తల |
| మన్ను | మణ్ | మణ్ణు | మణ్ణు |

**4) గ్రామ్యపదాలు :**

"లక్షణ విరుధంబగు భాష గ్రామ్యంబు" అని చిన్నయసూరి చెప్పారు. లక్షణగ్రంథం అంటే "వ్యాకరణ శాస్త్రం" వ్యాకరణానికి విరుద్ధమైన పదాలను గ్రామ్యపదాలు అంటారు. అనాగరికులైన గ్రామీణులు భాషాపదాలు ఉదా॥ వస్తాడు, తెస్తాడు, వచ్చేవి, తెచ్చేవి, వచ్చేవాడు వంటివి గ్రామ్యాలని బాలవ్యాకరణంలో చెప్పబడింది. సూరి వ్యాకరణంలో నింద్యగ్రామ్య, అనింద్యగ్రామ్య అని రెండు రకాలు చెప్పారు. ప్రాచీన కవులైన న్నయాదులు ఉపయోగించినవి గ్రామ్యాలైనా వాటిని స్వీకరించాలని "ఆర్యవ్యవహారంబుల ద్రష్టంబు గ్రాహ్యంబని" చెప్పారు. ఉదా॥ నన్నయ భారతంలో కపిల కన్నులు, కపిల జడలు వంటి పదప్రయోగం చేశారు. శ్రీనాధుడు "కఱకంఠుడు" పదం ఉపయోగించడం తిక్కన జీవగఱ్ఱ, ప్రాణగొడ్డము అనే పదప్రయోగాలు చేశారు. వారిమీది ఉన్న గౌరవంతో ఆ పదాలను యధావిధిగా స్వీకరించాలని చెప్పారు. సామాన్య ప్రజలు ఉపయోగించేవి నింద్యలని చెప్పారు.

**తెలుగు పదాలు - భాషాశాస్త్రజ్ఞుల విభజన :**

తెలుగు భాషజ్ఞులు తెలుగులోకి ప్రవేశించిన ఇతర పదాలను దృష్టిలోపెట్టుకొని, దేశ్యాలు 2) అన్యదేశ్యాలని

విభజించారు.

ఎ) దేశ్యాలు : తెలుగు భాషలో సహజంగా వాడుకలో ఉన్నవి. ఉదా: నెయ్యి, పాలు, పెరుగు వంటివి.

బి) అన్యదేశ్యాలు : ఇతర భాషల నుండి తెలుగులోకి వచ్చి స్థిరపడినది. వాటిని విజ్ఞులు రెండుగా విభజించారు.

1) సజాతీయ భాషలు

2) విజాతీయ భాషలు

ఒకే భాషాకుటుంభం నుండి వచ్చినవి సజాతీయాలు. అంటే మనది ద్రవిడభాషా కుటుంభం. అదే కుటుంభానికి చెందిన తమిళ, కన్నడ, మళయాళ పదాలను సజాతీయ అన్య దేశ్యాలంటారు.

**ఉదా॥ తమిళపదాలు :** సాంబారు, వడ, దోసె, తిరునాళ్ళు, జియ్యారం, ఆళ్వారు, వంటివి.

**కన్నడ పదాలు :** హోదా, గండపెండరం, హోరాహోరి, హోయలు మొదలైనవి.

**మరాఠీ పదాలు :** భళీ భళీ, ఖంగారు, చావిడీ, పాగా, కిరాణా, పంతులు, రావు, గుంజాయి, కాగడా. బహుజన పల్లి సీతారామాచార్యులు గారు "రావు" అనేది బిరుదు, గౌరవసూచకంగా చెప్పారు.

**ఒరియా పదాలు :** బేపి (కుక్క), కంబారి (జీతగాడు) బుగత (భూస్వామి) భోగట్టా (సమాచారం) వంటివి. పన్నె (దువ్వెన) మొదలైనవి.

ఉర్దూ, హిందీ వంటి హిందూస్తానీ పదాలు తెలుగులో విరివిగా ఉపయోగిస్తాం. మొగలుల పాలన వల్ల ఎక్కువగా ఈ పదాలు తెలుగు భాషలో స్థిరపడ్డాయి.

**ఉదా॥** దోస్తు, బడాయి, దివాలా, మెహర్బానీ వంటి పదాలు నిత్య వ్యవహారంలో గమనిస్తూ ఉంటాయి.

అదేవిధంగా పాలనా పరంగా ఉపయోగించే పదాలైన నవాబు, రసీదు, వసూలు, గులాం, గుమస్తా, కౌలు, దస్తావేజు, ఖాతా, దివాను, బందోబస్తు వంటి పదాలు నిత్య వ్యవహారంలో విరివిగా ఉపయోగిస్తున్నాము.

**పోర్చుగీసు పదాలు :** జామ, బొప్పాయి, క్యాబేజి, సబ్బు, పీపా, బంకు, ఇస్త్రీ, గిడ్డంగులు వంటి పదాలు పోర్చుగీసు వారి నుండి తెలుగులోకి వచ్చాయి.

**"బత్తాహియా దీవుల నుండి"** : డచ్ వ్యాపారస్తులు మనదగ్గరికి 'బత్తాయి' పండు తెచారు.

**ఫ్రెంచ్ పదాలు :-** కిచెన్, బీరువా, మేడమ్ వంటి పదజాలం తెలుగులో కలిసిపోయాయి. రాజకీయ వృత్తి, మత విజ్ఞాన రంగాలలో ఎన్నో పదాలు వచ్చాయి.

**ఉదా ॥** డాక్టర్, కోర్టు, లాయర్, పోలీసు, డాన్స్, సినిమా, కాఫీ, టీ, లైటు, కారు వంటి పదాలు వచ్చాయి.

**ముగింపు :**

తెలుగు భాషలో పర్యాయ పదాలు, నానార్థాలు ఉన్నాయి. సజాతీయ, విజాతీయ పాశ్యాత్యదేశీయ పదాలు తెలుగులోకి ప్రవేశించి తెలుగు భాష, అభివృద్ధి చెందింది. అన్య భాషా పదాలు స్వీకరించడం సహజ లక్షణంగా మనకి కనిపిస్తోంది.

## 13.3 భాషా నిర్మాణంలో వాక్యప్రాధాన్యత

మానవుడు తన భావ ప్రకటన చేయడానికి భాషాపరమైన సంపూర్ణ రూపం "వాక్యం". క్రమ బద్దంగా పదాలను కూర్చడం వల్ల వాక్యానికి అర్థం వస్తుంది. మానవుడు తన భావాలను, అభిప్రాయాలను ఇతరులకు అర్థవంతంగా,

సుస్పష్టంగా తెలియ జేయడం వాక్య నిర్మాణ క్రమం స్పష్టతపైనే ఆధారపడి ఉంటుంది. అదే విధానం, ఇతరుల భావాలు గ్రహించడానికి కూడా దోహద పడుతుంది. భాషజ్ఞులు "సంపూర్ణ భావాన్ని వ్యక్తీకరిస్తూ రెండు విరామ చిహ్నాల మధ్య ఉచ్చారణను వాక్యం" అందురని తెలిపారు. విరామ చిహ్నాలంటే పులుస్టాప్. ఆ వాక్య నిర్మాణం ఎలా ఉండాలి? ఏ పదాలు ఎక్కడ అమర్చాలి (కర్త కర్మ క్రియలను అని బహుజనపల్లి సీతా రామాచార్యులు గారు ప్రౌఢవ్యాకరణంలో తెలుగు వాక్యం గూర్చి వివరించారు. (వాక్యపరిచేదం)

ఇంగ్లీష్‌లో 1957 నోమ్‌ఛామ్‌స్కీ "పరివర్తన వ్యాకరణంలో" వాక్యాన్ని వివరించారు. అది వాక్య నిర్మాణ పరిశోధనకు విపరీతమైన విశేష ప్రాధాన్యాన్ని సంతరించుకొంది ' అందుకే దీనిని "ఉత్పాదక వ్యాకరణం" అన్నారు. ఆంగ్ల భాషలో వ్యాన్ని "Syntax" అన్నారు. ఇది sya, Taxin అనే రెండు భాషా పదాల నుండి ఉద్భవించింది. say అంటే. Together with అని Taxin అంటే arrangement or order అని అర్థం "syntax' అంటే శాస్త్రీయ పద్ధతిలో వాక్య నిర్మాణ అధ్యయనం అని అర్థం. వీరి "ఉత్పాదక వ్యాకరణం" అనేకులకు భాషాశాస్త్ర అధ్యయనాలకు, పరిశోధనలకు తోడ్పడడం వల్ల నోమ్‌చామ్‌స్కీని "ఆధునిక భాషాశాస్త్ర పితామహుడిగా" కొనియాడ బడుతున్నారు.

భాషాశాస్త్రం బాగా అభివృద్ధి చెందిన తరువాత ఆధునిక యుగంలో "ఆచర్య చేకూరి రామారావు గారు" తెలుగు నామ్నీ కరణాలపై పరివర్తన శాస్త్ర అధ్యయనం అనే అంశంపై పరిశోధన చేశారు. కార్నల్ విశ్వవిద్యాలయం (అమెరికా) నుండి పి. హెచ్. డి పట్టా పొందారు. ఒక వాక్యంలో కొద్దిగా మార్పుచేసి కర్త - కర్మ పదస్థానాలలో 'ప్రయోగించే పద్ధతినే "నామ్నీకరణం అంటారు". ఒక వ్యక్తి అన్ని మాటలను విన్న వ్యక్తిగాని వేరొకరుగాని పునశ్చరణ చేస్తే దానిని అనుకృతి వాక్యం అంటాం. ఇది ప్రత్యాక్షానుకృతి, పరోక్షానుకృతి అని రెండు విధాలుగా ఉంటుంది. ""అని" ప్రత్యయం వస్తుంది

**ఉదా ॥** ప్రత్యాక్షానుకృతి :- సీత ఎల్లుండి రాగలనని చెప్పింది.

పరోక్షం :- సీత తను ఎల్లుండి రాగలనని. చెప్పింది.

పురుషలను బట్టి అను, అనిగా మారుతుంది. అనుకృత వాక్యాల్లో కర్త లోపిస్తుంది. ప్రధాన వాక్యంలో ద్వితీయా విభక్తి అముఖ్య కర్మకి చెరుతుంది. "అమ్" అనే శబ్ధం ఆగమమౌతుంది.

**ఉదా ॥** చెప్పమని, రమ్మని, వెళ్ళమని.

**వాక్యం - భేదాలు:** వాక్య నిర్మాణాన్ని బట్టి వాక్యాలను ముఖ్యంగా రెండు రకాలుగా విభజిస్తాము.

1. సామాన్య 2. సంశ్లిష్ట వాక్యాలు, 3, సంయుక్త -వాక్యాలు

**1. సామాన్య వాక్యాలు**: అన్వయక్రమంలో క్లిష్టత లేకుండా పూర్తి అర్థాన్నిచ్చే వాక్యాలను సామాన్య లేదా సాధారణ వాక్యాలు అంటాం. ఈ వాక్యాలలో అసమాపక క్రియలుండవు. ఒకే ఒక్క సమీపక క్రియ ఉంటుంది.

**ఉదా॥** సీత అన్నం తింది.

**2) సంశ్లిష్ట వాక్యాలు :** ఒక వాక్యం ఇంకొక వాక్యంతో కలిసిపోయి ఉంటే వాటిని సంశ్లిష్ట వాక్యం అంటాం. ఇందులో ఒకటి లేదా అనేక అసమాపక క్రియలు ఒక సమాపక క్రియ ఉంటుంది. అసమాపక క్రియననుసరించి. క్త్వార్థం, శత్రర్థం, ఛేదర్థక వాక్యాలు ఏర్పడతాయి.

**ఉదా॥** సీత అన్నం తిని బడికి వెళ్ళింది.

**3. సంయుక్త వాక్యాలు : -** రెండు లేదా అంతకంటే ఎక్కువ వాక్యాలు సమాన ప్రతిపత్తిని సంతరించుకొని ఏర్పడే వాక్యాలను సంయుక్త వాక్యాలు అంటారు.

**ఉదా॥** సీత కవిత్వం రాస్తుంది. పాటలు పాడుతుంది. స్వర కల్పన చేస్తుంది. భాషజ్ఞులు సంయుక్త వాక్యాలను

1. సంకలన సంబంధ వాక్యాలు
2. వికల్ప సంబంధ వాక్యాలు.
3. వైరుధ్య సంబంధ వాక్యాలు.

అని మూడు విధాలుగా విభజించారు.

**ముగింపు :**

ఈ విధంగా తెలుగు వాక్యనిర్మాణం ఉంటుంది. అది వ్యాకరణ బద్ధంగా నిర్మించబడిందని 'మనకి అర్థమౌతుంది.

రాదగిన ప్రశ్నలు.

**I. వ్యాస రూప ప్రశ్నలు**

1) భాషా నిర్మాణం "పదం" ప్రాధాన్యతను వివరించి వ్యాకరణకర్తలు చెప్పిన వర్గీకరణను వివరించుము?

జ:- అర్థవంతమైన పదాల సమూహాన్ని "పదం" అంటారు. పదానికి మాట శబ్దం అనేవి పర్యాయ పదాలు. భాషా నిర్మాణంలో "పదం' ప్రముఖ స్థానాన్ని పోషిస్తుంది. సంస్కృత శబ్దాలకు డు, ము, వు, లు అనే విభక్తి ప్రత్యయాలు చేరి తెలుగులో పదాలు ఏర్పడతాయి.

I

**ఉదా॥** "రామ" శబ్దానికి చిన్నయిసూరి బాలవ్యాకరణం ప్రకారం రామ అనేది పుంలింగం, మహద్ వాచకం, ప్రాతిపదిక చివర అ (అత్వం) ఉంది కావున "పుంలింగంబగు మహద్వాచక. నామంబు తుది అత్వంబునకు ఉ త్వంబగు అను సూత్రం ప్రకారం

రామ - ప్రాతిపదిక

రాము అని కాగా

పుంలింగంబుదు మహద్వాచకం నడు "డుఙ్" అగు అనే సూత్రం ప్రకారం "డుఙ్"" ప్రత్యయం వచ్చి రాము + డుఙ్ అని కాగా ఙ్' అనేది ఇత్ సంజ్ఞ కావున ఙిత్తు బిందు పూర్వంబు అనే సూత్రం ప్రకారం రాముఁడు అనే తెలుగు పదం ఏర్పడింది. నామవాచకాలు, క్రియలలోని ప్రాతిపదికలు ప్రత్యయాలతో చేరి పదాలు ఏర్పడతాయి. అర్థాన్ని బోధించే ప్రత్యయాలన్నీ వాడాలి.

**పద నిర్మాణ పద్ధతి (ఏర్పడే) - పొందే మార్పులు:-** పదాల రూపాలలో కొన్ని మార్పులు చేర్పులు జరిగి నూతన పదాలు ఏర్పడతాయి. ప్రాతిపదిక లేదా మూలరూపానికి చివర చేరి పదం ఏర్పడితే దానిని ప్రత్యయం

అంటారు. ఈ ప్రత్యయం అనే పదం సంస్కృత వ్యాకరణం నుండి గ్రహించాము. నామవాచకాల చివర "డు,వు,రు,ను, ము" అనే ప్రత్యయాలు చేరి తెలుగులో నూతన పదాలు ఏర్పడతాయి. తెలుగులో 7 విభక్తులు ఉన్నాయి. **అవి**

డు, ము,వు,లు - ప్రథమా విభక్తి

ని,ను,ల, గూర్చి, గురించి - ద్వితీయ

చేత, తోడ - తృతీయ

కొరకు, కై - చతుర్థి

వలన, కంటి, పట్టి - పంచమీ

కి, కు, యొక్క లో, లోపల - షష్టీ

అందు, న - సప్తమీ

ఈ విభక్తులకు ఏక, బహు వచనాలు, ప్రథమ పురుష, మధ్యమపురుష, ఉత్తమ పురుష అనే 3 పురుషాలు, స్త్రీ, పుం లింగాలు, భూత భవిషత్, వర్తమాన కాలాలను బట్టి నూతన పదాలు ఏర్పాటు చేసుకోవచ్చు.

**లింగభేదం :** దొర - దొరసాని

రామయ్య - రామమ్మ

సుబ్బయ్య - సుబ్బమ్మ

**వచనభేదం :** రావణుడు - రావణులు

రాముడు - రాములు

చెట్టు - చెట్లు

కొమ్మ - కొమ్మలు

ఊరు - ఊళ్ళు

వచ్చాడు - వచ్చారు.

**కాలబేదం :** నిన్న వచ్చాడు

రేపు రాగలడు

ఎల్లుండి వస్తాడు

మొన్న వెళ్ళాడు

నిన్న వెళ్ళింది

నేడు దొరికింది

**పురుషలు :**

**వాడు, వారు - ప్రథమ పురుష (ఎక్కడో ఉన్నవారి గూర్చి చెప్పేది).**

**ఉదా ॥** వాడు తిన్నాడు (ఏక)

వారు తిన్నారు (బహు)

**నీవు, మీరు - మధ్యమ పురుష (ఎదురుగా ఉన్నవారు)**

**ఉదా॥** నీవు వచ్చావా?

మీరు వచ్చారు

**నేను, మేము, మనము - ఉత్తమ పురుష (తనగూర్చి తాను)**

**ఉదా॥** నేను బడికి వెళ్ళాను

మేము బడికి వెళ్ళాము

మనము బడికి వెళ్ళాము

ఈ విధముగా క్రియారూపాలను బట్టి అంటే చేసే పనిని బట్టి లింగ, వచన, పురుషలను బటి, కాలాన్ని బట్టి పదాలు ఏర్పాటు చేసుకుంటాం.

**భాష - వ్యాకరణం :** భాషా స్వరూపం, పదం, వాక్య నిర్మాణాలు గూర్చి తెలుసుకోడానికి తప్పనిసరిగా మనం వ్యాకరణ శాస్త్రంపై ఆధారపడవలసిందే. వ్యాకరణాన్నే శబ్ధశాస్త్రం అనికూడా అంటాము. భాషలో వర్ణం, పదం, వార్య నిర్మాణానికి సంబంధించిన విషయ జ్ఞానం వ్యాకరణం వల్లే తెలుస్తుంది.

సంస్కృతం నుండి తెలుగు ఉద్భవించిందని మన వైయాకరుణుల అభిప్రాయం అందువల్ల సంస్కృత వ్యాకరణ ప్రభావం తెలుగు వ్యాకరణంపై అధికంగా కనిపిస్తుంది. నన్నయ, కేతన, విన్నకోట పెద్దన అప్పకవి మొదలైనవారు సంస్కృత వ్యాకరణాన్ని అనుసరించి పదవిభజన చేశారు. బాలవ్యాకర్త తత్సమ, తత్భవ, దేశ్య, గ్రామ్య పదాలుగా తెలుగు పదాలు విభజించారు. పదాల వ్యుత్పత్తిని బట్టి ఈ వర్గీకరణ జరిగింది.

1) తత్సమ పదాలు : సంస్కృత ప్రాకృత పదాలకు సమమైన తెలుగు పదాలను తత్సమాలంటాము.

ఉదా॥ రామ - రాముఁడు

సంస్కృత ప్రాతిపదికలకు తెలుగు విభక్తులు చేరి పదాలౌతాయి.

ఉదా॥ హరిః - హరి

విద్యా - విద్య

గోః - గోవు

భూః - భువి

పితా - పిత

ప్రాకృత ప్రాతిపదికలకు తెలుగు విభక్తులు చేరి పదాలౌతాయి.

ఉదా॥ అగిః - అగ్గి - అగ్గి

రాజ్ఞ - రాణీ - రాణి

వంటి ప్రాకృత సమాలు.

తత్భవాలు : సంస్కృత ప్రాకృత భాషలనుండి పుట్టిన తెలుగు భాషా పదాలను తత్భవాలు అంటారు. వీటినే వికృతిపదాలని కూడా పిలుస్తాము. ఈ మార్పు, 1) వర్ణాగమం 2) వర్ణాదేశం 3) వర్ణలోపం 4) వర్ణవ్యత్యయం 5) వర్ణసమీకరణం అని 5 విధాలుగా ఉంటుంది.

ఉదా ॥ శుచి - చొచ్చు

శ్రేష్ఠి - సెట్టి

తామరసమ్ - తామర

ఆకాశం - ఆకసం

ద్వారం - దువారం

సంధ్య - సంజ

శుచి - చిచ్చు

ఈ విధంగా సంస్కృత ప్రాకృత పదాలు మార్పు చెంది తెలుగు పదాలేర్పడతాయి.

**3) దేశ్య పదాలు :**

త్రిలింగ దేశంలో వ్యవహారంలో ఉన్న పదాలను దేశ్యపదాలంటారు. తత్భవాలు, తత్సమాలు కాక మిగిలినవి. ఇవి తెలుగులో సహజంగా ఉన్న పదాలు. ఊరు, పేరు, ఇల్లు, ముల్లు, కోట, పేట, దూడ, మేడ వంటివి. కొన్న దేవ్యపదాలకు అన్య భాషా పదాలతో సంబంధం ఉంటుంది. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, ద్రావిడ భాష నుండి పుట్టాయి. అందుచేత దేశ్య పదాలకు ఇతర ద్రావిడ భాషా పదాలతో సామ్యం ఉంటుంది.

**4) గ్రామ్యపదాలు :** వ్యాకరణ శాస్త్రానికి విరుద్ధంగా ఉన్న భాషా పదాలను గ్రామ్యపదాలంటారు. అనాగరికులు మాట్లాడే భాష.

**ఉదా॥** తెస్తాడు, వస్తాడు వంటివని చిన్నయసూరి చెప్పారు. ఇవి రెండు రకాలు 1) నింద్యగ్రామ్యాలు 2) అనింద్య గ్రామ్యాలు. చిన్నయసూరి బాలవ్యాకరణంలో లక్షణ విరుద్ధమైన భాష గ్రామ్యం అయినప్పటికి, ఆర్యులు అంటే నన్నయ, తిక్కన వంటి మహాకవులు గ్రామ్యపదాలు ఉపయోగించినా వారిపై గౌరవంతో వాటిని స్వీకరించాలి అని "ఆర్య వ్యహారంబుల ద్రష్టంబు గ్రాహ్యంబు" అని చెప్పారు. కావున వారు వాడిన గ్రామ్యపదాలను నిందించకూడదు.

**ఉదా॥** ప్రాణగొడ్డం, జీవగఱ్ఱ, కపిల జడలు, మొదలైనవి. మహాకవులు కానివారు (సాధారణ ప్రజలు లేదా గ్రామీణులు) ఉపయోగించే వ్యాకరణ విరుద్ధమైన పదాలు నింద్యాలు.

**5) అన్యదేశ్యాలు :**

తెలుగులో ప్రవేశించిన ఇతర భాషా పదాలను అన్యదేశ్యాలు అంటారు. ఇవి 2 విధాలు

**1) సజాతీయాలు :** సజాతీయాలు అంటే కన్నడ, తమిళ, మళయాళీ పదాలు

**ఉదా॥** హెూదా, హెూరా, హెూరీ, ఆళ్వారు, జియ్యరు, తిరునాళ్ళు వంటివి.

**2) విజాతీయాలు :** మన రాష్ట్రానికి సమీపంలో ఉన్న ప్రాంతాలలో మాట్లాడే భాషా పదాలు. కాగడా, పాగా, కిరాణా, కిరాయి, కంచారీ, బొగట్టా వంటి పదాలు ఒరియా, మరాఠీ భాషల నుండి వచ్చాయి. దివాలా, మెహర్బానీ, బడాయి మొదలైనవి హిందీ పదాలు. కౌలు, నవాబు, రసీదు, గులాం, ఖాతా వంటివి ఉర్దూ భాషనుండి వచ్చి స్థిరపడ్డాయి. పర్షియా భాషనుండి జాగీర్దార్, కిస్తీ వంటి పదాలొచ్చాయి. పోర్చుగీసు భాషనుండి జామ, బొప్పాయి, బాల్చీ, కిచ్, మేడమ్ మొదలైనవి ఫ్రెంచ్ పదాలు. ఇంగ్లీషు నుండి పోలీస్, డాక్టర్, కోర్ట్, కారు, సినిమా, లైటు, రోడ్డు వంటివి విచ్చి మనభాషలో మిళితమై భాషాభివృద్ధి జరిగింది.

**2. భాషా నిర్మాణంలో వాక్యం ప్రాధాన్యతను వివరించుము?**

జవాబు:- ఒక సంపూర్ణ భావాన్ని వ్యక్తీకరిస్తూ రెండు విరామ చిహ్నాల మధ్య ఉండే ఉచ్ఛారణను వాక్యం అంటారు. కేవలం పదాలలో భావాన్ని సంపూర్ణంగా వ్యక్తీకరణ చేయలేము. పదాల సముదాయం వాక్యమని చెప్పినా, ఆ పదాలు ఒక క్రమంలో ఉన్నప్పుడే అది భావాన్ని అర్థమయ్యేలా చేస్తుంది. భావ ప్రకటన చేయడానికి

ఉపయోగపడే భాషారూపమే వాక్యం. మనం మాట్లాడే రాసే భాషలో పదాలు క్రమ పద్ధతిలో ఉండాలి. అలా లేకపోతే శ్రోతకు భావం అర్థంకాక గందరగోళానికి గురౌతారు. మన భావాలను ఇతరులకు సంచాలన్నా ఇతరుల భావాన్ని మనం గ్రహించాలన్నా స్పష్టంగా తెలియాలంటే వాక్యంలో పదాలు క్రమంలో ఉండాలి. తెలుగు వ్యాకర్తలు వాక్య నిర్మాణంగూర్చి పెద్దగా పట్టించుకోలేదు గాని బహుజన పల్లి సీతారామాచార్యులు గారు ప్రౌఢ వ్యాకరణంలో వాక్యాన్ని గూర్చి వివరించారు. వారు రాసిన వాక్య నిర్మాణం కావ్యభాషకు సరిపోయింది. గాని వ్యవహారిక భాషగూర్చి చెప్పలేదు.

ఆంగ్ల భాషలో నోమ్‌చామ్స్‌కీ అనే పండితుడు వాక్యాన్ని గూర్చి తన "పరివర్తన వ్యాకరణంలో" తెలియజేశారు. వ్యాకరణ సూత్రాల ద్వారా ఏసాదు వాక్య నిర్మాణమైనా చెయ్యొచ్చు అని చెప్పారు. వీరి గ్రంథం అనేకులకు పరిశోధనా గ్రంథంగా మారింది. కావున దానిని "ఉత్పాదక వ్యాకరణం" అనికూడా పిలుస్తారు. (పరివర్తన వ్యాకరణాన్ని ) వీరిని ఆధునిక భాషా శాస్త్ర పితామహుడిగా ప్రపంచ భాషాపండితులు కొనియాడారు.

ఇంగ్లీషులో వాక్య నిర్మాణాన్ని " syntax" అని పిలుస్తాం. ఇది రెండు లాటిన్ భాషా పదాల వల్ల ఏర్పడిన పదం. లాటిన్‌ల " say" Taxim" అనే పదల కలయికతో ఏర్పడింది " syntax" లో " say" అంటే together with అని అర్థం Taxim అంటే arangement of order అని అర్థం. syntax అంటే శ్రాస్త్రీయ పద్ధతిలో వాక్య నిర్మాణ అధ్యయనం అని అర్థం.

భాషాశాస్త్రం బాగా ప్రాచుర్యం పొందిన తర్వాత ఆచార్య చేకూరి రామారావుగారు "తెలుగు నామ్నీకరణాలపై పరివర్తన శాస్త్ర అధ్యయనం" అనే అంశంపై పరిశోధన చేసి అమెరికాలోని కార్నెల్ విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి. పట్టా పొందారు. నామ్నీకరణం అంటే వాక్యాన్ని కొన్ని మార్పులతో కర్త, కర్మ పదస్థానాల్లో ఉ పయోగించే పద్ధతిని నామ్నీకరణం అంటారు.

ఒకరు అన్న మాటలు వేరొకరు చెప్పేటప్పుడు వాక్యంలో పురుషను బట్టి కొన్ని మార్పులు జరుగుతాయి. అంటే పునశ్చరణ వాక్యాలల్లో అలా జరుగుతుంది. వీటిని అనుకృతి వాక్యాలు అంటారు. అనుకృతి రెండురకాలు.

**1) ప్రత్యాక్షానుకృతి :** ఉదా॥ రామారావు రేపు వస్తాను (అని) అన్నారు.

**2) పరోక్షానుకృతి :** ఉదా॥ రామారావు తాను రేపు వస్తాను (అని) అన్నాడు.

ప్రత్యాక్షానుకృతిలో వాక్యంలో ఉత్తమ పురుష సర్వనామాలు ప్రధాన వాక్యంలో ప్రథమ పురుష నామంలో చెప్పబడతాయి. అప్పుడు పరోక్షానుకృతిలో ప్రథమ పురుషలోకి వాటికి బదులుగా ఏకవచనంలో తాను, బహువచంలో తాము అనే పదులు ఆదేశంగా వస్తాయి. ప్రధాన వాక్యాలలో క్రియకు అను, చెప్పు వంటి వచ్యర్థక వాక్యాలు (పదాలు) చేరుతాయి. క్రియా విభక్తిలో మార్పు కలగదు. అనుధాతువు నిష్పన్న క్రియకు సమీపంలో ఉంటే 'అని' ప్రయోగం వైకల్పికంగా వస్తుంది. ప్రత్యక్షాను కృతిలో ఏ పదమైనా అనుకృతికావచ్చు. అది అర్థవంతమైనదైనా, అర్థంలేనిదైనా కావచ్చు. అనుకృత వాక్యాలలో కర్త లోపిస్తుంది. ప్రధాన వాక్యంలో అప్రధాన కర్మకు ద్వితీయావిభక్తి వస్తుంది. క్రియలు "అమ్" అనే శబ్దం ఆగమంగా వస్తుంది.

**ఉదా ॥** రా+అమ్+అని = రమ్మని

చెప్పు +అమ్+అని = చెప్పమని

వంటి వాటిలో అని విషయార్ధ భోదకంగా చేరినట్లు గమనించగలం. అనుకృతిలో ఇతర వాక్యాలను కూడా అని చేరుతుంది.

**ఉదా ॥** ఆమె వస్తుందని నాకు తెలుసు.

ఆమె చదవదని నాకు తెలుసు వంటివి.

వాక్య భేదాలు రాకాలు : వాక్య నిర్మాణాన్ని బట్టి తెలుగులో ముఖ్యంగా 3 విధాల వాక్యాలుంటాయి. వీటి ప్రయోగాలకు సందర్భాన్ని బట్టి ప్రయోజనం ఉంటుది.

**1) సామాన్య వాక్యాలు :**

అన్వయ క్లిష్టత లేకుండా పూర్తి అర్థాన్నిచ్చే వాక్యాలు సామాన్య లేదా సాధారణ వాక్యాలు అంటారు. ఇందులో సమాపక క్రియలే ఉంటాయి. సామన్య వాక్యాలలో కర్మ, క్రియలకు ప్రాధాన్యత ఉంటుంది.

ఉదా ॥ రాజు ఇంటికి వచ్చాడు.

**2) సంశ్లిష్ట వాక్యాలు :**

ఒక వాక్యం ఇంకొక వాక్యంలో ఇమిడిపోతే వాటిని సంశ్లిష్ట వాక్యాలంటారు. వీటిలో ఒకటి కంటే ఎక్కువ అసమాపక క్రియలు ఒక సమాపక క్రియ ఉంటాయి.

**ఉదా ॥** సీత అంగడికి పోయి (వెళ్ళి) సరుకులు తెచ్చింది.

3) **సంయుక్త వాక్యాలు :** రెండు లేదా అంతకంటే ఎక్కువ సమాన ప్రతి పత్తిగల వాక్యాలు కలిసి ఒక వాక్యంగా ఏర్పడితే వాటిని సంయుక్త వాక్యాలు అంటారు.

**ఉదా॥** రాజు బడికి వచ్చాడు. పరీక్షరాశాడు.

ఊరికి వెళ్ళాడు. ఇక్కడ కర్త ఒక్కరే ఉంటారు. ఈ సంయుక్త వాక్యాలలో అనేక భేదలున్నాయి.

**ముగింపు :** ఈ విధంగా భాషలో వాక్యం ప్రాధన్యత పొంది అనేక రకాల భావాలను వ్యక్తం చేయడానికి అర్థం చేసుకోడానికి భాషాబివృద్ధికి తోడ్పడుతుంది. సాహిత్య రచనకు దోహదకారి అవుతుంది.

3) భాషా నిర్మాణంలో వర్ణం, పదం, వాక్యం ప్రాధాన్యతను వివరించండి?

**జవాబు :**

**ఉపోద్ఘాతం :** భాషలో వర్ణాలు ఏర్పడ్డాక వర్ణ సముదాయం పదంగా ఏర్పడుతుంది. అది వాక్య నిర్మాణానికి దోహదపడుతుంది. వాక్యం భాషాభివృద్ధికి, సమాజాభివృద్ధికి తోడ్పడుతుంది.

**వర్ణం :** మానవ కంఠ ధ్వనులకు గుర్తులుగా వర్ణాలు తయారయ్యాయి. ధ్వనుల్లో ప్రధానమైన వాటినే వర్ణాలుగా గుర్తిస్తాం. వర్ణంగా గుర్తింపు పొందిన దానికే లిపి, చిహ్నం ఉంటుంది. వర్ణం అంటే ఒక ధ్వని మాత్రమే కాదు. కొన్నిసార్లు ధ్వనుల సమూహం కూడా వర్ణమే అవుతుంది. అ అనేది ఏ విధంగా వర్ణమౌతుందో క్+ఓ+=కో కూడా వర్ణమే అవుతుంది.

క్రీ.పూ. 200 నుండి క్రీ.శ. 600 వరకు ఉన్న కాలంలో తెలుగులో "ఐ" అనే వర్ణం వాడుకలో ఉన్నట్లు తెలుస్తుంది. క్రీ.శ. 7వ శతాబ్ధంలోనే అరసున్న అర్ధానుస్వరానికి విలువ వచ్చింది. శాసనాల ఆధారంగా పరిశీలిస్తే "అఆఇఈఉఊఎఏఒఓ అనే అచ్చులు 34 హల్లులు ఉన్నట్లు తెలుస్తుంది. వర్ణాలనే అక్షరాలు అనికూడా అంటాం. అక్షరం అంటే నశించనిది అని అర్థం.

తెలుగు భాషలో 56 వర్ణాలు ఉన్నాయని వ్యాకర్తల అభిప్రాయం. కాని ప్రస్తుతం ఋఋూలు లేవు. కారణం సాధురేఫకు కొమ్ము, కొమ్ము దీర్ఘం ఇస్తే ఇదే ఉచ్చారణ వస్తుంది. అర్థభేదంకూడా లేదు. కావున

సంస్కృత సమాలలో తప్ప ప్రస్తుతం ఋ ౠలు లేవు వీటిస్థానంలో కూడా రు రూ లే రాస్తున్నాము. ఌ ౡలు అనే అచ్చులు అవసరం లేదు. ల లూ లు అదే ఉచ్చార కలవి మరియు అర్థ భేదం లేదు. ఙ ప్రస్తుతం వాడుకలో లేదు. సాదురేఫ ర ఉపయోగిస్తున్నాము. "క్ష" సంయుక్తాక్షరం కావున అది స్వతంత్ర వర్ణం కాదు "శ" సంస్కృత పదాలలోనే ఉంటుంది. చే జే లను చిన్నయసూరి దంత్య తాలవ్యాలైన చజలు సవర్ణాలు అని చెప్పడం వల్ల అవికూడా ప్రస్తు ఉపయోగంలో లేవు ం ః ఉభయాక్షరాలు అవి అచ్చులలో చెప్పకూడదు. అవి అనుస్వరాలు.

వర్ణాల కలయికతో పదాలు, వాక్య నిర్మాణం జరుగుంది. కావున పరిమిత వర్ణాలతో అపరిమిత భాషాసృష్టి చేయవచ్చు.

పదం – ప్రాధాన్యం : అర్ధవంతమైన వర్ణాల సమూహంతో ఏర్పడేవి పదాలు. ఈ పదాలకు అర్ధాలుంటాయి. వాటిని వాచ్యార్ధం, ప్రతీయమానార్ధం అని విభజిస్తాం. నిత్యవ్యవహారిక పదజ్ఞానం ప్రతీయమానార్ధం అంటాం. పదాలలో వర్ణాల మార్పు చేర్పుల వల్ల నూతన పద సృష్టి జరుగుతుంది. ఈ చేర్పులు పదం చివర జరికితే ప్రత్యయం అంటాం.

ఉదా ॥ డు, ము, వు, రు, ను, ము అనేవి ప్రత్యయాలు. ధాతువు చివర ప్రత్యయం చేర్చుతూ వచన, లింగ, కాల పురుష భేదాలతో నూతన పదాలు సృష్టించవచ్చు.

తెలుగు వ్యాకర్తలు తెలుగు పదాలను 1) తత్సమాలు 2) తత్భవాలు 3) దేశ్యాలు, 4) గ్రామ్యాలు గా చెప్పారు. ఇవి కాక మన పొరుగు ప్రాంతాల నుండి ఇతర దేశాల నుండి తెలుగులోకి వచ్చి చేరిన పదాలను అన్యదేశ్యాలు అంటారు. సజాతీయ దేశ్యాలు తమిళ, కన్నడ, మలయాళీ పదాలు మన ద్రవిడ భాషా కుటుంభంలోవి కావున వాటిని సజాతీయ దేశ్యాలంటాం. విజాతీయ దేశ్యపదాలంటే ఇతర పొరుగు ప్రదేశాల నుండి తెలుగులోకి వచ్చి ఇమిడిన పదాలు. ఇంగ్లీష్, పోర్చుగీస్, డచ్ మరాఠీ, హిందీ, ఒరిస్సా మొదలైన భాషా పదాలు తెలుగులో స్థిరపడ్డాయి. ఇతర భాషాపదాలు స్వీకరించి తెలుగు భాషాజ్ఞానాభివృద్ధి జరిగింది.

**వాక్య ప్రాధాన్యత :**

భావ ప్రకటనకు ఉపయోగపడే భాషా రూపాన్నే వాక్యం అంటారు. ఈ వాక్యం అనేది శాస్త్రీయ బద్ధంగా క్రమపద్ధతిలో ఉండాలి. "ఒక సంపూర్ణ భావాన్ని వ్యక్తీకరిస్తూ రెండు విరామ చిహ్నాల మధ్య ఉండే ఉచ్చారణను" వాక్యం అంటామని భాషావేత్తలు నిర్వచించారు.

తెలుగులో వాక్యం గూర్చి ప్రౌఢవ్యాకర్త చర్చించారు. ఆచార్య చేకూరి రామారావుగారు తెలుగులో నామ్నీకరణాలపై పరిశోధన చేసి పి.హెచ్.డి. పట్టా పొందారు. పునుశ్చరణ వాక్యాలు కొద్ది మార్పుతో ప్రయోగించబడతాయి.

వాక్య నిర్మాణాన్నిబట్టి వాక్యాలను 3 విధాలుగా విభజిస్తారు. అవి :

1. సామాన్య వాక్యాలు
2. సంశిష్ట వాక్యాలు
3. సంయుక్త వాక్యాలు అంటారు. సంయుక్త వాక్యాలు అనేక విధాలుగా ఉంటాయి. అర్ధాన్నిబట్టికూడా వాక్య నిర్మాణంలో (స్వరూపంలో) మార్పులు వస్తాయి.

**ముగింపు :**

ఈ విధంగా భాషా నిర్మాణంలో వర్ణం, పదం, వాక్యం విశేష ప్రాధాన్యాన్ని పొంది అనంతమైన

వాఙ్మయాన్ని, సాహిత్యాన్ని సృష్టించడానికి తోడ్పడుతుంది.

**గమనిక :** 3 ప్రశ్నలకు పాఠంలో పూర్తిగా చూపించబడింది. పరీక్షలో పూర్తిగా వ్రాయవలసి ఉంటుంది.

**II** సంక్షిప్త జవాబులకు రాదగిన ప్రశ్నలు.

1). భాషోత్పత్తి పరిణామ క్రమాన్ని వివరించుము?

2) తెలుగు భాషా వర్ణమాలపై భిన్నాభిప్రాయాలను విపులీకరించుము?

3) తెలుగు భాషపై అన్యభాషల ప్రభావం ఉదాహరణలతో తెలుపుము?

4) భాషా నిర్మాణంలో వర్ణం, వర్ణమాల ప్రాధాన్యతను విశదీకరించుము?

**III. ఆధార గ్రంథాలు :**

1) తెలుగు వాక్యం - ఆచార్య చేకూరి రామారావు

2) ఆధునిక భాషా శాస్త్రం - ఆచార్య వెలమల సిమ్మన్న

3) ఆధునిక భాషా శాస్త్ర సిద్ధాంతాలు - ఆచార్య పి.యస్ సుబ్రహ్మణ్యం.

4) తెలుగు భాషా చరిత్ర - ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి (సంపాదకులు)

5) బాలవ్యాకరణం - పురవస్తు చిన్నయసూరి

6) ప్రౌఢవ్యాకరణం - బహుజనపల్లి సీతారామాచార్యులు

డా॥ దొప్పలపూడి సుజాత
తెలుగు అధ్యాపకురాలు,
ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల,
యర్రగొండపాలెం,
ప్రకాశంజిల్లా.

# పాఠం - 4

# సృజనాత్మక రచన

## కవితా రచన : ఉత్తమ కవిత - లక్షణాలు

**పాఠ్యాంశ నిర్మాణ క్రమం:**

4.1. సృజనాత్మక రచనల విశిష్టత

4.2. కవిత్వం – పాశ్చాత్యుల నిర్వచనాలు

4.3. ఉత్తమ కవిత్వ లక్షణాలు

4.4. కవిత్వం పరిణామ వికాసం

### 4.1 సృజనాత్మక రచనల విశిష్టత : -

'సృజనాత్మకత' అనే తెలుగు పదానికి 'creativity' అనే ఆంగ్లపదాన్ని సమానార్థంగా ప్రయోగిస్తారు."to cause to come into existence", "bring into existence" అని 'creat' అనే పదానికి ఆంగ్ల నిఘంటువుల్లో అర్థాలు ఉన్నాయి. 'creation' అనే ఆంగ్ల పదం 'సృజన, 'సృష్టి' అనే అర్థాలను స్ఫురింపజేస్తుంది..

తెలుగు నిఘంటువులు 'సృజన' శబ్దానికి కల్పన, ఉత్పత్తి, నిర్మాణం, సృష్టించు, సృష్టిచేయు, పుట్టించు, కలుగజేయు, కల్పించు మొదలైన అర్థాలను సూచిస్తున్నాయి. దీన్ని బట్టి 'సృజన' అంటే లోకంలో లేనిదాన్ని కొత్తగా సృష్టించడం అని అర్థం. అంతకు ముందు లోకంలో లేనిదాన్ని ఊహ ద్వారా గానీ, క్రియాత్మకంగా గాని నిర్మించడం సృజన అవుతుంది.

సృజనాత్మకత సామాజిక, రాజకీయ, ఆర్థిక, జీవశాస్త్ర, మనోవైజ్ఞానిక - ఇలా అన్ని రంగాలకు సంబంధించింది. ప్రతిరంగం సృజనాత్మక ఆలోచనల ద్వారానే నూతన సృష్టి జరిగి లేదా ఉన్న అంశంలో మార్పు వచ్చి అభివృద్ధి చెందింది. మానవ సమాజం ప్రధానంగా సృజనాత్మక ఆలోచనలపైనే ఆధారపడి వికాసం చెందింది.

సృజనాత్మకత ఇలా అన్ని రంగాలకు సంబంధించినది అయినా సాహిత్యంలో ఈ పదాన్ని విరివిగా వాడుతున్నారు. వ్యాకరణం, భాష, విమర్శ వంటి వాటిని తప్పించి మిగిలిన కవిత్వం, కథ, నవల, నాటకం వంటివన్నీ సృజనాత్మక ప్రక్రియలుగానే భావించవచ్చు. సృజనాత్మక రచనలలో కవిత్వం ప్రధానమైంది.

#### 4.1.1 కవిత్వం- కవి విశిష్టత:-

కవి శబ్దం ప్రధానంగా 'ఈశాన్యోపనిషత్తు లో కనిపిస్తుంది. కవి శబ్దం ఆ తరువాత 'ఋగ్వేదం' లో కనిపిస్తుంది. 'కమ్' అన్న ధాతువు నుండి కవి శబ్దం జనించినట్లు భావిస్తున్నారు. 'కమ్' అనే ధాతువుకు 'బ్రహ్మజ్ఞానం తెలిసినవాడు, పరమేశ్వర సాక్షాత్కారం పొందినవాడు" అని అర్థం పూర్వికులు కవిని పరమాత్మ స్వరూపునిగా, క్రాంతదర్శినిగా భావించారు. "కవిర్మనీషీ పరిభూ:

'ఈ విధంగా సంస్కృత అలంకారికులతో పాటు పాశ్చాత్య పండితులు కూడా కవిని ఉన్నత స్థానం ఇచ్చి గౌరవించారు.

**4.1.2 కవిత్వం - అలంకారికుల నిర్వచనాలు:-** కవిత్వం ద్వారా ఆనందం కలగడానికి కారణం శబ్దమని, రీతి అని, రసం అని, అలంకారాలు అని ఒక్కొక్క అలంకారికుడు ఒక్కో విధంగా చెప్పారు. కవిత్వాన్ని గురించి తెలిపే అలంకారశాస్త్ర గ్రంథాలన్నీ సంస్కృతంలోనే ఉన్నాయి. అలంకార శాస్త్రంలో ప్రసిద్ధులైన భరతుని మొదలు విశ్వనాథుని వరకు అలంకారికులందరూ కవిత్వం గురించి తెలియజేశారు.

తొలి అలంకారికుడైన భరతుడు తన నాట్యశాస్త్రం అనే గ్రంథంలో కావ్య శరీరం ఇతివృత్తమైనా, దాని సౌందర్య హేతువు రసమన్నాడు. కావ్యం మృదువైన పదాలతో ప్రసాద గుణ సహితంగా ఉండాలన్నాడు.

భామహుడు తన 'భామహాలంకారం'లో "శబ్దార్థసహితా కావ్యమ్" అన్నారు. హితంతో కూడిన శబ్దార్థాల సమూహమే కావ్యం అని అర్థం.

దండి 'కావ్య దర్శనం' లో "ఇష్టార్థ వ్యవచ్ఛిన్న పదావళి కావ్యమ్" అని కావ్యాన్ని నిర్వచించాడు. అంటే రమణీయమైన అర్థంతో కూడిన పదావళిని కావ్యమని చెప్పాడు. కావ్య శరీరానికి గుణాలు ప్రధానమని వివరించాడు. ఇతడు గుణ ప్రాధాన్యవాది.

వామనుడు "గుణాలంకారయుక్తార్థౌకావ్యమ్" అన్నాడు. సౌందర్యమే అలంకారమని చెప్పాడు. "రీతిరాత్మ కావ్యస్య" అని పేర్కొన్నాడు. అంటే కావ్యం అలంకారయుక్తంగా, గుణసహితంగా ఉండాలని, రీతిని కావ్యాత్మగా వివరించాడు.

ఆనందవర్ధనుడు రసానుభూతియే కావ్య పరమ లక్ష్యంగా పేర్కొన్నాడు. కావ్యానికి ధ్వని ఆత్మవంటిదని ఇతని అభిప్రాయం. ఆనందవర్ధనుడు తన పూర్వీకులైన అలంకారికుల సిద్ధాంతాలను సమన్వయించి అలంకార గుణ రీతులను తన ధ్వని సిద్ధాంతానికి అంశభూతాలుగా చెప్పాడు. భరతుని సిద్ధాంతాన్నే ' రసధ్వని' రూపంలో ప్రతిపాదించాడు. " సహృదయ హృదయాహ్లా శబ్దార్థ సహితమ్ కావ్యమ్" అని నిర్వచనం చెప్పి తరువాతి వారికి మార్గదర్శకుడయ్యాడు. కాని మహిమభట్టు అనే అలంకారికుడు ఆనందవర్ధనుడి ధ్వని సిద్ధాంతంలోని వ్యంజనావృత్తిని ఖండించాడు. రస ప్రాధాన్యాన్ని మాత్రం అంగీకరించాడు. 'శబ్దార్థోభయమే కావ్య శరీరమని' పేర్కొన్నాడు. స్వయం భూః" అని కవి శబ్దాన్ని పరమాత్మ అనే అర్థంలో వేద మంత్రాల్లో ప్రయోగించారు. ఉపనిషత్తుల తదనంతర కాలంలో కవిని పరమేశ్వర సాక్షాత్కారం పొందిన 'ఋషి' తో పోల్చారు. అందుకే మమ్మటుడు తన 'కావ్యప్రకాశం' లో "నా నృషిః కురుతే కావ్యమ్ ఋషిశ్చకిల దర్శనాత్" అని పేర్కొన్నాడు. ఋషి కాని వాడు కవి కాలేడు, కవి కానివాడు కావ్యం రాయలేడని దీని అర్థం.

రోమ్ దేశంలోని సాహితీవేత్తలు కూడా కవిని ఋషిగానే భావించారు. వారు కవిని 'వాటిస్ (vates)' అంటారు. వాటిస్ అంటే Fore-seen Prophet (ద్రష్ట) అని భావం

భారతీయ అలంకారికులు కవిని ఋషి కంటే గొప్పవానిగా భావించారు. ఋషి కేవలం దర్శన భాగ్యం కలిగి ఉంటాడు. కాని కవి దర్శనాశక్తితో పాటు వర్ణనాశక్తిని కూడా కలిగి ఉంటాడని వారు వివరించారు. కవి యొక్క దర్శన, వర్ణనాశక్తులను గూర్చి అభినవగుప్తుని గురువు భట్టతౌతుడు తన 'కవికౌతుకం' లో "దర్శనాత్ వర్ణనాశ్చాదా రూడాలోకే కవిశృతి:" అని పేర్కొన్నాడు. దర్శించిన దానిని వర్ణించేవాడు కవి, వర్ణించబడేది కావ్యం అని దీని భావం.

మరికొంతమంది అలంకారికులు కవిని సృష్టికర్త అయిన బ్రహ్మతో పోల్చారు. ఆనందవర్ధనుడు తన 'ధ్వన్యాలోకం' అన్న గ్రంథంలో

"అపారే కావ్య సంసారే కవిశేష ప్రజాపతిః
యథాస్మై రోచతే విశ్వంథేనం పరివర్తతే"

అని పేర్కొన్నాడు. అనంతమైన కావ్య ప్రపంచానికి కవియే బ్రహ్మ అతని ఇష్టానుసారమే కావ్య జగత్తు నిర్మితమవుతుందని దీని అర్థం.

గ్రీకులు కూడా కవిని సృష్టికర్తగానే భావించారు. వీరు కవిని "పొయిటిస్ ' (Poites) అన్నారు. 'పొయిటిస్' అంటే సృష్టికర్త అని అర్థం.

ప్రముఖ ఆంగ్ల కవి రస్కిన్ కవికి దర్శనం, ప్రకటనం, సృజనం, ఆలోచనం, విశ్వాసం అనే ఐదు శక్తులు సమ్మిళితంగా ఉండాలని చెప్పాడు. వీటిలో ప్రత్యేకంగా దర్శనాశక్తి, సృజన శక్తి బలంగా ఉండాలన్నాడు. కవికి గతంతో పాటు భవిష్యత్తును కూడా దర్శించగల నేర్పు ఉండాలన్నాడు. దీనినే భారత అలంకారికులు క్రాంత దర్శనం అన్నారు. ఇది ఋషులకు మాత్రమే సాధ్యం. కుంతకుడు "వక్రోక్తి కావ్య జీవితమ్" అని పేర్కొన్నాడు. వక్రోక్తి కావ్యం శోభించదన్నాడు. వట్టి శబ్ద చమత్కృతిని నిరసించాడు. వక్రోక్తిని నిర్వచిస్తూ విచిత్ర గుణాలు, అలంకారాలు కావ్యంలో వ్యక్తం కావాలని చెప్పాడు. వక్రోక్తి ఎన్ని రీతులుగా సాధ్యమో వివరించాడు.

క్షేమేంద్రుడు "ఔచిత్యం రససిద్ధస్య స్థిరం కావ్యస్య జీవితమ్" అని ఔచిత్యమే కావ్యాత్మగా సిద్ధాంతీకరించాడు. ఈ ఔచిత్యం పద, వాక్య, గుణ, అలంకార ఉపసర్గ, నిపాత, కాల దేశాదులను అనుసరించి ఉంటుందని చెప్పాడు.

మమ్మటుడు తన కావ్యప్రకాశంలో "తదదోషౌ శబ్దార్థౌ సుగుణావనం కృతిపునః క్వాపీ" అని పేర్కొన్నాడు. దోషరహితాలు గుణసహితాలైన శబ్దార్థాలు కావ్యమని చెప్పి, అలంకారాలు లేకపోయినా నష్టం లేదన్నాడు. కవిత్వం వ్యంగ్యం ప్రధానంగా ఉండాలన్నాడు.

విశ్వనాథుడు "వాక్యం రసాత్మకం కావ్యమ్" అంటూ కావ్యంలో రసం యొక్క ప్రాధాన్యం గురించి చెప్పాడు. అతని దృష్టిలో రసవత్తరమైన వాక్యం ఒక్కటైనా కావ్యమే.

జగన్నాథ పండితరాయలు "రమణీయార్థ ప్రతిపాదక శబ్దమ్ కావ్యమ్"-అని నిర్వచించాడు. రమణీయమైన శబ్దార్థాలతో కూడిందే కావ్యమని అర్థం.

పై అలంకారికుల అభిప్రాయాలను పరిశీలిస్తే అలంకారికులు అలంకారవాదులు, రసవాదులు అని రెండు తెగలుగా చెప్పుకోవచ్చు. కాని అలంకారవాదుల కంటే రసవాదుల సిద్ధాంతాలే సమర్థనీయంగా కనిపిస్తాయి. అలంకారవాదులు కావ్య శరీరాన్ని మాత్రమే చూడగలిగారు. కాని రసవాదులు కావ్యాత్మను దర్శించారు.

కావ్య నిర్వచనాలన్నింటిలో "కావ్యస్య ఆత్మ ధ్వనిః", "సహృదయ హృదయాహ్లాద శబ్దార్థమయత్వమేవ కావ్యత్యమ్' అనే నిర్వచనాలు శ్రేష్టమైనవిగా భావించవచ్చు. రస సిద్ధాంతం భరతుడు చెప్పినా దానికి ఆనందవర్ధనుడు అందరికీ ఆమోదయోగ్యమైన రూపాన్ని ఇచ్చాడు.

వ్యంగార్థ స్ఫురణ వలన కలిగే ఆనందానుభూతి ఒక్కటే కావ్య ప్రయోజనం. ఆ ఆనందం ప్రత్యేకమైంది. ఆ ఆనందం మనసు లోపలే కాక శరీరమంతా వ్యాపిస్తుంది. పరవశం చేస్తుంది. అటువంటి కవిత్వమే ఉత్తమోత్తమ కవిత్వమని, స్థూలంగా భారతీయ అలంకారికుల అభిప్రాయం.

### 4.2 కవిత్వం :- పాశ్చాత్యుల నిర్వచనాలు:-

పాశ్చాత్య విమర్శకులు సంస్కృత అలంకారికుల మాదిరిగా కావ్యశరీరాన్ని, కావ్యాత్మను విడివిడిగా నిర్వచించలేదు. కవిత్వాన్ని గురించి మొట్టమొదట నిర్వచించిన పాశ్చాత్య విడివిడిగా సాహితీవేత్త అరిస్టాటిల్ ఆయన కవిత్వం కళలన్నీ ప్రకృతి అనుకరణాలనీ అనుకరణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.

పాశ్చాత్య విమర్శకుల్లో ఎక్కువ మంది అనుభూతి, ఆవేశం అనే వానిని ఆధారం చేసుకొని కవిత్వ స్వరూప స్వభావాలను తెలియజేశారు. వర్డ్స్‌వర్త్ Poetry is the overflow of the powerful feelings" తీవ్ర అనుభూతుల స్వచ్ఛంద విజృంభణమే కవిత్వమన్నాడు.

జె.యస్. మిల్ "But the thoughts and words in which emotion Spontaneously embodied itself " - ఆవేశం స్వచ్ఛందంగా శబ్దార్థాలుగా, రూపొందుటే కవిత్వమన్నాడు.

జాన్‌రస్కిన్ "The suggestion by the imagination of noble grounds for noble emotions" - ఊహ ద్వారా ఉదాత్తావేశాలకు ఉత్తమ ఆలంబనం కల్పించేది కవిత్వమన్నాడు.

పైన పేర్కొన్న నిర్వచనాలన్ని ఆవేశం, అనుభూతి ఆధారంగా కవిత్వ స్వరూపాన్ని తెలియజేశాయి. ఊహాశక్తి ఆధారంగా కవిత్వ స్వరూపాన్ని నిర్వచించిన వారిలో షెల్లీ ముఖ్యుడు.

"In a general sense may be defined as the expression of the imagination" ఊహాశక్తి ప్రకటనమే కవిత్వమని షెల్లీ చెప్పాడు.

షెల్లీ చెప్పిన విధంగానే హాడ్లిన్ " The language of imagination" - ఊహాశక్తి ప్రకటనమే కవిత్వమని నిర్వచించాడు.

లయను దృష్టిలో పెట్టుకొని కార్లయిల్ " Poet?ry we will call musical thought" - సంగీతాత్మకమైన ఆలోచనయే కవిత్వమన్నాడు.

E.A. పో కార్లయిల్ అభిప్రాయంతో ఏకీభవిస్తూ "the rhythmic creation of beauty" - లయబద్ధమైన సౌందర్య సృష్టి కవిత్వమని నిర్వచించాడు.

మాథ్యూ ఆర్నాల్డ్ అనే సాహితీవేత్త వ్యక్తీకరణను దృష్టిలో ఉంచుకొని " The most delightful and perfect form of utterance that human words canreach" శబ్ద సంపద అందుకోగల సంపూర్ణమైన, ఆనందప్రదమైన స్వరూపమే కవిత్వమని నిర్వచించాడు.

కాల్‌రిడ్జ్ మాత్రం కవిత్వ ప్రయోజనాన్ని మనసులో ఉంచుకొని కవిత్వాన్ని నిర్వచించాడు. "Poetry is the antithesis of science having for its immediate object pleasure but not truth" - కవిత్వం విజ్ఞాన శాస్త్రానికి విరుద్ధమయింది. దాని ప్రయోజనం ఆనందం తప్ప సత్యం కాదని చెప్పాడు.

శామ్యూల్ జాన్సన్ "Poetry is metrical composition" ఛందోబద్ధమైన రచన కవిత్వం అని నిర్వచించాడు. కాని తరువాత వారు ఛందోబద్ధమైనదే కవిత్వమనడాన్ని ఖండించారు.

ఈ విధంగా పాశ్చాత్యులు అనుభూతి, ఆవేశం ఊహా, లయ, వ్యక్తీకరణ, ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కవిత్వాన్ని నిర్వచించారు.

**కవిత్వం - ఆధునిక కవుల అభిప్రాయాలు :-**

ప్రాచీన సంప్రదాయం ఛందోబద్ధ కవిత్వానికి భిన్నంగా పాశ్చాత్యదేశాల్లో ఆధునిక ధోరణులైన కాల్పనిక వాదం, మానవతావాదం వంటి కళాసిద్ధాంతాలు తెలుగు కవులను ఆకర్షించాయి. తత్ఫలితంగా ఆధునిక కవిత్వం ఆవిర్భవించింది. ఆధునిక కాలంలో కవితా లక్షణాలు మారాయి. ఈ కాలంలో సాహిత్యంలో వచ్చిన జాతీయోద్యమ కవిత్వం, భావకవితా ఉద్యమం, అభ్యుదయ కవితా ఉద్యమం, దిగంబర కవితా ఉద్యమం, విప్లవ కవితా ఉద్యమాలు తెలుగు సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి. గేయ కవిత్వం, వచన కవిత్వం, పాటలు, సాహిత్యంలో మొదలయ్యాయి. స్త్రీవాదం, దళితవాదం, మైనారిటి వాదం మొదలైన అస్తిత్వవాద కవిత్వాలు కూడా ఈ కాలంలో వచ్చాయి. కవిత్వంలో సామాజిక ప్రయోజనం ఉండాలనే వాదం ప్రబలింది. అందువలన ఆధునిక కవులు కవిత్వం గురించి వ్యక్తంజేసిన అభిప్రాయాలు ప్రాచీన అలంకారికుల అభిప్రాయాలకు చాలావరకు భిన్నంగా ఉన్నాయి.

ప్రముఖ కవి మరియు ఆధునిక కవిత విమర్శకు నవ్యమార్గ ప్రవక్తగా కీర్తిగాంచిన కట్టమంచి రామలింగారెడ్డి “భావోద్రేకమే కవిత్వానికి ప్రాణం” అన్నారు. ఇది ఆంగ్ల విమర్శకుడు వర్డ్స్‌వర్త్ చెప్పిన భావానుసరణమే.

శ్రీశ్రీ అభ్యుదయ కవిగా ‘కార్మిక లోకపు కళ్యాణానికి శ్రామిక లోకపు సౌభాగ్యానికి కవిత్వం రాస్తానని’ ప్రతిజ్ఞ చేశారు. “కష్టజీవికి ఇరువైపుల ఉన్నవాడే కవి” అని చెప్పి ఆధునిక కాలంలో కవుల బాధ్యతను తెలియపరచారు.

“కదిలేదీ కదిలించేదీ
మారేదీ మార్పించేదీ
పాడేదీ పాడించేదీ
పెను నిద్దర వదిలించేదీ
మునుముందుకు సాగించేది
పరిపూర్ణపు బ్రదుకిచ్చేదీ”

కవిత్వమంటూ కవితా స్వరూపాన్ని నిర్వచించాడు. మనిషిని చైతన్య వంతం చేసి ముందుకు నడిపించేది కవిత్వమని శ్రీశ్రీ భావన.

దేవరకొండ బాలగంగాధర తిలక్
“కవిత్వం’ అంతరాంతర జ్యోతి స్సీమలను బహిర్గతం చేయాలి
విస్తరించాలి చైతన్య పరిధి
అగ్ని చల్లినా అమృతం కురిసినా
అందం ఆనందం దాని పరమావధి కావాలి” అని కవిత్వాన్ని వివేచించాడు.

డా॥ సి. నారాయణ రెడ్డి (సి.నా.రె) “కప్పి చెప్పేదే కవిత్వం” అంటారు. కవిత్వం ఆలోచనాత్మకంగా ఉండాలన్న భావనతో గురజాడ చెప్పిన ‘ ఆకులందున అణిగి మణిగి కవిత కోయిల పలుకవలె” అన్న భావానికి దగ్గరగా సి.నా.రె. అభిప్రాయం ఉంది.

ఈ విధంగా ఆధునిక కవులు తెలుగు కవిత్వాన్ని గురించి తమ అభిప్రాయాలను తెలియజేశారు.

## 4.3. ఉత్తమ కవిత్వ లక్షణాలు:-

'ప్రతిభ - వ్యుత్పన్నత- అభ్యాసం' అనేవి కవిత్వ హేతువులు. ఈ మూడు పుష్కలంగా ఉన్న కవి ఉత్తమ కవిత్వం రాస్తాడు. భామహుడు, దండి, రుద్రటుడు, మమ్మటుడు, రాజశేఖరుడు, అభినవ గుప్తుడు జగన్నాథ పండితరాయలు, వామనుడు వంటి లాక్షణికులంతా కావ్య హేతువులను వివరించారు. వీరిలో రాజశేఖరుడు, అభినవగుప్తుడు, జగన్నాథ పండితరాయలు ప్రతిభకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు.

**ప్రతిభ:**

ప్రతిభ జనతః సంక్రమించే లక్షణం. ఈ ప్రతిభ వల్లనే క్రాంత దర్శనం కలుగుతుంది. అందరినీ రంజింపజేయగల కవిత్వం ప్రతిభ వల్లనే సాధ్యమవుతుంది.

**వ్యుత్పన్నత :**

అనేక శాస్త్ర గ్రంథాలు, కావ్యాలు పఠించి సాధించే పరిజ్ఞానాన్ని వ్యుత్పత్తి అంటారు. కవికి లోకజ్ఞతతో కూడిన వ్యుత్పత్తి అవసరం.

**అభ్యాసం :-**

కవితా సాధనకు నిరంతరం చేసే కృషిని అభ్యాసం అంటారు. ' అభ్యాసము కూసు విద్య' అనేది సామెత.

పై మూడింటిలో ప్రతిభ ప్రధానమైనదని ఆధునికులు కూడా ప్రశంసించారు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రామాయణ కల్పవృక్షంలో

"కవి ప్రతిభలోన నుండు కావ్యగత
శతాంశములయందు తొంబదియైదు పాళ్ళు"

అంటూ ప్రతిభ గొప్పతనాన్ని వివరించాడు. ఈ మూడు కావ్యహేతువులు సమపాళ్ళలో ఉన్నప్పుడే ఉత్తమ కవిత్వం ఉద్భవిస్తుంది.

పాశ్చాత్య విమర్శకుల్లో 'విన్ చెస్టే' కావ్య హేతువులను నాల్గింటిని పేర్కొన్నాడు.

అవి :

1. భావావేశం (Emotion)
2. భావన (Imagination)
3. ఆలోచన (Thought?)
4. ఆకృతి (Form).

భావావేశ భావనలు సదాలోచనతో సరైన ఆకారాన్ని సంతరించుకున్నప్పుడే ఉత్తమ కవిత్వం వస్తుందని 'విన్ చెస్టే' అభిప్రాయం.

ఆరుద్ర " మంచి కవిత్వం చదివితే సుష్టుగా భోంచేసినట్లుండాలి. కాస్తంత నిద్రవచ్చినట్లుండాలి. కాస్తంత నిద్రవచ్చినట్లుండాలి. కారాకిల్లీ నమిలినట్లు ఘాటుగా ఉండాలి' అంటూ పాఠకునికి గొప్ప అనుభూతినిచ్చేది ఉత్తమ కవిత్వమని చెప్పాడు.

కరుణశ్రీ ఉత్తమ కవిత్వం ఎలా ఉండాలో క్రింది పద్యంలో మధురమైన పదాలతో వర్ణించాడు.

"కలువలు పూచినట్లు - చిరుగాలులు చల్లగ వీచినట్లు
తీవలే తలలూచినట్లు - పసిపాపలు చేతులు సాచినట్లు
క్రొవ్వలపులు లేచినట్లు - చెలువలు చెలువంబుగ చూచినట్లు
అవ్వలు పైన వైచినట్లు - కవితల్ రచియింతురు మహాకవుల్"

సముచితమైన వర్ణనలతో, ఔచిత్యం కలిగిన పదాలతో సహృదయులైన పాఠకులకు గొప్ప అనుభూతిని కలిగించేది ఉత్తమ కవిత్వం. ఆధునిక విమర్శకులు సామాజిక ప్రయోజనం ఉన్నదే ఉత్తమ కవిత్వమని చెబుతున్నారు. సామాజిక రుగ్మతలను ఎత్తి చూపి రూపుమాపేదేఉత్తమ కవిత్వమని గురజాడ నిరూపించాడు. శ్రీశ్రీ. సి.నా.రె. ఆరుద్ర, దాశరథి, సోమసుందర్ వంటి ఎందరో మహాకవులు తమ కవిత్వం ద్వారా పాఠకులను జాగృతం చేశారు.

ప్రాచీన కవులలో నన్నయాదికవులు ఉత్తమ కవిత్వం రాసి మహా కవులు అనిపించుకున్నారు. కవిత్రయం, శ్రీనాథుడు, పోతన, తిమ్మన, పెద్దన, రామరాజ భూషణుడు, చేమకూర వేంకట కవి, ఆధునిక కవుల్లో విశ్వనాథ, జాషువా, తుమ్మల వంటి కవులు ఉత్తమ కవిత్వం రాశారు.

ఆధునిక కవులు ఔచిత్యంగా ప్రయోగించే పద చిత్రాలు ఉత్తమ కవితా స్ఫోరకాలు అని చెప్పవచ్చు.ఛందో అలంకారిక ప్రయోగాన్ని ఆధునిక కవులు అంగీకరించలేదు. ఉత్తమ కవిత్వం క్లుప్తంగా, గుప్తంగా ఉండాలని ఆధునికుల అభిప్రాయం.

## 4.4. తెలుగు కవిత్వం - పరిణామ వికాసం :-

ప్రాచీన తెలుగు సాహిత్యంలో పద్యం ప్రముఖ స్థానం వహించింది. నన్నయ మొదలుకొని దాదాపు 19వ శతాబ్ది వరకు పద్యమే రాజ్యమేలింది. కాని ఆధునిక కాలంలో పద్య కవిత్వం కొంత వెనుకబడింది. విశ్వనాథ, జాషువా, తుమ్మల సీతారామ్మూర్తి మొదలైన కవులు పద్య కవిత్వం రాసినా తెలుగు సాహిత్యంలో క్రొత్త ప్రక్రియలు రావడంతో పద్య కవిత్వంపై ప్రజలకు ఆదరణ తగ్గింది.

పద్యం కంటే ముందు పుట్టిన పాట పండితులు ఆదరణకి నోచుకోక జానపద సాహిత్యంగానే అజ్ఞాతంగా ఉండిపోయింది. కాని ఆధునిక కాలంలో జానపద సాహిత్యంతో పాటు దానిలో భాగమైన పాట పండితులతో పాటు పామరులకు కూడా అభిమాన పాత్రమై అలరారుతున్నది. ఆధునిక కవిత్వంలో పాటకి విశిష్ట స్థానం ఉంది. ఆధునిక యుగంలో పాట ఒక చారిత్రక బాధ్యతని సామాజ బాధ్యతని తనపై వేసుకొని కొత్త రక్తంతో జవజీవాల నింపుకొని ప్రవహిస్తుంది. పాటని పూర్వం వినోద రూపంగా పరిగణించడం ఎక్కువ. ఆధునికయుగంలో పాట ఒక బలమైన చైతన్య శక్తి. ఒక ఉద్యమరూపం. లయ, శ్రావ్యత, పాడేవీలు, కంఠస్థం అయ్యే గుణం, తన్మయత్వం, మమేకం చెందటం ప్రదర్శించే గుణం అనే లక్షణాలు మరింత పెంపొందించుకొని పాట బహుముఖంగా విస్తరిస్తోంది. పాట ప్రజలది ప్రజాకవిత పాట మాత్రమే. అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యేది పాట మాత్రమే.

"ఈ ఊరు మనదిరా, ఈ వాడ మనదిరా
పల్లెమనదిరా, ప్రతి పనికి మనంరా
సుత్తెమనది, కత్తిమనది.

పలుగు మనది, పారమనది

బండిమనదిరా, బండెడ్లు మనయిరా దొర ఎందుకురో దొరతనమెందుకురో......"

అంటూ బండి యాదగిరి పాడిన పాట యావత్తు తెలంగాణా ప్రజానికాన్ని నిజాంకు వ్యతిరేకంగా పోరాటానికి సమాయత్తం చేసింది.

పద్య కవిత్వం తరువాత తెలుగు సాహిత్యం వచన కవిత్వానికి తలుపులు తెరచి ఆదరించింది. వచన కవిత్వ ప్రక్రియని అభ్యుదయవాదులు తీసుకొచ్చారు. ఇది పద్యకవిత్వానికి వ్యతిరేకంగా వచ్చిన ప్రక్రియ ఆధునిక భావాలకు పద్యం పనికిరాదనీ, ప్రజలకి పద్యకవిత్వం చేరువ కాలేదనీ వీళ్ళు భావించారు. పఠాబి, బాలగంగాధర తిలక్, కుందుర్తి, ఆరుద్ర వంటి మహాకవులు వచన కవిత్వంలో నుంచి రచనలు చేశారు. ఇప్పటికీ వచన కవిత్వంలో పుంఖానుపుంఖాలుగా రచనలు వస్తూనే ఉన్నాయి. ఈనాడు కవిత్వం అంటే ' వచన కవిత్వం' గా స్థిరపడిపోయింది. అభ్యుదయ, దిగంబర, విప్లవ, స్త్రీవాద, దళితవాద ఉద్యమాలకు వచన కవిత్వం ప్రధాన వాహిక అయింది. అందుకే చాలా మంది వచన కవిత్వం 'ప్రజాస్వామ్యయుగ కవితా వాహిక' అన్నారు.

"నా ఉద్యమం ఒక మహాయుద్ధానికి నాంది

కర్త, కటారీ, వేషమూ, ద్వేషమూ లేంది

నా ఉద్యమం యిప్పుడే తొడిగిన మొగ్గ

అది విచ్చుకొని నలుదిక్కులా పరిమళం వెదజల్లుతుంది"

అని కుందుర్తి అన్నట్టు వచన కవిత్వం ఒక ఉద్యమంలా నల్దిక్కులా వ్యాపించింది, వ్యాపిస్తోంది.

వచన కవిత్వం తరువాత మినీ కవిత తెలుగులో ఆవిర్భవించింది మినీ కవిత ఆయుస్సు మెరుపంత అయినా అది కాలమంతా ప్రసరిస్తుందని నారాయణరెడ్డిగారు అభినందించారు. "మినీ కవిత" అనే వ్యాససంపుటకి అద్దేపల్లి రామమోహనరావు ఈ విధంగా వివరించారు. మినీ కవితకి ఉచ్ఛ్వాసం క్లుప్తత నిశ్వాసం ధ్వని వచన కవిత క్లుప్తతని మరిచిపోయి, కేవలం వచనానికి దగ్గరైపోతున్న స్థితిలో లేదా క్లుప్తత చేతగాని కవి చేతుల్లో అస్పష్టతకి బలైపోతున్న స్థితిలో ప్రతిబింబమైన 'మినీకవిత' కవితా మాంత్రికుడికి 'చలి వేంద్రం' అయింది. లోక్నాయక్ జయప్రకాశ్ నారాయణ్ మరణించినప్పుడు ఆయన ఆదర్శజీవితాన్ని వర్ణిస్తూ కాళోజీ రాసిన అద్భుతమైన మినీకవిత ఇది

"పుటుక నీది

చావు నీది

బతుకంతా

దేశానిది"

అలిశెట్టి ప్రభాకర్ వేశ్యను గూర్చి చెప్పిన మినీ కవిత బిగువైన శైలితో వేదనాత్మకంగా ఉంటుంది.

"తను శవమై

ఒకరికి వశమై

తనువు పుండై

ఒకరికి పండై

ఎప్పుడూ ఎడారై
 ఎందరికో ఒయాసిస్సై”

మినీ కవిత కంటే కష్టమైనవి, శక్తివంతమైనవి అయిన హైకూలు, నానీలు అనే క్రొత్త ప్రక్రియలు సాహిత్యరంగంలో ప్రవేశించాయి. అతి సూక్ష్మమైన, సున్నితమైన భావాన్ని అతి తక్కువ పదాలతో వెల్లడించడమే వీటి ప్రధాన ప్రయోజనం ఇవి వెనుకటి వేమన ఆటవెలదులవలె ఔషధ గుళికలుగానూ, రసగుళికలుగానూ సాహిత్య సమాజానికి ఉపయోగపడతాయి. ఇందులో చెప్పనదానికంటే ఊహించవలసింది ఎక్కువ.

జపాన్ భాషలోని హైకూల ప్రభావంతో తెలుగులో ఇస్మాయిల్, గాలి నాసరరెడ్డి, పెన్నా శివరామకృష్ణ తదితర కవులు హైకూలు రచించారు. “నీటిలోకి రాయి విసిరినప్పుడు ఒక దానిపై మరొకటి వృత్తాలు వ్యాపించినట్లు, ఒక్కొక్క హైకూ పాఠకునిలో వివిధ ఆలోచనా తరంగాలను సృష్టిస్తుంది” అని ఇస్మాయిల్ హైకూ గురించి పేర్కొన్నారు.

“పచ్చిక మొలిచింది
బాటను కప్పేసింది మళ్లీ
ఎన్ని వందల కాళ్లవసరమో!”

అదృశ్యమైన ఒక బాటను స్మరించుకుంటూ, ఇస్మాయిల్ రాసిన హైకూ ఇది.

‘నానీలు’ అంటే.... ‘నావీ, నీవీ, మనందరివీ’ అని అర్థం చెబుతారు. ఈ ప్రక్రియను ఆచార్య ఎన్. గోపి గారు ప్రచారంలోకి తెచ్చారు. ఇందులో నాలుగు పాదాలుంటాయి. ఒక పాదానికి ఇన్ని అక్షరాలు అనే నియమం లేకుండా ఒక నానీకి మొత్తం 20 నుండి 25 వరకు అక్షరాలుండవచ్చు. ‘ హైకూను కాస్త సాగతీస్తే నానీ” అని చెబుతారు.

కరోనా కల్లోల కాలంలో ప్రజలకు హితబోధ చేస్తూ నాగభైరవ ఆదినారాయణ రాసిన నానీ ఇది.

“ప్రపంచం తరువుకు
 కరోనా శిశిరం
 వాసంతం కోసం
 ఏకాంత వాసం”

ఉర్దూ భాషా ప్రభావంతో తెలుగులో రుబాయి, గజల్ అనే ప్రక్రియలు వచ్చాయి. దాశరథి, సి. నారాయణరెడ్డి వంటి ప్రముఖులు ఈ ప్రక్రియల్లో రచనలు చేసి, వాటి అభివృద్ధికి దోహదం చేశారు.

“నవబాష్పధారలో నవ్వుకాగలవు
 ముళ్ళ తీగలలోన పువ్వు కాగలవు
యత్నించి చూడమని అంటాను నేను
రాళ్ళు రాసులలోని రవ్వ కాగలవు”

ప్రయత్నిస్తే సాధించలేనిది లేదని, వేదనల నుండి, విపత్తుల నుండి ప్రయత్నంతో బయటపడి మంచి

రత్నంగా మారవచ్చని దాశరథి ఈ రుబాయి ద్వారా ప్రబోధించారు.

"దృష్టిని బట్టే కనిపిస్తుంది సృష్టని విన్నాను
నువ్వది వాదం అన్నావు నేనది వేదం అన్నాను
సంతనుడుమ ఒక జోలెపట్టి పసిగొంతు మోగుతుంటే
నువ్వది గేయం అన్నావు, నేనది గాయం అన్నాను"

అంటూ రెంటాల శ్రీ వేంకటేశ్వరరావు రాసిన గజల్ చక్కని భావంతో చిక్కని లయతో సాగుతుంది. ఇప్పుడు కిరణాలు, రెక్కలు అనే పేర్లతో కొన్ని లఘుకవితా ప్రక్రియలు తెలుగు సాహిత్యంలో ఉద్భవించాయి. కాలానుగుణంగా కవిత్వపు భాషలో, భావ ప్రకటనలో, ప్రక్రియల్లో, ఆలోచనల్లో మార్పులు వచ్చినా పాఠకులకు ఆనందాన్ని కలిగిస్తూ, ఆలోచనలను రేకెత్తిస్తూ జాగృతం చేస్తూ కవిత్వం ఉత్తమంగా సాగిపోతూనే ఉంది.

**I.** సంక్షిప్త సమాధాన ప్రశ్నలు.

1. సృజనాత్మక రచనల విశిష్టతను వివరించండి.
2. కవి విశిష్టతను తెలపండి.

**II.** వ్యాసరూప ప్రశ్నలు

1. కవిత్వాన్ని గురించి అలంకారికుల నిర్వచనాలను వివరించండి.
2. పాశ్చాత్య విమర్శకులు కవిత్వం స్వరూపాన్ని వివరించిన తీరును తెలియజేయండి.
3. ఉత్తమ కవిత్వ లక్షణాలను వివరించండి.
4. కవిత్వాన్ని గురించి ఆధునిక కవుల అభిప్రాయాలు తెలియచేయండి.
5. తెలుగు కవిత్వ తీరు తెన్నులను సంగ్రహంగా సమీక్షించండి.

**II ఆధార గ్రంథాలు**


1. ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయములు - ప్రయోగములు
   - డా. సి. నారాయణరెడ్డి
2. తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు - ఆచార్య వెలమల సిమ్మన్న



**డా॥ టి. ఓగేశ్వరరావు**
తెలుగు అధ్యాపకులు
వి.వి.గిరి. ప్రభుత్వ డిగ్రీకళాశాల,
దుంపలగూడెం, ప.గొ. జిల్లా.

## పాఠం - 5

## కథానిక రచన : ఉత్తమ కథానిక - లక్షణాలు

పాఠ్యాంశ నిర్మాణ క్రమం :

5.1 కథానిక పరిచయం

5.2. కథానిక నిర్వచనాలు

5.3. తెలుగు కథానిక ప్రారంభం

5.4. తెలుగు కథానిక పరిణామం

5.5. కథాంగాలు

5.6. ఉత్తమ కథానిక లక్షణాలు

### 5.1 కథానిక పరిచయం :

కథానిక అనేది ఆధునిక సాహిత్య ప్రక్రియ. ప్రపంచ భాషా సాహిత్యంలో ఆధునిక కాలంలో ఆధునిక సమాజ అవసరాల కోసం పుట్టిన సాహిత్య ప్రక్రియ కథానిక. ప్రపంచంలోని అన్ని భాషలలోనూ ఎంతో ప్రాచీన కథా వాఙ్మయం ఉంది. అరేబియన్ నైట్స్ కథలు, ఈసఫ్ నీతి కథలు, చార్ దర్వేష్ కథలు, బృహత్కథ, కథాసరిత్సాగరం, జాతక కథలు వంటివి అనేకం ఉన్నాయి. మన ఇతిహాసాలలో కొన్ని వందల ఉపన్యాసాలు ఉన్నాయి. కథాకావ్యాలు. భారతీయ సాహిత్యంలో అసంఖ్యాకంగా ఉన్నాయి. ప్రపంచంలోని ప్రతి భాషలోనూ జానపద వాఙ్మయం అపారంగా ఉంది. కాని ఇదేది నేటి కథానికకు మూలం కాదు. ఈ రోజు మనం కథానిక అంటున్నది పారిశ్రామిక విప్లవం తరువాత మధ్య తరగతి ప్రజలు తమకోసం సృష్టించుకొన్న సాహిత్య ప్రక్రియ. “పారిశ్రామిక నాగరికత ప్రపంచానికిచ్చిన మహత్తరమైన కానుక కథానిక” అన్నారు వల్లంపాటి వెంకట సుబ్బయ్యగారు. భారతీయ భాషలలోకి ఈ కథానిక ప్రక్రియ వలస పాలన, వలస విద్య ద్వారా ఆంగ్ల సాహిత్య పరిచయంతో ప్రవేశించింది.

ప్రారంభంలో ఆంగ్లంలోని Short story అనే మాటకు తెలుగులో చిన్న కథ అని పిలవగా 1936లో ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారు అగ్నిపురాణంలోని కథానిక అన్న మాటను Short storyకి పర్యాయపదంగా ఉపయోగించారు. ఆనాటి నుండి కథానిక అనే పదం Short storyకి పర్యాయపదంగా తెలుగు సాహిత్యంలో స్థిరపడి పోయింది.

### 5.2. కథానిక నిర్వచనాలు

ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగు సాహిత్యంలోకి వచ్చిన అనేక ప్రక్రియల్లో కథానిక ముఖ్యమైంది. ఈ కథానికను తెలుగు సాహిత్యంలో కథారచయితలైన వారెందరో నిర్వచించారు. “కథానిక ఒక మెరుపులాంటిది. దానిలో వేగం ప్రధానం. వైచిత్రి కథానికకు ప్రాణం. కథానికకు ప్లాట్ అనేది అవసరమని నా అభిప్రాయం. శిల్పం మీద దృష్టి కేంద్రీకరించి రాయకపోతే కళ్లెంలేని గుర్రంలా తిరిగితిరిగి దిక్కులేని ప్రదేశానికి చేరుకుంటుంది”

- పాలగుమ్మి పద్మరాజు

"కథలు కల్పించడానికి గొప్ప ప్రతిభ ఉండాలి. వాటి విలువ తెలుసుకోవడానికి ఎంతో పరిజ్ఞానం కావాలి. అది చెప్పడానికి ఎంతో నేర్పుండాలి. అవి వినడానికి ఎంతో రుచి ఉండాలి. అది బోధపడటానికి ఎంతో బుద్ధి సూక్ష్మత ఉండాలి. కథలు కళ్లకు వెలుగిస్తాయి. బుద్ధికి పదును పెడతాయి. మనసుకు ఉత్సాహం, ఉల్లాసం కలిగిస్తాయి"

– శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

"కథకి గొప్పతనం పట్టాలంటే కథ చిత్రించే జీవితం భూమి నుండి పైకి లేవాలి" – చలం

"కథను ఏ రూపంలో రాసిన కథ ద్వారా పాఠకులకు ఒక సంస్కారాన్ని, ఒక కొత్త దృష్టినీ కల్గించడం ముఖ్యం" – త్రిపురనేని గోపీచంద్

"సహజం అనిపించే అసహజం కథ" – **మల్లాది రామకృష్ణశాస్త్రి**

"ఏకాంశ వ్యగ్రమై స్వయం సమగ్రమైన వచన ప్రక్రియ కథానిక" – పోరంకి దక్షిణామూర్తి

"ఒక అవస్థనిగానీ, ఒక అనుభవాన్ని గానీ, ఒక వైచిత్ర్యాన్ని గానీ, ఒక మనస్తత్వాన్నిగానీ చిత్రించేది కథానిక"

**–హితశ్రీ**

"మనిషి జీవితంలో, జీవిత రహస్యంతో, జీవిత వైచిత్రితో కథ కొంత కొత్త పరిచయం కలగజేయాలి. కథ చెప్పే విధానమే కథకి అందాన్నీ, బలాన్నీ ఇస్తుంది".

**– దేవరకొండ బాలగంగాధర తిలక్**

"కథ రాయాలనే ఆర్తికి ఎలా రాయాలి? ఎందుకోసం రాయాలి? అనే ఆలోచనవుంటే ఆసక్తి కలిగించే మంచి కథ రాయడం సాధ్యమవుతుంది"

–కేతు విశ్వనాథరెడ్డి

ఈ విధంగా రచయితలు కథానిక స్వరూప స్వభావాల గురించి నిర్వచిస్తూ తమ అభిప్రాయాలు తెలియజేశారు.

## 5.3 తెలుగు కథానిక ప్రారంభం :

ప్రకృతిలో ఏదీ హఠాత్తుగా ఉద్భవించదు. సాహిత్యంలో కూడా అంతే. 20వ శతాబ్దిలో తెలుగు కథానిక పుట్టడానికి ముందు 19వ శతాబ్దిలో భాషలోనూ, సమాజంలోనూ అనేక మార్పులు వచ్చాయి. పద్యరూపంలో ఉన్న తెలుగు సాహిత్యం వచన రూపంలోకి మారడానికి చాలా సంఘర్షణ పడింది. 1819 నాటి రావిపాటి గురుమూర్తి శాస్త్రి 'విక్రమార్క కథలు' మొదలు 1909 నాటి పనప్పాకం శ్రీనివాసాచార్యులు 'భోజసుతా పరిణయం' దాకా ప్రాచీన కథా వాఙ్మయం అనువాదం, అనుకరణ, అనుసరణల రూపంలో వచనంలోకి మారుతూ వచ్చింది.

ఆంగ్లేయులు భారత దేశంలో స్థిరపడిన తరువాత వారు తమ పాలనలో భాగంగా తెలుగు నేర్చుకోవలసిన అవసరం ఏర్పడింది. పోర్ట్ సెయింట్ జార్జి కళాశాలలో ప్రధాన ఆంధ్రోపన్యాసకులైన రావిపాటి గురుమూర్తి శాస్త్రిగారు 1819లో విక్రమార్క కథలు రాశారు. 1834లో పంచతంత్ర కథలు రాశాలు. 1840లో పాటూరి రామిస్వామి శాస్త్రి శుకసప్తతి కథలను, 1842లో ధూర్జటి లక్ష్మీపతి హంసవింశతి కథలను వచనంలో రాశారు. అలా మొదలైన తెలుగు వాఙ్మయం 20వ శతాబ్దిలో మౌలికతను పొంది వర్తమాన జీవితాన్ని వస్తువుగా చేసుకొంది.

20వ శతాబ్ది ప్రారంభం నుండే ఆధునిక తెలుగు కథానిక రూపుదిద్దుకోసాగింది. 1921నాటి పానుగంటి 'కానుగచెట్టు' పాత కథలకు భరతవాక్యమైతే 1910 నాటి గురజాడ 'దిద్దుబాటు' కొత్త కథలకు నాంది వాక్యమని మదురాంతకం రాజారాంగారు పేర్కొన్నారు.

తెలుగులో తొలి కథానిక ఏది? అనే అంశంపై కొంత వివాదం ఉంది. మొన్నటి వరకు చాలా మంది సాహిత్యవేత్తలు గురజాడ రచించిన దిద్దుబాటు (1910) ను తొలి కథానికగా భావించారు. కాని ఇటీవల కాలంలో కొందరు సాహితీవేత్తలు 1902వ సం॥లో బండారు అచ్చమాంబగారు రచించిన 'స్త్రీవిద్య', ధన త్రయోదశి'లను కథానికలుగానే భావించాలని చెప్తూ తెలుగులో, తొలి కథానికా రచయితగా ఆమెను ముందుకు తీసుకువచ్చారు. ఏది ఏమైనా తెలుగు కథానిక 20వ శతాబ్ది ప్రారంభంలోనే ఉద్భవించిందని ఖచ్చితంగా చెప్పవచ్చు.

## 5.4 తెలుగు కథానిక పరిణామం :

20వ శతాబ్దంలో వచ్చిన అన్ని సామాజిక ఉద్యమాలకు స్పందించి రచయితలు కథానిక వికాసానికి దోహదపడ్డారు. తొలి కథానిక రచయిత్రి బండారు అచ్చమాంబ స్త్రీవిద్య, ధనత్రయోదశి వంటి కథలు సంస్కరణాభిలాషతో రాశారు. గురజాత రాసిన కథానికలు కూడా సంస్కరణాభిలాషతో రాసినవే. గురజాడ తన 'దిద్దుబాటు' కథలో విద్యావంతురాలైన భార్య తన భర్తను సరిదిద్దుకోవడాన్ని చిత్రిస్తే, 'మెటిల్డా' కథలో వయసు మళ్ళిన భర్త దుర్మార్గానికి బలైన భార్యను చిత్రించారు. గురజాడ ఇతర కథలలో కూడా సంఘ సంస్కరణే ప్రధానంగా కనిపిస్తుంది.

తెలుగు కథానికల్లో వ్యవహారిక భాషను ప్రవేశపెట్టిన ఘనత శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారికి దక్కుతుంది. ఈయన రాసిన అరికాళ్ళ కింద మంటలు, కలుపు మొక్కలు వితంతు సమస్యలు ఇతివృత్తాలు కాగా, 'ఇలాంటి తవ్వాయివస్తే' కథానికలో అంటరానితనాన్ని నిరసించారు. తెలుగు కథా సాహిత్యంలో మొదటిసారిగా గిరిజనుల్ని గురించి, సంచార జాతుల గురించి కథలు రాసిన రచయిత చింతాదీక్షితులు. ఆయన రాసిన సుగాలీ కుటుంబం', 'దాసరిపాట', 'చెంచురాణి' వంటి కథలు ప్రసిద్ధాలు. తెలుగు కథాసాహిత్యంలో తాత్వికతను కథల్లో ప్రవేశపెట్టినవాడు విశ్వనాథ సత్యనారాయణ. ఆయన కథల్లో మానవుని అస్తిత్వానికి సంబంధించిన ఆలోచనలతోపాటు అన్వేషణను ప్రవేశపెట్టాడు.

తెలుగు కథల్లో చలం గొప్ప మార్పు తెచ్చాడు. శృంగారానికి, సౌందర్యారాధనకు అడ్డుగా నిలిచిన సంప్రదాయాలను బద్దలుకొట్టాడు. కరుణకుమార నెల్లూరుజిల్లా భాషలో గొప్ప కథలు రాశారు. గాంధీజీ, ఉన్నవ లక్ష్మీనారాయణ ప్రభావం కరుణకుమారపై బలీయంగా ఉంది 'కయ్య–కాలువ' 'బిళ్లల మొలత్రాడు', 'అంటుజాడ్యం' 'కొత్తచెప్పులు' మొదలైన కథల్లో ఆయన దళితులు, గిరిజనులను పాత్రలుగా మలచి గ్రామాల్లో వర్గవైరుధ్యాలను వాస్తవికంగా చిత్రించారు. కొడవటిగంటి కుటుంబరావు సామాజిక రాజకీయ భావాలను కథావస్తువులుగా తీసుకొని 'కులద్వేషం', 'కొత్తజీవితం', 'ట్యూటర్' వంటి కథల్లో చక్కగా చిత్రించారు.

గోపీచంద్ కథల్లో రాజకీయ సిద్ధాంతాలను ప్రత్యక్షంగా ప్రవేశపెట్టాడు. ప్రజల్లో జాతీయ దృష్టి లోపించడాన్ని ఆయన విమర్శించాడు. 'దేశం ఏమయ్యేట్టు' వంటి కథానికల్లో ఇది గమనించవచ్చు. 'ధర్మవడ్డీ' 'తండ్రులూ –

కొడుకులూ', 'మమకారం' వంటి కథానికలో గోపిచంద్ సామాజిక దృక్పథం, వాస్తవిక జీవిత చిత్రణను పోషించిన తీరును మనం గమనించవచ్చు. గోపీచంద్ కథాశిల్పంలో ఎన్నో ప్రయోగాలు చేశాడు. సామాజిక సంబంధాలకు సంబంధించిన కథల్లో అలంకార రహిత శైలిని ప్రయోగించాడు. పాత్ర పోషణ మీద ప్రత్యేక శ్రద్ధ చూపించాడు. చాగంటి సోమయాజులు తన కుంకుడాకులు, ఎంపు, లేడీ కరుణాకరం, కుక్కుటేశ్వరం, బండపాటు వంటి కథల్లో సామాజిక జీవత చిత్రణను గొప్పగా పోషించారు. ఈయన 'మార్క్సిజాన్ని కథాసాహిత్యంలో ప్రవేశపెట్టింది నేనే" అని చెప్పుకున్నాడు. తెలుగు కథకు అంతర్జాతీయ ఖ్యాతి తీసుకువచ్చిన రచయిత పాలగుమ్మి పద్మరాజు. ఇతను రచించిన గాలివాన కథకు అంతర్జాతీయ కథల పోటీలో బహుమతి లభించింది.

బుచ్చిబాబు కథల్లో కథాంశాలు వాస్తవికతకు దర్పణాలుగా ఉంటాయి. పాత్ర చిత్రణ బాగుంటుంది. తెలుగు కథను 'మార్మికత' స్థాయికి తీసుకొని వెళ్ళినవాడు బుచ్చిబాబే. ఆరు సారా కథలు, జరీ అంచు తెల్లచీర, విలువలు, మెరుపు మెరిసింది, పిపీలికం, వేతన శర్మ కథ వంటి కథల ద్వారా తెలుగు కథా సాహిత్యంలో తనకంటు ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్న రచయిత రాచకొండ విశ్వనాథ శాస్త్రి. ఇతను తన కథల్లో పాత్రల చిత్రణకు అధిక ప్రాధాన్యత ఇచ్చాడు. అదేవిధంగా ఒక్కొక్క వాక్యాన్ని ఒక్కో పేరుగా రాసే పద్ధతిని ప్రవేశపెట్టాడు. "తెలుగు కథను వ్యక్తి నిష్ట సంవేదనల నుంచీ, వైవిధ్య రాహిత్యం నుంచీ రక్షించిన గౌరవం నిస్సందేహంగా రా.వి. శాస్త్రిదే" నని విమర్శకులు భావిస్తారు.

ప్రముఖ కథా రచయిత కాళీపట్నం యజ్ఞం, చావు, కుట్ర, భయం వంటి కథల్లో అట్టడుగు వర్గాల ప్రజల జీవితాలను చిత్రించారు. ఈయనపై విప్లవ రచయితల సంఘం ఎక్కువ. మునిపల్లె రాజు 'బిచ్చగాళ్ళజెండా', 'అరణ్యంలో మానవయంత్రం' భారాగో రాసిన 'మీకూ కథలే ఇష్టం', మధురాంతకం రాజారాంగారి ' సర్కస్‌డేరా', 'కూనలమ్మకోన', ఆర్.యస్. సుదర్శనం గారి 'కాలం తెచ్చిన మార్పు, 'మధుర మీనాక్షి' వంటి కథలు బాగా ప్రసిద్ధి చెందాయి.

బీనాదేవి, అబ్బూరి ఛాయాదేవి, భానుమతి రామకృష్ణ, ఆర్. వసుంధరాదేవి మంచి కథలు రాసిన కథా రచయిత్రులు వీరు రాసిన రాధమ్మపెళ్లి ఆగిపోయింది (బీనాదేవి), సుఖాంతం (అబ్బూరి ఛాయాదేవి), అత్తగారి కథలు (భానుమతి రామకృష్ణ), బ్రిడ్జి క్రింద మనం (ఆర్.వసుంధరాదేవి) మొదలైన కథలు తెలుగు కథాసాహిత్యంలో మణిపూసలుగా నిలిచిపోయాయి.

పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారి 'నీళ్ళు' 'కళ్లజోడు', కేతు విశ్వనాథరెడ్డిగారి 'పీర్ల చావడి', అల్లం శేషగిరిరావుగారి 'నరమేధం', పులికంటి కృష్ణారెడ్డిగారి 'గౌడ్లు', కలువకొలను సదానంద గారి 'విముక్తి', 'అడుసు' మొదలైన కథలు తెలుగు సాహిత్యంలో మంచి కథలుగా గుర్తింపుపొందాయి. కొలకలూరి ఇనాక్ గారు 'ఊరబావి', 'తలలేనోడు' మొదలైన కథలలో పీడిత వర్గాల తిరుగుబాటును, పగతీర్చుకున్న విధానాన్ని వాస్తవికంగా చిత్రించారు. శ్రీకాకుళం గిరిజన పోరాటం నేపథ్యంలో భూషణం, ఎన్.యస్. ప్రకాశరావుగార్లు గిరిజనుల బాధలను వర్ణిస్తూ కథలు రాశారు. సి.యస్.రావు చెరబండరాజు, అల్లం రాజయ్య, బి.యస్. రాములు ప్రజలలో తిరుగుబాటును ప్రేరేపిస్తూ కథలు రాశారు.

1970-90 మధ్యకాలంలో పతంజలి, వివినమూర్తి, పాపినేని శివశంకర్, స్వామి, మధురాంతకం

నరేంద్ర, చక్రవేణు, ఓల్గా, సత్యవతి వంటివారు గొప్ప రచయితలుగా పేరు పొందారు. ఓల్గా, కొండేపూడి నిర్మల, ముదిగంటి సుజాతారెడ్డి, కుప్పిల పద్మ, ప్రతిమ వంటి రచయిత్రుల స్త్రీవాద లక్ష్యాలతో కథలు రచించారు.

కొలకలూరి ఇనాక్ 'అస్పృశ్యగంగ', ఎండ్లూరి సుధాకర్ 'మల్లెమొగ్గల గొడుగు' నాగప్పగారి సుందరరాజు 'మాదిగోడు' వంటి కథా సంపుటాలు దళిత ఉద్యమ నేపథ్యంలో వెలువడిన ప్రసిద్ధ కథాసంపుటాలు. శాంతి నారాయణగారు 'ఉక్కుపాదం' కథలోనూ, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డిగారు 'అంటు' కథలో దళితుల్లో ఉన్న అంతర్గత అస్పృశ్యతను, వైవిధ్యాన్ని చిత్రించారు. ముస్లీం మైనారిటీవాద ప్రభావంతో ముస్లీం హక్కుల పరిరక్షణ ధ్యేయంతో రహంతుల్లా, ఖదీర్‌బాబు కథాసంపుటాలను వెలువరించారు. ముస్లింలలో తలాక్, బురకా వంటి ఆచారాలను నిరసిస్తూ కొన్ని కథలు వచ్చాయి.

1990 తరువాత ప్రపంచీకరణ ప్రభావం చేత నిరుద్యోగ సమస్య, కార్పొరేట్ విద్యాసంస్థలు, రైతుల ఆత్మహత్యలు, ఆమెరికా ఉద్యోగ ప్రయత్నాలు పెరిగాయి. ఈ ప్రపంచీకరణ ప్రభావాలను నిరసిస్తూ కుప్పిలి పద్మ, అశోక్ కుమార్, ఓల్గా, ఖదీర్‌బాబు కథలు రాశారు. ప్రపంచీకరణ ప్రభావంతో నాశనమైపోతున్న స్థానిక సంస్కృతీ విధ్వంసాన్ని ఆవిష్కరిస్తూ వివినమూర్తి, పాపినేని శివశంకర్, కాట్రగడ్డ దయానంద, వల్లూరి శివప్రసాద్, సుజాతారెడ్డి, అట్టాడ అప్పలనాయుడు కథలు రచించారు.

ఈ విధంగా తెలుగు కథానిక సామాజిక పరిణామాలను, సాంఘిక సమస్యలను, వివిధ ఉద్యమాలను ప్రతిబింబిస్తూ వికాసం చెందింది. నేడు తెలుగు కథానిక శాఖోపశాఖలుగా విస్తరించి మరే యితర సాహిత్య ప్రక్రియ చేరుకోలేనంత ఎత్తుకు ఎదిగిందనడం ఏమాత్రం అతిశయోక్తి కాదు.

## 5.5 కథాంగాలు :

కథను వస్తువు, రూపం అనే రెండు భాగాలుగా విమర్శకులు వర్గీకరించారు. రచయిత వస్తువును కళాత్మకంగా వ్యక్తం చేస్తేనే దానికి విలువవస్తుంది. కథావస్తువు గమ్యమే ఉద్దేశం. ఉద్దేశాన్ని కథగా మార్చే వరుసవేది రూపం లేదా శిల్పం. కథలో కేంద్ర బిందుకు కథాంశం. కథాంశానికీ, రచయితకూ మధ్య ఉండే సంబంధమే ఉద్దేశం. కథా, కథాంశం, ఉద్దేశం వస్తువుకు సంబంధించిన అంశాలైతే కథా సంవిధానం, పాత్రలూ, నేపథ్యమూ, దీక్షికోణం, కథనం శిల్పానికి సంబంధించిన అంశాలు. కథారచయితకు శిల్పానికి సంబంధించిన అంశాలు ప్రధానమైనవి. వీటిని గురించి వివరంగా తెలుసుకుంటే ఉత్తమ కథా సాహిత్యాన్ని క్షుణ్ణంగా గుర్తించి, అధ్యయనం చేయవచ్చు.

### 1. కథా సంవిధానం :

కథలో కాలక్రమంలో జరిగిన సంఘటనల కూర్పును కథా సంవిధానం అనవచ్చు. ఇది కథలోని సంఘటనల మధ్య ఉండే కార్యకారణ సంబంధాన్ని తెలియజేస్తుంది. కథలో ఏ సంఘటనకు ఏ సంఘటన కారణమో తెలియజేయడమే కథా సంవిధానం యొక్క ప్రయోజనం. సంవిధానం తర్కబద్ధంగా లేకపోతే కథాంశానికి అర్థస్ఫూర్తి కలుగదు. సంఘటనలను పూసలనుకుంటే కథ దండగుచ్చిన పూసలమాదిరిగా ఉండాలి. రావిశాస్త్రి రాసిన లక్ష్మీ అనే కథలో కథా సంవిధానం లోపించిందని, దానికి సంఘటనల మధ్య కార్యకరణ సంబంధం

లేకపోవడమే కారణమని వల్లంపాటి వెంకటసుబ్బయ్యగారు పేర్కొన్నారు.

## 2. పాత్రలు:

కథలను నడిపించేవి, కథా వస్తువును భరించేవి, కథాంశాన్ని సూచించేవి పాత్రలు. కథల్లోని పాత్రల్లో విశాలత్వం ఉండదు. కథా రచయిత పాత్రలు నేరుగా కాకుండా కిటికీలోంచి చూపించినట్లు చూపించాలి. అప్పుడే ఆ పాత్ర చేస్తున్న పని, దాని వ్యక్తిత్వం అర్థమవుతుంది. అంతేగాక రచయిత చెప్పకుండా విడిచిపెట్టిన అనేక విషయాలు పాఠకుడు ఊహించుకోగలడు.

నవలల్లోని పాత్రకు, కథల్లోని పాత్రకు తేడా ఉంటుంది. నవలలోని పాత్ర సహజంగా ఎదుగుతుంది. కథలోని పాత్ర రచయిత అదుపులో ఉంటుంది. కథలో సంఘటన తరువాత స్థానం పాత్రలది. పాత్రకు సంఘర్షణతో సంబంధ ఉంటుంది. కథలో పాత్ర గురించి రచయిత చెప్పకూడదు. సంఘటనలకు బట్టి పాఠకుడు పాత్రలను అర్థం చేసుకుంటాడు. పాత్ర పోషణకు రచయిత పరోక్ష సూచనమీద ఎంత ఆధారపడితే కథ విలువ అంతగా పెరుగుతుది. కథలోని పాత్రలకు, వాస్తవంగా లోకంలో కనిపించే పాత్రలకు మధ్య ఉన్న సంబంధాన్ని బట్టి పాత్రలను ప్రాతినిధ్య పాత్రలు, వ్యక్తిగత పాత్రలు, ప్రతీకాత్మక పాత్రలు అని మూడు రకాలుగా విభజించవచ్చు. గుంపులుగా ఉన్న మనుషులలో ఒక గుంపుకు ప్రతినిధిగా ఒక పాత్రను నిర్మిస్తే అది ప్రాతినిధ్య పాత్ర అవుతుంది. అలా కాకుండా తాను నివసించే గుంపు తనకు సంబంధం లేదని, తాను దానికి అతీతుడనని భావించే పాత్రలను వ్యక్తిగత పాత్రలు అంటారు. ఒక భావానికి బదులు మరొక భావాన్నో, వ్యక్తినో ప్రదర్శించడాన్ని ప్రతీకవాదం అంటారు. ఈ ప్రతీకలు వారసత్వంగా వస్తాయి. పాతివ్రత్యానికి సీత, అహంకారానికి దుర్యోధనుడు, కుటిలత్వానికి శకుని లాగా ప్రతీకలను పాత్రలకు కాకుండా కథాంశానికి, కథనానికి వాడిన రచయితలున్నారు. ఆ విషయంలో కాళీపట్నం రామారావుగారిని చెప్పుకోవాలి. ఆయన రాసిన భయం కథ ప్రతీకాత్మకమయింది.

ప్రతి కథా రచయిత పాత్రలను జాగ్రత్తగా ఆలోచించి నిర్మించాలి. పాత్ర చిత్రణ కథకు అతి కీలకమైంది.

## 3. నేపథ్యం :

కథకు స్థలం, కాలం ఉంటాయి. స్థలకాలాలకు సంబందించిన చిత్రణే నేపథ్య చిత్రణ అంటారు. కొన్ని కథలకు స్థలకాలాలుండవు. కాని చాలా కథలు ఏదో ప్రదేశంలో ఎప్పుడో జరుగుతాయి. కనుక నేపథ్యం అనేది ఆ సంఘటనలను తీర్చిదిద్దుతుంది. కథల నేపథ్యాన్ని మారిస్తే అది అసహజమని, అసంభవమని అనిపిస్తుంది. **ఉదా :–** సింగమనేని నారాయణ రాసిన విముక్తి కథ రాయలసీమకు చెందినది. ఈ కథకు ప్రదేశాన్ని మారిస్తే కుదరదు. నదులు, బల్లకట్టులూ లేని ప్రాంతానికి మాగోఖలే 'బల్లకట్టు పాపయ్య కథ' కుదరదు.

కొన్ని కథల్లో నేపథ్యం అలంకారప్రాయంగా మాత్రమే ఉంటుంది. అంటే కథా వస్తువు, పాత్రలూ ఆ నేపథ్యంలోంచి పుట్టే అవకాశం ఉండదు. సి. రామచంద్రరావు రాసిన 'వేలు పిళ్లై' అన్న కథకు నేపథ్యం తమిళనాడులోని టీ ఎస్టేట్లు పాత్రలందరూ కూడా తమిళులే. అలా ఈ కథకి భౌతిక నేపథ్యానికి, పాత్రలకు చక్కని పొంతన ఉంది. ఈకథకు నేఫథ్య చిత్రణ చేయడంలో రామచంద్రరావు అసాధారణమైన ప్రతిభ చూపించారు. నేపథ్యానికి ఉన్న రెండవ లక్షణం కాలం. స్థలాన్ని చిత్రించటం కంటే కాలాన్ని చిత్రించడం కష్టం. కాలాన్ని చిత్రించటం అంటే కథాకాలానికి సంబంధించిన భావజాలాన్ని చిత్రించటం. కాళీపట్నం రామారావు 'యజ్ఞం', 'ఆర్తి' లాంటి కథలూ,

బి.యస్. రాములు 'అడవిలో వెన్నెల', గోపి 'ఒక తండ్రి' లాంటి కథలు తమ నేపథ్యాల్లో ఉన్న భావజాలం ద్వారా కాలసూచన చేస్తాయి.

ప్రకృతిని, పరిసరాలను అవసరాలకు మించి వర్ణించకూడదు. మధురాంతకం రాజారాం 'ఏడారి కోయిల'లో ఈ లోపం కనిపిస్తుంది. నేపథ్యంలో మరొక ముఖ్యమైన అంశం భాష. భావాన్ని వ్యక్తం చేసేది భాషే. కథలోని పాత్రల సంభాషణల్లోని భాష, రచయిత భాష అని రెండు రకాలు. కథలో వివిధ వర్గాలకు చెందినవారు వారి భాషల్లోనే మాట్లాడతారు. మాండలిక భేదాలతో వివిధ ప్రాంతాలవారు మాట్లాడవచ్చు. కథా నేపథ్యంలో భాష భాగం కావడం శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారితో మొదలైంది. అభ్యుదయ సాహిత్యంతో సంబంధం ఉన్న రచయితలు భాష సహాయంతో నేపథ్యాన్ని చిత్రించారు. మాగోఖలే, కరుణ కుమార కథలు దీనికి ఉదాహరణ, విప్లవ సాహిత్యంతో సంబంధం ఉన్న భూషణం, అల్లం రాజయ్య, కాలువ మల్లయ్య, బి.యస్. రాములు, తుమ్మేటి రఘోత్తమ రెడ్డి, మధురాంతకం నరేంద్ర వంటి రచయితలు నేపథ్య చిత్రణలో ప్రత్యేక శ్రద్ధ చూపించారు. వీరంతా నేపథ్య చిత్రణలో భాషకున్న ప్రాధాన్యతను తెలుసుకొని ప్రయోగించారు.

## 4. దృష్టికోణం :

కథను, పాత్రలను, కథాంశాన్ని అనేక కోణాల నుంచి చూచి చెప్పవచ్చు. కథను ఎవరు చెప్పారు? ఎలా చెప్పాలి? ఎవరి దృష్టికోణం నుంచి చెప్పాలి అనేది రచయిత నిర్ణయించుకుంటాడు. ఈ దృష్టికోణం నాలుగు రకాలుగా ఉంటుంది.

**(అ) సర్వసాక్షి దృష్టికోణం :** వస్తువు, కథాంశం, పాత్రలు అన్నిటి గురించి రచయితకు తెలుసు. ఈ దృష్టికోణంలో రచయితే కథకుడై అన్ని సంఘటనలను తాను చూసినట్లుగా, విన్నట్లుగా చెపితే దాన్ని సర్వసాక్షి దృష్టికోణం అంటారు. కథకుడు పాత్రలను అతడు, ఆమె అని సంబోధించడం చేత దీనిని ప్రథమ పురుష దృష్టికోణం అనికూడ అంటారు. తెలుగు కథానిక ఈ సర్వసాక్షి దృష్టికోణంతోనే ప్రారంభమైంది. ఇప్పటికీ తెలుగు కథాసాహిత్యంలో ఈ సర్వసాక్షి దృష్టికోణంలోనే ఎక్కువ కథలు రావడం గమనించవచ్చు.

**(ఆ) ఉత్తమ పురుష దృష్టికోణం :** ఈ పద్ధతిలో కథను చెప్పడానికి రచయిత ఒక ముఖ్య పాత్రను ఎంపిక చేసుకుంటాడు. దీనిని ఆంగ్లంలో 'ఫస్ట్‌పర్సన్ పాయింట్ ఆఫ్‌రివ్యూ అంటారు. ఒక పాత్ర కథను నడిపిస్తే దానిని ఉత్తమ పురుష దృష్టికోణం అంటారు. ఈ ఉత్తమ పురుష దృష్టికోనంలో కథానికలు రాసిన మొదటి వ్యక్తి గురజాడే. ఆయన రాసిన 'మెటిల్డా' 'మీ పేరేమిటి' కథలలో ఈ ఉత్తమ పురుష దృష్టికోణం గమనించవచ్చు.

**(ఇ) నమ్మకస్తుడి కథనం :** ఇది కూడా ఉత్తమ పురుషలో చెప్పే కథనమయినా, ఇందులోని పాత్రలు కథకుని నమ్మి తమ కథను అతనితో చెపితే, కథకుడు ఆ పాత్రల మాటలు విని దానిని కథగా చెప్పడాన్ని నమ్మకస్తుడి కథనం అంటారు. బుచ్చిబాబు రాసిన 'నన్ను గురించి కథ రాయవూ?' కథలో ఈ నమ్మకస్తుడి కథనం ఉపయోగించాడు.

**(ఈ) నాటకీయ దృష్టికోణం :** నాటకీయ దృష్టికోణంలో రచయిత కథా స్థలంలో ఉంచిన వీడియో

కెమేరా లాంటివాడు. తనకు కనిపించిన సంఘటనలను, వినిపించిన మాటలను, శబ్దాలను రికార్డు చేసి కథగా రాస్తాడు. ఈ కథనంలో పాఠకునికి పాత్రల రూపం కనిపిస్తుందే కానీ వారి భావాలు వారే చెబితే తప్ప వినిపించవు. పాత్రల భావాలు కథకుని ఊహలే కాబట్టి నాటకీయ దీప్టికోణంలో వాటికి చోటు లేదు. ఆధునిక నాటకంలో లాగా ఈ దృష్టికోణంలో రచయిత వ్యాక్యానం, జోక్యం ఉండవు. అందుకే దీనికి నాటకీయ దృష్టికోణం అనే పేరు వచ్చింది.

ప్లేబేర్, అతని శిష్యుడైన మ.పా.సా తమ కథల్లో తాము కనిపించకూడదు అనుకున్నారు. అలాగే చెకోవ్ కూడా భావించాడు. కథలో రయిత తనను తాను ప్రదర్శించుకోవడాన్ని మానుకోవాలని వారు యువ రచయితలకు తెలియజేశారు.

తెలుగు కథా రచయితల్లో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి రచయిత జోక్యం, వ్యాఖ్యానం లేకుండా కథలు రాశాడు. ఆయన రాసిన 'అరికాళ్ళకింద మంటలు' ఈ పద్ధతిలో రాసిన కథ. చా.సో. 'వాయులీనం', కాళీపట్నం రామారావు 'చావు' కథల్లో కొంతవరకు ఈ దృష్టికోణం కనిపిస్తుంది.

**5. కంఠస్వరం :** కథను అనేక దృష్టికోణాల నుండి చెప్పే అవకాశం ఉన్నట్టే, కథకుడు కథను అనేక కంఠస్వరాల్లో చెప్పవచ్చు. కథా వస్తువుకు, కథకునికీ మధ్య ఉండే సంబంధాన్ని బట్టి ఒక్కొక్క కథ ఒక్కో కంఠస్వరంతో ఉండాలి. కొంతమంది అన్ని కథలకు ఒకే కంఠస్వరం వాడతారు. దానికి కారణం వారికి కంఠస్వరం ప్రాముఖ్యం తెలియకపోవడమే. కారణం ఏదైనా చాలా మంది తెలుగు రచయితల్లో కంఠస్వరం తరచుగా మారుతూ ఉండటం కనిపించదు. ఇది ఒక్కొక్కసారి ఆ రచయితల బాణిగా, ముద్రగా కూడా చెలామణి అవుతుంది.

పెద్దిభొట్ల సుబ్బరామయ్య రాసిన అనేక కథల్లో కంఠస్వరం గంభీరంగా ఉంటుంది. కంఠ స్వరానికి తగిన వర్ణనతో కథను ప్రారంభించడం ఆయన సాధారణ పద్ధతి. మధురాంతకం రాజారాం ఉత్తమ పురుష దృష్టికోణంలో రాసిన కథల్లో శంకరం అనే కథకుడు కనిపిస్తాడు. అతడు అమాయకుడు. తన అమాకత్వం పట్ల తనకే హ్రస్వదృష్టి ఉన్న కంఠస్వరంతో కథ చెబుతాడు. కొడవటిగంటి కుటుంబరావు కంఠస్వరంలో ప్రధానమైన అంశం వాదన, ల్లం రాజయ్య రాసిన కథల్లో కంఠస్వరం అణచుకున్న కోపం ప్రధానంగా కనిపిస్తాయి. ఇలా ఒక్కో రచయిత కంఠస్వరంలో వైవిధ్యం కనిపిస్తుంది.

I

కథా రచయితలు కథా శిల్పానికి సంబంధించి కథాంశాలైన కథా సంవిధానం, పాత్రల చిత్రణ, నేపథ్యం, దృష్టికోణం, కంఠస్వరంపై దృష్టి నిల్పి కథలు రాసినట్లైతే ఉత్తమ కథలు వెలువడతాయి.

## 5.6 ఉత్తమ కథానిక లక్షణాలు :

ఉత్తమ కథానికకు నాలుగు లక్షణాలుంటాయని ప్రముఖ విమర్శకులు వల్లంపాటి వెంకట సబ్బయ్య పేర్కొన్నారు. **అవి:**

1. క్లుప్తత
2. అనుభూతి ఐక్యత
3. సంఘర్షణ

4. నిర్మాణ సౌష్ఠవం.

ఈ నాలుగు లక్షణాలను గురించి వివరంగా పరిశీలిద్దాం.

**1. క్లుప్తత :** కథలో ప్రతి పదమూ రచయిత నిర్దిష్టంగా ఉపయోగించాలి. నవలా రచనలో మాదిరిగా కథా రచనలో అజాగ్రత్తగా ఉండకూడదు. అజాగ్రత్తగా, అశ్రద్ధగా ఉండడానికి కథానికలో జాగా ఉండదు. చెత్తకు చోటు ఉండదు. "అని నోబెల్ బహుమతి గ్రహీత ఫాక్నర్ చెప్పినట్టు కథా రచయిత శిల్పం పట్ల అధికమైన శ్రద్ధను చూపించాలి. రచనలో క్లుప్తతను కష్టపడి సాధించాలి.

కథలో అనేక కారణాల వలన క్లుప్తత లోపిస్తుంది. సందర్భశుద్ధి లేకుండా అనవసరమైన వర్ణనలు చేయడం వలన, కాలాన్ని సూచించడం కోసం వర్ణనలు ఎక్కువగా చేయడం వలన, కథతో సంబంధం లేని ఇతర వర్ణనల వలన క్లుప్తత దెబ్బ తింటుంది. రచయితకు పాఠకుని ఆలోచనా శక్తి మీద నమ్మకం లేక కథా రచనలో ఏదీ పాఠకుల ఊహాశక్తికి వదలకుండా ఛలోక్తులతో సహా అన్నీ తానే వివరించడం వలన కూడా క్లుప్తత లోపిస్తుంది. అలాగే అనవసరమైన సంభాషణలు, సంఘటనలు చెప్పడం వలన కూడా క్లుప్తత లేకుండా పోతుంది.

కుప్తత లేని కథలను చదివి పాఠకుడు సంవేదన పొందలేడు. అతనికి అనుభూతి కలుగదు. మధురాంతకం రాజారాం రాసిన అనేక కథల్లో క్లుప్తత లేకపోవడం లోపంగా కనిపిస్తుందని వల్లంపాటివారు పేర్కొన్నారు. రావిశాస్త్రికి వ్యాఖ్యానం చేయాలన్న చాపల్యం ఎక్కువ. ఆయన రాసిన వేతన శర్మ కథలో ఈ చాపల్యం వలన క్లుప్తత లోపించి ముగింపు బలహీనమయింది. కనుక కథా రచయితలు కథలో క్లుప్తతను తప్పకుండా పాటించాలి.

**అనుభూతి ఐక్యత :** ఈ అనుభూతి ఐక్యత కథకు ఉండవలసిన మరో లక్షణం. దీన్ని ఇంగ్లీషులో 'యూనిటీ ఆఫ్ ఇంప్రెషన్ ' అంటారు. 1842వ సంవత్సరంలో ఎడార్ ఎలెన్‌పో 'నథానియల్ హెూథార్న్' కథల మీద సమీక్ష చేస్తూ 'అనుభూతి ఐక్యత' ను కతకు ఉండవలసిన ప్రధాన లక్షణంగా పేర్కొన్నారు. ఈసందర్భంలో అనుభూతి అన్న పదాన్ని పాఠకునిలో కథ కలుగజేసే భావ ప్రకంపనగా అర్థం చేసుకోవాలని చెప్పాడు.

కథలో మొదటి వాక్యం నుండి చివరి వాక్యం వరకు కథ కథాంశం అనే తీగ మీదనే నడవాలి. ఏకాగ్రత లోపించినా, అలసత్వం చోటు చేసుకున్నా తీగ మీద నడిచేవాడు పడతాడు పులి తరుముకొస్తున్నవాడు చెట్టు దగ్గరకు పరుగెత్తుతున్నట్టు కథా రచయిత సూటిగా కథాంశం దగ్గరకు వెళ్లాలి. రచయిత అనుభూతి ఐక్యతను కష్టపడి సాధించాలి. పాఠకుని ప్రతిస్పందనను, అనుభూతిని రచయిత కంట్రోల్ చేయాలి.

అనుభూతి ఐక్యతను ప్రధానంగా రెండు మార్గాల ద్వారా సాధించవచ్చు.

1. ఒక సంఘటనకు పరిమితమయ్యేలా పాత్రను చిత్రించాలి. అంటే ఒక సంఘటన ముఖ్యమైనదిగా, మిగిలినవన్నీ అప్రధానంగా ఉండాలి.
2. రచయిత చెప్పే ప్రధాన సంఘటన పాత్రలో గుణాత్మకమైన మార్పుకు కారణం కావాలి.

**సంఘర్షణ:** కథలోని సంఘర్షణ అనేక రూపాల్లో ఉంటుంది. ఇద్దరు వ్యక్తుల మధ్య, వ్యక్తిలో రెండు అంశాల మధ్య, రెండు భావాల మధ్య, రెండు సిద్ధాంతాల మధ్య, రెండు జీవిత దృక్పథాల మధ్య, భౌతికంగా కాని, మానసికంగా కాని ఈ సంఘర్షణ ఉండవచ్చు కథలోని సంఘర్షణ రచయిత అభిరుచిని బట్టి, జీవితానుభవాన్ని

బట్టి ఉంటుంది.

సాధారణీకరణం చేసిన వ్యక్తుల మధ్య సంఘర్షణను పెద్దిభొట్ల సుబ్బరామయ్య చిత్రించాడు. భావాల మధ్య సంఘర్షణ కొడవటిగంటి కుటుంబరావు కథల్లో కనిపిస్తుంది. రా.వి. శాస్త్రి తాత్త్విక దృక్పథాల మధ్య సంఘర్షణను, కాళీపట్నం రామారావు ప్రతీకలుగా రూపొందించిన పాత్రల మధ్య సంఘర్షణను చిత్రించారు. బుచ్చిబాబు మనసులోని రెండు భావోద్రేకాల మధ్య సంఘర్షణను గొప్పగా చిత్రించారు.

రాయలసీమలో ప్రకృతికి, మనిషికి మధ్య సంఘర్షణను సింగమనేని నారాయణ, కేతు విశ్వనాథరెడ్డి, చక్రవేణు, కె.సభా, స్వామి వంటి రాయలసీమ ప్రాంతానికి చెందిన రచయితలు వాస్తవికంగా చిత్రించారు. స్త్రీ, పురుషుల మధ్య సంఘర్షణను ఓల్గా, సత్యవతి వంటి స్త్రీవాద రచయిత్రులు తమ కథల్లో చిత్రించారు.

కథలో సంఘర్షణ రచయిత దృక్పథానికి సంకేతం. మరో రకంగా చెప్పాలంటే ఎలాంటి సంఘర్షణ లేకుండా రాసిన రచయితకు నిర్దిష్ట జీవిత దృక్పథం లేదనవచ్చు. అలాంటి రచయితలు రాసిన కథలు కాలక్షేపం కథలు అవుతాయి.

కథలో రచయిత పరిష్కారాన్ని చూపిస్తే బాగుంటుంది. కాని ఆ పరిష్కారం కథలోంచి సహజంగా పుట్టాలి. బలవంతంగా రుద్దితే శిల్పం లోపిస్తుంది. అలాగే కొన్ని కథలకు పరిష్కారం చూపించటం సాధ్యం కాదు. రాయలసీమలో వానలు కురవకపోవడం చేత ప్రకృతికి, మనిషికి మధ్య సాగే సంఘర్షణకు పరిష్కారం వానరావటంతో ముగించడం సాధ్యంకాదు. అలాగే పీడనను చిత్రించే ప్రతికథనూ పీడకుణ్ణి నిర్మూలించడంతో ముగించడం కూడా సాధ్యంకాదు.

**నిర్మాణసౌష్ఠవం :** కథకు చక్కని నిర్మాణం ఉండాలి. చక్కని నిర్మాణం ఉన్న కథ పాఠకుని మనస్సును తాకుతుంది. ప్రముఖ కథా రచయిత 'సోమర్సెంట్‌మాం' అరిస్టాటిల్ చెప్పిన 'ఆది మధ్యాంతాల సిద్ధాంతం' నాటకాలకే కాక, కథలకు కూడా వర్తిస్తుందంటాడు. అల్లిక పూర్తిగా లేని కథ నీరసంగా ఉంటే అల్లిక ఎక్కువైన కథ కృత్రిమంగా ఉంటుంది. అనవసరమైన మలుపులు, అసహజమైన కొసమెరుపులు శిల్పాన్ని దెబ్బతీస్తాయి.

కథను రాసిన తరువాత ప్రారంభాన్ని ముగింపును తొలగించాలని చెకోవ్ చమత్కరించాడు. అంటే వాటిని పాఠకునికి విడిచిపెట్టాలని అతని అభిప్రాయం. మధురాంతకం రాజారాం 'కథనరంగం' వ్యాసంలో

ముగింపును కొసమెరుపు అన్నాడు. కొసమెరుపు ఓహెన్రీ రాసిన చాలా కథల్లో ప్రధాన సూత్రంగా ఉంటుంది. ఓహెన్రీ రాసిన 'దిగిఫ్ట్ ఆఫ్‌ది మెజై' కథ ఊహించని కొసమెరుపుతో పాఠకులను విస్మయపరుస్తుంది. తెలుగులో డా॥వి చంద్రశేఖరరావు రాసిన 'జీవని' మంచి కొసమెరుపు ఉన్న కథ. ఇలాంటి కథలను పాశ్చాత్యులు 'ఐపిఫనీలు' అంటారు.

జీవిత సాక్షాత్కారం (ఐపిఫనీ) రావిశాస్త్రి 'పిపీలకం'లో సింగమనేని నారాయణ 'అడుసు' లో కనిపిస్తుంది. జరగవలసిన దానికీ, జరిగిన దానికీ మధ్య ఉన్న అగాధాన్ని చూపించే కథలో మంచి శిల్పం ఉంటుంది.

పై లక్షణాలు సమపాళ్ళలో ఉన్న కథలు ఉత్తమ కథలుగా తెలుగు సాహిత్యంలో నిలిచాయి.

## I వ్యాసరూప ప్రశ్నలు

1. కథానిక పరిణామాన్ని వివరించండి
2. కథాంగాలను గూర్చి సంగ్రహంగా తెలపండి
3. ఉత్తమ కథానిక లక్షణాలను వివరించండి.
4. కథానిక నిర్మాణంలో రచయిత దృష్టికోణాన్ని వివరించండి.

## II సంక్షిప్త సమాధాన ప్రశ్నలు

1. కథానిక నిర్వచనాలను చెప్పండి
2. కథా సంవిధానాన్ని గూర్చి రాయండి.
3. కథా నేపధ్యాన్ని గూర్చి రాయండి
4. కథానికలో క్లుప్తత అవసరాన్ని తెలపండి
5. కథానికలో సంఘర్షణ స్వరూపాన్ని వివరించండి.

## III ఆధార గ్రంథాలు

1. కథా శిల్పం - వల్లంపాటి వెంకట సుబ్బయ్య
2. కథాంశం - డా॥ రాచపాళెం చంద్రశేఖర రెడ్డి

**డా॥ టి. ఓగేశ్వరరావు**
తెలుగు అధ్యాపకురాలు
వి.వి.గిరి. ప్రభుత్వడిగ్రీ కళాశాల,
దుంపలగూడెం,
ప.గో. జిల్లా.

# పాఠం - 6

# వ్యాస రచన : ఉత్తమ వ్యాసం - లక్షణాలు

పాఠ్యాంశ నిర్మాణ క్రమం :

6.1. వ్యాసం - నిర్వచనాలు

6.2. వ్యాసం - ఆవిర్భావ వికాసాలు

6.3. వ్యాసం - లక్షణాలు

6.4. వ్యాసం - భేదాలు

ఆంగ్ల సాహిత్య ప్రభావంతో తెలుగులోనికి వచ్చిన సాహిత్య ప్రక్రియల్లో వ్యాసం ఒకటి. ఆధునిక కాలంలో ఈ వ్యాస ప్రక్రియ బహుముఖాలుగా పరిఢవిల్లుతున్నది. సాహిత్యంలో వ్యాస ప్రక్రియకు మూల పురుషుడు ఫ్రెంచి రచయిత మాన్ టేగ్. బేకన్, జాన్ రస్కిన్, మథ్యూ ఆర్నాల్డ్, వాల్టర్ పీటర్ మొదలైన వారు ఆంగ్ల సాహిత్యంలో ప్రముఖ వ్యాస రచయితలు.

## 6.1. వ్యాసం - నిర్వచనాలు :-

వ్యాసాన్ని ఆంగ్లంలో Essay (ఎస్సె) అంటారు. ఈ పదం లాటిన్ భాష నుండి ఉద్భవించింది. దీనికి తూచడం, పరిశీలించడం అనే అర్థాలున్నాయి. బహుజనపల్లి సీతారామాచార్యులు శబ్దరత్నాకరంలో వ్యాస శబ్దానికి 'ఏదేని ఒక విషయాన్ని గురించి విరివిగా రాయడం' అని అర్థం చెప్పారు. వ్యాసం అంటే విభాగం అనే అర్థం కూడా ఉంది. ఒక విషయాన్ని గ్రహించి అందులోని విషయాలను, విభాగాలుగా వివరించడాన్ని వ్యాసం అనవచ్చు. ఈ శబ్దానికి సంస్కృతంలో విస్తారం, విగ్రహం అనేవి పర్యాయపదాలుగా కనిపిస్తాయి. విశేషంగా చెప్పుకోవడం విశేషంగా గ్రహించడం అనేక విధాలుగా ఉండడం అనేవి వీనికి వ్యుత్పత్తులు.

వ్యాసాన్ని కన్నడంలో ప్రబంధమని, మరాఠీ, హిందీ, సంస్కృత భాషల్లో నిబంధ, లేఖ్ అనే పదాలతో వ్యవహరిస్తున్నారు. తెలుగులో మాత్రం ఇది వ్యాసం అనే పేరుతో స్థిరపడిపోయింది.

వ్యాసం విషయ ప్రధానమైన ప్రక్రియ. ఒక విషయాన్ని స్పష్టంగా వివరించే ప్రక్రియ విశ్లేషణకు ప్రాధాన్యమున్న ప్రక్రియ. ఈ పదానికి ఉన్న అర్థాల్లో ప్రయత్నం రాతకు, పరిశీలనం ఆలోచనకు సంబంధించినది. ఒక విషయాన్ని చర్చిస్తూ దానికి సంబంధించిన కొత్త కోణాలను ఆవిష్కరించడం, కొత్త ఆలోచనలు చేయడం, కొత్త ప్రతిపాదనలు చేయడం అనేవి వ్యాసంగా చెప్పుకోవచ్చు.

## 6.2. వ్యాసం - ఆవిర్భావ వికాసాలు:-

తెలుగులో వ్యాసం 1860 లో మొదలయింది. తెలుగులో మొట్టమొదటి వ్యాసాన్ని సామినేని ముద్దు నరసింహనాయుడు రాశారు. వీరి వ్యాసాలు హిత సూచిని పేరుతో ముద్రితమయ్యాయి. ఆయన వ్యాసాలను గ్రాంథికంలో రాసి, వాటికి ప్రమేయాలు అని పేరు పెట్టారు. ప్రమేయం అంటే తెలుసుకోదగింది. కొలవదగింది

అని అర్థం. హిత సూచినిలో ఆయనే తన భాష గురించి చెపుతూ గ్రామ్య పదాలను కొన్ని స్వీకరిస్తానని అన్నారు.

సామినేని తరువాత పరవస్తు రంగాచార్యులు ' సంగ్రహం' అనే పేరుతో వ్యాసాలు రాశారు. ఈ వ్యాసాలు కూడా గ్రాంథిక భాషలోనే ఉన్నాయి. ఆయన భారతీయ సాహిత్యం, సంస్కృతి, నాగరికత, మతాలకు చెందిన విషయాలపై వ్యాసాలు రాశారు. తెలుగులో మూడవ వ్యాసకర్త జియ్యరు సూరి. ఆయన 1875 లో 'స్త్రీ కళాకల్లోలిని' అనే పేరుతో వ్యాస సంపుటిని వెలువరించారు. తరువాత 'స్త్రీవిద్యామణి' అనే వ్యాస సంపుటిని కూడా ప్రచురించారు. ఆయన రచించిన వ్యాసాలన్ని స్త్రీలకు సంబంధించినవే. 1874 లో కందుకూరి వీరేశలింగం సరళ గ్రాంథికంలో వ్యాసాలు రాశారు. వీరేశలింగం సంస్కరణ ఉద్యమానికి వ్యాసాన్ని ఆయుధంగా వాడుకున్నారు. ఆయన వ్యాసాన్ని ఉపన్యాసం అని పిలిచారు. 1900 నుంచి వ్యాసం పేరు తెలుగు సాహిత్యంలో స్థిరపడింది. గురజాడ అప్పారావు తదితరులు వ్యాసం అనే పేరును ఎక్కువగా ఉపయోగించారు.

కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి, దాసు శ్రీరాములు, రాయసం వేంకట శివుడు వంటివారు విభిన్న విషయాలపై వ్యాసాలు రాశారు. కొమర్రాజు లక్ష్మణరావు, గిడుగు రామ్మూర్తి భాషా సంస్కరణ కోసం వ్యాసాలు రాశారు. సంఘ సంస్కరణ కోసం రచయితలు తమ అభిప్రాయాలను ప్రకటిస్తూ వ్యాసాలు రాశారు.

గిడుగు రామ్మూర్తి వ్యవహారిక భాషోద్యమం కోసం వ్యాసాన్ని ఉపయోగించుకున్నారు. ఆ కాలంలోని భాషా సంబంధమైన వాదోపవాదాలు వ్యాసరూపంలోనే జరిగాయి. తెలుగు పత్రికారంగం 1835 లో ప్రారంభమైనా 1864 నుంచి మాత్రమే వ్యాసాలు పత్రికలలో ప్రచురితం కావడం జరిగింది. పత్రికల్లో గ్రంథ సమీక్షలు, మత, రాజకీయ, ఆర్థిక, సాహిత్య, భాష, కళలు అలా అనేక విషయాలపై వ్యాసాలు వచ్చాయి.

తెలుగులో వ్యాసరచనలో దిట్టలైన సాహితీ వేత్తలు ఎందరో ఉన్నారు. వారంతా చేసిన కృషి వలన వ్యాస ప్రక్రియ బహుళ ప్రజాదరణ పొందింది.

## 6.3. వ్యాసం – లక్షణాలు:

వ్యాసం విషయ ప్రకటనను అర్థవంతంగా, స్పష్టంగా చెప్పడానికి అనువైన ప్రక్రియ దీనిలో వైవిధ్యం ఉంటుంది. ఏ అంశాన్ని గురించి అయినా గంభీరంగా రాసినా, తేలికగా రాసినా, సంక్షిప్తంగా రాసినా, సమగ్రంగా రాసినా వ్యాసంలో ఒక క్రమపద్ధతి ఉంటుంది. అసలు విషయాన్ని విడిచిపెట్టి ఇతర అంశాల చర్చ ఇందులో కనిపించదు. వ్యాసం ఏ విషయం గురించి అయినా అది దండలోని దారంలాగా అంశం చుట్టూనే తిరుగుతూ ఉంటుంది.

తెలుగు వ్యాసంలో ముఖ్యంగా ఏడు లక్షణాలు ఉండాలని విమర్శకుల అభిప్రాయం. అవి: 1. వచనత్వం 2.అనిర్ణీతత్వం 3. మిత్రత్వం. 4. హాస్యత్వం 5. సృజనత్వం 6. అసంపూర్ణత్వం 7. వ్యక్తిత్వం.

**1. వచనత్వం** : వ్యాసం ఎప్పుడూ వచన రూపంలోనే ఉంటుంది. కవితాత్మకంగా రాసిన వ్యాసాలు అయినా వచనంలోనే ఉంటాయి.

**2.అనిర్ణీతత్వం** : రచనకు ఉండే పరిమితిని ఇతివృత్తం, సన్నివేశం ఆధారంగా నిర్ణయిస్తారు. కాని వ్యాసానికి ఇక్కడ ముగించాలన్న నియమం ఉండదు. అపరిమితంగా సాగిపోవచ్చు. కొందరు ఒక్క వ్యాసాన్నే గ్రంథంగా

రాశారు. కాని స్వల్పకాలంలో చదవడానికి అనువుగా ఉంటే వ్యాసం బాగుంటుంది.

**3. మిత్రత్వం :** వ్యాసం పాఠకులకు మిత్రునిగా అనిపించాలి. వ్యాసకర్త వ్యాసంతో పాఠకులతో మాట్లాడినట్లు అనిపించాలి. మిత్రునికి తన అభిప్రాయం చెపుతున్నట్లు, ముచ్చటిస్తున్నట్లు ఉన్న వ్యాసాలయితే, పాఠకులు ఆదరిస్తారు. వ్యాసకర్త పరోక్షంగానో, ప్రత్యక్షంగానో పాఠకులతో మైత్రి లేకపోయినా, మైత్రి ఉన్నట్టు తన వ్యాసం ద్వారా అనిపించాలి.

**4. హాస్యత్వం :** హాస్యం పాఠకునికి సంతోషాన్ని, శక్తిని ఇస్తుంది. వ్యంగ్యం, పరిహాసం, అధిక్షేపం ఉన్న రచనలు పాఠకులకు జీవిత సత్యాలను తెలియపరుస్తాయి. సాక్షి వ్యాసాలు, వదరబోతు వ్యాసాలు ఈ లక్షణాలు కలిగి ఉంటాయి. వ్యాసాల్లోని హాసం. పాఠకులను దూరం కానీయకుండా చేస్తుంది. కాని కొన్ని రకాల వ్యాసాల్లో హాస్యం ఉండకూడదు. వేదాంత వ్యాసాల్లో, శాస్త్ర సాంకేతిక వ్యాసాల్లో హాస్యం ఉండకూడదు.

**5. సృజనత్వం:** వ్యాసం సృజనాత్మకంగా, కొత్త ఆలోచనలతో నిండి ఉండాలి. వ్యాసంలో పాండిత్య ప్రదర్శన పనికి రాదు. ఏ వ్యాసంలో సృజన ఉంటుందో ఆవ్యాసంలో ఆత్మీయత ధ్వనిస్తుంది. సృజన ఉన్న రచయిత అభిప్రాయాలు పాఠకుల హృదయానికి హత్తుకుంటాయి. సృజనాత్మకంగా ఉండే వాక్యం ఆలోచనామృతం రూపంలో పాఠకులను ఆలోచింపజేస్తుంది.

**6. అసంపూర్ణత్వం:-** వ్యాసం పెద్దదయినా, చిన్నదయినా అందులోని విషయం సర్వసమగ్రం కాదు. అది అసాధ్యం. ఏ విషయం గురించి అయినా వ్యాస రచయిత కూలంకషంగా, సమగ్రంగా రాయలేడు. అంటే అసంపూర్ణత్వం కూడా వ్యాసానికి ఒక లక్షణమవుతుంది.

**7. వ్యక్తిత్వం :-** వ్యాసంలో రచయిత వ్యక్తిత్వం ఆత్మాశ్రయరీతిలో ఉంటుంది. వ్యాసాన్ని రచయిత పాత్రగతంగా రాసినా, ఉత్తమ పురుషలో రాసినా, వ్యాసం పాఠకులతో మాట్లాడినట్లు ఉండాలి. రచయిత దృక్పథం, అనుభవం, అవగాహన వ్యాసంలో ప్రస్ఫుటంగా కనిపించాలి. రచయిత వ్యక్తిత్వం పెరిగితే వ్యాసంలో సృజన ధర్మం పెరుగుతుంది.

వ్యాసంలో పైన చెప్పిన ఏడు లక్షణాలు ఉండాలనే నియమం లేదు. కొన్ని లక్షణాలు లోపించవచ్చు. కాని వ్యాసానికి చదివించే గుణం ముఖ్యమైనది. అది రచయిత నైపుణ్యంపై ఆధారపడి ఉంటుంది. పై లక్షణాలతో ఈ క్రింది లక్షణాలు ఉన్న వ్యాసం గొప్ప వ్యాసమవుతుంది.

1. వ్యాసం సుదీర్ఘంగా కాకుండా సంగ్రహంగా, భావస్ఫూర్తి కలిగించేలా ఉండాలి.
2. వ్యాసానికి ఆకర్షణీయమైన శీర్షిక ఉండాలి.
3. వ్యాసాన్ని విషయాన్ని బట్టి విభాగాలుగా చేసి, ఒక్కో విభాగంలో ఒక్కో విషయం గురించి మాత్రమే చెప్పాలి.
4. వ్యాసంలో ఉండే భాష సరళ సుందరంగా, సూటిగా, తేలికగా, అర్థమయ్యేటట్లు ఉండాలి.

## 6.4. వ్యాసం - భేదాలు:

వ్యాసాల్లో ఉండే విషయాలను బట్టి వ్యాసాలను అనేక విధాలుగా వర్గీకరించారు. వానిలో ముఖ్యమైన వాటిని తెలుసుకుందాం.

1. సాహిత్య వ్యాసాలు:-

సాహిత్యానికి సంబంధించిన వ్యాసాలను సాహిత్య వ్యాసాలు అంటారు. కట్టమంచి రామలింగా రెడ్డి పాశ్చాత్య విమర్శ దృష్టితో చేసిన విమర్శతో కవిత్వతత్వ విచారం రచించారు. ఇది గొప్ప విమర్శ గ్రంథంగా పేరు పొందింది. ఆయన పద్ధతిలోనే తరువాతి విమర్శకులు సాహిత్య విమర్శ చేశారు. సాహిత్య విమర్శ చేసిన వారిలో రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మ, విశ్వనాథ సత్యనారాయణ, చలం, వేటూరి ప్రభాకరశాస్త్రి వంటివారు ప్రసిద్ధులు.

2. భాషా వ్యాసాలు :-

భాషకు సంబంధించిన విశేషాలు, సమస్యలు, భాషా పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలు తదితర విషయాల గురించి రాసే వ్యాసాలను భాషా వ్యాసాలు అంటారు. ఇలాంటి వ్యాసాలు రాసిన వారిలో గిడుగు రామ్మూర్తి పంతులు, గురజాడ అప్పారావు, కొమర్రాజు లక్ష్మణరావు, చిలుకూరి నారాయణ రావు, కోరాడ రామకృష్ణయ్య, గంటిజోగి సోమయాజులు ముఖ్యులు.

3. శాస్త్రీయ వ్యాసాలు :-

శాస్త్రీయ విషయాల్ని తీసుకొని వీటి మీద వ్యాసాలు రాసినవారిలో కాళీపట్నం కొండయ్య ఒకరు. ఖగోళ శాస్త్రానికి సంబంధించి గొబ్బూరి వెంకటానంద రాఘవరావు వ్యాసాలు రాశారు. ఆధునిక కాలంలో నండూరి రామమోహనరావు విశ్వరూపం, నరావతారం అనే గ్రంథాలను రచించారు. శ్రీపాద గోపాల కృష్ణమూర్తి ఐన్‌స్టీన్ సాపేక్ష సిద్ధాంతం గురించి జమ్మి కోనేటిరావు జంతుశాస్త్ర సంబంధ వ్యాసాలు రచించారు. శారీరక విజ్ఞానానికి సంబంధించి బాలసుందరరావు, సర్వేశ్వరశర్మ తదితరులు వ్యాసాలు రాశారు.

4. కళా వ్యాసాలు :-

లలిత కళలకు సంబంధించిన వ్యాసాలను కళా వ్యాసాలు అంటారు. వీనిలో చిత్రకళకు సంబంధించినవి అధికం. దామెర్ల రామారావు, అడవి బాపిరాజు, పైడి రాజా తదితరులు ఈ వ్యాసాలు రాశారు.

5. పరిశోధన వ్యాసాలు :-

ఇప్పుడు వివిధ విశ్వవిద్యాలయాల్లో, వివిధ విషయాలపై పరిశోధనలు చేసి వ్యాసాలు సమర్పిస్తున్నారు. ఈ పరిశోధనా వ్యాసాల్లో మొదటిది చిలుకూరి నారాయణరావు గారి 'ఆంధ్రభాషా చరిత్రము'. ఇది తెలుగులో మొదటి పిహెచ్.డి. సిద్ధాం వ్యాసం తెలుగు భాషలో డి.లిట్ పొందిన మొదటి వ్యాసం కొర్లపాటి శ్రీరామమూర్తి గారి 'ఈశ్వరార్చన కళాశీలుడు', భాషా సాహిత్యాల్లో వందలాది పరిశోధన వ్యాసాలు వస్తున్నాయి..

6. చారిత్రక వ్యాసాలు:-

చరిత్రలో మరుగునపడిన విషయాలను, శాసనాల వల్ల బయటపడిన విషయాలను, ఇంకా పరిశోధన వల్ల వెలుగు చూసే అనేక చారిత్రక విషయాలను గురించిన వ్యాసాలు చారిత్రక వ్యాసాలు. ఇటువంటి వ్యాసాలు రాసిన వారిలో మామిడిపూడి వెంకట రంగయ్య, మల్లంపల్లి సోమశేఖర శర్మ, నేలటూరి వేంకట రమణయ్య సురవరం ప్రతాపరెడ్డి, కొమర్రాజు లక్ష్మణరావు వంటివారున్నారు. కొన్ని చారిత్రక వ్యాసాలు సంపుటాలుగా వచ్చాయి. వాటిలో రాజరాజ నరేంద్రుని పట్టాభిషేక సంచిక, కళింగ సంచిక, కాకతీయ సంచిక, రెడ్డి సంచిక

వంటివి ఉన్నాయి.

**7. సాంఘిక వ్యాసాలు :-**

సాంఘిక సమస్యలను, దురాచారాలను గురించి రాసిన వ్యాసాలు ఇవి. పానుగంటి వారి సాక్షివ్యాసాలు ఈ వ్యాసాల్లో ముఖ్యమైనవి. వీటిలో మత, నైతిక, తాత్త్విక విషయాలకు సంబంధించిన వ్యాసాలున్నాయి.

**8. రాజకీయ వ్యాసాలు :-**

రాజకీయాలకు సంబంధించిన వ్యాసాలు ఇవి. రాజకీయ పరిస్థితులను అర్థం చేసుకొని రాసే వ్యాసాలు రాజకీయ వ్యాసాలు ఇవి పత్రికల్లో ప్రచురించబడతాయి. ప్రభుత్వ పాలనా విధానం, రాజకీయ నాయకుల అవినీతి, ప్రభుత్వ విధానాల పట్ల విమర్శ, ప్రభుత్వ పెద్దల అక్రమార్జన వంటివి వీనిలో వస్తువులవుతాయి. ఒక్కోసారి ఈ వ్యాసాలు ధారావాహికగా వస్తాయి. ఇలాంటి వ్యాసాలను సాధారణంగా రాజకీయ విశ్లేషకులు, పాత్రికేయులు రాస్తారు.

**9. ఆర్థిక వ్యాసాలు :-**

ధన వ్యవహారాలకు సంబంధించిన వ్యాసాలను ఆర్థిక వ్యాసాలు అంటారు. కట్టమంచి రామలింగారెడ్డి, కొచ్చెర్లకోట సత్యనారాయణ వంటివారు ఈ వ్యాసాలను రాశారు.

**10. జీవిత చరిత్ర వ్యాసాలు:-**

జాతీయ నాయకులు అంబేద్కర్, గాంధీ, నెహ్రూ లాంటి మహా పురుషులు, ప్రముఖమైన చారిత్రక వ్యక్తులు, సుప్రసిద్ధులైన కవి జీవిత చరిత్రల్ని గురించి రాసే వ్యాసాలను జీవిత చరిత్ర వ్యాసాలు అంటారు. కందుకూరి వీరేశలింగం, బండారు అచ్చమాంబ, చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు తదితరులు జీవిత చరిత్ర వ్యాసాలు రాశారు.

**11. సంపాదకీయ వ్యాసాలు:-**

పత్రికల్లో సంపాదకుడు రాసే వ్యాసాలను సంపాదకీయ వ్యాసాలు అంటారు. తెలుగులో దిన, వార, పక్ష, మాస పత్రికలు ఎన్నో ఉన్నాయి. ఆ పత్రికల్లో సంపాదకీయ వ్యాసాలు ముద్రితమవుతున్నాయి. గొప్ప సంపాదకీయ వ్యాసాలు రాసిన వారిలో కందుకూరి, ముట్నూరి కృష్ణారావు, తాపీ ధర్మారావు, నార్ల వేంకటేశ్వర రావు, రాఘవాచారి , ఎ.బి.కె. ప్రసాద్ వంటివారు ప్రముఖులు.

**12. సమీక్షా వ్యాసాలు :-** దిన, వార, పక్ష, మాస, త్రైమాస పత్రికల్లో పుస్తకాల్ని సమీక్షిస్తూ రాసే వ్యాసాలనే సమీక్షా వ్యాసాలంటారు. తెలుగులో ఎప్పుడు పత్రికలు ప్రారంభమయ్యాయో అప్పుడినుండే ఈ సమీక్షా వ్యాసాలు రావడం మొదలైంది. సాధారణంగా ఈ వ్యాసాలను సంపాదకుడు గాని, విమర్శకుడు గాని రాస్తారు. ఈ వ్యాసాలు నిష్పాక్షికంగా ఉండాలి. ఇలాంటి వ్యాసాలు రాసిన వారిలో బూదరాజు రాధాకృష్ణ, పోరంకి దక్షిణామూర్తి, కేతు విశ్వనాథరెడ్డి, ద్వా.నా. శాస్త్రి ప్రముఖులు.

13. ఉపోద్ఘాతాలు:-

పుస్తకాల్లో ఉపోద్ఘాతాలు, పీఠికలు, ముందుమాట మొదలైన పేర్లతో ఇవి ఉంటాయి. ఉపోద్ఘాతాల

రచనలో విశ్వనాథ సత్యనారాయణ, చిలుకూరి నారాయణరావు, చలం, నార్ల వేంకటేశ్వర రావు, శ్రీశ్రీ, సంజీవ దేవ్ తదితరులు ప్రసిద్ధులు.

**14. అధిక్షేప వ్యాసాలు :-**

ఈ వ్యాసాలు హాస్యం, వ్యంగ్యం ప్రధానంగా ఉంటాయి. సమాజంలోని లోపాలను విమర్శిస్తూ, అవహేళన చేస్తూ రచన చేయడం ఈ వ్యాసాల్లో కనిపిస్తుంది. ఈ వ్యాసాల్లో, రచయిత హాస్యాన్ని జోడిస్తూ చురకలు వేస్తాడు. మునిమాణిక్యం, మొక్కపాటి, పానుగంటి, భమిడిపాటి, కొడవటిగంటి కుటుంబరావు మొదలైన వాళ్ళు అదిక్షేప వ్యాసాలు రాశారు.

ఈ వ్యాసాలతో పాటు ఉపదేశాత్మక, విశ్లేషణాత్మక, భావనాత్మక, సంభాషణాత్మక వ్యాసాలంటూ మరికొన్ని వ్యాసాలు కనిపిస్తాయి.

ఈ విధంగా తెలుగులో వ్యాస పరిణామ వికాస భేదాలు కనిపిస్తాయి.

**మాదిరి ప్రశ్నలు**

## I. వ్యాసరూప ప్రశ్నలు

1. వ్యాసం ఆవిర్భావ వికాసాలను తెలపండి.
2. ఉత్తమ వ్యాస లక్షణాలను వివరించండి.
3. వ్యాసాల్లో భేదాలను వివరించండి.

## II సంక్షిప్త సమాధాన ప్రశ్నలు

1. 'వ్యాసం' అనే పదానికి వ్యుత్పత్తిని, నిర్వచనాన్ని వివరించండి
2. చారిత్రక వ్యాసాలను గూర్చి రాయండి.

## III ఆధార గ్రంథాలు

1. చదువు - సంస్కృతి - కొడవటిగంటి కుటుంబరావు.

**డా॥ టి. ఓగేశ్వరరావు**
తెలుగు అధ్యాపకులు
వి.వి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల
దుంపలగూడెం
పశ్చిమగోదావరి జిల్లా

# పాఠం - 7
# అనువాద రచన

**పాఠ్యాంశ నిర్మాణ క్రమం :**

7.1 అనువాద నిర్వచనం

7.2 . అనువాద స్వరూప స్వభావాలు

7.3. అనువాద నియమాలు

7.4. అనువాద రకాలు

## 7.1. అనువాదం నిర్వచనం :

"ఈ సృష్టిలో మానవున్ని ఇతర జంతువుల నుంచి వేరు చేసే గొప్ప లక్షణం భాషించడం లేదా మాట్లాడటం, ఒక మనిషి తన మనస్సులోని భావాలను ఎదుటి వ్యక్తికి అర్థమయ్యేలా వివరించడానికి ఉపకరించు సాధనం భాష. ప్రపంచంలో వున్న భాషలన్నీ నేర్చుకోగలగడం ఎవరికీ సాధ్యమయ్యే పనికాదు. మరి ప్రపంచ జ్ఞానం పొందడం ఎలాగా అంటే దానికి సమాధానం అనువాదమే. ఒక భాషలో పుట్టిన గొప్ప సాహిత్యం ఇతర భాషల వారికి అందాలన్నా అలాగే మన భాషలో ఉన్న సాహిత్యం ఇతర భాషలకు చెందినవారు చదివి ఆస్వాదించాలన్నా అవసరమయ్యే సాధనం అనువాదం.

* ఒక భాషలోని సమాచారాన్ని మరొక భాషలో ప్రకటించే పద్ధతినే అనువాదమని, తర్జుమా అని ఉంటారు. ఏ భాష లోని భావాలను అనువాదం చెయ్యాలనుకుంటున్నామో ఆ భాషని మూలభాష (source languages) అంటారు. ఏ భాషలోకి అనువాదం చెయ్యాలనుకుంటున్నామో అది లక్ష్యభాష (Target language) అంటారు. అనువాదమంటే మూలభాషలోని సమాచారాన్ని లక్ష్య భాషలో వెల్లడించడమన్న మాట.

* వద్ అను ధాతువునకు 'అను' అనే ఉపసర్గ చేరడం వలన అనువాదం అనే పదం ఏర్పడుతుంది. దీనిని మరలా చెప్పడం అని అర్థం.

* తెలుగు నిఘంటువులు అనువాదం అను పదానికి "ఒకరు చెప్పిన దానిని మరల చెప్పుట"' అనే అర్థాన్నిచ్చాయి. ఆంగ్లంలో దీనిని 'Translation' అంటారు.

*ఒక భాషలో ఉన్న విషయపాఠాన్ని మరో భాషలోకి సమానార్థక పాఠంగా మార్చే ప్రక్రియ అనువాదం" - కీట్‌ఫర్ట్. The replacement of Textual material in one language be equalent of textual material in another language.

## 7.2. అనువాద స్వరూప స్వభావాలు:

* తెలుగు సాహిత్యంలో అనువాదం ఈనాటిది కాదు. వాస్తవంగా చెప్పాలంటే తెలుగు లిఖిత సాహిత్యంలో మహాభారతానువాదం మనం గమనించవచ్చు. వైదికమత వైశిష్ట్యాన్ని తెలుగు ప్రజలకు తెలపడానికి నన్నయ,

తిక్కన, ఎర్రనాదులు మహాభారతాన్ని సంస్కృతం నుండి తెలుగులోకి అనువదించారు.

* ఒక భాష లోని సంస్కృతి, శాస్త్రవిజ్ఞానమును వెరొక భాషలోకి అందించడానికి ఏకైక సాధనం అనువాదం మాత్రమే.

* అనువాదంలో మనం దుబాసి అనే మాటను వింటుంటాము. 'దుబాసి'నే ఆంగ్లం లో "Interpretor" అంటారు. దుబాసి అనే మాట సంస్కృత భాష నుంచి వచ్చింది. దీని మూలరూపం ద్విభాషి. ద్విభాషి అంటే రెండు భాషలు మాట్లాడగలిగేవాడని అర్థం.

ఉదాహరణకు ఇంగ్లీషు మాత్రమే తెలిసిన వ్యక్తి తెలుగు మాత్రమే తెలిపిన వ్యక్తి తో మాట్లాడాలనుకుంటే వారివురి మధ్య రెండుభాషలూ తెలిసిన వ్యక్తి అవసరం వుంది. ఆ వ్యక్తి రెండు భాషల్లోనూ అటూ ఇటూ సమాచార వినిమయానికి తోడ్పడతాడు. ఈ విధానాన్ని దుబాసించడం (Intepretation) అని, ఆ వ్యక్తిని దుబాసి (Interpretor) అని అంటారు.

## 7.3. అనువాద నియమాలు (ప్రమాణాలు)

* అనువాదం చేయాలనుకునే వ్యక్తికి మూలభాష లోను, లక్ష్య భాషలోనూ, భాషకు సంబంధించి, వ్యాకరణంకు సంబంధించి, సామెతలు, జాతీయాలు, నుడికారాలకు సంబంధించి పూర్తి పరిజ్ఞానం వుండాలి.

* అనువాదం చేసేటప్పుడు మూలభాషలో కొన్ని దోషాలు గమనిస్తే వాటిని యధాతథంగా కాకుండా సరైన వాటిని లక్ష్యభాషలోకి తీసుకురావాలి.

* మూల భాషలో వున్న పదాలకు అర్థాలను కాకుండా విషయార్థాన్ని గ్రహించి అనువాదం చెయ్యాలి.

* సాంకేతిక పదాలను అనువాదం చేసేటప్పుడు వాటిని యధాతథంగా అనువాదం చెయ్యవచ్చు. ఉదాహరణకు రేడియో, టెలివిజన్, సినిమా వంటి పదాలను యధాతథంగా అనువాదం చెయ్యవచ్చు.

* మూలభాష లో విషయం ఎంత సరళంగా చెప్పబడిందో లక్ష్య భాషలోకి కూడా అంతే సరళంగా అనువాదం చెయ్యాలి. అనువాదం పాఠకులకు విషయ అవగాహన కొరకు మాత్రమే కాని, అనువాదకుల పాండిత్య ప్రదర్శనకు కాదని గ్రహించాలి.

* మూల భాష లోని శైలి విధానాన్ని, రచనా విధానాన్ని యథాతథంగా లక్ష్యభాషలోకి తీసుకురావడానికి అనువాదకుడు ప్రయత్నం చెయ్యాలి.

* ఒక్కొక్కసారి మూల భాషలోని కొన్ని పదాలు లక్ష్యభాషలలో దొరకకపోవచ్చు. అటువంటి సందర్భంలో భావానికి భంగం వాటిల్లకుండా సమానార్థక పదాలనుపయోగించి అనువాదం చెయ్యాలి.

* అమవాదకుడు మూలగ్రంథం రచించిన సమయం నాటి సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితుల పట్ల అవగాహన కలిగివుండాలి. అప్పుడు మాత్రమే విషయాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకొని, సమర్ధవంతమైన అనువాదం చెయ్యగలరు.

## 7.4 అనువాద రకాలు :

అనువాదం చేసే విషయాన్ని బట్టి అనువాదం 5 రకాలు అవి :

1. సమాచారానువాదం
2. వచన సాహిత్యనువాదం.
3. కవిత్వానువాదం
4. వైజ్ఞానిక సాంకేతికానువాదం /శాస్త్రానువాదం
5. నుడికారపు అనువాదం
6. సాహితీ ప్రక్రియల అనువాదం

### 1. సమాచారానువాదం :-

వార్తలను అధికారిక విధి విధానాలను పరిపాలనా వ్యవహారాలను, ప్రభుత్వ ఉత్తర్వులను అనువాదం చేయడాన్ని సమాచారనువాదం అంటారు.

### 2. వచన సాహిత్యానువాదం :-

"వచన సాహిత్యంలో మానవుల భావాలు, ఆలోచనలూ, అనుభూతులు, ఉద్వేగాలు చిత్రీకరించబడి వుంటాయి. ఈ క్రమంలో అర్థ విశేషాలు వాడబడతాయి. కాబట్టి వీటిని అనువాదం చేసేటప్పుడు వాటి సందర్భాన్ని, పరిస్థితులను అవగాహన చేసుకొని భావాన్ని అనువాదం చెయ్యాలి అప్పుడు మాత్రమే సమర్థవంతమైన అనువాదం సాధ్యమవుతుంది.

### 3. కవిత్వానువాదం :-

వచన సాహిత్య శిల్పం కంటే కవిత్వశిల్పం వేరుగా వుంటుంది. కవిత్వంలో అలంకారాలు, పదాల కల్పన, ప్రాస వచన కవిత్యం కంటే వేరుగా వుంటుంది, ఇక్కడ పదాల అర్థాల కంటే కూడా కవి మనస్సును సహృదయతో దర్శించగలగాలి, కవిలా ఆలోచించాలి. అందుకే ఏ భాషలోనైనా కవిత్వమును అనువాదం చేయడం దాదాపు అసాధ్యమని అంటారు.

### 4. వైజ్ఞానిక సాంకేతికానువాదం / శాస్త్రానువాదం :-

ఒక విధంగా ఈ అనువాదమును ఫోటోగ్రఫీ తో పోల్చవచ్చు. ఆంగ్లంలో వున్న శాస్త్ర, సాంకేతిక గ్రంథాలను ప్రాంతీయ భాషల్లోకి అనువాదం చేయడానికి ఈ పద్ధతిని ఉపయోగిస్తారు శాస్త్ర, సాంకేతిక రంగాలకు చెందిన భాష ఒకరకంగా ప్రత్యేకమైనది . 'ఆయా రంగాలకు మాత్రమే పరిమితమైంది. అనువాదకునికి శాస్త్ర, సాంకేతిక రంగాలతో పరిచయం వున్నప్పుడు మాత్రమే ఇది సాధ్యమవుతుంది. అంటే ఈ అనువాదానికి భాషాజ్ఞానం ఒక్కటే సరిపోదు, శాస్త్ర, సాంకేతిక జ్ఞానం కూడా తప్పనిసరి. ఈ అనువాదం విషయంలో ముఖ్యంగా పారిభాషక పదాలను సృష్టించుకోవడం కష్టం. కొన్ని పదాలకు పారిభాషిక పదాలను సృష్టించగలం. ఉదాహరణకు నైట్రోజన్ అను పదమునకు నత్రజని అని చెప్పగలం కాని, కొన్ని పదాలకు పారిభాషిక పదాలను స ృష్టించలేము.. అటువంటి సమయంలో ఆంగ్లపదాలనే లిప్యంతరీకరణం చేసి అనువాదం చేయడం మనం గమనిస్తుంటాము.

**5. నుడికారపు అనువాదం :-**

ఒక భాషలో ఉన్న సామెతలు, జాతీయాలు, నుడికారాలు ఆ భాషకు మాత్రమే ప్రత్యేకమైనవి. వాటిని వేరొక భాష లోకి అనువాదం చేసేటప్పుడు అనువాదకుడు లక్ష్యభాషలో వాటికి సమానార్థకాలైన జాతీయాలను, సామెతలను, నుడికారాలను వాడాలి.

**ఉదా :-** Don`t teach Fish to Swim - English

చేపపిల్లకు ఈత నేర్పాలా - తెలుగు

Trust not a broken Staff - English.

కుక్కతోక పట్టుకొని గోదావరి ఈదినట్లుంది. - తెలుగు.

పై అనువాదాలను పరిశీలించినట్లయితే ఇక్కడ పదాల అర్థాల అనువాదం కనిపించదు. మూలభాష లో వాడిన జాతియాలు, సామెతలు లక్ష్యభాషలో ఏ జాతీయాల తో సరిపోతాయో పోల్చుకొని చేసే అనువాదం పాఠకులని ఆకర్షిస్తుంది.

**6. సాహితీ ప్రక్రియల అనువాదం :-**

నవల, కథానిక, గజల్స్ మొదలగు ప్రక్రియలు ఇతర భాషల ప్రభావంతో తెలుగులోకి ప్రవేశించాయి. ఆ క్రమంలో ఇతర భాషల్లో వున్న వివిధ సాహితీ ప్రక్రియలకు సంబంధించిన రచనలు కూడా అనువాదం చేయబడతాయి. ఉదాహరణకు ఆంగ్లంలోని అనేక నవలలు తెలుగులోకి అనువదించబడ్డాయి అలాగే తెలుగు నవలలు కూడా ఆంగ్లంలోకి అనువదించబడ్డాయి. సాహితీ ప్రక్రియల్లో వుండే హాస్యం, భావోద్రేకం సాంస్కృతిక వైరుధ్యాలను జాగ్రత్తగా అనువాదం చెయ్యాలి.

మూలభాషలోని అంశాన్ని లక్ష్యభాష లోకి ఏ పద్ధతిలో తీసుకువస్తున్నాము, ఏ విధానాన్ని అనుసరిస్తున్నాము అనే అంశాన్ని బట్టి అనువాదాన్ని రెండు రకాలుగా విభజించవచ్చు.

1. మూల విధేయానువాదం (Literal or Faithful)
2. స్వేచ్ఛానువాదం (free or Idiomatic Translation).

**1 మూల విధేయానువాదం:-**

మూలానికి కట్టుబడి చేసే అనువాదాన్ని మూల విధేయానువాదం అంటారు. అంటే మూల భాషలోని ప్రతి అంశాన్ని వున్నది వున్నట్టు అనువదించడం. ఈ అనువాదంలో, అనువాదకుడికి స్వేచ్ఛవుండదు. మూల విధేయానువాదంలో ముఖ్యంగా క్రింది లక్షణాలుండాలి.

1. అనువాదం చదివినా మూలం చదివినట్లే వుండాలి : అనువాదకుడు స్వతంత్ర రచయిత కాదు. మూలాన్ని అనువాదం చేస్తున్నాడు. కావున సాధ్యమైనంత వరకు మూల రచయిత భావాలనే అనువాదం చెయ్యాలి.

2. మూలం లోని రచనా విధానమే కనిపించాలి :- మూలరచయిత వాడిన శైలి విధానాన్నే అనుసరించి అనువాదం చెయ్యాలి.

**ఉదా :-**

Hand work is an essential thing. we all need in life. It is impossible to achieve greatness without

working hard. In other words, an idle person cannot gain anything if they wish to sit and wait for something else. on the other hand one who keeps working hard Constantly will deffinitely gain success in life.

మనందరి జీవితంలో కష్టపడి పనిచేయడమనేది అత్యంత ముఖ్యమైనది. కష్టపడి పని చేయకుండా గొప్ప స్థానాన్ని సాధించడం అసాధ్యం. వేరొక దాని గురించి ఎదురుచూస్తూ ఈ నిమిషం ఖాళీగా కూర్చుంటే అతను ఏదీ సాధించలేడు. అలా కాకుండా నిరంతరం శ్రమిస్తూ నిలకడగా కష్టపడే వ్యక్తికి విజయం తప్పకుండా వరిస్తుంది.

పై అనువాదమును గమనించినట్లయితే మూలం లోని భావం, అర్థం మారకుండా అనువాదం చేయబడింది.

**స్వేచ్ఛానువాదం:-**

మూల భాషలోని భావాలను లక్ష్యభాషలో స్వతంత్రంగా అనువదించే విధానాన్ని స్వేచ్ఛానువాదం అంటారు. ఈ అనువాద విధానంలో అనువాదకుడు మూలంలోని భావం చెడకుండా తనదైన శైలీ రీతిలో అనువాదం చేయవచ్చు.

1) మూల భాషలోని భావాలను లక్ష్యభాషలోకి తీసుకువచ్చేటప్పుడు మక్కికి మక్కి అనువాదం చేయనవసరం లేదు. లక్ష్యభాషలో తగిన పదబంధాలను సందర్భానుసారం అందించవచ్చు.
2) లక్ష్యభాష నుడికారానికి సహజమైన రీతిలో చెప్పే స్వేచ్ఛ ఈ అనువాదంలో వుంటుంది. కనుకనే ఈ అనువాద రచన స్వతంత్ర రచనలా అనిపిస్తుంది.
3) అనువాదకుడు లక్ష్యభాషకు అనుగుణమైన శైలిలో అనువాదం చేయవచ్చు.
4) మూలం ఏ కాలానికి చెందినదో ఆ కాలం నాటి రచనలాగానే అనువాద రచన వుండాలి.
5) లక్ష్యభాషకు అనుగుణంగా పాత్రల పేర్లు, ఊర్ల పేర్లు, నుడికారాలు మార్చవచ్చు. ఉదా॥
    1. నన్నయ ఆంధ్రమహాభారత ఆంధ్రీకరణ విధానం స్వేచ్ఛానువాదమే.
    2. చెహూవ్ రాసిన "The cherry orchard " అను నాటకం ను శ్రీశ్రీ "సంపెంగ తోట" గా తెలుగులోకి స్వేచ్ఛానువాదం చేశారు.

పై అనువాద పద్ధతులతో పాటు ప్రస్తుత కాలంలో యాంత్రిక అనువాదం లేదా కంప్యూటరీకరణ అనువాదం చూస్తున్నాం. అంటే కంప్యూటర్ సహాయంతో అనువాదం చెయ్యడం.

## అభ్యాసము

### I. వ్యాసరూప ప్రశ్నలు

1. అనువాదమును నిర్వచించి, దాని స్వరూప స్వభావాలను, ప్రమాణాలను తెలపండి.
2. అనువాద పద్ధతులను వివరించండి.

### II. లఘు సమాధాన ప్రశ్నలు

1. అనువాదమును నిర్వచించండి.
2. అనువాదము ఆవశ్యకతను తెలపండి?
3. స్వేచ్ఛానువాదము ఆవవ్యకతను తెలపండి?
4. మూల విధేయానువాదం గురించి సోదాహరణంగా వివరించండి?
5. అనువాద ప్రమాణాలను తెలపండి?

-షేక్ జరీనా బేగం
ప్రభుత్వ డిగ్రీ కళాశాల
రాజమండ్రి, ప.గో.జిల్లా

# పాఠం - 8

# అనువాద సమస్యలు

అనువాదకుడు మూలభాష నుంచి విషయాన్ని లక్ష్యభాషలోకి అనువాదం చేసేటప్పుడు అనేక సమస్యలు ఎదురవుతాయి.

అవి :

1 భాషా సంబంధమైనవి

2 సాంస్కృతిక సంబంధమైనవి

3. భౌగోళిక సమస్యలు

4. వ్యాకరణ పరమైన సమస్యలు.

**1. భాషా సంబంధమైనవి :-**

అనువాదంలో వున్న రెండు భాషలకు సంబంధించిన సమస్యలు భాషా సంబంధమైనవి.

* ప్రతి భాష లోను ధ్వని రీతులు వేరు వేరుగా వుంటాయి వాటిని లిప్యంతరీకరణం చేసేటప్పుడు ఉచ్ఛారణకు లోబడే అక్షరాలు వాడాలి.

* మూల భాషలోని పదాలకు సందర్భానుసారం వచ్చిన అర్థాలను తెలుసుకోలేకపోవడం ఉదాహరణకు Temple అను పదమునకు దేవాలయము, మందిరము అనే అర్థాలున్నట్లే కణత అనే అర్థం కూడా వుంది.

* భాష నిరంతరం అభివృద్ధి చెందుతూ వుంటుంది. ఈ క్రమంలో ఒక భాషలో వున్న పదాలు మరొక భాషలో లభించవు. ఉదాహరణకు ఆంగ్లభాషలోని అనేక పదాలు తెలుగు భాషలో లభించవు ఉదాహరణకు facebook, Twitter, Instagram వంటి ఆంగ్లపదాలకు తెలుగు పదాలు రాయలేము.

* వాక్య నిర్మాణం ఒక్కొక్క భాషలో ఒక్కొక్క విధంగా వుంటుంది. ఆంగ్ల భాషలో కర్త, కర్మ, క్రియ క్రమానికీ, తెలుగులోని కర్త, కర్మ, క్రియ క్రమానికి భేదం వుంది.

**ఉదా :-** Teacher is in a Bus

ఉపాధ్యాయుడు బస్సులో వున్నారు.

పై ఉదాహరణలో కర్త, కర్మ, క్రియ క్రమం మారిన విధానాన్ని గమనించవచ్చు.

**2. సాంస్కృతిక సంబంధమైనవి**

యూరోపియన్ సంస్కృతికీ, భారతీయ సంస్కృతికీ చాలా వ్యత్యాసముంటుంది అక్కడి వివాహవ్యవస్థ, కటుంబవ్యవస్థ, బంధుత్వాలు, ఆచారవ్యవహారాలు భిన్నంగా వుంటాయి. వీటి కారణంగా, అనువాదంలో సమస్యలు ఏర్పడతాయి.

* మధ్యయుగానికి చెందిన యూరప్ జీవన చిత్రణలో వాడిన knight వంటి పదాలు ఇప్పుడు

ప్రయోగం లో వుండవు అటువంటప్పుడు వాటికి సమానార్థకాలు తెలుగులో దొరకవు

* బంధుత్వాలకు సంబంధించిన పదాలలో కూడా వ్యత్యాసం వుంటుంది. మనకు మేనమామ, బాబాయి అనే రెండు పదాలు వుంటాయి. కానీ, ఆంగ్లం లో కేవలం "Uncle" అనే పదం మాత్రమే వుంటుంది. అలాగే "Aunt, Cousin" అనే పదాలను గమనించవచ్చు.
* ఆంగ్లం'లోని Home, House అనే పదాలకు తెలుగులో ఇల్లు అను ఒక పదాన్నే వాడతాము. Ceiling, అనే మాటకు సమానార్థక పదం లేదు.
* జీవనవిధానం తెలిపే కొన్ని పదాలను అనువాదం చెయ్యలేము వాటిని లిప్యంతరీకరణం చేసుకోవచ్చా? అనేది అనువాద సమస్యగా మిగిలిపోయింది. ఉదా :- స్కేటింగ్

### 3. భౌగోళిక సమస్యలు

ఒక ప్రాంత ఒక జాతి యొక్క ఉనికి భాష అని అంటారు. అందుకే భాషను జాతి పరంగా, ప్రాంతం పరంగా మరియు భాషాపరంగా వాడతారు. ఉదాహరణకు తెలుగు అనే భాషా పదాన్ని తెలుగోళ్ళు అని జాతిపరంగా, తెలుగు ప్రాంతం అని భౌగోళిక పరంగా వాడటం మనం గమనించవచ్చు. ఒక భాష మాట్లాడే ప్రజలు భౌగోళికం గా ఒక ప్రాంతంలో ఎక్కువగా వుంటారు. అటువంటప్పుడు వారి భౌతిక జీవనం, సాంఘిక జీవనం, మతవిశ్వాసాలు భాషపై ప్రభావం చూపుతాయి.

ఉదాహరణకు ఆంగ్లంలో Ice, snow, dew, mist, fog frost అనే వేరు వేరు ఆరు పదాలు కనిపిస్తాయి. వీటిని అనువాదం చేయవలసివచ్చినప్పుడు తెలుగులో మంచు, చలిమంచు, పొగమంచు పదాలు మాత్రమే వున్నాయి. అలాగే తెలుగులో పొడఎండ, మండుటెండ పొద్దుటెండ, నీరెండ, మూసెండ అనే పదాలు ఎండకు సంబంధించి వున్నాయి. కానీ, ఆంగ్లంలో Sunny అనే ఒక్క పదం మాత్రమే వుంది.

ఈ విధంగా శీతోష్ణ భేదాల వలన భౌతిక జీవనం లోని వ్యత్యాసాల వలన కూడా అనువాదంలో, సమస్యలు ఏర్పడతాయి.

### 4. వ్యాకరణ సంబంధమైన సమస్యలు

లేఖన చిహ్నాలు, వచనాలు, లింగాలకి సంబంధించిన సమస్యలు అనువాదంలో కనిపిస్తాయి.

* ఆంగ్లంలో ప్రధాన వాక్యం నుంచి ఉపవాక్యంను వేరుచేస్తు Hyphen (-) ను వాడతారు. ఉదా:- Co-director, Sub-Inspector ఇలాంటి పదాలను మనం తెలుగులోకి అనువదించేటప్పుడు సబ్ఇన్స్పెక్టర్ అని కలిపి రాస్తాము.
* ఆంగ్లంలోని విభక్తులకు తెలుగులో యధాతథంగా అర్థం ప్రకారం అనువాదం చెయ్యలేము. ఉదాహరణకు on, in అనే విభక్తులు సందర్భాన్ని బట్టి మారుతూ వుంటాయి. వాటి అర్థాన్ని యధాతథంగా తీసుకోలేము.

**ఉదా:-** "in" అంటే "లో" "on" అంటే "మీద" అని సామాన్య అర్థాలు.

I saw her on my way to the school అనే వాక్యాన్ని " నేను బడికి వెళ్ళే దారిలో ఆమెను చూసాను" అని రాయాలి అంతేకానీ, "నేను బడికి వెళ్ళే దారి మీద ఆమెను చూసాను" అనా అనువదించకూడదు. ఇది ఒక

అనువాద సమస్య.

* ఆంగ్లంలో People అనే ఏకవచన పదానికి 'ప్రజలు అని వాడుతాము, Peoples అనే బహువచన పదానికి ప్రజలు ఆనే వాడతాము "news" అనేది ఏకవచన పదం కాని దీనిని కొన్ని సార్లు వార్తా అనే ఏకవచనంగా వాడుతాం, కొన్నిసార్లు వార్తలు అనే బహువచనంగా వాడతాం.

* ఆంగ్లం లో మనకి who, what, which అనే పదాలలో "ఉపవాక్యాలని నిర్మిస్తారు. తెలుగులో అలాంటి ప్రయోగం సహజంగా అనిపించదు.

* అనువాదంలో లింగపరమైన సమస్యలను అధికంగా ఎదుర్కొంటాము. ఆంగ్లంలో క్రియలకు లింగాలుండవు స్త్రీ పురుషులిరువురికి ఒక క్రియారూపం వుంటుంది.

**ఉదా :-** Kiran is singing అన్నప్పుడు కిరణ్ పులింగానికి సంబంధించినదా? స్త్రీ లింగానికి సంబంధించినదా? అనేది తేల్చి చెప్పలేము. అదే తెలుగులో స్త్రీ అయితే కిరణ్ పాడుతుంది అని పురుషుడైతే పాడుతున్నాడు అని రాస్తాము.

**ఉదా:-** friend is Going అంటే అక్కడ కూడా లింగమును గుర్తించి అనువాదం చెయ్యడం సమస్యగా మారుతుంది.

అనువాదానికి సంబంధించి పైన పేర్కొనబడిన సమస్యలను అనువాదకుడు జాగ్రత్తగా విచక్షణతో పరిష్కరించి అందరికీ ఆమోదమయ్యే విధంగా అనువాదం చెయ్యాలి.

## అభ్యాసము

### I. వ్యాసరూప ప్రశ్నలు

1. అనువాదంలో సాంస్కృతిక సమస్యలను గూర్చి రాయండి.
2. అనువాదంలో వ్యాకరణ సమస్యలను చర్చించండి.
3. అనువాదంలో ఎదురయ్యే భాషా సమస్యలను తెలపండి.
4. అనువాదంలో ఎదురయ్యే సమస్యలను పేర్కొని, పరిష్కార మార్గాలను సూచించండి.

### III. లఘు సమాధాన ప్రశ్నలు

1. అనువాదంలో భౌగోళిక పరిష్కార మార్గాలు తెలపండి
2. అనువాదంలో బంధుత్వ పదాలను గూర్చిన సమస్యలు తెలపండి
3. ఆంగ్లంలోని పదాలకు తెలుగు సమానార్థకాలు లేనప్పుడు అనువాదకునికి ఎలాంటి సమస్యలు కలుగుతాయి?
4. అనువాదంలో లేఖన చిహ్నాల సమస్యను తెలపండి.
5. అనువాదంలో వచనాల సమస్యను తెలపండి.

- షేక్ జరీనాబేగం
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
రాజమండ్రి, ప.గో. జిల్లా

# పాఠం - 9

# అభ్యాసము

## ఆంగ్లం నుండి తెలుగుకి అనువదించుట

1. The environment is our surroundings. It comprises of natural, social and man made environments. the natural environment is all the biotic and abiotic factors present on earth. All social relationships that involve the gathering of two or more people are called as social environment.

Social environment consists of family, friends, relations we made to others as an individual and relations in the outer world. it may at your school colleges. offices and other outer world interactions.

In the solar system the earth is a single planet where life is found. We all humans are blessed with the gift of nature and rich bio-diversity.

**అనువాదం :**

మన చుట్టూ వున్న మన పరిసరాలే మన పర్యావరణం సహజంగా పర్యావరణం సామాజిక, సహజ, మానవ నిర్మితమైనదిగా వుంటుంది. సహజ పర్యావరణం భూమిపై గల జీవ, నిర్జీవ సమ్మిళితమై వుంటుంది. సామాజిక బంధుత్వాలు, సంబంధాలు సామాజిక పర్యావరణం క్రిందకి వస్తాయి. సామాజిక పర్యావరణంలో కుటుంబం స్నేహితులు, ఇతరులతో గల సంబంధాలు పరిగణించబడతాయి.

2. The word Communication is aprocess of Interaction with the people and their environment sending and receiving ineormation is called communication. Good Communication skills is necessary for every one. Communicateion will helps us to build or to continue good relationship. with right and effective communication we can solve so many issues. In offices also we can create strong team environment with the help of good comminication. Good Communication will give you great love and respect.

మన చుట్టూ వున్న వ్యక్తులతో మనం చేసే భావ ప్రకటనయే భావప్రసారం. భావప్రసారం అంటే సమాచారాన్ని పొందటం మరియు పంపించడం అని చెప్పవచ్చు. ప్రతి ఒక్కరూ ఉత్తమ భావప్రసాద నైపుణ్యాన్ని కలిగి వుండటం అత్యంత ఆవశ్యమైనది. సత్సంబంధాలు ఏర్పడటానికి మరియు కొనసాగించడానికి భావప్రసారం అనేది సహకరిస్తుంది. ఎన్నో సమస్యలను కూడా మనం చక్కటి భావప్రసారం ద్వారా పరిష్కరించుకోవచ్చు. కార్యాలయాలలో కూడా గొప్ప ఉన్నతమైన సమూహాన్ని మన భావప్రసారం ద్వారా నిర్మించుకోవచ్చు. అంతేకాదు మంచి భావప్రసారం అనేది అందరి నుంచి ప్రేమను గౌరవాన్ని అందిస్తుంది.

3. Once There was a dog who wandered the streets night and day in search of food. One day he found a juicy bone and he immediately grabbed it between his mouth and took it home. On his way home he crossed a river and saw another dog who also had a bone in its mouth. He wanted that bone also. But as he opened his mouth, The bone he was biting fell into river and sank. That night, he went home hungry.

**Moral of the Story**

if we always envy what otheres have, we'll end up losing what we already have, just like the greediy dog.

**అనువాదం :**

అనగనగా ఒక వూరిలో ఒక కుక్క వుండేది. అది రోజూ తన ఆహారం కోసం వీధులలో తిరుగుతూ వుండేది. ఒక రోజు దానికి ఒక మాంసం వున్న ఎముక కనిపించింది. వెంటనే కుక్క దానిని నోటితో కరుచుకొని సంతోషంగా ఇంటికి బయలుదేరింది. మార్గం మధ్యలో ఒక నది కనిపించింది. అక్కడ మరో కుక్క నోట్లో మంచి మాంసం వున్న ఎముక పెట్టుకొని కనిపించింది. ఈ కుక్కకి ఆ కుక్క నోట్లో వున్న మాంసం ముక్క కూడా కావాలనిపించింది. వెంటనే అది తీసుకోడానికి కుక్క నోరు తెరిచింది. వెంటనే దాని నోట్లో వున్న మాంసం ముక్క కాస్త నదిలో పడిపోయింది. అలా ఆ రాత్రి ఆ కుక్క ఆకలితోనే వెనుతిరగవలసి వచ్చింది.

**నీతి :** మనం మన దగ్గర వున్న దానితో తృప్తి చెందక ఇతరుల దగ్గర వున్నదానిపై ఆశపడితే చివరికి దురాశ కలిగిన కుక్కకి జరిగినట్లు నష్టమే జరుగుతుంది.

**తెలుగు నుంచి ఆంగ్లంలోకి అనువదించుట.**

1) అనగనగా ఒక వూరిలో జాన్ అనే అబ్బాయి వుండేవాడు. అతను చాలా బద్ధకస్తుడు. తన బట్టలు మార్చుకోవడం కూడా బద్ధకంగా భావించేవాడు. ఒకరోజు అతను తన తోటలో యాపిల్ చెట్టుకు యాపిల్ పండ్లు చాలా వుండటం గమనించాడు. వాటిలో ఒకటి తినాలనుకున్నాడు. కాని, అవి కోసుకొని తినాలంటే చెట్టెక్కాలి. చెట్టెక్కాలంటే అతనికి బద్ధకం అందుకని చెట్టుక్రింద కూర్చొని ఆపిల్ ఎప్పుడు క్రిందపడుతుందా అని ఎదురుచూస్తూ వున్నాడు. చివరికి ఆకలితోనే వుండిపోవలసి వచ్చింది.

**నీతి :** బద్ధకం వలన మనం ఏదీ పొందలేము మనం ఏదైనా కావాలనుకుంటే దానికోసం శ్రమించాల్సి వుంటుంది.

**అనువాదం :**

There was a boy named John who was so lazy, he couldn't even bother to change his clothes one day he saw that the apple tree in their yard was full of fruits. he wanted to eat some apples but he was too lazy to climb the tree and take the fruits. so he laydown underneath the tree and waited for the furits to fall off. John waited until he was very hungry but the apples never fell.

**Moral :**

Laziness can get you nowhere. If you want something you need to work hard for it.

2. భారతదేశంలో వ్యవసాయం ప్రాథమిక రంగానికి చెందిన ఉపాధి. దేశంలో సగం కంటే ఎక్కువ మంది జనాభా వ్యవసాయం పై ఆధారపడి వున్నారు. పంటలను పండించడం, పశుపోషణ వ్యవసాయం క్రిందకు వస్తాయి. భారత ఆర్థిక వ్యవస్థపై వ్యవసాయంరంగం ఎక్కువ ప్రభావాన్ని చూపుతుంది. అగ్రికల్చర్ అనే పదం "Ager" మరియు "Cultura" అనే లాటిన్ పదాల నుంచి పుటింది. Ager అంటే (field) భూమి అని Cultura అంటే సాగుచేయడం (Cultivation) అని అర్థం. అందరికీ ఆహారాన్ని అందించాలన్నదే వ్యవసాయం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

అనువాదం :

In India Agriculture comes under frimary sector of Employment. In our country more than half of the population are involved in Agriculture. Generally Agriculture means practice of farming and rearing of Animals. Agriculture is one of the important aspeet in our country's economy. Agriculture word was derieved from the lattin words of Ager and culturea where Ager means field and culturea means growing or cultivation. The most important aim of agriculture is to provide food for all.

3. ప్రపంచంలోనే కొత్త కరోనా వైరస్ (కోవిడ్-19) ను చైనాలోని ఊహాన్‌లో 2019లో మొదటిసారి కనుగొన్నారు. కరోనా వైరస్ కొన్ని వైరస్‌ల కలయిక ఇది సాధారణంగా జలుబుతో మొదలవుతుంది. తీవ్రమైతే మిడిల్ ఈస్ట్ రెస్పిరేటరీ సింగ్రోమ్, సివియర్ ఎక్యూట్ రెస్పిరేటరీ సింగ్రోమ్ వరకూ విస్తరించి వుంటాయి. మొదటిసారి మానవుల్లో ఈ వైరస్ వ్యూహాన్‌లోని సముద్రపు ఆహారపు ఉత్పత్తుల మార్కెట్‌లో ఇద్దరిలో గుర్తించారు.

అనువాదం :

In the words first time a novel coronavirus was identified in 2019 in Wuhan. Coronavirus is a large family of viruses. it is generally starts with common symptom of cold to more several diseases such as middle east respiratory syndrome (MERS) and several Acute Respiratory syndrom. This is a new coronavirus that has not previusly identifed in humanes first time it was detected of the two people in china wuhan in sea food market.

-షేక్ జరీనా బేగం
ప్రభుత్వ డిగ్రీకళాశాల
రాజమండ్రి, ప.గో.జిల్లా

# పాఠం - 10

# ముద్రణా మాధ్యమం (అచ్చు మాధ్యమం): పరిచయం, పరిధి, వికాసం

**పాఠ్యాంశ నిర్మాణ క్రమం.**

10.1 – పరిచయం

10.2 – ముద్రణ పరిధి, వికాసం

10 3 – తెలుగు పత్రికా వికాసం

## ఉద్దేశ్యం:

ఈ పాఠ్యభాగం ద్వారా ముద్రణా మాధ్యమాన్ని పరిచయం చేసి, దాని పరిధి, వికాసాల గురించి తెలియజేయడం.

## 10.1 పరిచయం:

ప్రపంచ భాషలలో తెలుగు భాషకు ఉన్న ప్రాధాన్యత ఎంతో విశిష్టమైనది. ఇటలీ దేశస్థుడైన నికొలొకొంటి "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని, శ్రీకృష్ణ దేవరాయలు "దేశభాషలందు తెలుగు లెస్స" అని కొనియాడటమే దీనికి నిదర్శనం. బ్రిటీష్ వారి రాకతో భారతదేశంలో ముద్రణ అనేది ప్రారంభమైంది. ఈ ముద్రణావతరణకు తెలుగు జర్నలిజం ఆవిర్భావానికి విడదీయరాని సంబంధం ఉన్నదనేది అంగీకరించవలసిన విషయం. గూటెన్ బర్గ్ రూపొందించిన అచ్చుయంత్రం ముద్రణారంగంలో విప్లవాన్నే రగుల్కొలిపింది. ఆధునిక సాహిత్య ప్రక్రియలు ఏవిధంగా అయితే పాశ్చాత్య దేశాల నుండి భారతదేశంలోకి అడుగుపెట్టామో అదేవిధంగా ముద్రణ, ముద్రణ ద్వారా, పత్రికా రచన భారతదేశంలో ప్రారంభింపబడ్డాయి.

'ముద్ర' అనే పదం నుంచి 'ముద్రణ' ఉత్పన్నమైంది. ముద్ర అంటే సీలు వేయు అనే అర్థం ఉంది. ముద్రాక్షరశాల అంటే ఆంగ్లంలో Press (ప్రెస్). దీనినే అచ్చతెలుగులో అచ్చుఇల్లు అనవచ్చు. ముద్రణను కూడా ఒక కళగానే భావించవచ్చు. ప్రపంచంలో మొట్టమొదటగా ముద్రణ ప్రారంభించింది చైనా దేశస్థులు.

క్రీ.శ. 1550లలో జెసూయిట్ మిషనరీలు అచ్చుయంత్రాన్ని భారతదేశానికి తెచ్చి క్రీ.శ. 1556లో గోవాలో ముద్రణాశాలని నెలకొల్పారు. ఈ అచ్చుయంత్రం కారణంగా సమాచారం ఒకరి నుంచి మరొకరికి అందటం అంత క్రితం కంటే వేగవంతం అయింది. ఈ సమాచారం ఒకరి నుంచి మరొకరికి అందిస్తూ ప్రజల అభివృద్ధికి సహకరించేదే మాధ్యమం. ఈ మాధ్యమం ప్రజల మనసులను ఎక్కువగా ప్రభావితం చేయగలిగే సామర్థ్యం కలిగుంటుంది. ముద్రణా మాధ్యమం ఇంకా ఎక్కువమందిని ప్రభావితం చేయగలిగింది. పూర్వుల నుంచి తరువాతి తరాలకు జ్ఞానమంతా గ్రంథస్థం చేయటం ద్వారా అందించగలిగే అవకాశం అచ్చుయంత్రం కలిగించింది. ముద్రణా మాధ్యమం కారణంగా శాస్త్రాలే కాకుండా సాహిత్యం కూడా ప్రజలకు చేరువైంది. దీనితో రచయితకు ప్రజలకు మధ్య దూరం తగ్గించిన ఘనత అచ్చుయంత్రానికే దక్కింది.

## 10.2 భారతదేశంలో ముద్రణ - పరిధి, వికాసం:

1556 భారతదేశానికి Joao Bustamante అనే పాశ్చాత్యుడు రెండు అచ్చుయంత్రాలు తీసుకురావటంతో భారతదేశంలో ముద్రణ ప్రారంభమైంది. 1557లో Doctrina christa అనే గ్రంథాన్ని గోవాలో ముద్రించారు. ఇదే ఇండియాలో ముద్రించబడిన మొదటి పుస్తకం. 1578లో మలబార్ తమిళంలో ఇదే పుస్తకం ముద్రించబడింది. 1606లో మధుర మిషనరీకి చెందిన రాబర్ట్ డినోబిలి తమిళ తెలుగు భాషలు నేర్చుకొని రోమన్ స్క్రిప్ట్ లో క్రైస్తవ మత గ్రంథాలు ప్రచురించారు. నాలుగు వేదాలను కూడా రోమన్ స్క్రిప్ట్ లో ప్రచురించారు. ఈ విధంగా భారతదేశంలో ముద్రణ ప్రారంభమైంది. 16వ శతాబ్దిలో పశ్చిమ కోస్తాలో క్రైస్తవ మిషనరీలు అచ్చు యంత్రాలను స్థాపించాయి. 1712లో మద్రాస్ లో డేనిష్ మిషనరీ వారు అచ్చు యంత్రాన్ని నెలకొల్పారు. తమిళం తర్వాత బెంగాలి భాషలకు ముద్రణ విస్తరించింది. తమిళ– ఇంగ్లీష్ నిఘంటువు, ఇంగ్లీష్ – తమిళ నిఘంటువు, బెంగాల్ వ్యాకరణం వంటివి ముద్రించబడ్డాయి. ఈ విధంగా భారతదేశంలో అదీ భారతీయ భాషలలో ముద్రణా సౌకర్యం విస్తరించింది.

1801 నుండి 1832 వరకు 40 భాషలలో అనేక పుస్తకాలు ప్రచురించబడ్డాయి. అందులో భాగంగానే మద్రాసులో 1816లో ఎ.డి కాంబెల్ తెలుగు వ్యాకరణం ముద్రణ జరిగింది. 1817లో విలియం బ్రౌన్ తెలుగు వ్యాకరణం ప్రచురించబడింది. 1818లో కాన్ స్టంటైన్ శాంపి విలియం బ్రౌన్ రచించిన తెలుగుశబ్దావళి ప్రచురించాడు. 1819లో రావిపాటి గురుమూర్తి శాస్త్రి రచించిన 'విక్రమార్క కథలు' ప్రచురించబడ్డాయి. 1818లో మద్రాస్ రిలిజయన్ సొసైటీ లక్షల క్రైస్తవ మత ప్రచార గ్రంథాలు ప్రచురించారు. 1820లో స్థాపించబడిన మద్రాస్ స్కూల్ బుక్ సొసైటీ 10 సంవత్సరాలలో అనేక వాచకాలు, ఛందో గ్రంథాలు, వేమన పద్యాలు, విక్రమార్క కథలు వంటి పుస్తకాలు ముద్రించారు. 1823లో సి.పి మోరిన్ రాసిన తెలుగు వాచకం ముద్రించబడింది. 1827లో సంస్కృతాంధ్ర భాషల ఛందో గ్రంథం ముద్రించబడింది. 1829లో సి.పి. బ్రౌన్ ఆంగ్ల అనువాదంతో కూడిన వేమన పద్యాలు కాలేజి ముద్రణాలయంలో ముద్రించారు. 1831లో ఫోర్ట్ సెయింట్ జార్జి గెజెట్ కోసం ప్రభుత్వ ముద్రణశాల ఏర్పాటు చేయబడింది. 1832 జనవరి 4వ తేదీన పోర్టు సెయింట్ జార్జి గెజెట్ వెలుగుచూసింది.

1825లో బళ్లారి ప్రెస్ స్థాపించబడింది. ఇక్కడ క్రైస్తవ మత ప్రచార గ్రంథాలు ముద్రించబడ్డాయి. 1839లో గోదావరి డెల్టా మిషన్ నరసాపూర్ ప్రారంభమైంది. ఈ సంవత్సరంలోనే రాజమండ్రిలో రీడింగ్ రూం ప్రారంభమైంది. 1854లో విశాఖపట్టణంలో ముద్రణా యంత్రం నెలకొల్పబడింది. 1841లో చర్చి మిషన్ సొసైటీ తెలుగు మిషన్ ను మచిలీపట్నం లో ప్రారంభించింది. ఇదే సంవత్సరం నోబెల్ కాలేజిని స్థాపించింది.

ఈ విధంగా అచ్చు యంత్రం సహాయంతో ప్రారంభమైన ముద్రణ కారణంగా అనేక దిన, వార, పక్ష, మాసపత్రికలు అన్ని భాషలలోనూ ప్రారంభించబడ్డాయి. ముద్రణ అందుబాటులోకి రావటం కారణంగా విద్య, వైజ్ఞానిక, మత సంబంధమైన గ్రంథాలతో పాటుగా అనేక సాహితీ రచనలు ప్రచురించబడ్డాయి. సాహిత్యం ప్రజలకు అందుబాటులోకి వచ్చి ప్రజల మనోవికాసానికి దోహదపడింది. సాహిత్య ప్రచారంతో అనేక కొత్తకొత్త రచనలతో రచయితలు తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేశారు.

## 10.3 తెలుగు పత్రికా వికాసం :

తెలుగులో పత్రికా పరిణామ వికాసాన్ని ఆరు దశలుగా విభజించవచ్చు. అని ప్రారంభ దశ, పరిణామ దశ, వికాస దశ, విస్తరణ దశ, స్వాతంత్ర్యానంతర దశ, ఆధునిక దశలు.

### 10.3.1 ప్రారంభ దశ - 1830 - 1857 (కుంఫిణీ యుగం) :

ప్రారంభదశలో వచ్చిన పత్రికలన్నీ ఆంగ్లేయుల సంపాదకత్వంలో. వెలువడటమే కాకుండా ఆంగ్ల ప్రభుత్వ పాలనకు అనుకూలంగా ఉండటం వలన ఈ యుగాన్ని కుంఫిణీయుగం అన్నారు. ఈ దశలో వచ్చిన పత్రికలు వార్తలకి ప్రాధాన్యమిస్తూ దానితోపాటు మత ప్రచారానికి కృషి చేశాయి. తెలుగులో తొలిపత్రికైన వృత్తాంతి పత్రికాపరంగా కాకుండా అందులో ప్రచురించిన అంశాల విషయంలోనూ మొదటిస్థానాన్ని నిలుపుకొంది. బ్రిటిష్ ప్రభుత్వానికి విధేయత ప్రకటిస్తూనే హిందువులు క్రైస్తవమతం స్వీకరించడాన్ని నిరసించింది. సంఘసంస్కరణాంశాలతో పాటు పాఠకుల అభిప్రాయాల్ని తెలిపే లేఖలను నిర్భయంగా ప్రచురించింది.

1842 జూన్ 8న వర్తమాన తరంగిణి వారపత్రికగా ప్రారంభింపబడింది. ఈ పత్రిక వ్యవస్థాపకుడు సయ్యద్ రహమతుల్లా. ఈ పత్రికలో ప్రాంతీయ వార్తలే కాక ఇతర ప్రాంతాలలోని రాజకీయ అంశాలను, వర్తక వ్యాపార విషయాలను, భూగోళ, ఖగోళ, గణిత, ధర్మశాస్త్ర, నీతిశాస్త్ర విషయాలను వ్యాపార ప్రకటనలను, ఉత్తరాలను ప్రచురించేవారు. ఆంగ్లేయులలోనే గొప్ప తెలుగు పండితుడిగా పేరు పొందిన జె. ఎడ్మండ్ షార్కి 1848లో " హితవాది' పత్రికను ప్రారంభించాడు. మద్రాసులోని రాజధాని కళాశాలలో దేశభాషల విభాగంలోని ఆచార్యుడైన రెవరెండ్ పీటర్ పెర్సివల్ సంపాదకత్వంలో 1855లో 'దినవర్తమాని' పత్రిక ప్రారంభమైంది. 1856లో ప్రభుత్వ పాలనా విషయాలు ప్రజలకు తెలియజేసే ఉద్దేశ్యంతో ప్రారంభింపబడిన 'జిల్లా గెజిట్లు' ఆంగ్ల భాషలతో పాటు ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యమిచ్చాయి. 1844లో సుప్రసిద్ధ సంఘసేవకుడైన గాజుల లక్ష్మీసెట్టి ఇంగ్లీష్‌లో "క్రీసెంట్" పత్రికను ప్రచురించాడు.

### 10.3.2. విస్తరణ దశ - క్రీ.శ. 1858 - క్రీస్తుశకం 1874 - (పూర్వ వీరేశలింగ యుగం) :

ఈ యుగంలో ప్రారంభించబడిన పత్రికలు భాష, సాహిత్య వికాసానికి, సాంఘిక దురాచారాల నిర్మూలనకు, వ్యవహారిక భాషా ప్రాధాన్యతకు కృషిచేశాయి. క్రీ.శ. 1863లో ప్రచురించబడిన శ్రీ యక్షిణి పత్రికతో ఈ యుగం ప్రారంభమైంది. 1864లో సాహిత్య విషయాలకు ప్రాధాన్యమిచ్చిన మొట్టమొదటి పత్రిక ' సుజనరంజని' ప్రచురితమైంది. దీని ముఖపత్రం "మంచి వర్సిటీ పరీక్ష విద్యార్థులకుపకారము" అని ముద్రించబడిన దానికి తగిన రీతిగా విద్యార్థులకు, పరీక్షలకు వెళ్ళే ప్రభుత్వ ఉద్యోగులకు చాలా ఉపయోగకరంగా ఉండేది. బ్రహ్మ సమాజ సూత్రాలను ప్రచురిస్తూ 1864లో ప్రారంభమైన పత్రిక 'తత్వబోధిని" వేదాలను తెలుగులిపిలో తొలిసారిగా ప్రచురించటమే కాక స్త్రీ పునర్వివాహ విషయంపై మొట్టమొదట వ్యాసాలు ప్రచురించిన ఘనత ఈ పత్రికది. ఆంధ్ర అనే పదంతో ప్రారంభమైన మొట్టమొదటి పత్రిక "ఆంధ్ర భాషా సంజీవని" 1871లో మొదలైంది. మొదటి సారిగా ఎలిజీ ప్రచురించిన పత్రిక ఇది. ఈ పత్రిక స్త్రీవిద్యను, వితంతు వివాహాలను ఖండించటమే పనిగా పెట్టుకుంది. 1872లో 'పురుషార్ధ ప్రదాయిని' పత్రిక ప్రారంభమైంది. అనేక విషయాలలో అభ్యుదయ దృక్పథాన్ని ప్రదర్శిస్తూ ఈ పత్రిక విగ్రహారాధన,

కులతత్వం, స్త్రీవిద్య, స్త్రీ పునర్వివాహం, బాల్య వివాహాలు, నిర్భంద వైధవ్యం, వేశ్యావృత్తి, భోగం మేళాలు, లంచగొండితనం, ఉద్యోగుల అవినీతి, పోలీసుల దురుసుతనం వంటి అనేక విషయాలకు ప్రాధాన్యం కల్పించింది . తెలుగు దేశంలోని పునరుజ్జీవోద్యమానికి నాందిగా ఈ పత్రికపనిచేసింది.

## 10.3.3. వికాసదశ - క్రీ.శ. 1874 - క్రీ.శ. 1900 - వీరేశలింగం యుగం:

పత్రికారంగంలో విరేశలింగంగారి ప్రవేశం ఆ రంగానికే నూతన ఒరవడి తెచ్చింది. 1874లో వేరేశలింగంగారు "వివేక వర్ధిని" మాసపత్రికను ప్రారంభించారు. ఈ పత్రిక అభ్యుదయాన్ని బోధించటమే కాకుండా సాంఘిక సంస్కరణల విషయంలో వాదోపవాదాల శకానికి నాంది పలికింది. మొట్టమొదటిసారిగా పరిశోధనాత్మక జర్నలిజానికి బీజాలు వేసింది. శాస్త్ర సంబంధమైన అంశాలను ప్రశ్న సమాధానాల రూపంలో ప్రచురించిన పత్రిక 'సకల విద్యాభివృద్ధి' మాసపత్రిక 1875 లో ప్రారంభమైంది. బాలసాహిత్యాన్ని ప్రచురించిన తొలిపత్రికగా పేరుపొందిన 'జనవినోదిని' పత్రిక ఈ సంవత్సరంలోనే ప్రారంభమైంది. వివేక వర్ధిని పత్రికలోని రచనలను ఖండించటం కోసమే కొక్కొండ వెంకటరత్నంగారి సంపాదకత్వంలో 1875లో ప్రారంభించబడిన పత్రిక 'హాస్యవర్ధిని'. 1875లోనే ప్రారంభమైన మరో పత్రిక 'భారతి'. 1876లో హాస్యవర్ధినికి వ్యతిరేకంగా వీరేశలింగం గారు ప్రారంభించిన పత్రిక 'హాస్య సంజీవని'. జ్ఞానభాను, రాయబారి, మందార మంజరి, అనంత జాగృత, కల్పవల్లి, ప్రబంధ కల్పవల్లి, చింతామణి, కళానిధి, హిందూజన సంస్కారిణి, నీలదర్పణము, అముద్రిత గ్రంథ చింతామణి, ఆంధ్ర ప్రకాశిక, దేశాభిమాని, రసికోల్లాసిని, ఇతిహాస మంజరి, ప్రకాశిక, చింతామణి, రాజయోగి, ధర్మవర్ధిని, జనానా, శారద, మంజువాణి, కళావతి, ఆనందదాయిని వంటి అనేక పత్రికలు ఈ యుగంలోనే ప్రారంభమయ్యాయి. ఎక్కువ పత్రికలకు ప్రాణం పోసిన యుగమిది.

## 10.3.4 విస్తరణ దశ - క్రీ.శ. 1901 - క్రీ.శ. 1947:

పత్రికా వికాసంలో 20వ శతాబ్దంలో విస్తరణ దశ ప్రారంభమైంది. పత్రికల సంఖ్య, వాటి మధ్య పోటీ పెరిగింది. గ్రాంధికభాష స్థానంలో వ్యవహారిక భాష స్థానం సంపాదించుకుంది. ఫోటోలు ముద్రించటం ప్రారంభమైంది. తెలుగు పత్రికారంగంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న కృష్ణా పత్రిక 1901లో ప్రారంభమైంది. 1907 లో కల్పలత, 1906లో మనోరమ, 1910లో దేశమాత, 1907 లో వందేమాతరం, 1908లోనే స్వరాజ్య పత్రిక, ఆంధ్ర పత్రికలు, 1912లో ఆంధ్ర సాహిత్య పరిత్పత్రిక, 1915లో గ్రంథాలయ సర్వస్వము, 1919లో తెలుగు సాహితి పత్రికలు ప్రారంభమయ్యాయి. 1922 లో ప్రబుద్ధాంధ్ర, మాతృసేవ, నవ్వులతోట, కళ పత్రికలు, 1923లో సరస్వతి మాస పత్రిక, 1924 లో భారతి, 1925 లో వజ్రాయుధం, 1926లో తెలుగు వాఙ్మయ పత్రిక, గోల్కొండ పత్రిక ప్రారంభమయ్యాయి.

1933లో ఆంధ్రభూమి, 1946లో చందమామ, 1947లో మాతృభూమి పత్రికలు వెలువడ్డాయి.

## 10.3.5. స్వాతంత్ర్యనంతర దశ క్రీ.శ. 1947 తర్వాత :

క్రీ.శ. 1947 తర్వాతస్వాతంత్ర్యానంతరం 20 ఏళ్ళ వరకు స్వాతంత్ర్యానికి ముందున్న ప్రమాణాలతో పత్రికలు సాగినా 60ల తర్వాత వ్యాపార, వాణిజ్య దోరణులకు లోనవ్వటమే కాకుండా కొన్ని పత్రికలు ఎజెండాలను

వదిలి రాజకీయ జెండాలను మోయటం ప్రారంభించాయి. 1952లలో కమ్యూనిస్టు పార్టీకి సంబంధించిన జనత, విశాలాంధ్ర, కొత్తబాట పత్రికలు ప్రారంభమయ్యాయి. 1953లో శశి, సంస్కృతి, తెలుగు విద్యార్థి పత్రికలు, 1954లో సినిమా రంగం, పరిశోధన, స్రవంతి పత్రికలు, 1960లో ఆంధ్రభూమి, 1961లో సాహితి, 1965లో సినీ జ్యోతి, 1966 లో స్వేచ్ఛ, 1970లో ప్రజాసాహితి, 1971లో పిలుపు, కమ్యూనిజం పత్రికలు ప్రారంభమయ్యాయి. 1974లో ఈనాడు, 1984 లో ఉదయం, 1993లో నడుస్తున్న చరిత్ర, ప్రసన్న భారతి, 1996లో వార్త, 2000లో విజేత, హెల్త్ ఎడ్యుకేషన్, 2004లో భావవీణ, 2006 లో బహుజన కెరటాలు పత్రికలు ప్రారంభమయ్యాయి.

పత్రికలెప్పుడు ప్రభుత్వాలకు పక్కలో బల్లెంలా ఉండాలనే వృత్తి ధర్మాలు పోయాయి. సామాన్యుడు కూడా పత్రికలను విమర్శించే స్థాయికి దిగజారాయి కొన్ని పత్రికలు. పాఠకాదరణ తగ్గింది. పోటీయుగం కారణంగా పోటికి తట్టుకున్న పత్రికలే నిలబడుతున్నాయి.

రాదగిన ప్రశ్న:

1. తెలుగు పత్రికా వికాసాన్ని తెలియజేయండి?

**ఆధార గ్రంథాలు :**


1. తెలుగులో పత్రికారచన – అవతరణ – వికాసములు – డా॥ జి. హరిశ్చంద్ర ప్రసాద్
2. పత్రికారచన – పరిచయ విశేషాలు – ఆచార్య జి. యోహాన్ బాబు



– పిడతల రామచంద్రుడు.

తెలుగు అధ్యాపకులు.

డి ఆర్ జి ప్రభుత్వ డిగ్రీ కళాశాల,

తాడేపల్లిగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా.

# పాఠం - 11

# వివిధ రకాల పత్రికలు - పరిశీలన

# పత్రికాభాష, శైలి, వైవిధ్యం

**పాఠ్యాంశ నిర్మాణ క్రమం.**

11.1 – వివిధ రకాల పత్రికలు

11.2 – పత్రికా భాష –శైలి

**ఉద్దేశ్యం :**

ఈ పాఠ్యభాగం ద్వారా వివిధ రకాల పత్రికలను గురించి, పత్రికా భాష, శైలుల గురించి తెలుపటం.

## 11.1. వివిధ రకాల పత్రికలు :

"పత్రికొక్కటున్న పదివేల సైన్యము
పత్రికొక్కటున్న మిత్రకోటి
ప్రజకు రక్షలేదు పత్రికలేకున్న"

అన్న నార్ల వెంకటేశ్వరరావు గారి మాట అక్షర సత్యం. ప్రజలను చైతన్యపరిచేవి, ప్రజల పక్షం వహించి రక్షణగా నిలిచేవి, ప్రజలకు స్నేహితుడిలా ఏది మంచో, ఏది చెడో తెలియజేసేవి పత్రికలు. అందుకే ప్రజాస్వామ్యం అనే సౌధానికి మూలస్తంభాలు పత్రికలు. పత్రికలు అటు ప్రజలకు ఇటు ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేస్తాయి. గాంధీజీ కూడా పత్రికా రచన మానవసేవే అని అన్నారు. ప్రముఖ పాత్రికేయులు జి. కృష్ణ కూడా "ప్రజలు మానవత్వం మీదనే అభిమానం చూపేటట్లు వార్తలు, విశేషాలు అందించటమే పత్రికా రచన లక్ష్యం అదే మానవసేవ, అదే సత్యం, అదేదైవం" అన్నారు.

అటువంటి పత్రికలు ఈ ఆధునిక కాలంలో అందించే సమాచారాన్ని బట్టి, పాఠకులను బట్టి, ప్రాంతీయతను బట్టి, వెలువడే కాలాన్ని బట్టి అనేక రకాలుగా ప్రచురింపబడుతున్నాయి. ఆధునిక పరిజ్ఞానంతో వెలువడే పత్రికలు దినపత్రికలు, వారపత్రికలు, పక్ష పత్రికలు, మాస పత్రికలు, వార్షిక పత్రికలు, స్త్రీల పత్రికలు, పిల్లల పత్రికలు, సాహిత్యపత్రికలు, రాజకీయ పత్రికలు, సినిమా పత్రికలు, మత పత్రికలు, కుల పత్రికలు, వేదాంత పత్రికలు, హాస్య పత్రికలు అనే అనేకరకాలుగా వెలువడుతున్నాయి.

### 11.1.1. దిన పత్రికలు :

తెలుగులో పత్రికారచన ప్రారంభమైన 60 సంవత్సరాల తర్వాత దినపత్రికలు ప్రారంభమయ్యాయి. ప్రతిరోజు వెలువడే పత్రికను దిన పత్రికలంటాము. ఈనాడు, ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, వార్త, సాక్షి, విశాలాంధ్ర, ప్రజాశక్తి వంటివన్నీ దినపత్రికలే. ప్రారంభంలో రోజువారీ వార్తల ప్రచురణకే పరిమితమైన

దినపత్రికలు కాలక్రమేణా విద్య, ఆరోగ్య, క్రీడా, ఉద్యోగ, వ్యాపార, సినిమా, సాహిత్య సంబంధ విషయాలకు ప్రాధాన్యతిచ్చి ప్రచురిస్తున్నాయి.

## 11.1.2 వార పత్రికలు:

వారానికి ఒకసారి వెలువడే పత్రికలు వారపత్రికలు. ప్రారంభంలో ఎక్కడో ఒక చోట ప్రచురించబడిన వారపత్రికలు నేడు ఎక్కువగా ప్రచురించబడుతున్నాయి. ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, స్వాతి మయూరి మొదలైనవి పాఠకాదరణ పొందిన వారపత్రికలలో కొన్ని. వీటిలోనూ రానురాను పోటీ పెరగడంతో ప్రచురణాంశాలలో, రూపంలో కొత్తదనాన్ని సంతరించుకుంటూ వ్యాపార ధోరణితో వ్యవహరిస్తున్నాయి. ఈ వారపత్రికలలో కవర్ పేజీ ముఖచిత్రం ప్రచురణ మొదలు లోపలి పేజీలలో ప్రచురించే విషయాలైన కథలు, ఫీచర్స్, సీరియల్స్, వ్యాసాలు, ప్రముఖుల అభిప్రాయాలు, యాత్ర విశేషాలు ఇంటర్వ్యూలు అన్నీ కూడా పాఠకుడిని ఆకర్షించడం పట్లే శ్రద్ధ వహిస్తున్నాయి. ఈ వార పత్రికలు ప్రత్యేకంగా స్త్రీలను, పిల్లలను ఆకర్షించడానికి ప్రత్యేక శీర్షికలను నిర్వహిస్తున్నాయి. పాఠకలోకానికి వినోదంతోపాటు విజ్ఞానాన్ని అందించటానికి క ృషిచేస్తున్నాయి వారపత్రికలు. కొన్ని పత్రికలు ఆధ్యాత్మిక అంశాలకు ప్రాధాన్యతనిస్తే కొన్ని పత్రికలు దాంపత్య జీవిత సమస్యలకు పరిష్కారాలు చూపించడానికి ప్రాధాన్యతనిస్తున్నాయి. కొన్ని వారపత్రికలలో భాషాపరిజ్ఞానం పెంచే పదవినోదాలు, ఫజిల్స్, మాటలకిటుకు వంటివి ప్రచురించబడుతున్నాయి. చిట్కా వైద్యాలకు, వంటవార్పులకు ప్రాధాన్యతనిచ్చే పత్రికలున్నాయి. ఏదేమైనా పాఠకులను ఆకర్షించడానికి ఎంతో కృషి చేస్తున్నాయి పత్రికలు.

## 11.1.3. పక్ష పత్రికలు :

పదిహేనురోజులకొకసారి వెలువడే పత్రికలు పక్ష పత్రికలు. ఇవి అంత ఎక్కువగా ప్రచురించబడవు. అక్కడక్కడా కనిపిస్తాయి. ఎక్కువగా సినిమా పత్రికలు పక్షపత్రికలుగా వెలువడుతున్నాయి. సుప్రభాతం, ఇండియాటుడే, క్రైమ్ టుడే, గీతాంజలి వంటివి పక్షపత్రికలు. పక్షపత్రికలలో కూడా వార పత్రికలలాగానే మంచి వ్యాసాలు, విజ్ఞాన విశేషాలు, సీరియల్స్, కథలు, కవితలు, జోక్స్, ఫజిల్స్, వ్యాపార విశేషాలు మొదలైన వాటికి ప్రాధాన్యతనిస్తాయి.

## 11.1.4. మాస పత్రికలు :

నెలకొకసారి వెలువడేవి మాసపత్రికలు. దిన, వారపత్రికల తర్వాత తెలుగులో మాసపత్రికలే ఎక్కువగా ఉన్నాయి. మిగిలిన దిన, వార పత్రికలకన్నా భిన్నంగా మాసపత్రికలు కొత్తకొత్త అంశాలతో పాఠకులను అలరిస్తాయి. వనితా జ్యోతి, బాలమిత్ర వంటి స్త్రీల, పిల్లల పత్రికలే కాకుండా చేతన, చినుకు, మూసి, భావవీణ, మన భూమి, నడుస్తున్న చరిత్ర, ప్రజా సాహితి, ఇల్లు – ఇల్లాలు, కళింగ సీమ వంటి పత్రికలు వెలువడుతున్నాయి. వీటిలో సాహిత్యం, సంస్కృతి, రాజకీయ, సామాజిక అంశాలు ప్రచురించబడుతున్నాయి. ఈ మాసపత్రికలు కూడా వినోదంతోపాటు విజ్ఞానాన్ని అందించేవిధంగా ఉన్నాయి.

### 11.1.5. ద్వైమాస పత్రికలు :

రెండు నెలలకొకసారి ప్రచురింపబడేవి ద్వైమాసపత్రికలు. ఇవి చాలా తక్కువగా ఉన్నాయి. స్త్రీల సమస్యలకు సంబంధించి 'మహిళా మార్గం' అనే పత్రిక వెలువడేది. అలాగే 'రసరేఖ' అనే సాహిత్య పత్రిక ద్వైమాసిక పత్రికే.

### 11.1. 6. త్రైమాస పత్రికలు :-

మూడు నెలల కొకసారి వెలువడే పత్రికలు త్రైమాసపత్రికలు. ఇవీ తక్కువగానే ఉన్నాయి. ఎక్కువగా ఈ పత్రికలలో సాహిత్యానికి, సంస్కృతికీ ప్రాధాన్యత ఎక్కువ. నవ కవిత, వాఙ్మయి, తెలుగు, వాణి వంటి పత్రికలు త్రైమాస పత్రికలు.

వార్తాపత్రికల లాగా పాఠకులు అందరి కోసం కాకుండా వార, పక్ష, మాస పత్రికలు ప్రత్యేకమైన పాఠకుల్ని దృష్టిలో పెట్టుకొని ప్రచురించబడుతున్నాయి. ఈ పత్రికల్లో విషయసేకరణ మొదలు పత్రిక ప్రచురణ వరకు అన్ని విషయాల్లో ప్రత్యేకంగానే ఉంటాయి. ఈ ప్రచురణ ప్రత్యేకంగా ఉండటానికి కారణం వెసులుబాటు ఉండటమే.

### 11.1.7 మహిళా పత్రికలు :

స్త్రీల సమస్యలు, వాటి పరిష్కారాలు గురించి వారి అభ్యున్నతికి సంబంధించిన అంశాలను ప్రచురించే పత్రికలను మహిళా పత్రికలు అంటారు. స్త్రీలకు సంబంధించిన ఎన్నోరకాల ఫీచర్లు, కథలు, సీరియల్స్, వంటావార్పులు, అందం, ఆరోగ్యాలకు సంబంధించిన చిట్కాలు, అన్నిరంగాలలో అభివృద్ధి సాధిస్తున్న మహిళలు వృత్తాంతాలు వంటి ఎన్నో విషయాల్ని ప్రచురించాయి. మహిళా పత్రికలు మొదటి నుంచి తక్కువే. మహిళా పత్రికలు మొదటినుంచి తక్కువే. మహిళా పత్రికలు రాక ముందు నుంచే 'హితవాది' వంటి పత్రికలు హిందూ స్త్రీల స్థితిగతుల్ని తెలుపుతూ వారి అభ్యున్నతికి పనికి వచ్చే వార్తలు, కథనాలు ప్రచురించాయి. స్త్రీల అభ్యున్నతి కోసమే ప్రత్యేకించిన పత్రిక ఒకటుంటే బాగుంటుందని ఆలోచించి 'సతీహితబోధిని' పత్రికను కందుకూరి వీరేశలింగం గారు ప్రారంభించారు. తెలుగు జనానా, స్త్రీ హిత బోధిని, శ్రీ బాలిక, హిందూ సుందరి, గృహలక్ష్మి, సావిత్రి, వివేకవతి, సౌందర్యవల్లి, భారత మహిళ, ఆంధ్ర లక్ష్మి, ఆంధ్ర మహిళ వంటి పత్రికలన్నీ స్త్రీల కోసమే ప్రచురించబడిన మహిళా పత్రికలు. ఈ పత్రికలన్నీ స్వాతంత్ర్యానికి పూర్వం ప్రచురింపబడినవే. స్వాతంత్ర్యానంతరం భూమిక, మహిళాభ్యుదయ మాసపత్రిక, ఇల్లు- ఇల్లాలు, మహిళా మార్గం వంటి మహిళా పత్రికలు వెలువడ్డాయి. ఇవే కాకుండా వనిత, వనితాజ్యోతి, మహిళాశక్తి మొదలైన పత్రికలు వెలువడుతున్నాయి.

### 11.1.8. సాహిత్య పత్రికలు:

స్వాతంత్ర్యానికి పూర్వం సుజనరంజని, ఆంధ్రభాషా సంజీవని, హాస్యవర్ధిని, సుధీరంజని, వివేకవర్ధిని, సత్య సంవర్ధిని, చింతామణి, అముద్రిత గ్రంథ చింతామణి, కృష్ణాపత్రిక, ఆంధ్రపత్రిక, ఆంధ్ర భారతి, ఆంధ్ర సాహిత్య, సాహితి, శారద, భారతి, సఖీ, జగతి, వీణ, చిత్ర గుప్త, ప్రతిభ వంటి పత్రికలన్నీ సాహిత్యానికి పెద్ద పీట వేశాయి. స్వాతంత్ర్యం తర్వాత వచ్చిన స్రవంతి, సమాలోచన, వాఙ్మయి, భావవీణ, చినుకు, మిసిమి, సాహిత్యనేత్రం

వంటి పత్రికలు సాహితీ పత్రికలు.

### 11.1.9. పిల్లల పత్రికలు:

1875లో 'జన వినోదిని' బాలసాహిత్యాన్ని ప్రచురించిన తొలిపత్రిక. బాల భారతి, బాలకేసరి, బాల, బాలమిత్ర, బాబు, పాపాయి, బాలబంధన, బుజ్జాయి మొదలైన పత్రికలు పిల్లల కోసమే ప్రచురించబడిన పత్రికలు. చందమామ, బాలమిత్ర, బుజ్జాయి, బాలజ్యోతి పత్రికలు పిల్లలని ఎక్కువగా అలరించాయి. బాలలను ఆకర్షించే విధంగా కథలు, గేయాలు, శీర్షికలు, సీరియల్స్, ఫజిల్స్, కార్టూన్లు ప్రచురించబడ్డాయి ఈ పత్రికలలో.

### 11.1.10. సినిమా పత్రికలు:

సినిమా పత్రికలు ప్రారంభం కాకముందే సినిమా సమాచారానికి దిన, వార పత్రికలు ప్రాధాన్యతనిచ్చాయి. పత్రికల్లో సినిమా వార్తలు, వ్యాఖ్యానాలు, సమీక్షలు ప్రచురించబడ్డాయి. తెలుగు సినిమా వార్తల కోసమే ప్రారంభమైన ప్రత్యేక పత్రిక 'చిత్రకళ'. రూపవాణి, తెలుగు సినిమా, సినిమారంగం. కినిమా, చిత్రాలయ, సినీ జనత, సినిమా, విజయచిత్ర, స్క్రీన్ ప్లే, వెండితెర, సినీ హెరాల్డ్, చిత్రసీమ వంటి పత్రికలు ప్రచురించబడ్డాయి. పంతొమ్మిది వందల డెభై నుండి వ్యాపారంగా మారిన సినిమా పరిశ్రమలో ప్రచారానికి ప్రాధాన్యత పెరిగింది. 1976లో ఈనాడు దినపత్రిక యాజమాన్యం 'సితార' సినీవార పత్రిక ప్రారంభించారు. ఆ పత్రిక ట్రెండ్ సెట్టర్ గా మారింది. 1977లో ఆంధ్రజ్యోతి వారు జ్యోతిచిత్రను ప్రారంభించారు. చిత్రభూమి, శివరంజని, సినిమా రంజనీ, తార సితార, సినీడిటెక్టివ్, సినీ ఎన్ కౌంటర్, నంబర్ వన్, చిత్రం, సంతోషం, సినీవినోదం అనేవి ప్రారంభమయ్యాయి.

## 11.2. పత్రికా భాష – శైలి

### భాష తీరు

పత్రికా రంగం అన్ని ప్రసార మాధ్యమాలలో విశిష్ట మయినదిగా గుర్తింపు పొందింది. భాషను వినియోగించుట లో పత్రికలకు ఎంతో బాధ్యత ఉంటుంది. అందువలన భాష విషయం లో జాగ్రత్తగా, శ్రద్ధ గా ఉంటాయి. సాధారణంగా పత్రికలు ప్రామాణిక భాష ను వాడుతాయి. కొన్ని పత్రికలు అస్తిత్వం, అస్మిత ల కోసం మాండలిక భాషను కూడా ప్రయోగిస్తాయి. పత్రికలు సాధారణంగా పాండిత్య పరం గా సాధారణ స్థాయి పాఠకులను దృష్టిలో ఉంచుకుని భాషస్థాయి నిర్ణయిస్తాయి. పాత్రికేయులకు భాష శైలి అదుపు ఆజ్ఞలలో ఉండాలి.

పాత్రికేయ భాష సాధారణ పాఠకుడిని దృష్టి లో ఉంచుకుని సరళంగా ఉండాలి. దోషరహిత భాషలో రచించబడాలి. ముఖ్యంగా వ్యాకరణ, విరామ చిహ్నాల విషయంలో దోషాలు ఉండరాదు. తను ప్రయోగించే ప్రతీ పదమూ అర్థం, భావం, రూఢి లను నిర?యించుకుని ప్రయోగించాలి. పత్రికా రచనలో వాక్యాలు తెలుగు భాష పరం గా చిన్న చిన్న వాక్యాలు అయితే మంచిది. మహా వాక్యాలు, సంక్లిష్ట వాక్య నిర్మాణం వార్తా రచనకు శోభను

తగ్గిస్తాయి. వార్తా రచన లో పేరాలు చిన్న చిన్న గా ఉండటం చదివించే గుణాన్ని పెంచుతుంది. సాధారణంగా ఒక పేరా లో 75 పదాల కంటే తక్కువ పదాలు ఉండటం అభిలషణీయం. అలాగే సగటున ప్రతీ వాక్యానికి 19 కి మించి పదాలు ఉండరాదు అంటారు. రాసిన దానిలో సంగతితో పాటు రాసిన తీరును బట్టి వార్తకు విలువ నిర్ణయించవచ్చు.

పేరా లోని సారాంశాన్ని సాధారణంగా మొదటి వాక్యం లో సూచిస్తారు. కొన్ని వివరణాత్మక కథనాలలో మాత్రం చివరి వాక్యం లో సారాంశాన్ని చూపించే విధం గా రాస్తారు. ప్రతీ పేరా లో కనీసం 2 వాక్యాలు అయినా ఉండే విధం గా రాస్తారు

## 11.3 శైలీ వైవిధ్యాలు:

వార్తా రచన లో విషయ ప్రధానమైన శైలి ఉంటుంది. సంపాదకీయం, ప్రత్యేక వ్యాసాలలో సృజనాత్మక శైలి ఉంటుంది.

విషయ ప్రధానమయిన శైలి లో సరళత, స్పష్టత, వివరణ, వర్ణణాత్మకత ఉంటాయి. వివరణ, విశ్లేషణ, వ్యాఖ్యానం ఈ తరహా రచనలో చోటుచేసుకుంటాయి.

సృజనాత్మక శైలిలో ఆకర్షణీయమైన పదజాలం, స్పష్టత, సరళత, మంచి నానుడులు, పలుకుబడులు, మంచి జాతీయాలు, సామెతలు, మంచి పొడుపు కథలు ఉంటాయి.

చిన్న పిల్లలకు ఉద్దేశించిన రచనల్లో చిన్న పిల్లల స్థాయి కి వెళ్లి వాళ్ళ పదజాలంతో, సరళమయిన, స్పష్టమయిన భాష లో రాయాలి. చిన్న పిల్లల మనస్తత్వం, అభిరుచులు, అభీష్టాలను ద ృష్టిలో ఉంచుకుని రాయాల్సి ఉంటుంది. కథనాత్మకత ఉన్న రచనలు ఆకట్టుకుంటాయి.

వార్తల ఎత్తుగడ, అంశాలను కూర్చే పద్ధతి, విపులీకరించే సామర్థ్యం మొదలయినవి పత్రికా రచనలో పెంపొందిన శిల్పాలు. ఆ తర్వాత శీర్షిక రూప కల్పన, లీడ్ ఇవ్వడం, అందుబాటులో ఉన్న పత్రికా స్పేస్ అనుగుణంగా సంక్షిప్తంగా మార్చగలిగే నేర్పు పాత్రికేయులకు ఉండాలి.

పత్రికలలో స్థానిక వార్తలు, అంతర్జాతీయ వార్తలు, సినిమా వార్తలు, క్రీడా వార్తలు, సాంస్కృతిక వార్తలు మొదలైన రకరకాల వార్తలు ప్రచురితమవుతాయి. ఇలాంటి వార్తలు కూర్చడం లో ప్రత్యేకమయిన పద్ధతి పాటిస్తారు. పత్రికా ప్రాథమ్యాలను దృష్టిలో ఉంచుకుని ఆయా పేజీ లను కేటాయిస్తారు. ఉదాహరణకు క్రీడా వార్తలు చాలా మటుకు చివరి పేజీ లలో వస్తాయి.

పత్రికలకు వచ్చే కథనాలు నిస్సారంగా ఉంటాయి. వాటిని వార్తా రచనగా మార్చేటపుడు హృదయ స్పందన కలిగించే అంశాలు బయటకు తీసి నాటకీయంగా వార్తా రచన సాగిస్తారు.

చాలామటుకు వార్తలలో అతిశయోక్తి దొర్లనీయరు. యదార్ధ విషయాలు ఉండేలా చూస్తారు. సంపాదకులు మాత్రం తమ వ్యాఖ్యలు జోడిస్తారు. ఒకవేళ ఏదయినా అంశం గురించి ఎక్కువ చేసి రాసేటప్పుడు మరొకరు

దానిని చెప్పినట్లు రాస్తారు.

పత్రికలలో వ్యక్తులకు సమాన గౌరవం ఇచ్చే పదాలు ఉంచి, శ్రీ శ్రీ శ్రీ మొదలైన అనవసర గౌరవ పద ప్రయోగాలు పరిహరిస్తారు.

ఏ వార్తలు ప్రచురించకూడదో పాత్రికేయులకు అవగాహన ఉండాలి. కోర్టు ధిక్కారం, అశ్లీలత, వ్యక్తుల పరువు నష్టం వార్తలలో ఉండరాదు. మత కలహాలు, ప్రేమ విషయాలకు సంబంధించిన వార్తలు ఎవరినీ రెచ్చగొట్టి విధంగా ఉండరాదు. ఊత పదాలు, పునరుక్తులు, కర్ణ కఠోర శబ్దాలు వాడకూడదు. సందేహాస్పద వార్తలు వదిలివేయాలి.

**రాదగిన ప్రశ్నలు :**

1. వివిధ రకాల పత్రికలను పరిచయం చేయండి?
2. పత్రికలలో శైలీవైవిధ్యాన్ని వివరించండి?

**ఆధార గ్రంథాలు :**


1. తెలుగు జర్నలిజం – దుర్గం రవీంద్ర
2. తెలుగులో పత్రికారచన – అవతరణ – వికాసములు – డా.జి. హరిశ్చంద్ర ప్రసాద్
3. పత్రికా రచన – పరిచయ విశేషాలు –ఆచార్య జి. మోహన్ బాబు
4. ప్రచారమాధ్యముల కోసం రాయడం– డా . అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం



**–పి. రామచంద్రుడు**

తెలుగు అధ్యాపకులు,

డి ఆర్ జి ప్రభుత్వ డిగ్రీ కళాశాల,

తాడేపల్లి గూడెం.

# పాఠం - 12

# పత్రికారచన - వార్తా రచన, సంపాదకీయాలు, సమీక్షలు - అవగాహన

**పాఠ్యాంశ నిర్మాణ క్రమం:**

12.1. పత్రికా రచన

12.2. వార్తా రచన

12.3. సంపాదకీయాలు

12.4. సమీక్షలు

**ఉద్దేశ్యం :**

పత్రికా రచన గురించి అదీ ముఖ్యంగా వార్తలు, సంపాదకీయాలు, సమీక్షలు రాయడం ఎలానో అవగాహన కల్పించటం.

## 12.1. పత్రికా రచన :

పత్రికలకు రాయడం పత్రికారచనవుతుంది. సాధారణ ప్రజానీకానికి అర్థమయ్యేవిధంగా పత్రికా రచన ఉండాలి. పత్రికలు చదివే వాళ్ళలో పండితులు, పామరులు ఉంటారు కనుక అందరినీ మెప్పించే విధంగా పత్రికా రచనుండాలి. పత్రికలలో వార్తలు, సంపాదకీయాలు, సమీక్షలు, వార్తా కథనాలు, కార్టూన్లు, వ్యాపార ప్రకటనలు మొదలైనవన్నీ ఉంటాయి.

## 12.2. వార్తా రచన :

వార్త అంటే సమాచారం. నేటి సమాజంలో సమాచారం అత్యంత శక్తివంతమైన ఆయుధం.

"వార్తయందు జగము వర్ధిల్లుచున్నది, అదియు లేనినాడు అఖిలజనులు అంధకార మగ్నులగుదురు గావున, వార్త నిర్వహింపవలయు పతికి" అని మహాభారతంలో నారదుడు ధర్మరాజుకి చెపుతాడు. దీనినిబట్టి వార్త ప్రాధాన్యత తెలుస్తుంది. భామహుడు అలంకారశాస్త్రంలో 'వక్రతలేని ఉక్తి వార్త' అని చెప్పాడు. వార్త అంటే వృత్తాంతం లేదా సంఘటన విషయం. మామూలు సంఘటనలు కాకుండా అసహజమైన, విశేషమైన అసాధారణమైన సంఘటన, లేదా అంశం వార్త అవుతుంది. వార్తలు ముఖ్యంగా వర్తమానానికి చెంది ఉండాలి, చర్చనీయంగా ఉండాలి, తాజాగా ఉండాలి. ప్రముఖమైనవై ఉండాలి, ఖచ్చితమైనవై ఉండాలి.

### 12.2.1. వార్త లక్షణాలు :

వార్త ఈ క్రింది లక్షణాలు కలిగి ఉండాలి.

**1. ప్రాముఖ్యత :**

సమాజంలో ప్రముఖమైన వ్యక్తులు, ప్రదేశాలు, సంఘటనలు, సంస్థల వివరాలు వార్తా ప్రాముఖ్యతను కలిగి ఉంటాయి. రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ప్రముఖ శాస్త్రవేత్తలు, సంఘసేవకులు, రాజకీయ నాయకులు విదేశీ నేతలు, ప్రముఖ నటీనటులు, ఉన్నత ప్రభుత్వాధికారులు, మత ప్రవక్తల వంటి వారికి సంబంధించిన అన్ని విషయాలు వార్తలే అవుతాయి. విదేశీ అధ్యక్షుల వంటివారు మన దేశాన్ని సందర్శించటం వంటివి వార్త అవుతాయి. పార్లమెంట్, శాసనసభ, సచివాలయం, ప్రముఖ దేవాలయాలు, రాయబార కార్యాలయాలు, చారిత్రక ప్రాధాన్యత గల ప్రదేశాల్లో చిన్న సంఘటన జరిగినా వార్తే అవుతుంది.

**2. సామీప్యత :**

మన సమీపంలో జరిగే సంఘటనల పట్ల ఆసక్తి ఎక్కువ కలిగి ఉండటం సహజం. సంఘటన ఎంత సమీపంలో జరిగితే ప్రాధాన్యత అంత పెరుగుతుంది. ఎక్కడో విదేశాల్లో జరిగిన సంఘటనల కన్నా మన ఊరిలో, అదీ మన వీధిలో జరిగిన సంఘటనల పట్ల ఆసక్తి అధికంగా ఉంటుంది. ఈ లక్షణాన్ని ఆధారంగా చేసుకొనే దినపత్రికలన్నీ ప్రాంతీయ వార్తలకు ప్రాధాన్యతనిచ్చి ప్రచురిస్తున్నాయి. ఈ ఒరవడిలోనే జిల్లా ఎడిషన్లు ప్రారంభమయ్యాయి.

**3. పర్యవసానం :**

ఏ సంఘటనల ప్రభావం మనపై ఎక్కువగా ఉంటుందో ఆ వివరాలని తెలుసుకోవటానికి ఆసక్తి చూపటం సాధారణంగా జరుగుతుంది. ప్రభుత్వ విధానాలు, నాయకుల వాగ్దానాలు, వ్యాపార సంస్థల ప్రకటనలు, కొత్త చట్టాల వివరాలు, పన్నులు, ఎన్నికలు, బడ్జెట్, వాతావరణ సూచనలు, యుద్ధాలు వంటివన్నీ ఈ కోవకు చెందిన వార్తలే. ఇలాంటి వాటిలో తీసుకునే నిర్ణయాల పర్యవసానం కారణంగా ప్రజల జీవనంలో మార్పులు వస్తాయి కాబట్టి వాటిపట్ల ఆసక్తి కనబరుస్తారు.

**4. అన్వయింపు :**

ప్రజలు సహజంగా తమ జీవితంతో, ఆలోచనలతో పోలిక కలిగిన సంఘటనల పట్ల ఆసక్తి కనబరుస్తారు. జరిగిన సంఘటన ఫలితాలను, తీరు తెన్నులను, తమకు అన్వయించుకొని దాని ప్రభావాన్ని అంచనా కడతారు. లాటరీలో ఒక వ్యక్తికి భారీ మొత్తంలో బహుమతి వస్తే అది వార్త కావడానికి కారణం దానిని పాఠకుడు తనకు అన్వయించుకొని ఆనందపడటం కారణంగానే..

**5. సంఘర్షణ :**

మానవ జీవితం జననం మొదలు మరణం వరకు సంఘర్షణతో కూడుకొని ఉంటుంది. వ్యక్తులు, సంస్థలు, ఉద్యమాలు, మతాలు వంటివాటిలో ఉండే భావసారూప్యాలు, భేదాలు వాటిపై వాదోపవాదాలు ఇవన్నీ పాఠకుడిని ఆకర్షిస్తాయి. ఎన్నికలలో పోటీ, కొట్లాటలు వంటి వాటిపట్ల పాఠకులు ఆకర్షితులు కావటానికి కారణం ఈ సంఘర్షణే.

**6 సంచలనశీలత:**

సంచలనాత్మకమైన విషయాలపట్ల కూడా పాఠకులు ఆకర్షితులవుతారు. మానవ బలహీనతల వల్ల

సంభవించే రకరకాలైన వికృతచేష్టలు కారణంగా జరిగే నేరాలు, ఘోరాలు, బలాత్కారాలు, అక్రమ సంబంధాలు, మోసాలు, నమ్మక ద్రోహాలు, ప్రేమ, ద్వేషం వంటివన్నీ సంచలనశీలమైనవి కావడంతో పాఠకులు ఇలాంటి వార్తల పట్ల ఆకర్షితులవుతారు. అయితే ఇలాంటి వార్తల వలన ఆవేశపడే గుణంగలవారు వెంటనే ప్రతిస్పందిస్తే జరిగే పరిణామాలు అనర్థాలు కలిగించవచ్చు. ఆ వార్తల వలన ప్రభావితులై మంచినికాక చెడును తీసుకొనే పాఠకులు ఉండకపోరు. కాబట్టి ఇలాంటి వార్తలు రాసేటప్పుడు ఆ బలహీనతలను నిరుత్సాహపరిచే విధంగా, నేరాలు చేస్తే పడే శిక్షలు ఎంత ఘోరంగా ఉంటాయో తెలియజేసే విధంగా రాయాలి.

**7. మానవాసక్తి:**

ఆశ్చర్యాన్ని కలిగించే సంఘటనలు, అసాధారణమైన అంశాలు, సాహసం, సెక్స్, సౌందర్యం, ప్రతిభ, అనుకోకుండా జరిగే కొన్ని సంఘటనలు ఎంతో ఆసక్తిని పాఠకులలో కలిగిస్తాయి. అందుకే మానవాసక్తి వార్తా లక్షణాల్లో ఒకటైంది. బతికున్న జంతువులను తినే మనిషి, మట్టి తినే వ్యక్తి, 12 అడుగుల జుట్టు పెంచుకున్న మనిషి జుట్టుతో కారో.. లారీనో లాగటం వంటివి అందుకే వార్తలు అయ్యాయి. మూఢ నమ్మకాలు, బలులు వంటి విషయాలు కూడా మానవాసక్తిని పెంచుతాయి.

**8. సమయానుకూలత :**

News should be fresh like fish అంటారు. అంటే వార్తలు ఎప్పుడూ తాజాగా ఉండాలి. ఎంత తాజా వార్త అయితే అంత ప్రాధాన్యత పెరుగుతుంది.

**9. ప్రమాదం - అభివృద్ధి :**

ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే అవి ప్రాకృతికమైనా, మనిషి తప్పిదాల కారణంగానైనా అవి ప్రాధాన్యతను సంతరించుకుంటాయి. భూకంపం, వరదలు, అగ్ని ప్రమాదాలు, కరువు కాటకాలు, పేలుడు సంఘటనలు, రోడ్డు ప్రమాదాలు మొదలైనవన్నీ పాఠకులు ఆసక్తితో చదువుతారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల పట్ల కూడా పాఠకులు ఆసక్తి కనబరుస్తారు. ప్రాజెక్టులు, వంతెనల నిర్మాణాలు, వైద్యశాల ఏర్పాటు, రక్షిత మంచినీటి సౌకర్యం కల్పించడం వంటి అభివృద్ధికరమైన సంఘటనల సమాచారాన్ని తెలుసుకోవటానికి పాఠకులు ఆసక్తి కనబరుస్తారు. కాబట్టి ప్రమాదాలు, అభివృద్ధి అనేవి వార్త లక్షణాల్లో ఒకటిగా అయ్యాయి.

## 12.2.2 వార్త రాసేటప్పుడు పాటించవలసిన మెళకువలు:

1. వార్తా లక్షణాలను బట్టి అందిన సమాచారం వార్త అవునో కాదో ముందుగా నిర్ధారించుకోవాలి.
2. నిర్ణయించుకున్న తర్వాత వాస్తవాలను పరిశీలించాలి.
3. వాస్తవ విషయాలు కాకపోయినా సంచలనాల సరదాతో రంగులు పులమకూడదు.
4. వివేచనలేని రాతలకు విలువలేదు కనుక అలాంటివి రాయకూడదు.
5. పక్షపాత ధోరణి ఉండకూడదు
6. నూతన పదాల నిర్మాణం అవసరమే కానీ ఉన్న పదాలకు బదులు అవసరం లేని దగ్గర కొత్త పదాల ప్రయోగం చేయవలసిన అవసరం లేదు.

7. అసత్యం రాయడం కన్నా రాయకపోవటమే నయం. పొరపాటుగా తప్పు రాస్తే తరువాతైనా దానిని సరిచేసుకోవాలి.
8. కొత్త ప్రయోగాలు చేసేటప్పుడు ఔచిత్యం పాటించాలి.
9. విస్తృత విషయ పరిజ్ఞానం కలిగుండి వార్తా రచన చెయ్యాలి.
10. మౌలిక విలువలకు హాని కల్గించే వార్తలు రాయకూడదు.
11. వార్త అందరికీ అర్థమయ్యేరీతిలో సరళమైన భాషలో రాయాలి. శబ్దాడంబరం అవసరం లేదు.
12. ప్రజాహిత సమాచారం అందించే విధంగా వార్తా రచన ఉండాలి.
13. ఔచిత్య భంగంలేని సృజనాత్మకతతో రచన చేయాలి.
14. భావం చెడకుండా రాయాలి
15. ధ్రువపడని విషయాలను వార్తగా రాయకూడదు.
16 వార్తాంశాన్ని ఆకళింపు చేసుకొనే విధంగా శీర్షిక పెట్టాలి.
17. వార్తను వక్రీకరించి రాయకూడదు.
18. చెప్పే విషయం సూటిగా, స్పష్టంగా పాఠకుడికి అర్థమయ్యే విధంగా ఉండాలే కానీ విసుగు కలిగించకూడదు.
19. పాఠకులను ఇబ్బంది పెట్టె పరభాషా ప్రయోగం చేయకూడదు.
20. అవసరమైన దగ్గర సామెతలు, జాతీయాలు వాడవచ్చు.

## 12.3. సంపాదకీయాలు:

సంపాదకీయమనేది వార్తాపత్రికకు శిరస్సులాంటిది. తల లేకుండా మనిషి లేనట్లే సంపాదకీయం లేకుండా వార్తా పత్రిక మనుగడ ఉండదు. అందుకే సంపాదకీయమే వార్తా పత్రికకు జీవం. సంపాదకీయాన్ని చదివేవారిలో ఎక్కువమంది బాగా చదువుకున్నవారు, ఉద్యోగులు, అధికార్లు వంటివారుంటారు. కనుక సంపాదకీయాన్ని మేధావుల పేజీగా పరిగణిస్తారు. భాషరీత్యా జటిలత్వాన్ని, భావం రీత్యా నర్మగర్భాన్ని పెనవేసుకొని ఉండే ప్రక్రియ సంపాదకీయం. పత్రిక యొక్క ప్రామాణికతకు కొలమానం సంపాదకీయమనుకోవచ్చు. వాస్తవాల్ని మాత్రమే వార్తలు ప్రతిబింబిస్తే వాటిని వ్యాఖ్యానిస్తూ, తర్కిస్తూ రాయడం సంపాదకీయం. కొన్ని పత్రికలు ప్రజాభిప్రాయాలకు ప్రాధాన్యతనిచ్చి వాటిని సంపాదకీయాల రూపంలో ప్రచురిస్తాయి. సమాజంలో జరుగుతున్న సంఘటనలకు పత్రిక ఏవిధంగా స్పందిస్తుందో తెలియజేసేది సంపాదకీయం.

సంపాదకీయం సాధారణంగా సంక్షిప్తంగా ఉంటుంది. నిలువుగా ఒక కాలమ్ లో ఇమిడేటట్లు ఉంటుంది. భావప్రాధాన్యత అధికంగా ఉంటుంది . సంపాదకీయంలో ముఖ్యంగా నాలుగు అంశాలు ఉండాలి. అవి:

1. వార్తా కీలకం 2. వాదన 3. ప్రతి వాదన 4.ముక్తాయింపు / సమాపనం

సంపాదకీయాలు వార్తల ఆధారంగానే రాయబడతాయి. వ్యాఖ్యానించబోయే వార్తను పరిచయం చేసే భాగం వార్తా కీలకం. సంపాదకీయం కోసం ఎన్నుకొనే వార్తలు ప్రాధాన్యతను కలిగి ప్రజలందరూ చర్చించుకునేదై ఉండాలి. సంపాదకీయంలో ముఖ్యమైన అంశం వాదన. వార్త కీలకానికి వాదనకు అనుసంధానం ఉండాలి. జరిగిన సంఘటన పట్ల పత్రిక స్పందనను తెలియజేయాలి. పత్రిక ప్రజల పక్షం వహించినట్లుగా నిరూపితం

చేసేది వాదన. ప్రతివాదనలో ప్రజల అభిప్రాయాన్ని వ్యక్తీకరించాలి. తర్కానికి ఆస్కారముండే భాగం ఇది. ప్రజల స్పందన పట్ల పత్రిక అభిప్రాయం ఏమిటో వ్యక్తం కావాలి. సరళమైన శైలిలో వ్యాఖ్యానం పదునుగా ఉండాలి. ఈ వ్యాఖ్యానంపై వచ్చే ప్రతి వ్యాఖ్యానాలను సంపాదకుడే ఊహించుకొని వాటికి సమాధానాలు కూడా రాయాలి. ఇక సంపాదకీయంలో ముఖ్యమైంది ముక్తాయింపు లేదా సమాపనం. వాదన, ప్రతివాదనల ఆధారంగా సంపాదకుడు జరిగిన సంఘటనకు బాధ్యుడైన వారిని విమర్శిస్తూ, ఏ మాత్రం భయంలేకుండా సాహసంతో జనజాగృతికి పిలుపునిస్తూ రాయాలి. ప్రభుత్వ దురాగతాలైనా నిర్భయంగా తెలియజేయగలగాలి. ప్రజలకు హెచ్చరిక, సందేశము వంటివి ఇవ్వాలి. పత్రిక తాలుకు అసలైన బాధ్యతను నిర్వహించే భాగమిది. ముక్తాయింపులేని సంపాదకీయాలు ప్రజలను ఆకట్టుకోలేవు. ఈ నాలుగు భాగాలను అనుసరించి రాసే సంపాదకీయలు కలకాలం గుర్తుండిపోతాయి.

కేవలం ప్రజావ్యతిరేక అంశాల మీదే కాకుండా ప్రజల ప్రయోజనం కోసం ప్రభుత్వాలు చేపట్టే ప్రగతి ప్రణాళికలపై కూడా సంపాదకీయాలు రాయవచ్చు. ఈ మధ్య సాహిత్య సంపాదకీయాలు కూడా వస్తున్నాయి. సంపాదకుడు సమర్ధుడైనప్పుడు సంపాదకీయం కలకాలం నిలిచిపోతుంది. లేకపోతే వార్తలలాగానే మరుగునపడిపోతుంది.

## 12.4. సమీక్షలు :

ఇవి సాధారణంగా పుస్తక సమీక్షలుగా పత్రికలలో చూస్తాం. వివిధ రంగాలకు సంబంధించి వెలువడే పుస్తకాలన్నీ సమీక్షకు వస్తాయి. ఆ రంగాలకు చెందిన నిపుణులు ఆ పుస్తకాన్ని సమీక్షిస్తారు. ఆ పుస్తకానికి సంబంధించిన ప్రాధమిక సమాచారాన్ని ఈ సమీక్షలలో తెలియజేస్తారు. రచయిత వివరాలు, పబ్లిషర్స్ వివరాలు, ధర, లభించేచోటు మాత్రమే తెలిపే సమీక్షలుంటాయి. ఇంకా లోతులకు వెళ్లి ఆ రచనలోని విషయం ఏంటి, అందులోని మంచి చెడులేంటి అని సద్విమర్శ చేసే సమీక్షలు ఉంటాయి. ఏది ఏమైనా పాఠకులకు ఆ రచనను పరిచయం చేయటం, చదవాలనే ఆసక్తిని రేకెత్తించటం సమీక్షల ఉద్దేశ్యం.

రాదగిన ప్రశ్నలు :

1. వార్తను నిర్వచించి వార్తా లక్షణాలు తెలపండి?
2. సంపాదకీయం గురించి రాయండి?

**ఆధార గ్రంథాలు :**


1. తెలుగు జర్నలిజం - దుర్గం రవీంద్ర
2. తెలుగులో పత్రికా రచన - అవతరణ - వికాసములు - డా. జి. హరిశ్చంద్ర ప్రసాద్
3. పత్రికారచన - పరిచయ విశేషాలు - ఆచార్య జి.యోహన్ బాబు
4. ప్రచార మాధ్యమాల కోసం రాయడం - డా అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వారి ప్రచురణలు
5. దిద్దుబాటు - జి.యస్. వరదాచారి



**-పి. రామచంద్రుడు,**

తెలుగు అధ్యాపకులు,

డి అర్ జి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తాడేపల్లి గుండెం

# పాఠం - 13

# ప్రసార మాధ్యమాలు - నిర్వచనం, రకాలు, విస్తృతి, ప్రయోజనాలు

**పాఠ్యాంశ నిర్మాణం క్రమం**

13.1 ప్రసార మాధ్యమాలు - నిర్వచనం.
13.2 జన మాధ్యమాలు - విధులు
13.3 జన మధ్యమాల ఆవశ్యకత /ప్రయోజనం
13 4 మాధ్యమాలు - విస్తృతి
13.5 ప్రసార మాధ్యమాలు - రకాలు

**ఉద్దేశ్యం :** ప్రసార మాధ్యమాల లక్షణాలు, విధులు, రకాల గురించి తెలియజేయటం

## 13.1 ప్రసార మాధ్యమాలు - నిర్వచనం :

సమాచారం చేరవేసే వాహికను మాధ్యమం అంటారు. సమాచార చేరవేత అనేది ఒక చలన ప్రక్రియ. ఇది వ్యక్తి నుండి వ్యక్తికి, ఒకేసారి ఒక సమూహానికి, అంతకంటే విస్తృతంగా జనబాహుళ్యానికి ప్రసార మాధ్యమాల ద్వారానే సమాచారం చేరవేయబడుతుంది. ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో పాల్గొంటే దానిని జన మాధ్యమం (Mass Media) అంటారు. ఈ జనమాధ్యమాలు వివిధ రకాలు. వార్తా పత్రికలు, మ్యాగజైనులు, రేడియో, చలన చిత్రాలు, టెలివిజన్ వంటివి ప్రధానంగా పేర్కొనదగినవి. ఈ జనమాధ్యమాలకు కొన్ని విధులున్నాయి.

## 13.2 జన మాధ్యమాలు - విధులు:

### 13. 2.1 సమాచారం :

జీవన విధానం మెరుగుపరుచుకోవడానికి సమాచారం ఎంతో అవసరం. అందుకే పాశ్చాత్య దేశాలలో సమాచారాన్ని ఒక శక్తిగా భావిస్తారు. ప్రాంతీయ, రాష్ట్రీయ, దేశీయ, అంతర్జాతీయ సంబంధమైన అన్ని విషయాలు సమాచారం ద్వారానే తెలుస్తాయి. ప్రకృతి వైపరీత్యాల గురించిన ముందస్తు హెచ్చరికలు, సూచనలు అందించేవి మాధ్యమాలే. అందుకే మాధ్యమాలు ముఖ్యవిధి సమాచార మందించటం.

### 13.2.2 బోధన :

బోధన కూడా మాధ్యమాల విధుల్లో ఒకటి. విజ్ఞానాన్ని సాంకేతిక పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను ప్రజలకు అందించగల సామర్థ్యం ఈ మాధ్యమాలకుంది . ప్రత్యేకంగా పాఠశాల విద్యార్థుల కోసం పాఠ్యాంశ బోధన కూడా మాధ్యమాల ద్వారా నిర్వహిస్తే విద్యార్థులకు సులభంగా విషయ అవగాహన అవుతుంది. విద్యార్థులు ఆసక్తిగా పాఠ్యాంశాలను నేర్చుకోగలుగుతారు.

### 13.2 3. వినోదం:

మానవ జీవితంలో దైనందిన కృత్యాలతో అలసి, నిస్పృహ, నిస్సత్తువ నిండుకున్న జీవితాలకు వినోదం కొత్త ఉత్సాహాన్ని అందిస్తుంది. జీవితానికి సంబంధించిన అనేక విలువైన అంశాలను వినోదంతో మేళవించి ప్రజలకు అందించవచ్చు. సంగీతం, నృత్యం, నాటకం, సాహిత్యం, చలనచిత్రాలు, క్రీడలు, హాస్య ప్రధానమైన కార్యక్రమాల వంటివి ప్రజలకు వినోదంతోపాటు ఆహ్లాదాన్ని, జ్ఞానాన్ని అందిస్తాయి.

### 13.2.4. సాంస్కృతిక అభివృద్ధి :

జనమాధ్యమాలు దేశసంస్కృతిని పరిరక్షించుకోవడానికి, పెంపొందించుకోవడానికి అవకాశం కల్పిస్తాయి. ప్రజలలో ఉన్న కళాత్మక భావాలను మేల్కొలుపుతాయి. జన మాధ్యమాలు చేసే కృషి కారణంగా ప్రజలు సంస్కృతి విలువను అర్థం చేసుకోగలుగుతారు, కాపాడుకోగలుగుతారు.

### 13.2.5. సమైక్యత:

వర్తమానకాలంలో సమైక్యత ఆవశ్యకత ఎంతైనా ఉంది. అదీ మన దేశం వంటి దేశంలో దీని అవసరం ఇంకా ఎక్కువ. భిన్న మతాలు, భిన్న కులాలు, భిన్న భాషలు, భిన్న సంప్రదాయాలు కలిగిన భారతదేశాన్ని ఒక్కటిగా నిలిపేది ప్రజలలోని సమైక్యభావనే. ఆ సమైక్యతని పెంపొందించే దిశగా మాధ్యమాలు మంచి కార్యక్రమాలను రూపొందించి ప్రసారం చేస్తే వాటి ప్రభావం ప్రజలపై తప్పకుండా ఉంటుంది. వ్యక్తుల మధ్య, సమూహాల మధ్య, దేశాల మధ్య సదవగాహన పెంపొందించే సంస్కారాన్ని, సౌభ్రాతృత్వాన్ని మాధ్యమాలు కల్పిస్తాయి.
×

### 13. 3 జన మాధ్యమాల ఆవశ్యకత / ప్రయోజనం :

జనమాధ్యమాలలో వస్తున్న సాంకేతిక పురోభివృద్ధి కారణంగా నేడు ప్రజల నిత్యజీవితంలో మాధ్యమాలు ఒక భాగమయ్యాయి. ఏదో ఒక మాధ్యమంతో అనుబంధం లేని వ్యక్తి ఈనాడు సమాజంలో కన్పించదు. అంటే మాధ్యమాలు ప్రజలను అంతగా ఆకట్టుకున్నాయి, అంతగా ప్రభావితం చేస్తున్నాయి. సాంకేతిక అభివృద్ధి కారణంగా పెరిగిన జనమాధ్యమాల వినియోగం ప్రపంచాన్నే ఓ కుగ్రామంగా (global village) మార్చివేసింది.

జనమాధ్యమాల ప్రభావం సమాజం మీద, మనిషి మీద ఎంతగానో కన్పిస్తుంది. ప్రజలు ప్రతి విషయానికి జనమాధ్యమాల మీదనే ఆధారపడి ఉండటం వాటి ఆవశ్యకతను తెలియజేస్తాయి. వాటి ప్రయోజనం అంత ఎక్కువగా ఉంది కనుకనే వాటి వాడకం విస్తృతమైంది. అయితే ఇక్కడ మర్చిపోకూడని ఒక విషయం ఏంటంటే మాధ్యమాలు ఎంత అనుకూల ప్రభావాన్ని చూపుతున్నాయో అంత వ్యతిరేక ప్రభావాన్ని సమాజంపై చూపుతున్నాయి. హింస, నేర ప్రవృత్తి, సెక్స్ విషయాలు యువతరం మీద చెడు ప్రభావం చూపిస్తుండటం అందరికీ తెలిసిన విషయమే. విదేశీ కార్యక్రమాల కారణంగా మన సంస్కృతి, జాతీయతలకు ముప్పు కలుగుతుందనే అనుమానం లేకపోలేదు. జన మాధ్యమాలకు సమాజంతో సంబంధం ఉంది కనుక ప్రజల మీద ఇవి ధనాత్మక ఋణాత్మక ప్రభావాన్ని చూపకమానవు. మతసామరస్యం, పర్యావరణ పరిరక్షణ, సమాజ వ్యతిరేక శక్తుల నిర్మూలన, మాదక ద్రవ్యాల వ్యతిరేకత, దేశ సమైక్యత వంటి అనేక అంశాలపై ప్రజలలో అవగాహన కలిగించటానికి మాధ్యమాలు ఉపకరిస్తున్నాయి. విద్య, అభివృద్ధి, సామాజిక చైతన్యం వంటి విషయాల ప్రచారంలో ధనాత్మక పాత్రను

జనమాధ్యమాలు నిర్వహిస్తున్నాయి.

## 13.4. మాధ్యమాలు - విస్తృతి :

మాధ్యమం అంటే మొదట్లో పత్రికలే. ఆ తర్వాత రేడియో వచ్చింది. ఆ తరువాత టెలివిజన్ వచ్చింది. టెలివిజన్ కంటే ముందే వచ్చిన చలనచిత్రాలు ప్రజలను ఎక్కువగా ప్రభావితం చేశాయి. ఆధునిక కాలంలో వెబ్‌సైట్, ఫేస్ బుక్, యుట్యూబ్, ట్విట్టర్, వాట్సప్, బ్లాగ్ ల వంటివి ప్రారంభమై ఎక్కువ ప్రభావాన్ని చూపుతున్నాయి. ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చిన తరువాత ఈ సామాజిక మాధ్యమాల ద్వారా అన్ని రంగాలకు సంబంధించిన జ్ఞానం ప్రజల అరిచేతిలోకి వచ్చింది. విద్య, వైద్యం, వంటలు, చిట్కాలు, సాహిత్యం, వివిధ భాషలకు చెందిన పరిజ్ఞానం, దేశ, విదేశీ సమాచారం, క్రీడలు, వ్యాపారం ఇది అది అని కాదు మనం దేని గురించి తెలుసుకోవాలన్నా దాని గురించి క్షణాల్లో తెలుసుకొనే అవకాశం కలిగింది. పిన్నల దగ్గర నుంచి పెద్దల వరకు అన్ని తరగతులకు, అన్ని వయసుల వారికి అవసరమైన సమాచారం, వినోదం అంతా ఒక దగ్గరే లభించటం మానవమేధకు నిదర్శనం. ఏదో ఒక సామాజిక మాధ్యమాన్ని వాడని వ్యక్తి నేటి సమాజంలో లేడంటే అది అతిశయోక్తి కాదు. కొన్ని సందర్భాలలో శృతిమించి సామాజిక మాధ్యమాలను వాడుతూ వాటికి బానిసలైపోతున్నారు. తాము వాడే మాధ్యమాలు ఒక అరగంట ఏదైనా కారణంతో అందుబాటులో లేకపోతే ఆందోళనపడే పరిస్థితి కలిగేటంతగా సామాజిక మాధ్యమాలు విస్తృతమయ్యాయి.

## 13.5. ప్రసార మాధ్యమాలు - రకాలు:

సమాచారం ప్రసారం చేస్తాయి కాబట్టి ప్రసారమాధ్యమాలయ్యాయి. ప్రసార మాధ్యమాలలో రేడియో, టెలివిజన్లు ముఖ్యమైనవి. ఇవి మాధ్యమాలలోనే అత్యుత్తమైనవి కూడా. వీటికి ప్రత్యేక లక్షణాలున్నాయి. ప్రసార మాధ్యమంలో ఉండే లక్షణాల విభిన్నతే ఈ రెండింటికి విశిష్టతను తెచ్చిపెట్టింది.

### 13.5.1. రేడియో - విశిష్ట లక్షణాలు:-

రంగస్థలంతో పోల్చినపుడు రేడియో దానికన్నా భిన్నంగా కనిపిస్తుంది. రంగస్థలం మీద కళాకారుడు ప్రేక్షకుడికి కనిపిస్తాడు. కానీ రేడియోలో వక్త శ్రోతలకు కనిపించడు, వినిపిస్తాడు. అంటే శ్రోత, ప్రేక్షకుడు ప్రత్యక్ష సంబంధం కలిగి ఉండరు. రేడియోలో పాల్గొనే కళాకారుడు తన శ్రోతని ఊహించుకోవాలి, అలాగే శ్రోత కళాకారుడిని ఊహించుకుంటాడు. అది సాధించటానికి ఈ క్రింది లక్షణాలు రేడియో కలిగి ఉంటుంది.

#### 1. ధ్వని మాధ్యమం:

రేడియో ధ్వని ప్రధాన మాధ్యమం. రేడియో ప్రసారంలో మాట, సంగీతం, శబ్దాలుంటాయి. వీటిని ధ్వని తరంగాల శ్రోతకు చేరుస్తాయి. ధ్వని తరంగాల ద్వారా వెళ్ళే శబ్దాలు వినసొంపుగా ఉండాలి. శ్రోతలోని ఊహాశక్తిని, సృజనాత్మకతను తట్టిలేపగలగాలి.

#### 2. స్వర మాధ్యమం :

కళాకారుడు ప్రసారం కోసం తన స్వరాన్ని ఉపయోగిస్తాడు కాబట్టి ఇది స్వర మాధ్యమం. కళాకారుడి స్వరమే

ప్రధానం, దానికి అవసరమైన సంగీతం, శబ్దాలు జోడిస్తారు. భావావేశాలను ప్రదర్శించేవిధంగా కళాకారుడి స్వరం ఉండాలి. గొంతులోనే సంతోషం, దుఃఖం, ఆశ్చర్యం, భయం వంటి అనేక భావాలను పండించగలగాలి. కళాకారుడి స్వరం, స్వరంలో ధ్వనించే భావాన్ని బట్టే శ్రోత ఊహించుకుంటాడు.

**3 వారధి - మైక్రోఫోన్:**

మైక్రోఫోన్ రేడియో కార్యక్రమ నిర్మాణంలో ఉపయోగించే ఒక పరికరం. వక్త మాట్లాడేది ఈ మైక్రోఫోన్ ద్వారానే శ్రోతకు చేరుతుంది. వక్త స్వరంలోని హెచ్చుతగ్గుల్ని శ్రోతకు ఈ మైక్రోఫోనే అందిస్తుంది. శ్రోతతో మాట్లాడుతున్నట్లే మైక్రోఫోన్ లో వక్త మాట్లాడాలి. సున్నితంగా భావ ప్రకటన చేస్తేచాలు.

**4. సన్నిహిత మాధ్యమం :**

రేడియోకి శ్రోతల్ని సన్నిహితులుగా చేసుకొనే శక్తి ఉంది. వక్త మాట్లాడుతుంటే శ్రోత తనతోనే మాట్లాడుతున్నారని, తన ప్రక్కనే ఉన్నారని బావిస్తాడు. అలా భావించగలిగినప్పుడు సాన్నిహిత్యం సాధ్యమవుతుంది. వక్త, శ్రోత ఒకరికొకరు అనే భావం ఏర్పడాలి. అది శ్రోతకు సన్నిహితంగా మాట్లాడినపుడే సాధ్యం. ఏ స్థితిలో ఉన్నా అర్థం చేసుకోగలిగే సామర్థ్యాన్ని ఈ సాన్నిహిత్యం కల్గిస్తుంది. చెప్పదల్చుకున్న విషయాన్ని ఉత్తేజంగా చెప్పాలి.

**5. ప్రజా మాధ్యమం :**

ఒక్క ప్రసారంతోనే ఒకేసారి లక్షణాది, కోట్లాది శ్రోతలకు చేరే తత్వం కలిగి ఉంటుంది. ఆ శ్రోతలలో వివిధ వర్గాలు, సమూహాలు, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక వైరుధ్యాలు కలిగిన శ్రోతలుంటారు. పామరుడి నుంచి పండితుల వరకు శ్రోతలుంటారు కనుక అందరూ ప్రసారమైన అంశాన్ని అర్థం చేసుకొనే విధంగా కార్యక్రమాలుండాలి. అతి తక్కువ ధరతో లభించే ప్రసార మాధ్యమం రేడియో.

**6. సరళమైన భాష :**

అత్యధిక నిరక్షరాస్యులున్న మన దేశంలో ఉపయోగించే భాష సూటిగా, సరళంగా, ప్రజలకు దగ్గరగా ఉండే విధం ఉండాలి. ప్రజల వాడుక భాషలోనే ప్రసారాలుండాలి, సాహిత్య సాంకేతిక పదాలను అనవసరంగా ఉపయోగించకూడదు. తప్పనిసరిగా సాంకేతిక పదజాలం వాడవలసి వస్తే శ్రోతలకు అర్థమయ్యేరీతిలో దాని గురించి చెప్పాలి. ప్రత్యక్షంగా సంభాషించినట్లుగానే రేడియో సంభాషణలుండాలి.

**7. కదిలే మాధ్యమం :-** మనం ఎక్కడున్నా, ఏ పని చేస్తున్నా ఆ పనికి అంతరాయం కలుగకుండా రేడియో ప్రసారాలు వినవచ్చు. ఏ సమయంలో నైనా వినవచ్చు. రేడియోను ఎక్కడికైనా తీసుకెళ్ళవచ్చు. కనుక ఇది కదిలే మాధ్యమం.

రేడియోకున్న ఇన్ని ప్రత్యేకతల కారణంగానే రేడియోను ఇంకా ఎందరో అభిమానిస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలతో తన మనసులోని మాటను పంచుకోవటానికి ' మన్ కి బాత్ ' రేడియోనే ఎంచుకోవటం ఇక్కడ మనం గుర్తుచేసుకోవాలి.

### 13.5.2. టెలివిజన్- విశిష్ట లక్షణాలు:

టెలివిజన్ దృశ్య శ్రవ్య మాధ్యమం. రేడియోకన్నా టెలివిజన్ ప్రజలను ఎక్కువగా ఆకర్షించటంతో టి.వి. వచ్చిన తర్వాత రేడియో వాడకం తగ్గింది. రేడియోలోలాగా కాక కళాకారులను చూసే అవకాశం ఉంటుంది కాబట్టి ప్రేక్షకులను ఆకర్షించే విధంగా కార్యక్రమ రూపకల్పన చేయాలి. కళాకారుల మాట తీరు, వస్త్రధారణ హావభావాలు వంటివన్నీ ప్రేక్షకులపై ప్రభావం చూపుతాయి. టెలివిజన్ శక్తిమంతమైన మాధ్యమం. దానికి కారణం వినటం ఒక్కటే కాకుండా చూడటం కూడా ఉండటమే. వినిన దానికన్నా చూసినది మనసుపై ఎక్కువగా ముద్రపడుతుంది.

**టెలివిజన్ మాధ్యమం - లక్షణాలు :**

**1. దృశ్యశ్రవ్య మాధ్యమం:**

టెలివిజన్ దృశ్యమాధ్యమమైనప్పటికీ ఎక్కువశాతం దృశ్యమాధ్యమంగానే భావిస్తాం. శ్రవ్య దృశ్య అంశాల ఆధార కార్యక్రమాల రూపకల్పన చేసి ప్రసారం చేస్తారు. శ్రవ్యానికి దృశ్యానికి అనుసంధానం బాగా ఉన్నప్పుడు అది ప్రేక్షకులను ఆకర్షిస్తుంది. ఒకేసారి వినటం, చూడడం జరగటం వలన పిల్లల నుంచి పెద్దల వరకు అందర్నీ టివి కట్టిపడేస్తుంది. చూడటం కారణంగా ప్రేక్షకుల గ్రహణశక్తి కూడా అధికంగానే ఉంటుంది.

**2. విస్తృత పరిధి, నమ్మకం:**

శాటిలైట్ సహకారంతో టెలివిజన్ ప్రసారాలు తమ పరిధిని విస్తృతం చేసుకున్నాయి. టెలివిజన్ కెమెరాకు భూగర్భం మొదలు అంతరిక్షం వరకు అన్నింటిని చూపగల సామర్థ్యం ఉంది. టెలివిజనే సమాచార విప్లవానికి నాంది పలికింది. ఉన్నది ఉన్నట్లు కళ్ళకు చూపించడంతో ప్రజల నమ్మకం సంపాదించింది. శక్తిమంతమైన మాధ్యమంగా ప్రపంచ రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, మత, క్రీడ, వ్యాపార, విద్య, వైద్య సంబంధిత అంశాలను ప్రజల ముందుకు తెచ్చింది.

**3. ఆకర్షణీయత :**

టి.వి. కి, టి.వి. లోని కార్యక్రమాలకు, ఆ కార్యక్రమాలలో పాల్గొనే కళాకారులకు ఎక్కువ ఆకర్షణ ఉంటుంది. ఒకప్పుడు చలనచిత్ర నటులకే ప్రాధాన్యత ఉండేది. కానీ నేడు బుల్లితెర నటీనటులకు అంతే ప్రాముఖ్యత ఉండటం గమనించవచ్చు. వివిధ సమాచారాలనేకాక అంతర్జాతీయ సమావేశాలను, ఫ్యాషన్ షోలను, ఇంటర్వ్యూలను, క్రీడాంశాలను, సినిమాలను మనకు చూపించగలదు. ప్రముఖ నాయకులు, నటులు, క్రీడాకారులను చూపటం కారణంగా టెలివిజన్ అంటే ఉండే ఆకర్షణ నుండి ప్రజలు బయట పడలేకపోతున్నారు. ప్రముఖ వ్యక్తుల వ్యక్తిత్వాలను ప్రేక్షకుల ముందు ఉంచగలదు. ఎన్ని కొత్తకొత్త సామాజిక మాధ్యమాలు వస్తున్నా ప్రజలు టివిని పక్కనపెట్టడం లేదంటే వారిని టి.వి ఎంతగా ఆకర్షిస్తుందో చెప్పవచ్చు.

**4. క్లోజప్ నైజం :**

టెలివిజన్ తెర చిన్నది కనుక కార్యక్రమాలను దూరపు షాట్ లతో తీస్తే ప్రేక్షకులకు కళాకారుల హావభావాలు సరిగా కనిపించవు. అందుకే టెలివిజన్లో ఎక్కువగా క్లోజప్ షాట్ లలోనే కార్యక్రమాల రూపకల్పన చేస్తారు. అందుకే టివికి క్లోజప్ మాధ్యమం అనే పేరు ఉంది.

**5. ఇంట్లోనే మాధ్యమం :-**

టెలివిజన్ కుటుంబంలోని అందరికీ వినోదాన్ని, విజ్ఞానాన్ని, సమాజాన్ని మన ముంగిట్లోకి తెస్తుంది. ఇంట్లోని వారందరూ కలిసి చూస్తారు. టెలివిజన్ సినిమా థియేటర్ ను మన ఇంట్లోకే తెచ్చింది. టెలివిజన్ అందరూ కలిసి చూస్తారు కాబట్టి కార్యక్రమాల రూపకల్పన, అందిస్తున్న సందేశం సమాజానికి ఉపయోగపడేదిగా ఉంటుంది.

**6. ప్రజాస్వామ్యయుతం :**

టెలివిజన్ మధ్యమం ఎలాంటి భేదం చూపక అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉంటుంది కనుక నిజమైన ప్రజాస్వామ్యం పాటించే మాధ్యమం ఇది. టెలివిజన్ ద్వారా ప్రసారమయ్యే అంశాలు అందరికీ అందుబాటలో ఉంటాయి. సమాచారాన్ని, విద్యను ప్రజాస్వామికంగా అందిస్తుంది.

**17. తక్షణం తత్వం :**

జరిగే సంఘటనలను, సమాచారాలను వార్తాపత్రికల కంటే అతివేగంగా అందిస్తుంది కనుక టి.వి. తక్షణ తత్త్వం కల మాధ్యమం . అంతేకాకుండా ప్రతి కార్యక్రమం నిడివి సమయం నిర్ధిష్టంగా ఉంటుంది. అదేవిధంగా కార్యక్రమాల రూపకల్పన జరుగుతుంది.

**18. ప్రచారతత్వం :**

టెలివిజన్ ను ఆధునిక సేల్స్ మేన్ అంటారు. ఏ వ్యాపార సంస్థకైనా తమ ఉత్పత్తులకు ప్రచారం కలిగించుకోవాలంటే టెలివిజనే ఆధారం. ఎందరో వినియోగదారులకు మంచి చెడులను సమర్ధవంతంగా అందిస్తుంది. ప్రకటనల్లో అయినా విలువలు దెబ్బతినకూడదు. అదేవిధంగా నియమాలు ఏర్పరచబడ్డాయి.

**రాదగిన ప్రశ్నలు :**

1. జనమాధ్యమాల విధులు, ప్రయోజనాలను వివరించండి?
2. రేడియో విశిష్టలక్షణాలు వివరించండి?
3. టెలివిజన్ లక్షణాలు తెలపండి?

**ఆధార గ్రంథాలు:**


1. తెలుగులో ప్రసార మాధ్యమాలు – డా . అనంతపద్మనాభరావు
2. ప్రసార మాధ్యమాల కోసం రాయడం – డా. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రచురణలు.



**ఇరపని మాధవి**
అసోసియేట్ ప్రొఫెసర్,
తెలుగు & ప్రాచ్యభాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

# పాఠం - 14

# శ్రవణ మాధ్యమాలు - రచన : రేడియో రచన ప్రసంగాలు నాటికలు, ప్రసార సమాచారం

**పాఠ్యాంశ నిర్మాణ క్రమం :**

14.1. శ్రవణ మాధ్యమాలు - రచన

14.2. రేడియో రచన - మౌలికాంశాలు

14.3. రేడియో రచన - మెళకువలు

14.4. రేడియో కార్యక్రమాలు రూప భేదాలు

    14.4.1 ప్రసంగాలు

    14.4.2 నాటిక - నాటకం

14.5 ప్రసార సమాచారం

**ఉద్దేశ్యం :** శ్రవణ మాధ్యమమైన రేడియోకు ఎలా రాయలో తెలియపరచడం

## 14.1. శ్రవణ మాధ్యమాలు - రచన:

రేడియో శ్రవణ మాధ్యమం. అంటే వినటానికే ప్రాధాన్యం రాసే భాష కన్నా భిన్నంగా రేడియోభాష ఉంటుంది. ప్రసార మాధ్యమాలకు రచన చేసేటప్పుడు ఏ ప్రసార మాధ్యమానికి రాస్తున్నామో ఆ మాధ్యమం పట్ల ఏ కార్యక్రమ రూపకల్పనకు రాస్తున్నామో ఆ కార్యక్రమం పట్ల ఎవరి కోసం రాస్తున్నామో వారి పట్ల రచయితకు పూర్తి అవగాహన ఉండాలి.

## 14.2. రేడియో రచన- మౌలికాంశాలు:

రేడియోకు రాసే ముందు రేడియో ప్రత్యేకత తెలుసుకోవాలి. పత్రికలలాగా కాకుండా నిరక్షరాస్యులు కూడా రేడియో ప్రసారాలు విని ఆనందించగలుగుతారు. పత్రికలలో రాసే దానికన్నా భిన్నంగా రేడియో రచన ఉంటుంది. పత్రికలు మళ్ళీ మళ్ళీ చదువుకోవచ్చు. అర్థంకానిది నిదానంగా అర్థం చేసుకోవచ్చు. కానీ రేడియో అలాకాదు. ప్రసారమైన కార్యక్రమం మళ్ళీ వెనక్కు వెళ్ళదు. అంటే శ్రోత వినగానే అది అర్థమవ్వాలి. అర్థం కాకపోతే శ్రోత ఆసక్తి కనబరచలేదు. అందుకే దీర్ఘ సమాసాలు, పెద్ద పెద్ద వాక్యాలు, పరుషమైన పదాలు ఉండకూడదు. 'సామాన్యుడే మా మాన్యుడు' అనేది రేడియో నినాదమని నినాదమని మర్చిపోకూడదు. రచయిత పాండిత్య ప్రకర్ష ఇక్కడ చూపించకూడదు.

ఇద్దరు వ్యక్తులు మాట్లాడుతుంటే ఎలా ఉంటుందో అలా రాయాలి. ఆ రాసేది కూడా కృత్రిమంగా కాక సహజంగా ఉండాలి. వక్త తనతోనే మాట్లాడుతున్నాడని శ్రోత భావించగలగాలి. అలా భావించకపోతే రేడియో ఆపేస్తాడు.

రాసే భాషపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలి. సహజంగా పైన రాసిన విధంగా, క్రింద చెప్పిన విధంగా

అనేవి పత్రికలలో కనిపిస్తాయి. ఆ ధోరణి రేడియో రచనలో ఉండకూడదు. ఒకవేళ తప్పనిసరైతే ముందు చెప్పినట్లుగా అనాలి. మాట్లాడుకునే భాషలో రాయాలి. శ్రోత ఏం విన్నాం అని గుర్తు చేసుకుంటే కొన్ని అంశాలైనా గుర్తుకొచ్చే విధంగా రచన ఉండాలి. అది ఎప్పుడు సాధ్యం అంటే శ్రోత ప్రసార కార్యక్రమమంతా శ్రద్ధగా విన్నప్పుడే. అలా శ్రద్ధగా వినగలిగే విధంగా రాయాలి.

కార్య క్రమానికి తగిన విధంగా రాయాలి. కార్యక్రమం ప్రసంగమా, చర్చా, నాటకమా, పరిచయమా, రూపకమా, మరేదైనా అనే దానిని బట్టి దానికి తగిన విధంగా దానిని రాయాలి. రేడియోలో పాటలు వినటం వేరు, ప్రసంగాలు వినడం వేరు. కనుక శ్రోత మనం చెప్పింది ఎక్కువ భాగం గుర్తుంచుకోగలిగేలా రాయాలి. ఎక్కువ గణాంకాలు చొప్పించకూడదు.

## 14.3. రేడియో రచన - మెళకువలు :

1. రేడియో భాష వ్యవహారికంలో ఉండాలి.
2 జటిల పదబంధాలు, సుదీర్ఘ సమాసాలు రాయకూడదు.
3. ఆత్మీయంగా అనిపించాలంటే ఉత్తమ పురుషలో రాయాలి.
   స్వంత అనుభవాలు చెప్పినట్లుగా ఉండాలి.
4. శ్రోతకు మానసిక శ్రమ కలుగని రీతిలో రాయాలి.
5. అవసరమైతే విషయాన్ని పునరుక్తి చేయవచ్చు కానీ మరీ చెప్పిందే చెప్పకూడదు.
6. సగటున రేడియోలో నిమిషానికి వంద పదాల వరకు వాడవచ్చు. కార్యక్రమ నిడివిని దృష్టిలో ఉంచుకొని రాయాలి.
7. కాగితానికి ఒక ప్రక్కే రాయాలి. ఎక్కడ ఎలా పలకాలో కూడా గుర్తు రాసుకోవాలి.
8. రాయడానికి ముందు విషయం, రూపభేదం, నిర్మాణం, శైలి అనే నాలుగు విషయాలను దృష్టిలో ఉంచుకోవాలి. విషయం రేడియో వాళ్ళే ఇస్తారు. దేని మీద రాయాలో ఆ విషయానికి ప్రసంగమైతే బాగుంటుందో, నాటకమైతే బాగుంటుందో, కవిత రూపంలో రాయవచ్చా ఇలా ఏ రూపభేదమైతే బాగుంటుందో అది రచయిత నిర్ణయించుకొని ఆ విధంగా రాయాలి. కార్యక్రమ నిర్మాణంలో సులభంగా చెప్పగలగడం అనేది దృష్టిలో ఉంచుకోవాలి. ఎవరి శైలిలో వారు రాస్తారు. రేడియోకి రాసేటప్పుడు వారిది కావ్యశైలి అయితే దానిని వదిలేయాలి . సులభ శైలిలోనే రచన సాగాలి.
9. రాయడానికి ముందు విషయం పట్ల పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. దానికోసం ఎక్కువ చదవాలి. అవసరమైతే ఇతరుల దగ్గర నుంచి విషయసేకరణ చేయాలి.
10. ప్రారంభం ముగింపు బాగుంటేనే శ్రోత దానిని వింటాడు, గుర్తుంచుకొంటాడు అనేది గుర్తుంచుకోవాలి.
11. భావంలో, వ్యక్తీకరణలో స్పష్టత ఉండాలి.
12. చెప్పేది సూటిగా, సంక్షిప్తంగా చెప్పాలి.
13. రాసేటప్పుడు మరే ఎక్కువగా రాయకూడదు. అలా అని మరీ తక్కువ రాయకూడదు. ఎంత అవసరమో అంత రాయాలి.
14. అవసరమైన దగ్గర హాస్యాన్ని జోడించవచ్చు. సామెతలు, జాతీయాలు ఉపయోగించవచ్చు.

15. రాసిన తర్వాత మళ్ళీ దానిని చదువుకొని మార్పులు, చేర్పులుంటే చేసుకోవాలి.
16. రాసిన దానిని ముందుగా ఇతరులకెవరికైనా వినిపించి వారు మంచి సలహాలనిస్తే పాటించాలి.

## 14.4. రేడియోలో కార్యక్రమాలు - రూపభేదాలు :

రేడియో కార్యక్రమ రూపకల్పనలో రూపభేదాలుంటాయి. విషయాన్నిబట్టి ఏ రూపభేదమైతే బాగుంటుందో నిర్ణయించి రాస్తారు. ప్రధానంగా రెండు రకాలుగా కార్యక్రమాలుంటాయి. మొదటిది ప్రవచనశాఖ, రెండవది సృజనాత్మక శాఖ. ప్రవచన విభాగంలో ప్రసంగం, పరిచయం, చర్చ, గోష్ఠి, సంభాషణ, ముచ్చట్లు - కబుర్లు వంటి కార్యక్రమాలుంటాయి. సృజనాత్మక విభాగంలో కథ, కవిత, జింగిల్, చిట్ చాట్, నాటిక, నాటకం, రూపకం వంటివి ఉంటాయి.

### 14.4.1. ప్రసంగాలు:

పది నుండి పదిహేను నిముషాలలో ప్రసంగం ఉంటుంది. అందుకని అంత తక్కువ సమయంలో చెప్పదలుచుకున్న విషయం చెప్పగలగటం సులభమేమీ కాదు. ఈ ప్రసంగాలు కూడా వివిధ రకాలుగా ఉంటాయి. సాహిత్య ప్రసంగాలు, విజ్ఞానశాస్త్ర ప్రసంగాలు, ప్రచార ప్రసంగాలనేవి ముఖ్యమైనవి.

సాహిత్య ప్రసంగాలలోనైనా గ్రాంథికమైన ప్రాబంధిక శైలి వాడకూడదు. ఏదైనా కావ్యం గురించి ప్రసంగించినా ఆ కావ్యంలోని సౌందర్యం శ్రోతకు అర్థమయ్యే విధంగా, ఆ కావ్యస్థానం సాహిత్యంతో ఏంటి అనేది తెలియజేసే విధంగా సుంభమైన భాషలోనే చెప్పాలి. అవసరమైన దగ్గర పద్యాలను ఉదహరించవచ్చు. సాహిత్యమైనా పండితులకే పరిమితం కాదు, పామరులు కూడా విని ఆనందించే విధంగా రాయాలి.

విజ్ఞానశాస్త్ర ప్రసంగాలు రాసేటప్పుడూ ఇదే పాటించాలి. శాస్త్రజ్ఞులకు కూడా అంతు చిక్కని విషయాలను చెబుదామనుకోకూడదు. పుస్తకాల నుండి పేరాలు, పేరాలు ఎత్తి రాయకూడదు. ఏవైనా సాంకేతిక పదాల ప్రయోగం అవసరమైతే చెయ్యవచ్చు. ఇది విషయ ప్రధానమైంది కాబట్టి విషయానికి ప్రాధాన్యత ఇస్తూనే సులభశైలిలో రాయాలి.

ప్రచార ప్రసంగాలంటే అభివృద్ధి కార్యక్రమాలను గురించి ప్రభుత్వ అధికారులు చెప్పేవి. ఇవైనా గణాంకాలు చెప్పకూడదు. పేలవంగా రాయకూడదు, స్వీయానుభవాలని జోడిస్తూ ఆ అభివృద్ధి కార్యక్రమాల వలన ప్రయోజనం ఏంటో తెలియజేయగలగాలి. ఏదో నివేదిక చదివినట్లుగా ఉంటే శ్రోతల్లో ఆసక్తి తగ్గిపోతుంది. అందుకే చెప్పే సమాచారాన్ని సందేశాత్మకంగా చెప్పాలి. ఎదుటివ్యక్తికి చెప్పినట్లుగానే ఉండాలి.

#### 14.4.1.1. ప్రసంగం రాసేటప్పుడు పాటించవలసిన మెళకువలు :

1. పుస్తకాల్లోంచి పేరాలు పేరాలు ఎత్తిరాయకూడదు.
2. గ్రంథస్థ భాష పనికి రాదు, సుదీర్ఘ వాక్య ప్రయోగం కూడదు.
3. ఎక్కువ విషయాన్ని తక్కువ సమయంలో చెప్పాలనే తాపత్రయం పనికిరాదు.
4. అనవసరమైన కొటేషన్లు అవసరం లేదు.

5. అసహజమైన శైలి పనికిరాదు.
6. లెక్కలు, గణాంక వివరాలు ఎంత అవసరమో అంత ఇస్తే చాలు.
7. సూచికలు, పట్టికలు, చిత్రపటాలు రేడియోలో చూపించలేం. కనుక వాటిని రాతప్రతి లో చేర్చనవసరం లేదు.
8. సిద్ధాంత వ్యాసమో, గోష్ఠి పత్రమో రాసినట్లుగా రాయకూడదు.
9. ఒక విషయం ఒకేసారి డొంక తిరుగుడుగాకాక సూటిగా చెప్పాలి.
10. స్వంత అనుభవాల్ని జోడించి కథలా చెప్పగలగాలి.
11. శ్రోతకు సన్నిహితంగా మాట్లాడే విధంగా ఉండాలి.
12. సామాన్యుడిని దృష్టిలో ఉంచుకొని వాడుకభాషలో రాయాలి.
13. సహృదయంతో ఆత్మీయుల విమర్శలు స్వీకరించగలిగి రాసిన దానిలో మార్పులు చేర్పులు చేయాలి.

### 14.4.2. నాటిక – నాటకం :

తెలుగు సాహిత్యంలోనే గొప్ప ప్రక్రియ నాటకం. అందుకే 'నాటకాంతంహి సాహిత్యం' అన్నారు. సమాజాన్ని ఎక్కువగా చైతన్య పరిచేది నాటకమే . సినిమా రాకముందు నాటకాలు రంగస్థలంపై ప్రదర్శించబడేవి. కళాకారులు ప్రత్యక్షంగా ప్రేక్షకులను తమ అభినయం ద్వారా అలరించేవారు. నాటకం అంటే మొదట్లో చాలా నిడివి కలిగి ఉండేది. వేగవంతమైన జీవన విధానం కారణంగా ఆధునిక కాలంలో నాటకం నిడివి తగ్గిపోయింది. నాటకం కూడా చూసే ఓపిక, తీరిక లేకపోవటంతో నేడు నాటికలు ఎక్కువగా ప్రదర్శించబడుతూ ప్రేక్షకుల ఆదరణ చూరగొన్నాయి. రంగస్థలంపై ప్రదర్శించబడే నాటకంగానీ, నాటికగానీ దాని విధానం వేరు. కళాకారుడి రూపం, వేషం, సంభాషణలు, హావభావాలు అన్నీ ప్రేక్షకుడు చూడగలుగుతాడు. నాటకం చూసినంతసేపు ప్రేక్షకుడి దృష్టి రంగస్థలంపైనా కేంద్రీకరింపబడి ఉంటుంది. కనుక ప్రదర్శింపబడిన నాటకాన్ని లేదా నాటికను అర్థంచేసుకోవటం సులభం.

మిగిలిన ప్రక్రియలకన్నా నాటక రచన కష్టమనుకుంటే ఇంక రేడియో నాటిక, నాటక రచన మరీ కష్టం. ఈ రేడియో నాటిక రచన చేయడానికి ముందు గుర్తుంచుకోవలసిన విషయం రేడియో శ్రవ్య మాధ్యమమని. దృశ్యనాటకాలు రాజ్యమేలుతున్న సమయంలో రేడియో కోసం ధ్వని ప్రధానమైన శ్రవ్యనాటకాలు ప్రత్యేకంగా రాయడం నాటక రంగ చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్నే సృష్టించిందనే విషయం ఈ సందర్భంలో జ్ఞప్తికి తెచ్చుకోవాలి. ధ్వని ప్రధానంగా సన్నివేశాలను, పాత్రలను శ్రోతల కళ్ళకు కట్టేలా రాయగల సామర్థ్యం రచయితకు ఉండాలి.

అయితే ఇక్కడ రచయిత ఎంత సమర్థుడైనా నాటికలో నటించే కళాకారులు సమర్థులు కాకపోతే నాటిక రక్తికట్టదు. కనుక ఇక్కడ ప్రధానం మంచి కంఠ స్వరం కలిగుండి, స్వరంలోనే నాటిక సాగుతుంది. రసాలన్నీ పలికించగలిగే కళాకారులు ఉండటమే. అప్పుడు నటులు, ప్రయోక్త, శ్రోతలు ముగ్గురికీ ఉత్కంఠ భరితంగా రేడియోలో శ్రోత మనః ఫలకమే రంగస్థలం కనుక అది విశాలమైంది. రంగస్థలంపై నాటక ప్రదర్శన చేసేటప్పుడు ఆ రంగస్థలం పొడవు, వెడల్పుకి అనుగుణం గానే పాత్రధారులు కదలాల్సి ఉంటుంది . కానీ శ్రోత మనసే

రంగస్థలమైతే ఇంక పరిమితనేది ఉండదు. శ్రోత భావుకుడైతే ఆ నాటికలో కళాకారులు తమ పాత్రలను చక్క గా పోషిస్తే ఇంక రసాస్వాదనకు తిరుగుండదు. అదే శ్రోతకు ఆసక్తి లేకపోతే ఎంత గొప్ప కళాకారులైనా, ఎంత మంచి నాటకం, నాటిక అయినా రక్తికట్టలేవు. ఆ ఆసక్తి కలిగించటం కోసం కూళాకారులే మాటల ద్వారా చాలా విషయాలు చెప్పాల్సి ఉంటుంది. నాటికలోని వాతావరణాన్ని శ్రోతల కళ్ళకు కట్టినట్లుగా మాటలను ఉపయోగించే చూపగలగాలి . అంటే వీనులతోనే వీక్షింపచేయగలగాలి. అది సాధించటానికి ఎంతో నైపుణ్యం అనుభవం కావాలి.

రేడియో నాటికకైతే పదిహేను నిముషాలు, నాటకానికైతే అరగంట లేదా గంట సమయం ఉంటుంది. ఆ సమయాన్ని దృష్టిలో ఉంచుకొనే రచయిత రచన చెయ్యాలి. నాటిక రక్తికట్టడానికి ఒక్క శబ్దాలే కాకుండా సన్నివేశాన్ని శ్రోతకు కనబడేటట్లు చెయ్యాలి. అది అనుకున్నంత సులభమేమి కాదు. ఆ సన్నివేశంలో ఉద్వేగాన్ని, ఉత్సాహాన్ని, ఉత్కంఠను మాటలతోనే సృష్టించాలి. నటుల ఉచ్చారణ సన్నివేశాల్ని పండిస్తుంది. సన్నివేశ కల్పన సహజంగా ఉండాలి.

రాసేటప్పుడు తక్కువ మాటల్లో ఎక్కువ భావాన్ని చెప్పగలగాలి. ఒక్కోసారి రేడియో నాటికలను స్వగతాలు రక్తికట్టిస్తాయి. తనలో తాను మాట్లాడుకోవడం స్వగతం, నాటికను రికార్డు చేయడానికి పూర్వమే అవసరమైనంత రిహార్సల్స్ ఉండాలి. అవసరమైన దగ్గర శబ్దాలను ఉపయోగించాలి. వీటినే sound effects అంటారు. సంగీతం కూడా తప్పనిసరిగా ఉండాలి. సంగీతం రసాన్ని పండించటంలో ప్రముఖ పాత్రవహిస్తుంది. అయితే ఎక్కడ ఏ శబ్దాలు పెట్టాలి, సంగీతం ఎలా ఉండాలి అనేవి రచయిత తన రచనలోనే సూచించాలి. సందర్భోచితంగా సంభాషణలు రాయాలి. అనవసర సంభాషణలు ఉండకూడదు. పాత్రల స్వరూప స్వభావాలను శ్రోతకు ఆ సంభాషణల ద్వారానే తెలిపే విధంగా రచన ఉండాలి.

నండూరి సుబ్బారావు, సుబ్బరాయ శర్మ, మాడుగల రామకృష్ణ, శారదా శ్రీనివాసన్, విజయలక్ష్మి వంటివారు శ్రోతల హృదయంలో కలకాలం గుర్తుండిపోయే కళాకారులు రెడియో నాటకాలకెన్నిటికో తమ సుస్వరంతో శాశ్వతత్వం కలిగించారు. రేడియోలో ఇంకా నాటక వారోత్సవాలు నిర్వహింపబడుతుండటం శ్రోతల ఆదరణకు నిదర్శనం.

## 14.5. ప్రసార సమాచారం :

రేడియో ప్రసారాలు మొదట్లో విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, కడప, అనంతపురం ఆకాశవాణి కేంద్రాల ద్వారా జరిగేవి . విజయవాడ కేంద్రం ద్వారా వార్తలు, పాడిపంటలు, కార్మికుల కార్యక్రమాలు, సాహిత్యకార్యక్రమాలు, విద్యార్థులకు, యువతరానికి, మహిళలకు సంబంధించిన కార్యక్రమలు ప్రసారం చేస్తారు. నాటికలు, నాటకాలు, రూపకాలు, ప్రసంగాలు, ముఖాముఖులు, హరికథలు, బుర్రకథలు వంటి అనేక కార్యక్రమాలు ఈ కేంద్రం ద్వారా నేటికీ ప్రసారమవుతున్నాయి. ఉదయం సూక్తి సుధతో ప్రారంభమై పాడిపంటలు, వార్తలు, ఉదయరేఖలు, కార్మికుల కార్యక్రమం, వనితావాణి, యువ వాణి వంటి అనేక కార్యక్రమాలను ప్రసారం చేస్తుంది విజయవాడ ఎ కేంద్రం.

ప్రత్యేకంగా క్రికెట్ వంటి క్రీడల ప్రత్యక్ష ప్రసార వ్యాఖ్యానం, శ్రీరామనవమి రోజున భద్రాచలంలో జరిగే శ్రీరాముల వారి కళ్యాణాన్ని కళ్ళకు కట్టినట్లు చేసే వ్యాఖ్యానం నేటికీ శ్రోతలను అలరిస్తూనే ఉన్నాయి. రేడియోలో ఏ రోజు ప్రసారమయ్యే కార్యక్రమాల వివరాలు సమయంతో సహా ఉదయమే చెబుతారు. విజయవాడ కేంద్రం ద్వారా వివిధ భారతి వంటి సినీపాటల కార్యక్రమాలే ఎక్కువగా ప్రసారమవుతాయి. ఇంక ఇప్పుడైతే రేడియో 24 గంటలు ఎఫ్. ఎమ్ ద్వారా తమ కార్యక్రమాలను ప్రసారం చేస్తుంది. జిల్లాస్థాయి ఎఫ్ ఎమ్. కేంద్రాలు ప్రారంభమయ్యాయి. రేడియో కూడా నూతనత్వాన్ని సంతరించుకొని మిగిలిన మాధ్యమాలతో పోటీని తట్టుకొనే విధంగా ఫోన్ ఇన్ లైవ్ వంటి కార్యక్రమాల రూపకల్పన చేస్తుంది. ఒకప్పుడు ఉత్తరాల ద్వారా ఏ పాట కావాలో అడిగే శ్రోత నేడు ఫోన్ ద్వారా, వాట్సప్ ద్వారా అడిగే సౌలభ్యం రేడియో కల్పించింది. అంటే రేడియో కూడా సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా పురోగమిస్తుందని చెప్పక తప్పదు.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో పురోగమిస్తూ ఉన్నా భారతీయ సంస్కృతికి, సమైక్యతకు పెద్ద పీట వేస్తుంది. అందుకే ఆజాదీకి అమృత్ మహోత్సవ్ లో భాగంగా ఆకాశవాణి రూపొందించి ప్రసారం చేసిన కార్యక్రమాలు యువతరానికి ఎంతో ఉపయోగకరం. నేటికీ శుక్రవారం ఉదయం గాంధీ మార్గ్ కార్యక్రమం ప్రసారం చేయటం ప్రశంసించవలసిన విషయం . రేడియోలో ప్రసారమయ్యే కార్యక్రమాలు ఏవైనా అశ్లీలతకు, అసందర్భాలకు అవకాశం ఇవ్వక విలువలకే ప్రాధాన్యత ఇవ్వటం హర్షించవలసిన విషయం.

**రాదగిన ప్రశ్నలు :**

1. రేడియో మౌలికాంశాలను వివరించండి?
2. ప్రసంగాలు, నాటికలు రచనా విధానాన్ని రాయండి?

**ఆధార గ్రంథాలు:**

1. తెలుగులో ప్రసార మాధ్యమం – డా. అనంత పద్మనాభ రావు
2. ప్రసార మధ్యమాల కోసం రాయడం – డా? అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రచురణలు

**డా. ఇరపని మాధవి,**
అసోసియేట్ ప్రొఫెసర్,
తెలుగు & ప్రాచ్యభాషావిభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.

## పాఠం - 15

# దృశ్య మాధ్యమాలు- రచన: వ్యాఖ్యానం (యాంకరింగ్), టెలివిజన్ రచన

**పాఠ్యాంశ నిర్మాణ క్రమం:**

15.1. దృశ్య మాధ్యమాలు - రచన

15.2. కార్యక్రమ నిర్మాణ ప్రణాళిక

15.3. రచనలో పాటించవలసిన మెళకువలు:

15.4. టెలివిజన్ రచనా రూపాలు

15.5. వ్యాఖ్యానం

**ఉద్దేశ్యం :** దృశ్యమాధ్యమమైన టెలివిజన్ కు ఎలా రాయాలో తెలియజేయడం, యాంకరింగ్ గురించి తెలుపుట.

### 15.1. దృశ్యమాధ్యమాలు - రచన:

దృశ్య మాధ్యమం అనగానే గుర్తుకొచ్చేది టెలివిజన్. టెలివిజన్ ప్రారంభంతో దానికన్నా ముందు ప్రారంభమైన పత్రికలు, రేడియో ల ప్రాధాన్యత తగ్గింది. టెలివిజన్ అంతగా ప్రజలను ఆకర్షించింది. విస్తృతపరిధిలో సమాచారం, వినోదం, విజ్ఞానం, విద్యావిషయాలను ప్రసారం చేయటమే దీనికి కారణం. దూరదర్శన్ తో ప్రారంభమైన టి.వి. నేడు అనేక ఛానల్స్ తో జనజీవనంలో భాగమైంది. దానితో టెలివిజన్ కు రాయడమే ఒక వృత్తిగా మారింది. టెలివిజన్ రచనా పరిధి ఎంత విస్తృతమైందో అంతే పరిమితులు కలిగి ఉంటుంది.

### 15.1.1. టెలివిజన్ - రచన :

టెలివిజన్ కు రాయడం అనేది సమిష్టికృషి టి.వి. రచన దశలవారిగా రూపొంది, తుది రూపాన్ని పొందుతుంది. రచయితతో పాటు నిర్దేశకుడు, నిర్మాణ బృందంలోని ఇతర సాంకేతిక సిబ్బంది పనిచేస్తేనే సృజనాత్మకంగా కార్యక్రమం రూపొందుతుంది.

టెలివిజన్ కార్యక్రమానికి స్క్రిప్టు తప్పనిసరి. దృశ్యాలను ఏర్చి కూర్చినపుడు వాటి వివరాలను తెలిపేటందుకు రచన తప్పనిసరి. రాయడానికి ముందే రచయిత ఎవరికోసం రాస్తున్నారు ? భాష ఎలా ఉండాలి? ఏ కార్యక్రమం ఏ రూపభేదంలో అయితే బాగుంటుంది ? అసలు కార్యక్రమ లక్ష్యం ఏమిటి ? అనేది ఆలోచించుకోవాలి. కార్యక్రమంలో శ్రవ్యదృశ్యాలు ఎంపిక సునిశిత దృష్టితో చేయాలి.

టి.వి. ప్రధానంగా దృశ్యమాధ్యమమైనప్పటికీ అవసరమైన దగ్గర ఆడియోకి ప్రాధాన్యతనివ్వాలి. కొన్నిసార్లు ఆడియోకి వీడియోని చేరుస్తారు. మరికొన్నిసార్లు వీడియోకి ఆడియో చెప్పాల్సి ఉంటుంది. అది కార్యక్రమాన్ని

అనుసరించి మారుతుంటుంది. కొన్ని సందర్భాలలో దృశ్యానికే అధిక ప్రాధాన్యత ఇవ్వవలసి ఉంటుంది. మరికొన్ని సందర్భాలలో చెప్పే విషయ ప్రాధాన్యతే ఎక్కువగా ఉంటుంది. రెండింటిని సమన్వయం చేస్తూ రచన చెయ్యాలి. టెలివిజన్ రచనలో సంభాషణతోపాటు దృశ్యాలు, శబ్దాలు, సంగీతం అన్నీ సను ప్రాధాన్యత వహిస్తాయి.

టెలివిజన్ రచన చేసేటప్పుడు లభించే సాంకేతిక వనరులపై కూడా అవగాహన ఉండాలి. లేని వనరులను మన రచనలో రాస్తే ఆ కార్యక్రమమే అభాసుపాలు కావచ్చు. చిత్రీకరణ సమయంలో కూడా సాధ్యాసాధ్యాలను దృష్టిలో ఉంచుకొని రచన లో మార్పులు, చేర్పులు చేసుకోవాలి. చిత్రీకరణ ఉన్న సక్రమంగా వినియోగించుకొంటూ అర్థవంతంగా తీయాలి. టెలివిజన్ పరిభాష ఆధారంగానే రచన చేయాలి.

## 15.2 కార్యక్రమ నిర్మాణ ప్రణాళిక :

దశల వారిగా సాగే టెలివిజన్ రచన లో అనేక అంచెలు ఉంటాయి. కనుక నిర్మాణ ప్రణాళిక అనేది తప్పనిసరి. ముందుగా కార్యక్రమ నిర్మాణ ప్రణాళిక తయారు చేసుకొని ప్రణాళికకు అనుగుణంగా కార్యక్రమం నిర్మాణం జరగాలి. కార్యక్రమ నిర్మాణంలో ప్లానింగ్, ప్రొడక్షన్, ప్రొడక్షన్ అనంతరం మదింపు అనే మూడు దశలుంటాయి. ఈ దశలన్నింటికీ రచనే ఆధారం.

### 15.2.1. నిర్మాణ ప్రక్రియలో ప్రధాన అంశాలు:

కార్యక్రమ భావం (Idea), కార్యక్రమ సంక్షిప్తం(Brievity), కార్యక్రమ పరిశోధన (Research), కార్యక్రమం రూపకల్పన (Design), నిర్మితి, దృశ్యీకరణం (Struture and visual treatment) స్టోరీ బోర్డ్ (story board), చిత్తు ప్రతి (Drft script) తుది ప్రతి (Final script), కెమెరా రచన (Camara Script).

ఈ అంశాలన్నిటి ఆధారంగా ప్రేక్షకుడికి ఏం చెప్పదెల్చుకున్నామో నిర్ధారించుకొని విషయాన్ని దృశ్యీకరించాలి. కార్యక్రమ నిడివిని ప్రేక్షకుడి స్థాయిననుసరించి, చెప్పే విషయాన్ని బట్టి నిర్ణయిస్తారు.

## 15.3. రచనలో పాటించవలసిన మెళకువలు:-

1. టెలివిజన్ దృశ్యమాధ్యమం కనుక రచనాంశాలలో సాధ్యమైనంతగా దృశ్యీకరణకు ప్రాధాన్యతనివ్వాలి.
2. వీలైనంత తక్కువ మాటలు వాడాలి. వాడిన మాటలు దృశ్యాన్ని బలపరచాలి
3. శబ్ధాలకు, మాటలకు ప్రాధాన్యతున్న దగ్గర దృశ్య ప్రాధాన్యం తగ్గించాలి.
4. వాడే భాష సరళంగా, సూటిగా ఉండాలి. చిన్న వాక్యాలు రాయాలి. మాట్లాడే భాషను రాయాలి.
5. సంభాషణ శైలిలో రాస్తే మంచిది. మాండలిక భాషను అవసరమైన దగ్గర మాత్రమే వాడాలి.
6. వ్యాకరణ దోషాలు లేకుండా జాగ్రత్తపడాలి.
7. పత్రికలకు రాసినట్లు రాయకూడదు. చేసే వ్యాఖ్యానం ఎదుటి వ్యక్తితో మాట్లాడుతున్నట్లు ఉండాలి.
8. ప్రేక్షకుడి స్థాయిని అంచనా వేసి దానికి తగినట్లు రాయాలి.
9. అవసరమైన దగ్గర పునరుక్తి పర్వాలేదు.
10. పదాడంబరం పనికి రాదు. తప్పని సరై వాడే సాంకేతిక పదజాలాలకు అర్థాలను వివరించాలి.

11. కార్యక్రమ నిడివిననుసరించి రచన చేయాలి. అన్ని విషయాలు తక్కువ సమయంలో చెప్పాలనే ఆరాటం కూడదు.
12. అవసరమైన దగ్గర ఎలాంటి శబ్దాలు, మాటలు ఉపయోగించకుండానే నిశ్శబ్ధ సందేశం ఇచ్చే విధంగానూ రచన ఉండాలి.
13. విషయం పాతదే అయినా కొత్త విధానంలో చెప్పగలగాలి.
14. స్టోరీ బోర్డు కు అవసరమైన దృశ్యాలను, ఎఫెక్ట్ లను సూచించాలి.

## 15.4 టెలివిజన్ రచనా రూపాలు :

టెలివిజన్ రచన కార్యక్రమ భావనతో మొదలై కార్యక్రమ నిర్మాణంతో ముగుస్తుంది. ప్రతి దశలోనూ రచన ఆవశ్యకమే. అయితే ఈ రచన కార్యక్రమన్ని అనుసరించి మారుతుంది. దీనినే రచనా రూపాలుగా వ్యవహరిస్తారు. ప్రధానంగా మూడు రూపాలుంటాయి. మొదటిది డ్రాఫ్ట్ రచన (Drfat script), తుది రచన (Final script) మూడవది కెమెరా రచన (Camara Script).

### 15.4.1. డ్రాఫ్ట్ రచన :

రచయిత చేసే రచన మొత్తం డ్రాఫ్ట్ రచన. ఇందులో భావనలు, దృశ్యాలు, సంభాషణలు, చేర్చవలసిన సంగీతం, సౌండ్ ఎఫెక్ట్స్ వంటి అన్ని వివరాలుంటాయి. కార్యక్రమ నిర్మాణంలో పాలుపంచుకొనే అందరితోనూ చర్చించటానికి డ్రాఫ్ట్ రచన ఉపకరిస్తుంది . డ్రాఫ్ట్ రచన చేయటం వలన సాంకేతిక వనరులు, నిర్మాణపరంగా సాధ్యాసాధ్యాలు, భావనల వివరణలలోని తప్పొప్పులను చర్చించి నిర్ధారించుకోవటానికి అవకాశముంటుంది.

### 15.4.2. తుది రచన :

డ్రాఫ్ట్ రచనపై వచ్చిన సలహాలు, సవరణలు చేసి రచనకు తుదిరూపం ఇస్తారు. కార్యక్రమంలో సంగీతం, శబ్దాలు, సహజ శబ్దాలు, నిపుణుల అభిప్రాయాలు ఏయే సందర్భాలలో చేర్చాలో సూచిస్తారు. కార్యక్రమం నాటకమా, రూపకమా, డాక్యుమెంటరీనా, వార్తా చిత్రమా అనే దానిననుసరించి ప్రదర్శనాంశాలు పొందుపరుస్తారు. కార్యక్రమ నిర్మాణం పూర్తయి పూర్తి కూర్పు (ఎడిటింగ్ ) జరిగాక రచనకు తుదిరూపం ఏర్పడుతుంది. ఈ తుది రచన ఆధారంగానే కార్యక్రమ నిర్మాత స్టోరీబోర్డ్ ని నిర్మించుకుంటాడు.

టెలివిజన్ కార్యక్రమ నిర్మాణంలో స్టోరీబోర్డ్ ప్రధానమైన అంశం . స్టోరీబోర్డ్ లో షాట్ ల వివరణ – రచనను చిన్నచిన్న భాగాలుగా విభజించి నిర్మాత పొందుపరుస్తాడు. రచనకు, దృశ్యానికి, సమన్వయం ఏర్పడుతుంది. స్టోరీబోర్డు ను ఎలా నిర్మిస్తారంటే రచన చేసే కాగితాన్ని నిలువుగా రెండు భాగాలుగా విభజించుకొని కుడి, ఎడమ భాగాలను చూపుతారు. కుడివైపు నిలువు భాగంలో కాగితం పై నుంచి కిందికి అడ్డుగీతలుంటాయి. రాయడానికి, శబ్దాలు, సంగీతం వంటి వాటిని కుడివైపు సూచిస్తారు. అంటే శబ్దానికి సంబంధించినవన్నీ ఈ ప్రక్క ఉంటాయి. ఇక ఎడమ వైపు నిలువు భాగంలో దీర్ఘచతురస్రాకారపు ఖాళీపెట్టెలను ఇస్తారు. 3:4 నిష్పత్తిలో ఈ పెట్టెల నిర్మాణముంటుంది ఈ పెట్టెలలో బొమ్మలను గీస్తారు. షాట్ సైజ్‌లను వివరిస్తారు. దృశ్యీకరణకు చెందిన అంశాలను బొమ్మల రూపంలో, రేఖల రూపంలో ఈ ఎడమువైపు పెట్టెలలో ప్రదర్శిస్తారు.

### స్టోరీ బోర్డ్ నమూనా




### 15.4.3. కెమెరా రచన :

రచనా విధానంలో ఇది అతిముఖ్యమైనది. తుది రచన పూర్తయిన తర్వాత కార్యక్రమ నిర్మాణ దశలో దీన్ని రచిస్తారు. రచయిత రాసిన దాన్ని నిర్మాత, కెమెరామెన్ తో చర్చించి కెమెరా పరిభాషలోకి రచనను రూపాంతరీకరిస్తారు. నిర్మాణ దశలో పాల్గొనే సిబ్బందికి నిర్మాణపు సంకేతాలను కెమెరా స్క్రిప్టు అందిస్తుంది. వాస్తవానికి ఇదొక సాంకేతిక రచన. ఇందులో షాట్ల వర్గీకరణ, పరిణామాలు పొందుపరుస్తారు. సంగీతం, శబ్దాలు, సహజశబ్దాలు, ప్రవేశ, నిష్క్రమణలు, సూచనలు కనిపిస్తాయి. కార్యక్రమ నిర్మాణంలో వాడే అనేక సాంకేతిక వనరుల సమన్వయం ఇందులో ఉంటుంది. కెమెరా రచన స్టూడియో నిర్మాణాలలో అతి ముఖ్యమైంది, పరికరాలు, సాంకేతిక వనరులు, నిర్మాణంలో పాల్గొనే సిబ్బంది, కళాకారులు - అందరి చర్య ప్రతిచర్యలను సమన్వయపరచి కార్యక్రమ నిర్మాణం ప్రణాళికాబద్ధంగా చేయడానికి సహకరిస్తుంది.

### 15.5 వ్యాఖ్యానం (యాంకరింగ్) :

టెలివిజన్ రూపొందించే అనేక కార్యక్రమాలలో వ్యాఖ్యాత అవసరం ఎంతగానో ఉంటుంది. డాక్యుమెంటరీ, టీ.వి షోలు, ఇంటర్వ్యూలు, సినిమాపాటలతో కూడిన కార్యక్రమాలు, ఫోన్ ఇన్ లైవ్ కార్యక్రమాలు, హాస్య ప్రధానమైన కార్యక్రమాలు, స్త్రీలకు సంబంధించిన ప్రత్యేక కార్యక్రమాలు, ఆటల పోటీలతో కూడిన కార్యక్రమాలు, చిన్నపిల్లలకు, యువకులకు ప్రత్యేకించి రూపొందించిన కార్యక్రమాలు, ప్రముఖులతో కూడిన కార్యక్రమాలు, కార్యక్రమం ఏదైనా కావచ్చు. ఆ కార్యక్రమం రక్తి కట్టించేది మాత్రం వ్యాఖ్యాతే, వ్యాఖ్యాత కార్యక్రమం గురించి వివరిస్తారు, కార్యక్రమాన్ని సమన్వయం చేస్తారు. కార్యక్రమం మొదలు నుంచి చివరి వరకు వ్యాఖ్యాతదే ప్రముఖపాత్ర. వ్యాఖ్యాత సామర్థ్యాన్ని బట్టి ఆ కార్యక్రమాలు ప్రేక్షకుల ఆదరణ పొందుతాయి. వ్యాఖ్యానానికి అంత ప్రాధాన్యత ఉంది కనుకనే నేడు యాంకరింగ్ అనేది ఒక వృత్తిగా స్థిరపడింది. సమాజంలో యాంకర్లు సెలబ్రిటీలుగానూ చెలామణి అవుతున్నారు.

టి.వి. యాంకర్ ల ప్రభావం సమాజంపై ఎంతగా ఉందంటే ఇంట్లో ఏదైనా ఫంక్షన్ జరిగినా, కాలేజీలో విద్యార్థులకు సంబంధించిన వెల్ కం, ఫేర్ వెల్, యూత్ ఫెస్టివల్ వంటి కార్యక్రమాలు జరిగినా, వీధులలో జరిపే పండుగలు. ఉత్సవాలలోనూ యాంకర్ తప్పని సరైపోయింది. అందుకే ప్రత్యేకంగా యాంకరింగ్ లో శిక్షణనిచ్చే విద్యాసంస్థలు ప్రారంభమయ్యాయి.

### 15.5.1. యాంకరింగ్ శిక్షణ - లక్ష్యాలు:

1. యాంకరింగ్ లో శిక్షణ నివ్వటం ద్వారా వ్యక్తిత్వవికాసాన్ని సాధించడం
2. వాయిస్ మాడ్యులేషన్ మెరుగుపరుచుకోవటం
3. న్యూస్ రైటింగ్, రీడింగ్ మెరుగుపరుచుకోవడం
4. కాపీ ఎడిటింగ్ లో మెరుగుదల
5. కెమెరా రిహార్సల్స్ చేయటంలో మెళకువలు
6. స్టూడియోలో కానీ ఔట్ డోర్ లో కాని షూటింగ్ గురించి తెలుసుకోవటం
7. బహిరంగ వేదికపై నిర్వహించే కార్యక్రమాల లో ధైర్యంగా పాల్గొనే నైపుణ్యాలను పెంపొందించటం
8. టాక్ షో లు, రియాలిటీ షో వంటివాటిలో పాల్గొనే సామర్థ్యం మెరుగుదల
9. రిపోర్టర్ గా, కాపీ ఎడిటర్ గా రాణించటానికి
10. ప్రత్యక్ష ప్రదర్శనలు, సమూహ చర్చలు, ఇంటంర్వ్యూలను నిర్వహించగలగటం.
11. అనేక రకాలైన కార్యక్రమాల స్క్రిప్టురచన కూడా నేర్చుకోవటం

### 15.5.2. యాంకర్ కి ఉండవలసిన లక్షణాలు:

1. మొదటగా చక్కని రూపం, శ్రావ్యమైన కంఠస్వరం అవసరం. ఇది జన్మతః వచ్చేవి. కాకపోతే ఉన్న రూపానికి మెరుగులు దిద్దుకునే అవకాశం ఈనాడు ఉంది కనుక మేకప్ తో అందంగా కనిపించవచ్చు. కంఠస్వరం కూడా అభ్యాసం ద్వారా మెరుగుపరుచుకోవచ్చు. కానీ ఈ రోజుల్లో అప్పటి రోజుల్లోలా ఈ రెండింటికి ప్రాధాన్యత ఇవ్వకపోవటం గమనిస్తున్నాం. కొన్ని ప్రోగాములలో స్థూలకాయం, మరుగుజ్జు రూపం, నల్లటి రంగు ఉన్న వాళ్ళనే ప్రత్యేకంగా ఎన్నుకుంటున్నారు. దీనికి కారణం హాస్య ప్రాధాన్యత పెరగడమే. ప్రేక్షకులను మెప్పించగలిగే సామర్థ్యముంటె చాలు ఎలాంటి రూపమైనా పరవాలేదు.

2. యాంకరింగ్ కష్టం కాదు గానీ అంత సులభం కూడా కాదు. ఇంట్లో మాట్లాడటం వేరు, అది అందరూ చేసేదే. వేదిక మీద మాట్లాడటం వేరు. అది అంత సులభం కాదు. అందుకని యాంకర్ కి ముందుగా ధైర్యం ఉండాలి. తన మీద తనకు నమ్మకముండాలి. భయం లేకుండా మాట్లాడగలిగుండాలి.

3. సమయస్ఫూర్తి వ్యాఖ్యాతకు చాలా అవసరం. ఎలాంటి వ్యంగపూరితమైన వ్యాఖ్యలు ఎదుటివారి నుంచి వచ్చినా సమయస్ఫూర్తితో మాట్లాడాలి. ఎదుటివారు మాట్లాడేదాన్ని అనుసరించి దానికనుగుణంగా అప్పటికప్పుడే మాట్లాడగలిగుండాలి. ముందు సిద్ధం చేసుకున్న దానికి భిన్నంగా కూడా ఒక్కో సారి మాట్లాడవలసి రావచ్చు. సమయస్ఫూర్తి ప్రదర్శించే యాంకర్ కలకాలం టెలివిజన్ రంగంలో పనిచేయగలుగుతారు.

4. బాగా మాట్లాడగలగాలి.
5. భాషపై పట్టుండాలి
6. సందర్భానుసారంగా వెంటనే స్పందించి సమయస్ఫూర్తితో వ్యవహరించగలగాలి.
7. ఎలాంటి పరిస్థితిలోనూ సంయమనం కోల్పోకూడదు.
8. ముఖం మీద చిరునవ్వు చెరుగకూడదు.
9. మనస్సులో ఎంత అలజడున్నా ప్రసన్నవదనంతో ఉండగలగాలి.
10. అవసరమైన దగ్గర హాస్యాన్ని జోడించగలగాలి. సామెతలు, జాతీయాలు, హాస్యోక్తులు, చళుకులు ఉపయోగించగలగాలి.
11. స్నేహపూరిత వ్యక్తిత్వం కలిగి ఉండాలి.
12. పోటీని తట్టుకొని నిలబడగలిగే సామర్థ్యం కలిగుండాలి .
13. శ్రమించేతత్త్వం కలిగి ఉండాలి.
14. క్రమశిక్షణ, సమయపాలన పాటించటం యాంకర్ కి అవసరం.
15. కార్యక్రమం దేనికి సంబంధించి చేస్తే దానికి సంబంధించిన విషయ పరిజ్ఞానం సంపాదించుకోవాలి.
16. ఓర్పు, నేర్పు కలిగి ఉండాలి.
17. ప్రేక్షకులను అలరించటమే లక్ష్యంగా భావించాలి.

వ్యాఖ్యాత డాక్యుమెంటరీ వంటివాటిలో వివిధ భాగాలకు అనుసంధానకర్తగా కూడా వ్యవహరిస్తారు. ఒక భాగాన్ని మరొక భాగానికి జోడించటం, మొత్తం విషయంలోని అన్ని అంశాల మధ్య సమన్వయం, కంటిన్యుటి ఉండేందుకు వ్యాఖ్యాతను ఉపయోగిస్తారు. అవసరమైన దగ్గర కనిపిస్తూ వ్యాఖ్యానించడం వీరి పని.

సుమ, ఉదయభాను, ఝాన్సీ వంటి యాంకర్లు నాటి నుంచి నేటివరకు ప్రేక్షకులను అలరిస్తున్నారు. రవి, ప్రదీప్, ఆది, సుధీర్, శ్రీముఖి, అనసూయ, రేష్మీ వంటి అనేకమంది వారి బాటలోనే కొనసాగుతున్నారు. అయితే ఒకప్పుడు సిల్వర్ స్క్రీన్ పై కనిపించే నటీనటులు బల్లితెరపై కనిపించటానికి ఇష్టపడేవారు కాదు. కానీ ఈరోజు సినిమా కంటే టీవీ ద్వారానే ప్రేక్షకులకు మరింత చేరువ కాగలమనే భావంతో అనేకమంది అగ్రస్థాయి నటీ నటులు ప్రత్యేక కార్యక్రమాలలో పాల్గొనడం హర్షించవలసిన విషయం. టివి ప్రాధాన్యతను తెలియజేసే విషయం. అలాగే టివి వ్యాఖ్యాతలకు సినిమాలో నటించే అవకాశం రావటం వారి ప్రతిభకు తార్కాణం.

**రాదగిన ప్రశ్నలు :**

1. టెలివిజన్ రచన గురించి వివరించండి?
2. టివి వ్యాఖ్యాతకుండవలసిన లక్షణాలను గురించి రాయండి?

**ఆధార గ్రంథాలు :**


1. తెలుగులో ప్రసార మాధ్యమాలు డా. అనంత పద్మనాభరావు
2. ప్రసార మాధ్యమాలకోసం రాయడం – డా . అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ప్రచురణలు.



**– డా . ఇరపని మాధవి**

అసోసియేట్ ప్రొఫెసర్,

తెలుగు ప్రాచ్యభాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం.